www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
వెల (Price) : Rs. 6.50
బుధవారం | 7-2-2024 | పేజీలు: 14 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 293 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: ద్వాదశి మ. 3.02 తదుపరి త్రయోదశి; నక్షత్రం: పూర్వాషాఢ తె. 4.38 తదుపరి ఉత్తరాషాఢ; వర్జ్యం: మ. 3.20-4.48; దుర్ముహూర్తం: మ. 12.07-12.53; అమృతఘడియలు: రా. 12.12-1.40, రాహుకాలం: మ. 12.00-1.30, సూర్యోదయం: 6.50; సూర్యాస్తమయం: 6.10 | విజయవాడ సిటీ**
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రాష్ట్రాలు ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ చేయొచ్చా?

సుప్రీంలో ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం విచారణ

పంజాబ్ రిజర్వేషన్ల చట్టంపైనా పరిశీలన

ఏపీ కేసును ఉటంకించిన పిటిషనర్లు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీల వర్గీకరణ చేయొచ్చా? అనే అంశంపై న్యాయపరమైన ప్రశ్నలను పరిశీలించేందుకు ఏడుగురు సభ్యుల సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటైంది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్‌తోపాటు.. జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ బేలా.ఎం.త్రివేది, జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్

మిగతా 2వ పేజీలో...



ఈసీ ప్రకటన అనంతరం అజిత్ వర్గం సంబరాలు

ఎన్‌సీపీ అజిత్‌దే

ఎన్నికల గుర్తు వారికే

ఎలక్షన్ కమిషన్ ప్రకటన

వ్యవస్థాపకుడు పవార్‌కు దక్కని పార్టీ

2

నేటి మధ్యాహ్నంలోగా కొత్త పేరు చెప్పాలని సూచన

పై నుంచి ఒత్తిళ్లు వచ్చాయి.. శరద్ వర్గం విమర్శ

'ఇండియా'కు మరో షాక్

ఎన్‌డీఏలో చేరనున్న ఆర్‌ఎల్‌డీ?

'ఓర్' మాస్ దోపిడీ!

నిన్న బీచ్‌శాండ్.. ఇప్పుడు ఐరన్ ఓర్

జగన్ సమర్పించు భారీ దోపిడీ టెండర్



ప్రకాశం జిల్లాలో 3143 ఎకరాల్లో ఐరన్ ఓర్

ఏడాదికి 5 మిలియన్ టన్నుల తవ్వకం, అమ్మకం

ఏపీఎండీసీ యజమాని.. భాగస్వామి కోసం వేట

దీనికోసం జాయింట్ వెంచర్ కంపెనీ ఏర్పాటు

ఎండీసీకి 11% వాటా ఇస్తే చాలు..

మిగతా 89 శాతం ప్రైవేటుకు ఇచ్చేందుకు ఓకే

కేంద్ర ప్రభుత్వ మైనింగ్ చట్టాలకు తూట్లు

వైఎస్ హయాంలోనే ఏపీఎండీసీకి 51 శాతం

జిందాల్‌కు దోచిపెట్టడానికే.. : నిపుణుల ఆగ్రహం

న్యాయకమిషన్ ఆమోదానికి ఐరన్ ఓర్ ఫైలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ప్రకాశం జిల్లా టంగుటూరు మండలంలో 3143.02 ఎకరాల్లో ఐరన్ ఓర్ (మాగ్నటైట్-అయస్కాంత విలువ కలిగినది) ఉంది. ఇందులో 1307.26 ఎకరాల్లోని మైన్‌ను ఏపీఎండీసీకి అప్పగించారు. సంవత్సరానికి కనీసం 5 మిలియన్ టన్నుల ఐరన్ ఓర్‌ను తవ్వొచ్చు. ఇందులో అయస్కాంత విలువ కలిగిన మినరల్ ఉంది. నిజానికి 27 శాతమే ముడి ఇనుము ఉంటుంది. కాబట్టి దాన్ని శుద్ధిచేసి హైగ్రేడ్ ముడి ఇనుముగా

మిగతా 2వ పేజీలో...

మొన్న బీచ్‌శాండ్...ఇప్పుడు ఐరన్‌ఓర్. ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థను (ఏపీఎండీసీ) ముంచేసి, ఓ కార్పొరేట్ కంపెనీని లాభాల్లో ముంచెత్తేలా జగన్ సర్కారు మరో స్కీమ్‌కు రూపకల్పన చేసింది. ఐరన్‌ఓర్‌ను తవ్వి, శుద్ధిచేసి హైగ్రేడ్‌గా మార్చి అమ్మేందుకు సంయుక్త భాగస్వామి ఎంపిక కోసం టెండర్లు పిలవాలనుకుంటోంది. ఇందుకోసం జాయింట్ వెంచర్ కంపెనీ ఏర్పాటు చేయాలనుకుంటోంది. ప్రైవేటు భాగస్వామి ఎంపిక కోసం ముసాయిదా టెండర్ డాక్యుమెంట్‌ను సిద్ధం చేసింది. ఇదంతా కార్పొరేట్‌కు దోచిపెట్టేందుకే...అని ఆ డాక్యుమెంట్‌లోని అక్షరాలు స్పష్టం చేస్తున్నాయి. అదేమిటో మీరే చదవండి..



గంగాధర నెల్లూరులో జరిగిన సభకు హాజరైన జనం.. ప్రసంగిస్తున్న చంద్రబాబు

రండి.. మాట్లాడుకుందాం

> ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలిస్తాం. ఉద్యోగం వచ్చే వరకు యువతకు రూ.3 వేల భృతి చెల్లిస్తాం. ఈ 60 రోజులూ సైకిలెక్కండి. టీడీపీ, జనసేన జెండాలు పట్టుకుని ఇంటింటికీ తిరిగి గెలిపించండి. - చంద్రబాబు

చంద్రబాబుకు అమిత్‌షా ఫోన్!

నేడు ఢిల్లీకి టీడీపీ అధినేత చంద్రబాబు



నేటి రాత్రి అమిత్ షాతో సమావేశం

జేపీ నడ్డా కూడా పాల్గొనే అవకాశం

టీడీపీతో పొత్తు కోరుకుంటున్న బీజేపీ

దానిపై చర్చించేందుకే బాబుకు పిలుపు!?

గతంలోనే తమ వైఖరి చెప్పిన లోకేశ్

ఇప్పుడేం జరుగుతుందో అనే ఆసక్తి

అమరావతి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముంగిట బీజేపీ జాతీయ నాయకత్వం నుంచి టీడీపీ అధినేత చంద్రబాబుకు పిలుపు అందింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా మంగళవారం ఉదయం ఆయనకు ఫోన్ చేశారు. కూర్చుని మాట్లాడుకుందాం రమ్మని ఢిల్లీకి ఆహ్వానించారు. ఆయన ఫోన్ చేసిన సమయంలో చంద్రబాబు ఉండవల్లిలోని తన నివాసంలో ఉన్నారు. అమిత్ షా ఆహ్వానం మేరకు బుధవారం ఆయన ఇక్కడి నుంచి ఢిల్లీ వెళ్తున్నారు. ఆయన పర్యటనకు

మిగతా 2వ పేజీలో...

చెల్లితో వాటాల గొడవకు మాపై నిందలా?

జగన్‌పై బాబు ఆగ్రహం

ఆయన జైలుకెళ్తే పాదయాత్ర చేయాలని మేం చెప్పామా?

ఆస్తుల వాటా గొడవ మీదే.. బాబాయిని చంపుకొంది మీరే

కుటుంబ సమస్యను రాష్ట్ర సమస్యగా చిత్రీకరిస్తున్నారు

వలంటీర్లూ.. జగన్‌ను నమ్ముకుంటే జైలుకే!

ప్రజా సేవచేసే వారిని తొలగించం.. వైసీపీకి చేస్తే చర్యలు

సీఈసీ ఆఫీసులో ఫైల్స్ మాయంపై సీబీఐ విచారణ జరగాలి

ఓటును తరచూ చెక్ చేసుకోండి.. ప్రజలకు బాబు పిలుపు

గంగాధర నెల్లూరులో 'రా.. కదలిరా' బహిరంగ సభ



అండర్ 19 ఫైనల్‌లో టీమిండియా

సెమీఫైనల్‌లో ఆతిథ్య దక్షిణాఫ్రికాపై గెలుపు

10

ఒత్తిడిని తట్టుకొని విజయం

వరుసగా ఐదోసారి ఫైనల్‌కు

కారుతో ఢీకొట్టి.. ఆపై తొక్కించి

కానిస్టేబుల్ దారుణ హత్య.. ఎర్రచందనం స్మగ్లర్ల ఘాతుకం

కారులో ఎర్రచందనం స్మగ్లింగ్

తనిఖీల్లో కారు ఆపిన పోలీసులు

ఆపినట్టే ఆపి వేగంగా ముందుకు

అడ్డుకునేందుకు కానిస్టేబుల్ యత్నం

ఢీకొట్టి తొక్కిస్తూ దూసుకెళ్లిన స్మగ్లర్లు

వెంబడించి పట్టుకున్న పోలీసులు

ఇద్దరు అరెస్టు.. ముగ్గురి పరారీ..

ఆస్పత్రికి వెళ్లేలోపే కానిస్టేబుల్ మృతి

అన్నమయ్య జిల్లా కేవీపల్లెలో ఘటన

30 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటన





ఎర్రచందనం స్మగ్లర్ల చేతిలో చనిపోయిన ఏఆర్ కానిస్టేబుల్ గణేశ్

పీలేరు, ధర్మవరం, ఫిబ్రవరి 6: విశాఖపట్నంలో తహసీల్దార్ హత్య ఘటనను మరవకముందే.. అన్నమయ్య జిల్లాలో మరో ప్రభుత్వ ఉద్యోగి దారుణ హత్యకు గురయ్యారు. ఎర్రచందనం స్మగ్లింగ్‌ను అడ్డుకోబోయిన ఏఆర్ కానిస్టేబుల్‌ను స్మగ్లర్లు కారుతో ఢీకొట్టి, ఆపై అదే కారుతో తొక్కించి కిరాతకంగా చంపేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ సంఘటన అన్నమయ్య జిల్లా కేవీపల్లె మండలంలో మంగళవారం తెల్లవారుజామున

మిగతా 12వ పేజీలో...

అడ్డొస్తే.. లేపేస్తాం!

ఎర్రచందనం అక్రమ రవాణాలో స్మగ్లర్ల బరితెగింపు

టీడీపీ హయాంలో ఐజీ టాస్క్‌ఫోర్స్‌తో కట్టడి

ప్రభుత్వం మారడంతో ఎస్పీ స్థాయికి పడిన ఫోర్స్



తమను అడ్డుకోవద్దంటూ అసెంబ్లీ గేటు వద్ద పోలీసుల కాళ్లు పట్టుకుంటున్న సర్పంచ్

'చలో అసెంబ్లీ'పై ఉక్కుపాదం

పార్టీలకతీతంగా సర్పంచ్‌ల పోరుబాట

అసెంబ్లీ ముట్టడిని భగ్నం చేసిన సర్కారు

పోలీసుల కళ్లుగప్పి ముట్టడికి యత్నం

అడ్డుకున్న పోలీసులు..

తోపులాటలో పలువురికి గాయాలు

వ్యాన్లలో కుక్కి స్టేషన్లకు తరలింపు

జిల్లాల్లోనూ ఎక్కడికక్కడ నిర్బంధాలు

నిధులు, విధులు అపహరించారని సర్కారుపై సర్పంచ్‌ల ధ్వజం

ఎన్నికల్లో తమ సత్తా ఏమిటో రుచి చూపిస్తామని హెచ్చరిక

అమరావతి, ఉయ్యూరు, తుళ్లూరు, ఒంగోలు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలకు కేంద్రం నుంచి విడుదలైన ఆర్థిక సంఘం నిధులను దొడ్డిదారిన మళ్లించిన జగన్ సర్కారుపై తాడోపేడో తేల్చుకోవడానికి పార్టీలకతీతంగా సర్పంచ్‌లు ఏకమయ్యారు. పంచాయతీలకు రావాల్సిన ఆర్థిక సంఘం నిధులను విడుదల


మిగతా 11వ పేజీలో...



2

మార్కెట్‌లోకి భారత్ బియ్యం

ఢిల్లీలో ప్రారంభించిన కేంద్ర మంత్రి గోయల్



2

బాణసంచా కర్మాగారంలో భారీ పేలుడు


మధ్యప్రదేశ్‌లో 11 మంది మృతి

200 మందికి తీవ్ర గాయాలు

రాయలకోటలో

శంకర్‌దాదా

ఎమ్మెల్యే, సోదరుల అడ్డగోలు దోపిడీ



మండలాలవారీగా పంచుకుని వసూళ్లు

కియాలో బినామీల పేరుతో అక్రమార్జన

ఉద్యోగులను తరలించే వాహనాలూ వారివే

కార్మికుల వేతనాల్లోనూ కమీషన్లు

రియల్ ఎస్టేట్, ఇసుక తవ్వకాల్లో దందాలు

అక్రమ సంపాదనతో భారీ వెంచర్

400 ఎకరాల విలువైన భూములు కొనుగోలు

స్థానిక వ్యతిరేకతతో సదరు నేత 'బదిలీ'

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆ నియోజకవర్గ కేంద్రానికి ఘనమైన చరిత్ర ఉంది. రాయలవారు ఏలిన కోట ఉంది. ప్రస్తుతం రాజులు, రాజ్యాలు లేకపోయినా ఆ నియోజకవర్గానికి ఎమ్మెల్యేనే సామంతరాజు! ఆయన సోదరులు మండలాలను పంచుకుని పాలెగాళ్లలా పాలన చేస్తున్నారు.



నియోజకవర్గంలో అవకాశమున్న దేన్నీ వదలకుండా దోపిడీ చేస్తున్నారు. వేలాదిమందికి ఉపాధి కల్పిస్తున్న కియ పరిశ్రమను ఆదాయ వనరుగా మార్చుకుని.. బినామీల ద్వారా అక్రమ మార్గాల్లో కోట్లు దోచుకుంటున్నారు. ఇక ఎవరైనా వెంచర్ వేయాలంటే కప్పం కట్టాలి. ఇసుక రవాణా సహా అక్రమ వ్యవహారాలన్నింటిలో వాటాలు ఇవ్వాల్సిందే. అక్రమ సంపాదనతో దాదాపు 400 ఎకరాల విలువైన భూములు కొనుగోలు చేసినట్టు సొంత పార్టీ నేతలే బహిరంగంగా చెబుతున్నారు.

● సొంత పార్టీలోనే సెగ

ఎమ్మెల్యేపై సొంత పార్టీలోనే తీవ్ర వ్యతిరేకత ఉంది. తమకు సదరు ప్రజానిధి వద్దంటూ ధర్నాలు చేసే దాకా వ్యవహారం వెళ్లింది. ఆయన వాహనాలపైకి చెప్పులు విసిరి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక గడప గడపలోనైతే అడుగడుగునా నిరసన సెగ తగిలింది. స్థానికంగా ఆయనపై తీవ్ర వ్యతిరేకత రావడంతో పార్టీ అధిష్ఠానం ఉమ్మడి జిల్లాలోనే మరో పార్లమెంటు నియోజకవర్గం ఇన్‌చార్జిగా బదిలీ చేసింది.

12



నేడే ఓటాన్ అకౌంట్ బడ్జెట్

4 నెలలకు రూ.95 వేల కోట్లకుపైనే..

శాసనసభలో ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రి బుగ్గన

అమరావతి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను బుధవారం ఉదయం 11 గంటల 3 నిమిషాలకు చట్టసభల్లో ప్రవేశపెట్టనుంది. శాసనసభలో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, శాసనమండలిలో పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. రాబోయే ఆర్థిక సంవత్సరానికి రూ.2.86 లక్షల కోట్ల బడ్జెట్‌ను అంచనా వేయగా, ప్రస్తుతం ఓటాన్ అకౌంట్ కింద 4 నెలలకు రూ.95 వేల కోట్ల నుంచి రూ.96 వేల కోట్ల వరకు బడ్జెట్‌ను ప్రతిపాదించనున్నారు.

బడ్జెట్ ఎలా ఉండాలి.. ఎలా ఉంటోంది?

సాధారణంగా బడ్జెట్ అంటే రాష్ట్రానికి ఎంత ఆదాయం వస్తుంది? ఎన్ని అప్పులు తెచ్చుకోవచ్చు? రాష్ట్రం ఖర్చులు ఎంత? అభివృద్ధి పనుల కోసం ఏ శాఖకు ఎంత కేటాయించాలి? ప్రజల కోసం చేయాల్సిన పనులు, వాటి ఖర్చుల

మిగతా 11వ పేజీలో...

చేతకాక.. చేయలేక!

అసెంబ్లీ సాక్షిగా జగన్ వింత వాదనలు

కేంద్రంలో ఎవరికీ మెజారిటీ రాకూడదనే 'షరతు'

విపక్షంలో ఉండగా మెడలు వంచేస్తానని గర్జన

అధికారంలోకి రాగానే కేంద్రంతో ములాఖత్

హైదరాబాద్ వంటి నగరం లేదని ఆవేదన

విశాఖపట్నం నుంచి ఐటీని తరిమేసిందీ ఆయనే

తన హయాంలో ఆర్థిక సంఘం నిధులు రాలేదట

మరి.. కేంద్రాన్ని ఎందుకు గట్టిగా అడగలేదు?

చేసిన అప్పులపైనా అదే తప్పుడు వాదన

హామీలన్నీ నెరవేర్చామంటూ మాయ మాటలు

ఎన్నికల ముందు గుర్తు కొచ్చిన 'హోదా'



(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి... ఇప్పుడు, ఎన్నికల ముందు ఆకస్మాత్తుగా విభజన కష్టాలు, ప్రత్యేక హోదా, రెవెన్యూ లోటు వంటి అంశాలు గుర్తుకొస్తున్నాయి. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మంగళవారం అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. బుధవారం ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశ పెడతామని, మళ్లీ అధికారంలోకి వచ్చి పూర్తిస్థాయి బడ్జెట్ తీసుకొస్తామని చెప్పారు. తన గొప్పలు చెప్పుకొంటూ... చంద్రబాబుపై విమర్శలు గుప్పించారు. స్వయానా ముఖ్యమంత్రే ప్రసంగిస్తున్న ఆ సమయంలో... సభలో సుమారు 95 మంది సభ్యులు మాత్రమే

మిగతా 11వ పేజీలో...

రాష్ట్రాలు ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ చేయొచ్చా?



(మొదటి పేజీ తరువాయి)

సతీశ్‌చంద్ర మిశ్రాల ధర్మాసనం మంగళవారం ఈ విచారణను ప్రారంభించింది. పంజాబ్ ప్రభుత్వం తీసుకువచ్చిన 'ద పంజాబ్ షెడ్యూల్డ్ క్యాస్ట్స్ అండ్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ (రిజర్వేషన్ ఇన్ సర్వీసెస్) యాక్ట్-2006'ను సవాలు చేస్తూ దాఖలైన 23 పిటిషన్లను(పంజాబ్ సర్కారు అప్పీల్‌తోపాటు) కలిపి ధర్మాసనం విచారిస్తోంది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఎస్సీలకు 22.5% రిజర్వేషన్ కల్పిస్తుండగా.. పంజాబ్‌లో అది 25శాతంగా ఉంది. పంజాబ్ రిజర్వేషన్ల చట్టంలోని సెక్షన్ 4(5) ప్రకారం.. ఎస్సీ రిజర్వేషన్లలో వాల్మీకి, మజ్హబీ సిక్కులు పోటీలో ఉంటే.. వారికి ప్రాధాన్యతనిస్తూ 50% కోటాను కేటాయించాలి. ఈ చట్టం వల్ల ఎస్సీల్లోని ఇతర కులస్థులు ఉద్యోగావకాశాలను కోల్పోతున్నారని, ఇది రాజ్యాంగ విరుద్ధమంటూ పంజాబ్-హరియాణా హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. 2010లో పంజాబ్ సర్కారుకు వ్యతిరేకంగా హైకోర్టు తీర్పునిచ్చింది. 2011లో పంజాబ్ సర్కారు దీనిపై సుప్రీంకోర్టులో అప్పీల్‌కు వెళ్లగా.. ఇతర పిటిషనర్లు సైతం వ్యాజ్యాలను దాఖలు చేశారు. 2020 ఆగస్టు 27న జస్టిస్ అరుణ్ మిశ్రా(ప్రస్తుతం రిటైర్ అయ్యారు) నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం.. ఈ విషయాన్ని పరిశీలించేందుకు విస్తృత రాజ్యాంగ ధర్మాసనం అవసరమని స్పష్టం చేశారు. దాంతో ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటైంది. ఈ కేసులో పిటిషనర్లు 2004 నాటి 'ఈవీ చిన్నయ్య వర్సెస్ స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' కేసులో సుప్రీంకోర్టు ఐదుగురు సభ్యుల ధర్మాసనం తీర్పును ఉటంకించారు. రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీల్లో వర్గీకరణ చేయడం రాజ్యాంగ విరుద్ధమని, అలాంటి నిర్ణయాలు భారత రాజ్యాంగంలోని 14వ అధికరణ(చట్టం ముందు అంతా సమానులే)ను ఉల్లంఘిస్తోందని 2004 నాటి తీర్పు స్పష్టం చేస్తోంది. దీనికి తోడు.. ఎస్సీ కులాల గుర్తింపు బాధ్యత పార్లమెంట్‌కు మాత్రమే ఉంటుందని, ఆయా కులాలను రాజ్యాంగంలోని ఆర్టికల్ 341 మేరకు రాష్ట్రపతి మాత్రమే నోటిఫై చేస్తారని పిటిషనర్లు తమ వ్యాజ్యాల్లో పేర్కొన్నారు.

ఉత్తరాఖండ్ అసెంబ్లీలో యూసీసీ బిల్లు

ప్రవేశ పెట్టిన రాష్ట్ర ప్రభుత్వం.. స్వతంత్ర భారతంలో తొలిసారి.. గిరిజనులకు మినహాయింపు



డెహ్రాడూన్, ఫిబ్రవరి 6 : ఉత్తరాఖండ్ రాష్ట్ర ప్రభుత్వం పౌరులందరికీ యూనిఫామ్ సివిల్ కోడ్(యూసీసీ) బిల్లును ఆ రాష్ట్ర అసెంబ్లీలో మంగళవారం ప్రవేశ పెట్టింది. స్వతంత్ర భారత దేశంలో తొలిసారిగా ఓ రాష్ట్ర ప్రభుత్వం యూసీసీని అమల్లోకి తేనుంది. రాష్ట్రంలోని గిరిజనులను ఈ బిల్లు నుంచి పూర్తిగా మినహాయించారు. అలాగే సహజీవనానికి గుర్తింపు ఇచ్చి నమోదు చేసేందుకు నిర్ణయించారు. వీరికి జన్మించిన పిల్లల్ని సక్రమ సంతానంగానే గుర్తిస్తారు. ఒకవేళ ఇద్దరూ విడిపోతే మహిళకు పురుషుడు మనోవర్తి చెల్లించాల్సి ఉంటుంది. మతంతో సంబంధం లేకుండా వివాహం, విడాకులు, భూమి, ఆస్తి, వారసత్వ హక్కులపై పౌరులందరికీ ఒకే చట్టం అని ఈ బిల్లు పేర్కొంటోంది. బహు భార్యత్వాన్ని ఈ ప్రతిపాదిత బిల్లు నిషేధిస్తుంది. ఉత్తరాఖండ్ అసెంబ్లీలో ఆ రాష్ట్ర సీఎం పుష్కర్‌సింగ్ ధామి స్వయంగా ఈ బిల్లును ప్రవేశపెట్టగా అధికార పక్ష సభ్యులు భారత్ మాతా కి జై అని నినదిస్తూ మద్దతు పలికారు. అయితే బిల్లును ఆమోదించకుండా ప్రతిపక్షాలు అడ్డుకున్నాయి. దాన్ని అధ్యయనం చేసేందుకు మరింత సమయం కావాలని కోరాయి. ఉత్తరాఖండ్ రాష్ట్రమంతటికీ... అలాగే ఆ రాష్ట్రం నుంచి వెళ్లినవారికీ ఈ బిల్లు వర్తిస్తుంది. సహజీవనం చేసేవారు 18 ఏళ్లలోపు వారై ఉండకూడదు. సహజీవనం చేస్తున్నవారు నెలలోగా ఆమేరకు రిజిస్ట్రార్‌కు స్టేట్‌మెంట్ సమర్పించకపోతే నెల రోజుల జైలుశిక్ష లేదా రూ.10వేల జరిమానా లేదా రెండూ విధించవచ్చు.

లోకం తీరు

పీఎం కిసాన్ మొత్తం పెంచే ఆలోచన లేదు: కేంద్రం



ఎన్‌సీపీ అజిత్ పవార్‌దే

ఎన్నికల గుర్తు వారికే.. ఈసీ ప్రకటన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: మహారాష్ట్రలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ) ఎవరికి చెందుతుందన్న విషయమై కొన్ని నెలలుగా బాబాయ్ శరద్ పవార్, అబ్బాయ్ అజిత్ పవార్‌ల మధ్య తలెత్తిన వివాదం ఎట్టకేలకు పరిష్కారమయింది. అజిత్ పవార్ ఆధ్వర్యంలోనిదే అసలైన ఎన్‌సీపీ అని మంగళవారం ఎన్నికల సంఘం ప్రకటించింది. ఎన్నికల గుర్తు అయిన 'గోడ గడియారం' కూడా ఆ పార్టీకే చెందుతుందని తెలిపింది. అసలైన శివసేన ఎవరన్నది తేల్చడానికి పలు రకాల పరీక్షలు నిర్వహించినట్టు ఎన్నికల సంఘం తెలిపింది. రెండు గ్రూపులు కూడా పార్టీ నియమ నిబంధనలకు అనుగుణంగా పనిచేయడం లేదని తెలిపింది. అందువల్ల చట్టసభల్లో ఆధిక్యత ప్రక్రియను ప్రామాణికంగా తీసుకున్నట్టు పేర్కొంది. చట్టసభల్లో అజిత్ వర్గానికే ఆధిక్యం ఉన్నందున దాన్నే అసలైన ఎన్‌సీపీగా గుర్తిస్తున్నట్టు వెల్లడించింది. 'వన్ టైం ఆప్షన్' కింద శరద్ పవార్ వర్గానికి ఎన్నికల కమిషన్ కాస్త వెసులుబాటు కల్పించిది. రాజ్యసభ ఎన్నిలను దృష్టిలో పెట్టుకొని బుధవారం మధ్యాహ్నంలోగానే పార్టీకి కొత్త పేరును ప్రతిపాదించాలని సూచించింది. మూడు పేర్లను ప్రతిపాదించవచ్చని తెలిపింది.

నడిరోడ్డుపై వెంటాడి...వేటాడి!

» సూర్యలంక తీరంలో యువకుడి హత్య

బాపట్ల రూరల్, బాపట్ల, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): అది మంగళవారం సాయంత్రం. బాపట్లలోని సూర్యలంక రోడ్డులోని పందెం కోడి రెస్టారెంట్‌లోకి ఓ ఐదుగురు యువకులు భోజనానికి వెళ్లారు. అదే సమయంలో సుమారు 30 మంది యువకులు ఒక్కసారిగా రెస్టారెంట్‌లోకి దూసుకొచ్చారు. వచ్చీరావడంతోనే.. ఆ ఐదుగురు యువకులు వచ్చిన కారును ధ్వంసం చేశారు. తర్వాత ఆ ఐదుగురిపై మీద దాడికి తెగబడ్డారు. వారి నుంచి తప్పించుకుని నలుగురు యువకులు పారిపోగా, బాపట్ల పెయింటర్స్ కాలనీకి చెందిన గోరంట్ల సుమంత్(22) వారికి చిక్కాడు. ఆ యువకులంతా కలిసి అతడిని వెంటాడిమరీ చంపేశారు. ఈ దాడికి ముందు మధ్యాహ్నమే ఇరు వర్గాల మధ్య చీలురోడ్డులో గొడవ జరిగినట్లు తెలుస్తోంది. దానికి కొనసాగింపుగానే సాయంత్రానికి వాళ్లు గుంపుగా వచ్చి హత్యకు పాల్పడినట్లు సమాచారం. చీలురోడ్డులో గొడవ జరిగిన సమయంలో హత్యకు పాల్పడిన వ్యక్తులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వడానికి వెళ్లినట్టు తెలిసింది. అప్పుడే పోలీసులు అప్రమత్తమై ఉంటే ఈ దారుణం జరిగేది కాదు.

వైసీపీ మోసం చేసిందన్న ముద్రగడ: మాగంటి

ఏలూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): "వైసీపీ నన్ను మోసం చేసింది. రాజ్యసభ సీటు ఇస్తామని వందల కోట్లు అడిగితే ఎలా? ఎక్కడ నుంచి తీసుకురావాలి?" అని కాపు నాయకుడు ముద్రగడ పద్మనాభం ఆవేదన వ్యక్తం చేసినట్టు టీడీపీ సీనియర్ నేత మాగంటి బాబు చెప్పారు. తాజాగా మంగళవారం ముద్రగడ.. మాగంటితో ఆయన నివాసంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇరువురూ రాజకీయాలపై చర్చించుకున్నారు. అనంతరం, మాగంటి మీడియాతో మాట్లాడుతూ.. "సీటు కోసం వందల కోట్లు ఖర్చు పెట్టే స్థితి తనలాంటి వాళ్లకు ఎలా ఉంటుందని ముద్రగడ వాపోయారు. రాజ్యసభ సీటిస్తానని చెప్పిన వైసీపీ, చివరకు ఆయనను మోసం చేసిందన్నారు. రూ.300-400 కోట్లకు అక్కడ, ఇక్కడ సీట్లు ఇచ్చామని చెప్పారట. దీంతో ముద్రగడ ఎంతో బాధపడ్డారు. వైసీపీ వల్ల తనకు ఒక గాయం తగిలిందని, ఆ గాయం మానాక తానే జనసేన అధినేత పవన్‌ను కలిసి పార్టీలో చేరికపై నిర్ణయం తీసుకుంటానని చెప్పార'ని మాగంటి తెలిపారు.

అనకాపల్లి లోక్‌సభపై జనసేన కన్ను!

» పవన్ సోదరుడు నాగబాబు కోసమే!!

విశాఖపట్నం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పొత్తులో భాగంగా అనకాపల్లి లోక్‌సభ స్థానం తమకివ్వాలని టీడీపీ నాయకత్వాన్ని జనసేన కోరుతున్నట్లు తెలిసింది. ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సోదరుడు నాగేంద్రబాబును ఇక్కడి నుంచి పోటీచేయించాలని భావిస్తున్నట్లు సమాచారం. వాస్తవానికి ఈ స్థానం కోసం టీడీపీలో తీవ్రమైన పోటీ ఉంది. ఎంపీగా పోటీకి మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు కుమారుడు విజయ్ ఎప్పుడో రంగం సిద్ధం చేసుకున్నారు. తన కుమారుడికి అవకాశం ఇవ్వాలని చంద్రబాబును తాను కోరినట్లు ఇటీవల అయ్యన్న కూడా చెప్పారు. ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. ఇటీవల సీట్ల సర్దుబాటుపై చంద్రబాబు, పవన్ మధ్య చర్చ జరిగినప్పుడు అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా టీడీపీ నుంచి బైరా దిలీప్ చక్రవర్తి పేరు పరిశీలనకు వచ్చింది. టీడీపీ అధిష్ఠానం నుంచి సంకేతాలు అందడంతో దిలీప్ చక్రవర్తి అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గంలో నాయకులందరినీ కలుస్తూ సహకరించాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో అనకాపల్లి నుంచి పోటీకి నాగబాబును దించాలని జనసేన పెద్దలు నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో నాగబాబు మంగళ వారం విశాఖ రావడం గమనార్హం. నాగబాబు కుటుంబానికి సన్నిహితంగా ఉండే సుందరపు సతీశ్‌కుమార్ (యలమంచిలి అభ్యర్థి)ని సోమవారం రాత్రే జనసేన ఉత్తరాంధ్ర పార్టీ వ్యవహారాల ముఖ్య ప్రతినిధిగా నియమించారు.

ఈడీ దర్యాప్తే అసలు స్కాం!

లిక్కర్ స్కాంలో విచారణల తాలూకు ఆడియో రికార్డులను ఈడీ తొలగించింది

» ఢిల్లీ మంత్రి ఆతిషి సంచలన ఆరోపణలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: ఢిల్లీ మద్యం పాలసీకి సంబంధించిన కేసులో ఏడాదిన్నరగా వివిధ వ్యక్తుల విచారణ సందర్భంగా రికార్డు చేసిన ఆడియో ఫైళ్లను ఈడీ తొలగించిందని ఢిల్లీ మంత్రి, ఆప్ సీనియర్ నాయకురాలు ఆతిషి సంచలన ఆరోపణలు చేశారు. విశ్వసనీయ వర్గాల ద్వారా ఈ సమాచారం తమకు అందిందని ఆమె తెలిపారు. మద్యం పాలసీలో కుంభకోణం చోటుచేసుకోలేదని, ఈడీ దర్యాప్తే పెద్ద కుంభకోణమని చెప్పారు. ఈడీకి సంబంధించి కొన్ని సంచలన విషయాలు మంగళవారం వెల్లడిస్తానని సోమవారం ట్విటర్‌లో ఆతిషి తెలిపారు. ఈ నేపథ్యంలో, మంగళవారం ఉదయం నుంచే ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ వ్యక్తిగత సహాయకుడు వైభవ్ కుమార్, ఆప్ కోశాధికారి, ఎంపీ ఎన్‌డీ గుప్తా, ఆప్ ఇతర నేతల ఇళ్లు, కార్యాలయాలపై ఈడీ సోదాలకు దిగింది. ఢిల్లీ జలమండలి టెండర్లలో అవినీతికి పాల్పడి, ఆ సొమ్మును ఆప్‌నకు ఎన్నికల నిధిగా అందించారన్న ఆరోపణల మీద ఈ సోదాలు జరిపినట్లు ఈడీ వర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో, మంత్రి ఆతిషి విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. లిక్కర్ స్కాం పేరిట గత రెండేళ్లుగా ఈడీ జరుపుతున్న దర్యాప్తులో ఒక్క రూపాయిగానీ, ఒక్క సాక్ష్యాధారంగానీ ఆ సంస్థ సేకరించలేకపోయిందని గుర్తుచేశారు. ఈ కేసులో విచారణ సందర్భంగా తాము చెప్పిన వివరాలను రికార్డు చేయాలని ఎంతోమంది నిందితులు, సాక్షులు, ప్రభుత్వ సాక్షులు ఈడీని కోరారని తెలిపారు. 2020లో సుప్రీంకోర్టు కూడా అన్ని దర్యాప్తు సంస్థలు నిందితుల విచారణను రికార్డు చేసి భద్రపరచాలని తీర్పు చెప్పిందని, కానీ, ఈడీ దీనిని పట్టించుకోలేదని విమర్శించారు.



ఏడాదిన్నరగా జరుగుతోంది

మద్యం పాలసీ కేసులో ఈడీ తనను ప్రశ్నించిన సందర్భంగా రికార్డు చేసిన వీడియో ఫుటేజీని తనకు అందజేయాలంటూ ఓ నిందితుడు కోర్టులో పిటిషన్ వేశారని ఆతిషి తెలిపారు. విచారణ సందర్భంగా తాను ఈడీకి చెప్పిన అంశాలకు, కోర్టులో ఈడీ సమర్పించిన వివరాలకు పోలికే లేదని సదరు నిందితుడు పేర్కొన్నారని చెప్పారు. విచిత్రమేమిటంటే, అతడి విచారణ సమయంలో గదిలో ఓ సీసీటీవీ కెమెరా ఉందని, ఈ మేరకు కోర్టుకు ఈడీ సీసీటీవీ ఫుటేజీని సమర్పించిందని, అయితే, దాంట్లో వీడియో తప్ప ఆడియో లేదని తెలిపారు. అంటే, ఆడియో రికార్డును (మాటలను) ఈడీ తొలగించిందని, తద్వారా, సాక్ష్యాధారాలను మార్చిందన్నారు. ఇది ఈ ఒక్క నిందితుడికి సంబంధించినదే కాదని, గత ఏడాదిన్నరగా ఈడీ ఈ కేసులో జరిపిన విచారణలన్నింటిలోనూ ఇలాగే వ్యవహరించిందన్నారు. ఈడీ ఒక కుంభకోణంపై దర్యాప్తు జరపటం లేదని, ఈడీ దర్యాప్తే ఓ పెద్ద కుంభకోణమని ఆతిషి ఆరోపించారు.

కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలి

ఢిల్లీ మరో మంత్రి సౌరభ్ భరద్వాజ్ కూడా ఈ అంశంపై స్పందిస్తూ.. ఆడియో ఫైళ్ల తొలగింపునకు బాధ్యులైన అధికారుల పేర్లను వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఆ అధికారులపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలన్నారు. కాగా, ఆప్ మంత్రుల ఆరోపణలపై ఈడీ వర్గాలు స్పందిస్తూ.. విచారణను రికార్డు చేయటానికి ఉపయోగించే సీసీటీవీ వ్యవస్థల్లో గతంలో ఆడియో రికార్డింగ్ సదుపాయం లేదని, గత ఏడాది అక్టోబరు నుంచే వీడియో ఫుటేజీకి ఆడియో రికార్డును కూడా కలిపే సౌకర్యం అందుబాటులోకి వచ్చిందని పేర్కొన్నాయి. తాము ఎటువంటి ఆడియో రికార్డులను తొలగించలేదని, ఆతిషి ఆరోపణలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈడీ వర్గాలు వెల్లడించాయి. ఢిల్లీ జల మండలి కేసులో రూ.21 కోట్ల మేర చేతులు మారాయని, దీనిపై దర్యాప్తులో భాగంగానే మంగళ వారం పలువురు ఆప్ నేతల ఇళ్లు, ఆఫీసులపై దాడులు జరిపామని తెలిపాయి.

ఈడీ ఎవరిని రక్షిస్తోంది

'ఈ ఆడియో ఫైళ్లను తొలగించటం ద్వారా ఈడీ ఎవరిని రక్షించటానికి ప్రయత్నిస్తోంది? దేన్ని దాచాలని చూస్తోంది? ఈడీ తన వద్ద ఉన్న ఆడియో ఫైళ్లను వెల్లడించగలదా? అలా చేయలేకపోతే, ఈ విచారణ తతంగం అంతా ఓ పెద్ద అవినీతి వ్యవహారమేనని తేలిపోతుంది కదా!' అని ఆతిషి పేర్కొన్నారు. మద్యం కేసులో ఈడీ జరిపిన విచారణల తాలూకు ఆడియో, వీడియో రికార్డులను తమకు అందించాలంటూ ఈడీ, సీబీఐ ప్రత్యేక కోర్టులలో తాము పార్టీ తరఫున పిటిషన్లు వేశామని వెల్లడించారు.

మార్కెట్‌లోకి 'భారత్' బియ్యం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: కేంద్ర ప్రభుత్వం మంగళవారం 'భారత్ రైస్'ను మార్కెట్‌లోకి విడుదల చేసింది. గత ఏడాది కాలంలో బియ్యం ధరలు 15 శాతం పెరిగిన నేపథ్యంలో కిలో 29 రూపాయలకు భారత్ బ్రాండ్ బియ్యాన్ని అందుబాటులోకి తెస్తామని కేంద్రం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇవి 5 కిలోలు, 10 కిలోల ప్యాకెట్లలో లభిస్తాయి. కేంద్ర ఆహార, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ఢిల్లీలోని కర్తవ్య పథ్‌లో 'భారత్ రైస్'ను ప్రారంభించారు. నిత్యావసరాల ధరలు సామాన్యులకు అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఇందులో భాగంగా ప్రారంభించిన కిలో రూ.29కే భారత్ రైస్‌తో పేద, మధ్యతరగతి ప్రజలకు ఉపశమనం లభిస్తుందన్నారు. ఈ బియ్యం విక్రయించే 100 మొబైల్ వ్యాన్లను కూడా మంత్రి ప్రారంభించారు. త్వరలో ఈ-కామర్స్ ప్లాట్‌ఫాంలలో కూడా లభ్యమవుతాయి.

బాణసంచా ఫ్యాక్టరీలో పేలుడు

మధ్యప్రదేశ్‌లో 11 మంది మృతి

భోపాల్, హర్దా, ఫిబ్రవరి 6: మధ్యప్రదేశ్‌లో ఘోర ప్రమాదం జరిగింది. ఓ బాణసంచా కర్మాగారంలో భారీ పేలుడు సంభవించడంతో మంటలు చెలరేగి పదకొండు మంది దుర్మరణం పాలయ్యారు. దాదాపు మరో 200 మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. ఈ ఘటన భోపాల్‌కు 150 కి.మీల దూరంలోని హర్దా పట్టణ శివార్లలో మంగళవారం జరిగింది. గాయపడిన వారిని ఆస్పత్రులకు తరలించారు. ప్రమాదంపై రాష్ట్ర సీఎం మోహన్ యాదవ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రమాదానికి గల కారణాలు తెలియలేదు. ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రధాని మోదీ రూ.2 లక్షలు, సీఎం మోహన్ యాదవ్ రూ.4 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. గాయపడిన వారికి మోదీ రూ.50 వేల సాయం ప్రకటించారు.

మోదీ సర్కారుపై దక్షిణ రాష్ట్రాల పోరు!

నేడు ఢిల్లీలో కర్ణాటక ప్రభుత్వ ధర్నా

» రేపు కేరళ సర్కారు వంతు

» తమిళనాడు సీఎం స్టాలిన్ మద్దతు

» నిధులపై కేంద్రం వివక్ష చూపుతోందనే



బెంగళూరు, ఫిబ్రవరి 6: దక్షిణ భారత రాష్ట్రాలపై మోదీ సర్కారు వివక్ష చూపుతోందని.. నిధులివ్వకుండా సతాయిస్తోందని దక్షిణాదిన కర్ణాటక, కేరళ, తమిళనాడులోని బీజేపీయేతర ప్రభుత్వాలు మండిపడుతున్నాయి. లోక్‌సభ ఎన్నికల ముంగిట తమ పోరాటాన్ని ఢిల్లీ దాకా తీసుకెళ్తున్నాయి. కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం బుధవారం ఉదయం హస్తినలోని జంతర్‌మంతర్ వద్ద రాష్ట్ర మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలతో ధర్నా నిర్వహించనుంది. పన్నుల ఆదాయం పంపిణీ, గ్రాంట్లలో గత కొన్నేళ్లుగా కర్ణాటకపై వివక్ష చూపుతోందని సీఎం సిద్దరామయ్య ఆరోపిస్తున్నారు. కరువు సాయం అందించకుండా దాటవేస్తోందని విమర్శిస్తున్నారు. 15వ ఆర్థిక సంఘం సిఫారసుల కారణంగా గత ఐదేళ్లలో రూ.1.87 లక్షల కోట్లు నష్టపోయామని.. వాటిని చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు కూడా ధర్నాలో పాల్గొనాలని సిద్దూ లేఖ రాశారు. నిధుల వ్యవహారంపైనే గురువారం కేరళలోని లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వం ఢిల్లీలో ధర్నా చేపట్టనుంది. తమ రాష్ట్రంపై కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, అప్పులు తెచ్చుకోకుండా ఆంక్షలు పెడుతోందని, సమాఖ్య తత్వాన్ని దెబ్బతీస్తోందని సీఎం విజయన్ ఆరోపిస్తున్నారు. కేరళ ధర్నాకు తమిళనాడు సీఎం స్టాలిన్ సంఘీభావం ప్రకటించారు. మరోవైపు.. తమకు ఉపాధి హామీ పథకం బకాయిలు ఇవ్వడం లేదంటూ టీఎంసీ అధ్యక్షురాలు, బెంగాల్ సీఎం మమతా బెనర్జీ శుక్రవారం కోల్‌కతాలో నిరసన ప్రదర్శనకు పిలుపిచ్చారుజ కాగా, సిద్దరామయ్య సర్కారు ఢిల్లీలో ధర్నాకు పిలుపివ్వడాన్ని బీజేపీ ఖండించింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేక.. లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోతామన్న భయంతో రాజకీయ స్టంట్ చేస్తోందని మాజీ సీఎం బొమ్మై ఎద్దేవాచేశారు.

ఎన్‌డీఏలోకి ఆర్‌ఎల్‌డీ?

లఖ్‌నవూ,ఫిబ్రవరి 6: ఇండియా కూటమిలో మరో భారీ కుదుపు తప్పదనిపిస్తోంది. యూపీలో చెప్పుకోదగ్గ స్థాయిలో బలం,బలగం ఉన్న రాష్ట్రీయ లోక్‌దళ్(ఆర్‌ఎల్‌డీ), విపక్ష శిబిరానికి షాక్ ఇచ్చి బీజేపీ సారథ్యంలోని ఎన్‌డీఏతో జట్టుకట్టే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. యూపీలో 4 లోక్‌సభ సీట్లు ఆర్‌ఎల్‌డీకి ఇచ్చేందుకు బీజేపీ అంగీకరించినట్లు సమాచారం. దీంతో కమలదళంలో చేరేందుకు ఆర్‌ఎల్‌డీ చీఫ్ జయంత్ చౌదరి సిద్ధపడుతున్నట్లు అభిజ్ఞవర్గాలు తెలిపాయి. యూపీలో సమాజ్‌వాదీ పార్టీ సారథ్యంలోని మహాకూటమిలో ఆర్‌ఎల్‌డీ భాగస్వామిగా ఉంది. ఆ పార్టీ 7 లోక్‌సభ సీట్లు కోరుతుండగా, రెండు సీట్లకు మించి ఇచ్చేందుకు సమాజ్‌వాదీ సుముఖంగా లేదు. దాంతో రెండు పార్టీల మధ్య ఇప్పటికే చిచ్చు రేగింది. బీజేపీ తాజాగా కైరానా, బాగ్‌పత్, మథుర, అమ్రోహా లోక్‌సభ్ సీట్లు ఇచ్చేందుకు ముందుకు రావడంతో, అటువైపు ఫిరాయించేందుకు ఆర్‌ఎల్‌డీ సంసిద్ధమైనట్లు తెలుస్తోంది.

చెల్లితో వాటాల గొడవకు.. మాపై నిందలేస్తారా?

» జగన్‌పై చంద్రబాబు ఆగ్రహం

గంగాధర నెల్లూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): 'వాటాల విషయంలో చెల్లెలు తిరగబడింది. గొడవలొచ్చాయి.. అంతఃపుర రహస్యాలు బయటికొస్తున్నాయి. వాటికి మా మీద నింద మోపుతారా? మీ కుటుంబ సమస్యను రాష్ట్ర సమస్యగా చిత్రీకరిస్తున్నారు' అని సీఎం జగన్‌పై టీడీపీ అధినేత చంద్రబాబు ధ్వజమెత్తారు. ఆయన్ను నమ్ముకుంటే జైలుకెళ్లడం ఖాయమని వలంటీర్లను హెచ్చరించారు. చిత్తూరు జిల్లా గంగాధరనెల్లూరులో మంగళవారం నిర్వహించిన 'రా.. కదలిరా' బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. వైఎస్ఆర్ సీఎంగా ఉన్నప్పుడు జగన్ రూ.వేల కోట్లు దోచుకున్నారు. చనిపోయిన నాన్న మీద కేసులు పెట్టుకోండని చెప్పిన వ్యక్తి ఆయన. జగన్ జైల్లో ఉన్నప్పుడు పాదయాత్ర చేయాలని షర్మిలకు మేం చెప్పలేదు. ఆస్తుల వాటా సమస్యా మీదే. బాబాయిని చంపుకొందీ మీరే. ఇప్పుడేమో కుటుంబాల మధ్య చిచ్చు పెడుతున్నారని మమ్మల్ని అంటున్నారు' అని ధ్వజమెత్తారు. 'ప్రజలకు సేవ చేసే వలంటీర్లకు మేం వ్యతిరేకం కాదు. వైసీపీ కోసం పనిచేసే వారిని మాత్రం వదిలిపెట్టే ప్రసక్తే లేదు. వలంటీర్లకు రాజకీయాలు వద్దు' అని సలహా ఇచ్చారు. టీడీపీ అధికారంలోకి వస్తే వారిని తొలగిస్తామంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని.. వారిలో కావాలనే అభద్రతాభావం పెంచుతున్నారని ఆక్షేపించారు. ఇంకా ఏమన్నారంటే..

వేంకటేశ్వరస్వామితో పైరవీలు

తిరుమలను అపవిత్రం చేస్తున్నారు. కలియుగ దైవం వేంకటేశ్వరస్వామితో వైసీపీ నాయకులు రాజకీయాలు, పైరవీలు చేస్తున్నారు. ఆయన అన్నీ చూస్తున్నారు. మిమ్మల్ని వదిలిపెట్టం. తిరుపతి దొంగ ఓట్లకు కేంద్రంగా మారింది. ఐప్యాక్ బృందం ఈసీ కార్యాలయంలో తిరుపతి దొంగ ఓట్లకు సంబంధించిన ఫైల్స్ మాయం చేసింది. వాళ్లను వదిలిపెట్టం. సీబీఐ విచారణ జరగాల్సిందే. కార్యకర్తలకు, ప్రజలకు ఒకటే విజ్ఞప్తి చేస్తున్నా. మీ ఓటు ఉందో లేదో తరచూ తనిఖీ చేసుకోండి. ఎర్రచందనం స్మగ్లర్‌కు చిత్తూరు సీటు ఇచ్చారు. స్మగ్లర్లే రాజులైపోతే ఇక పోలీసులెందుకు? పీలేరులో ఎర్రచందనం స్మగ్లర్లు గణేశ్ అనే కానిస్టేబుల్‌ను కారుతో గుద్ది చంపేయడం బాధాకరం. పోలీసులకే రక్షణ కల్పించలేని వ్యవస్థ ఎందుకు?

ఇదీ వైసీపీ మార్క్...

గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీ కట్టలేక టీడీపీ నిర్మించిన రోడ్ల మీద నడుస్తుండడం వైసీపీ మార్క్.. టీడీపీ హయాంలో ఇసుక ఉచితంగా లభిస్తే.. ఇప్పుడా పరిస్థితి లేకపోవడం వైసీపీ మార్క్.. ఉద్యోగులకు టీడీపీ 43 శాతం ఫిట్‌మెంట్ ఇస్తే, ఇప్పుడు ఒకటో తేదీన జీతాలు ఇవ్వకపోవడం వైసీపీ మార్క్.. తిరుపతిలో వందల ప్రసిద్ధ కంపెనీలను తెచ్చి లక్షల మందికి ఉపాధి ఇస్తే, ఇప్పుడు ఉన్న పరిశ్రమల్ని తరిమేస్తుండడం వైసీపీ మార్క్. చిత్తూరు జిల్లాలో పాపాల పెద్దిరెడ్డి ఇంట్లోనే ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు, కాంట్రాక్టర్లు, స్మగ్లర్లు, దొంగలున్నారు. రాష్ట్రంలో గ్రానైట్ యజమానులు మంత్రి పెద్దిరెడ్డికి కప్పం కట్టాల్సిందే. డిప్యూటీ సీఎం నారాయణస్వామి రెడ్లు కూర్చుని ఉంటే పక్కన చేతులు కట్టుకుని నిలబడి ఉంటారు. ఆయన అసమర్థుడు. మంత్రి రోజా కనీస హుందా లేకుండా పక్క రాష్ట్రాలకు వెళ్లి చిందులేస్తోంది. సొంత పార్టీ దళిత నాయకుల వద్దే మున్సిపల్ చైర్మన్ పదవి ఇప్పిస్తానని రూ.70 లక్షలు తీసుకుంది. పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అవినీతిపరుడని ముద్ర వేసి టికెట్ ఇవ్వలేదు. మరి పెద్దిరెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అవినీతిపరులు కాదా? చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఇసుకతో పాటు మున్సిపల్ కార్యాలయంలో అవినీతి చేసి పెద్దఎత్తున దోచుకున్నారు. ఇప్పుడు ఆయన్ను కాదని పెద్ద దొంగకు ఎమ్మెల్యే సీటు ఇచ్చారు. ఆ వ్యక్తి ఇంటర్నేషనల్ స్మగ్లర్.

టీడీపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే

చిత్తూరు జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే ఆర్.గాంధీ చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. వైసీపీలో దళితులకు గౌరవం లేదని, 12 ఏళ్లుగా ఒక్కసారి కూడా సీఎం జగన్‌ను కలవలేకపోయానని, మంత్రి పెద్దిరెడ్డి దళితుల పట్ల ఆధిపత్యం ప్రదర్శిస్తున్నారని ఆవేదన చెందిన ఆయన సోమవారం వైసీపీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే.

'ఓర్' మాస్ దోపిడీ

(మొదటి పేజీ తరువాయి)

మార్చి అమ్మాలి. 2004లోనే ఈ లీజుకు సర్కారు అనుమతి ఇచ్చింది. 2009లోనే ఒంగోలు ఐరన్‌ఓర్ మైనింగ్ కంపెనీని ఏర్పాటు చేసి జింపెక్స్ అనే కంపెనీనీ జాయింట్ వెంచర్ భాగస్వామిగా ఎంపిక చేసింది. ఇందులో ఏపీఎండీసీకి 51 శాతం, మిగతాది జింపెక్స్‌కు ఉండేలా ఒప్పందం కుదిరింది. దీనిపై న్యాయపరమైన చిక్కులు రావడంతో విషయం సుప్రీం కోర్టుకు వెళ్లింది. ప్రాజెక్టు ఆగిపోయింది. చివరకు న్యాయపోరాటం నుంచి 2019లో ఎంఎస్‌పీఎల్ తప్పుకొంది. తర్వాత ఈ ప్రాజెక్టు కార్యరూపం దాలుస్తుందనుకున్నారు. కానీ అనూహ్యంగా జగన్ సర్కారు ఇనుప ఖనిజం ఉన్న భూములను పేదలకు ఇవ్వాలని ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ఉత్తర్వుపై ఒంగోలు మైనింగ్ కంపెనీ హైకోర్టుకు వెళ్లగా, ప్రభుత్వ ఉత్తర్వులను కోర్టు నిలుపుదల చేసింది. దీంతో జింపెక్స్ కంపెనీనే మైనింగ్ చేపట్టాలి. కానీ ఆ కంపెనీ సైలెంట్‌గా తప్పుకొంది.

పెద్దల ప్లాన్...

ఐరన్‌ఓర్ ప్రాజెక్టును జిందాల్ అనే బడా కార్పొరేట్ కంపెనీకి ఇవ్వాలని జగన్ సర్కారు భావిస్తున్నట్లు తెలిసింది. ఇందుకోసం ఓ ముఖ్యనేత కొద్దిరోజుల క్రితం మీటింగ్ ఏర్పాటు చేశారు. దాని తర్వాత జింపెక్స్ తప్పుకొన్నట్లు తెలిసింది. పాత జాయింట్ వెంచర్ కంపెనీ స్థానంలో కొత్తసంస్థను ఏర్పాటు చేయాలని, జేవీ భాగస్వామి కోసం టెండర్లకు వెళ్లాలని పెద్దలు ఆదేశించినట్లు తెలిసింది. దరిమిలా ఏపీఎండీసీ.. శరవేగంగా ముసాయిదా టెండర్ డాక్యుమెంట్‌ను తయారు చేసింది. దాన్ని న్యాయకమిషన్ ఆమోదం కోసం పంపించింది. ఐరన్ మైనింగ్ చేసేంత శక్తిసామర్థ్యాలు ఏపీఎండీసీకి లేవు. కాబట్టి ప్రైవేటు భాగస్వామితో జాయింట్ వెంచర్ ఏర్పాటు చేయాలి. ఇదేమీ తప్పుకాదు. అయితే, ఎవరికి ఎంత వాటా ఉండాలన్నదాంట్లోనే ఏపీఎండీసీతో తప్పటడుగులు వేయించారు. కేంద్ర మైనింగ్ చట్టం(ఎంఎండీఆర్)-1956 ప్రకారం ఏపీఎండీసీకి 76 శాతంపైనే వాటా ఉండాలి. మిగతాది ప్రైవేటుకి ఇవ్వాలి. అలా కాదనుకుంటే, ఏపీఎండీసీకి 51 శాతంపైన వాటా ఉండాలి. కానీ, ఐరన్ ఓర్ జేవీసీ విషయంలో ఏపీఎండీసీకి కేవలం 11 శాతం వాటా ఉంటుందని ప్రతిపాదించారు. మిగతా 89 శాతం ప్రైవేటుకు ఇస్తారన్నమాట. ఇది కేంద్ర మైనింగ్ చట్టాలకు పూర్తి విరుద్ధం. వైఎస్. రాజశేఖరరెడ్డి హయంలో జరిగిన ఒప్పందంలో ఐరన్‌ఓర్ తవ్వకాల కోసం ఏర్పాటుచేసిన జేవీసీలో ఏపీఎండీసీకి 51 శాతం వాటా అని నిర్ధారించారు. ఇప్పుడు జగన్ పాలనలో ఏపీఎండీసీకి 11 శాతం వాటా చాలని, ప్రైవేటుకు మాత్రం 89 శాతం ఇవ్వాలని నిర్ధారించారు. మొన్నటి మొన్న బీచ్‌శాండ్ డెవలపర్ టెండర్లలో ఏపీఎండీసీకి 8 శాతం, ప్రైవే టు భాగస్వామికి 92 శాతం వాటా అని టెండర్లు పిలిచారు. హైకోర్టు ఆదేశాలతో ఆ టెండర్ నిలిచిపోయింది. ఇప్పుడు ఐరన్‌ఓర్ జేవీసీ ముసాయిదా డాక్యుమెంట్‌లో 11 శాతం వాటా ఏపీఎండీసీకి ఉంటుందని ప్రతిపాదించారు.

కార్పొరేట్ కోసమే..

టంగుటూరు మండలం కొణిజేడు, మర్లపాడు, సర్వరెడ్డిపాలెం, కండలూరు, ఎర్రజెర్ల, టంగుటూరులోని 1307 ఎకరాల పరిధిలోని భూముల్లో ఐరన్ ఓర్ నిక్షేపాలున్నాయి. ప్రాసెస్‌చేసి, హైగ్రేడ్ ముడి ఇనుముగా మార్చడానికి బెనిఫిసికేషన్ ప్లాంటు ఏర్పాటు చేయాలి. మైనింగ్‌తోపాటు, హై గ్రేడ్ ఇనుమును తయారుచేసి అమ్మే బాధ్యత ఈ జాయింట్ వెంచర్ కాంట్రాక్టులో ఉంది. ఏటా 5 మిలియన్ టన్నుల ఐరన్‌ఓర్ తవ్వితీయాలి. ఏటా 1.5 లక్షల టన్నుల ప్రాసెస్ ప్లాంటు నిర్వహణ ఉండాలి. జేవీసీలో భాగస్వామిగా ఉండే కంపెనీకి ఏడేళ్ల వ్యవధిలో (వరసగా నాలుగేళ్లు) 680 కోట్ల టర్నోవర్ ఉండాలన్న నిబంధన విధించారు. ఆ కంపెనీ వరుసగా నాలుగేళ్లుగా 250 కోట్ల నెట్‌వర్త్ కలిగి ఉండాలని, చేతిలో 45 కోట్ల నగదు ఉండాలని చేర్చారు. టెండర్ దక్కించుకునే సంస్థ ఈఎండీగా 4.5 కోట్లు, కార్యనిర్వాహణ గ్యారంటీ నిధిగా 45 కోట్లు చెల్లించాలన్న నిబంధన విధించారు. బిడ్ డాక్యుమెంట్ ఫీజు 5 లక్షలు. 18 శాతం జీఎస్టీతో కలిపితే 5.90 లక్షలు. అయితే, జిందాల్ కోసమే ఈ టెండర్ పిలిచినట్లుగా ఉందని గనుల శాఖ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది.

రండి.. మాట్లాడుకుందాం!

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించి భద్రతాపరమైన షెడ్యూల్ కూడా విడుదలైంది. బుధవారం మధ్యాహ్నం 2.30 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుంచి బయలుదేరి ఢిల్లీ వెళ్తారు. రాత్రి అమిత్ షాను కలుస్తారు. వారి చర్చల్లో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా కూడా పాల్గొంటారని సమాచారం.

పొత్తులపై చర్చకేనా?

ఈ ఎన్నికల్లో టీడీపీతో పొత్తుపై బీజేపీ కొన్నాళ్లుగా ఆసక్తి ప్రదర్శిస్తోంది. స్కిల్ కేసులో అరెస్టుకు ముందు 4నెలల కిందట ఒకసారి చంద్రబాబు ఢిల్లీలో అమిత్‌షాతో భేటీ అయ్యారు. ఆయన రిమాండ్‌లో ఉన్న సమయంలో లోకేశ్ రెండు పర్యాయాలు అమిత్ షాతో చర్చలు జరిపారు. జగన్ సర్కారు పెడుతున్న తప్పుడు కేసులు, కక్ష సాధింపు చర్యలను వివరించారు. బీజేపీతో పొత్తులకు సంబంధించి ఎన్నికల కోణంలో తమ పరిశీలనను సమగ్రంగా వివరించారు. ఆయన వాదనతో బీజేపీ పెద్దలు ఏకీభవించారని, పొత్తుపై వెనక్కి తగ్గారని అప్పట్లో ప్రచారం జరిగింది. మరోవైపు... బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా సోము వీర్రాజు ఉన్నంతకాలం టీడీపీపట్ల వ్యతిరేకత ప్రదర్శిస్తూ వచ్చారు. పురందేశ్వరి పదవి చేపట్టాక పరిస్థితి మారింది. ఇదే నేపథ్యంలో, ఇప్పుడు చంద్రబాబుకు అమిత్‌షా నుంచి పిలుపు అందడం ఆసక్తికరంగా మారింది. టీడీపీతో పొత్తు ఖరారవుతుందని రాష్ట్ర బీజేపీ నేతలు ఆశాభావంతో ఉన్నారు. 'ఈ నెల 9న ఢిల్లీలో బీజేపీ పార్లమెంటరీ బోర్డు సమావేశం జరగనుంది. దీనికి ముందే వివిధ రాష్ట్రాల్లో పార్టీ పరిస్థితి, అనుసరించాల్సిన వ్యూహాలను ఖరారు చేసుకోవాలని బీజేపీ నాయకత్వం భావిస్తోంది. టీడీపీతో పొత్తు పెట్టుకోవాలని నిర్ణయం తీసుకున్న తర్వాతే చంద్రబాబును పిలవాలని నిశ్చయించారు. అమిత్ షాతో సమావేశంలో పొత్తుపై లాంఛనంగా ఒక నిర్ణయం తీసుకుంటారు' అని రాష్ట్ర బీజేపీ ముఖ్యుడొకరు తెలిపారు.

గుంభనంగా టీడీపీ నేతలు

తాజా పరిణామంపై టీడీపీ వర్గాలు ఆచితూచి స్పందిస్తున్నాయి. ఢిల్లీ పిలుపుపై ఆ పార్టీ నాయకత్వం అధికారికంగా స్పందించలేదు. చంద్రబాబు ఢిల్లీ వెళ్తున్నారని ధ్రువీకరించడం మినహా ఆ పార్టీ నేతలు నోరుమెదపడంలేదు. పొత్తు విషయం అప్పుడే నిర్ధారించడం సాధ్యంకాదని అంతరంగిక సంభాషణల్లో చెబుతున్నారు. 'ఎన్నికల కోణంలో మా సమస్యలను చంద్రబాబు మరోసారి వివరిస్తారనే అనుకుంటున్నాం. ఇది సున్నితమైన అంశం. ఏం జరుగుతుందో చూడాలి' అని టీడీపీ ప్రముఖుడొకరు వివరించారు.


పావనీలత

మరణిస్తూ నలుగురికి పునర్జన్మ

» కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో మహిళ బ్రెయిన్ డెడ్

» అవయవదానానికి అంగీకరించిన కుటుంబసభ్యులు

కర్నూలు(హాస్పిటల్)ఫిబ్రవరి 6: బ్రెయిన్ డెడ్ అయిన ఓ మహిళ మరో నలుగురికి ప్రాణదాతగా మారింది. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో బ్రెయిన్‌డెడ్ అయిన మహిళ నుంచి కుటుంబ సభ్యుల అనుమతితో అవయవాలను సేకరించిన వైద్యులు కర్నూలుతో పాటు విజయవాడ, హైదరాబాద్ ప్రాంతాల్లోని అవయవ గ్రహీతలున్న ఆసుపత్రులకు చేరవేశారు. ఇందుకోసం మంగళవారం మధ్యాహ్నం నుంచి కర్నూలు నగరంలో గ్రీన్ చానల్ ఏర్పాటు చేశారు. కర్నూలు నగరంలోని బాలాజీ నగర్‌కు చెందిన వీరప్రతాప్‌రెడ్డికి ముగ్గురు సంతానం. రెండో కూతురు పావనీలత(28)కు తెలంగాణ రాష్ట్రం వనపర్తి జిల్లా కొల్లాపూర్ మండలం నరసాపురం గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డితో 8ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఆరు సంవత్సరాల కుమార్తె ఉంది. రెండున్నర ఏళ్ల క్రితం కిడ్నీ వ్యాధితో శ్రీనివాసరెడ్డి మరణించగా, ఉద్యోగం కోసం కొద్దిరోజుల క్రితం పావనీలత హైదరాబాద్‌కు వెళ్లింది. అక్కడ ఆమెకు ఫిట్స్ రాగా స్థానికులు గుర్తించి ఓ ఆసుపత్రిలో చికిత్స కోసం చేర్పించారు. పరిస్థితి విషమించడంతో ఆమె తల్లిదండ్రులు ఈ నెల 3న కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఆమెకు ఈ నెల ఐదో తేదీన వైద్యులు బ్రెయిన్‌డెడ్‌గా నిర్ధారించారు. పావనీలత కోరిక మేరకు ఆమె అవయవాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. కర్నూలు కలెక్టర్ డాక్టర్ జి.సృజన, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటరంగారెడ్డి సమక్షంలో ఊపిరితిత్తులను హైదరాబాద్ కిమ్స్ ఆసుపత్రికి, కాలేయాన్ని విజయవాడ మణిపాల్ ఆసుపత్రికి గ్రీన్‌చానల్ ద్వారా అంబులెన్స్‌ల్లో పంపారు. రెండు మూత్రపిండాల్లో కర్నూలు జీజీహెచ్‌కు ఒకటి, కర్నూలు కిమ్స్ ఆసుపత్రికి మరొకటి అందించారు. రెండు కళ్లను కర్నూలు జీజీహెచ్, జీవన్‌దాన్‌లో రిజిస్టర్ అయిన వారికి అందిస్తామని కర్నూలు కలెక్టర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ తెలిపారు.


స్నాతకోత్సవంలో ప్రసంగిస్తున్న గవర్నర్

'రెడ్‌బుక్'పై విచారణ 13కి వాయిదా

» చంద్రకాంత్ షా వాంగ్మూలం 15న

విజయవాడ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ 'యువగళం' ముగింపు సభలో 'రెడ్‌బుక్'ను ప్రస్తావిస్తూ చేసిన వ్యాఖ్యలపై సీఐడీ అధికారులు ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌పై విచారణను విజయవాడ ఏసీబీ కోర్టు ఈ నెల 13వ తేదీకి వాయిదా వేసింది. అదేవిధంగా, స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో నిందితుడిగా ఉంటూ అప్రూవర్‌గా మారిన చంద్రకాంత్ షా వాంగ్మూలం నమోదును ఈ నెల 15వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయాధికారి ఉత్తర్వులు ఇచ్చారు.

అచ్చెన్నాయుడి చార్జిషీట్‌పై నేడు విచారణ

ఈఎస్ఐ కుంభకోణం కేసుకు సంబంధించి టీడీపీ ఏపీ చీఫ్, మాజీ మంత్రి అచ్చెన్నాయుడిని బాధ్యుణ్ణి చేస్తూ ఏసీబీ అధికారులు దాఖలు చేసిన చార్జిషీటుపై విచారణ బుధవారానికి వాయిదా పడింది. చార్జిషీటు దాఖలు చేసే సమయంలో గవర్నర్ అనుమతి తీసుకోవాలని ఇటీవల ఏసీబీ కోర్టు స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ఈ అనుమతి అవసరం లేదని ఏసీబీ తరఫు న్యాయవాదులు వాదిస్తున్నారు. దీనిపై బుధవారం విచారణ జరగనుంది.

ఆటోతో ఢీకొట్టి.. రాడ్లతో కాళ్లు విరగొట్టి..

» టీడీపీ సానుభూతిపరుడిపై వైసీపీ దాడి

రొంపిచర్ల, ఫిబ్రవరి 6: పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం తురుమెళ్ళ గ్రామానికి చెందిన టీడీపీ సానుభూతిపరుడైన గొల్లపూడి శ్రీనివాసరావుపై వైసీపీ మూకలు దాడి చేశాయి. మంగళవారం ఆయన పని నిమిత్తం నరసరావుపేట వెళ్తుండగా వెంబడించి ఆటోతో గుద్ది, కిందపడిన తర్వాత రాడ్లు, కర్రలతో కాళ్లు విరగగొట్టారు. ఈ దారుణాన్ని స్థానికులు చూసి బంధువులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. గ్రామానికి చెందిన గొల్లపూడి రామారావు, మరి కొంతమంది శ్రీనివాసరావుపై దాడి చేసినట్లు ఆయన బంధువులు తెలిపారు. తీవ్రంగా గాయ పడిన శ్రీనివాసరావును నరసరావుపేటలోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. గత సంవత్సరం డిసెంబరు 31న గ్రామంలో ఫ్లెక్సీల విషయమై వివారం తలెత్తింది. ఈ నేపథ్యంలో శ్రీనివాసరావుపై దాడి జరిగినట్లు తెలిసింది. గ్రామంలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు. నిందితులను పట్టుకోవడానికి ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ పాల్‌రాజ్ రవీంద్ర తెలిపారు.

ప్రకాశంలో 8 చోట్ల టీడీపీ అభ్యర్థులు ఖరారు!

పరుచూరు, అద్దంకి, కొండపి సిటింగ్‌లకే మళ్లీ టికెట్లు

» మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి ప్రస్తుత ఇన్‌చార్జులకే చాన్సు

» ఒంగోలు, యర్రగొండపాలెం కూడా

» దర్శి సీటు జనసేనకు?

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ముప్పాతిక వంతు సీట్లలో టీడీపీ అభ్యర్థులపై స్పష్టత వచ్చింది. మొత్తం 12 సీట్లకుగాను 8 చోట్ల అభ్యర్థులు ఖరారయ్యారు. దర్శి స్థానాన్ని మిత్రపక్షం జనసేనకిచ్చే అవకాశం ఉంది. మిగిలిన మూడు సీట్లకు సంబంధించి మెరుగైన అభ్యర్థి కోసం కసరత్తు కొనసాగుతోంది. గత ఎన్నికల్లో ఈ జిల్లాలో టీడీపీ నుంచి నలుగురు ఎమ్మెల్యేలు గెలుపొందారు. వారిలో చీరాల నుంచి గెలిచిన కరణం బలరాం వైసీపీలో చేరిపోయారు. మిగిలిన ముగ్గురు ఎమ్మెల్యేలు.. గొట్టిపాటి రవికుమార్ (అద్దంకి), ఏలూరి సాంబశివరావు (పరుచూరు), డోలా బాల వీరాంజనేయ స్వామి (కొండపి-ఎస్సీ) నుంచి తిరిగి పోటీ చేయనున్నారు. మరో ఐదు సీట్లలో కూడా ప్రస్తుత ఇన్‌చార్జులనే బరిలోకి దించాలని నాయకత్వం నిర్ణయించింది. కనిగిరిలో ఉగ్ర నరసింహారెడ్డి, మార్కాపురం-కందుల నారాయణరెడ్డి, గిద్దలూరు-ఎం.అశోక్‌రెడ్డి, ఒంగోలు-దామచర్ల జనార్దన్, యర్రగొండపాలెంలో ఎరిక్సన్‌బాబు పోటీ చేస్తారని టీడీపీ వర్గాలు తెలిపాయి. దర్శిలో జనసేనలో కొత్తగా చేరిన ప్రవాసాంధ్రుడు గరికపాటి వెంకట్ చురుగ్గా కనిపిస్తున్నారు. తాజాగా మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగరటయ్య కుమారుడు కృష్ణచైతన్య కూడా ఆ పార్టీ టికెట్ ఆశిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. మిగిలిన మూడు సీట్లపై టీడీపీ నాయకత్వం కసరత్తు కొనసాగుతోంది. చీరాల ఇన్‌చార్జిగా ఎంఎం కొండయ్య ఉన్నారు. ఆయనతోపాటు అక్కడ సజ్జా హేమలత, చాపర్తి రాజేశ్ పేర్లు పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. కందుకూరులో ప్రస్తుతం టీడీపీ ఇన్‌చార్జిగా ఇంటూరి నాగేశ్వరరావు ఉన్నారు. ఆయనకు వరుసకు సోదరుడయ్యే రాజేశ్ కూడా టికెట్ ప్రయత్నాల్లో ఉన్నారు. కొత్తగా కోటపాటి జనార్దన్ అనే నేత పేరును కొందరు నేతలు అధిష్ఠానానికి ప్రతిపాదించారు. వైసీపీలోని ఒక ఎమ్మెల్యే పేరు కూడా టీడీపీ వర్గాల్లో నలుగుతోంది. సంతనూతలపాడు(ఎస్సీ)కు బీఎన్ విజయకుమార్ ప్రస్తుతం ఇన్‌చార్జిగా ఉన్నారు. ఆయన సోదరుడు డాక్టర్ అనిల్ ఏలూరు జిల్లా చింతలపూడి (ఎస్సీ) టికెట్ రేసులో గట్టి ప్రయత్నాల్లో ఉన్నారు. అనిల్‌కు అక్కడ టికెట్ వస్తే విజయ్ కుమార్‌కు ఇక్కడ టికెట్ వస్తుందా అన్న సందేహాలు పార్టీ వర్గాల్లో ఉన్నాయి. ప్రత్యామ్నాయంగా ఈ సీటుకు పాలపర్తి మనోజ్ కుమార్, బొమ్మాజీ అనిల్ పేర్లు వినిపిస్తున్నాయి. ఒంగోలు ఎంపీ అభ్యర్థిపైనా ఇంకా స్పష్టత రాలేదు. ఏలూరు ఎంపీ సీటు బీసీలకు ఇస్తే.. ఒంగోలు ఓసీలకు ఇస్తారని, అక్కడ వీలుకాని పక్షంలో ఇక్కడ బీసీలకు ఇచ్చే అవకాశముందని ప్రచారం జరుగుతోంది.

ప్రకాశం జిల్లాలో ఖరారైన టీడీపీ అభ్యర్థులు..

నియోజకవర్గం	అభ్యర్థి
ఒంగోలు	దామచర్ల జనార్దన్
కనిగిరి	ముక్కు ఉగ్రనరసింహారెడ్డి
అద్దంకి	గొట్టిపాటి రవికుమార్
మార్కాపురం	కందుల నారాయణరెడ్డి
పర్చూరు	ఏలూరి సాంబశివరావు
గిద్దలూరు	ముత్తుమల అశోక్‌రెడ్డి
కొండపి(ఎస్సీ)	డోలా బాల వీరాంజనేయస్వామి
యర్రగొండపాలెం(ఎస్సీ)	గూడూరి ఎరిక్సన్‌బాబు
దర్శి	జనసేన

2 సీట్లంటే ఆర్థికంగా తట్టుకోలేరేమో..!

» పరిటాల సునీతతో చంద్రబాబు వ్యాఖ్య

అమరావతి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): 'మీ కుటుంబానికి రెండు అసెంబ్లీ సీట్లు అడుగుతున్నారు. కానీ ఈ రెండు చోట్లా మీ ప్రత్యర్థులు ఆర్థికంగా బలవంతులు. మీరు రెండు స్థానాల్లో పోటీచేస్తే ఆర్థికంగా తట్టుకోలేరేమో.. ఆలోచించుకోండి' అని మాజీ మంత్రి పరిటాల సునీతతో టీడీపీ అధినేత చంద్రబాబు అన్నట్లు తెలిసింది. మంగళవారం ఆమె తన కుమారుడు శ్రీరామ్‌తో ఇక్కడకు వచ్చి ఆయన్ను కలిశారు. కొన్ని నియోజకవర్గాల నేతలను చంద్రబాబు మంగళవారం ఉదయం ఇక్కడ తన నివాసానికి పిలిపించి మాట్లాడారు.

వైద్యుల చేతుల్లోనే ప్రజారోగ్యం

» హెల్త్ వర్సిటీ స్నాతకోత్సవంలో గవర్నర్ నజీర్

» నిమ్‌హాన్స్ ప్రొఫెసర్ ప్రతిమా మూర్తికి గౌరవ డాక్టరేట్

» 60 మంది ప్రతిభావంతులకు పతకాలు ప్రదానం

విజయవాడ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యం వైద్యుల చేతుల్లోనే ఉందని గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. దేశం గానీ, రాష్ట్రం గానీ ఆరోగ్యంగా ఉండాలంటే వైద్యుల కృషి ఎంతో కీలకమన్నారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం 26వ స్నాతకోత్సవం విజయవాడలోని ప్రైవేటు ఫంక్షన్ హాలులో మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి చాన్సలర్ హోదాలో గవర్నర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మందులు రోగాన్ని నయం చేస్తే, రోగులను వైద్యులు మాత్రమే నయం చేయగలరని స్విస్ మానసిక వైద్య నిపుణుడు కారల్ జంగ్ మాటలను ఆయన ఉటంకించారు. స్నాతకోత్సవంలో పతకాలను అందుకున్న విద్యార్థులు వైద్య రంగానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. తమ వద్దకు వచ్చిన ప్రతి రోగిని చిరునవ్వుతో ఇంటికి పంపాలని చెప్పారు. హెల్త్ వర్సిటీ పరిధిలో ఉన్న 439 మెడికల్, డెంటల్, ఆయుర్వేదం, హోమియోపతి, యునాని, నేచురోపతి, యోగా, నర్సింగ్, ఫిజియోథెరపీ, అనుబంధ పారామెడికల్, ఆరోగ్య విజ్ఞాన కోర్సులను అభ్యసిస్తున్న వేలాది మంది విద్యార్థులు భవిష్యత్‌లో ప్రజలకు సేవలు అందించాలని విజ్ఞప్తి చేశారు. తొలుత బెంగళూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూరో సైన్స్ డైరెక్టర్ డాక్టర్ ప్రతిమామూర్తికి వర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. అనంతరం వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన 60 మంది యూజీ, పీజీ విద్యార్థులు గవర్నరు పతకాలను అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ వర్సిటీ ఉపకులపతి డాక్టర్ కె.బాబ్జి, వైద్య విద్య సంచాలకుడు డాక్టర్ దొమ్మేటి వెంకట లక్ష్మీనరసింహం, వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వేమిరెడ్డి రాధికారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

41(ఏ) నిబంధన పాటిస్తాం

ఎమ్మెల్యే ఏలూరి వ్యవహారంపై హైకోర్టుకు నివేదించిన పోలీసులు

» ముందస్తు బెయిల్‌పై దాఖలైన వ్యాజ్యాన్ని పరిష్కరించిన న్యాయస్థానం

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ప్రకాశం జిల్లా పర్చూరు నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు విషయంలో సీఆర్పీసీ సెక్షన్ 41(ఏ) నిబంధనలు పాటిస్తామని పోలీసులు హైకోర్టుకు నివేదించారు. అదేవిధంగా అర్నేష్‌కుమార్ కేసులో సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా నడుచుకుంటామని తెలిపారు. ఈ మేరకు మంగళవారం మెమో దాఖలు చేశారు. ఈ వివరాలు నమోదు చేసిన న్యాయస్థానం సీఆర్పీసీ సెక్షన్ 41(ఏ) కింద నోటీసులు ఇస్తామని పోలీసులు చెబుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్ లోతుల్లోకి వెళ్లడంలేదని పేర్కొంది. వ్యాజ్యాన్ని పరిష్కరించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి. మల్లికార్జున రావు మంగళవారం ఆదేశాలిచ్చారు. గ్రానైట్ పరిశ్రమల్లో తనిఖీలకు వచ్చిన మైనింగ్ అధికారుల విధులకు ఆటంకం కలిగించారనే ఆరోపణలతో మైనింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బాలాజీనాయక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో మార్టూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు హైకోర్టును ఆశ్రయించారు. మంగళవారం ఈ పిటిషన్ మరోసారి విచారణకు రాగా ఏలూరి తరఫున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపించారు. అర్నేష్‌కుమార్ కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం ఏడేళ్లు, ఆలోపు శిక్షకు వీలున్న కేసుల్లో సీఆర్పీసీ సెక్షన్ 41(ఏ) నిబంధనలు పాటించాలన్నారు. దర్యాప్తు అధికారికి ఉన్న అనుమానాలతో వ్యక్తులను అరెస్టు చేయలేరని తెలిపారు. పోలీసులు ఒకసారి 41(ఏ) నోటీసులు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్న తర్వాత అరెస్టు అవసరం లేదని భావించాలన్నారు. దొంగ ఓట్లు చేర్పిన వ్యవహారంలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పిటిషనర్ ఏలూరి హైకోర్టులో వ్యాజ్యం వేశారని, దీంతో బాధ్యులైన కొంతమంది పోలీసులు, రెవెన్యూ అధికారులను సస్పెండ్ చేశారని తెలిపారు. కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే పిటిషనర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. డ్రైవర్‌పై దాడి చేసినట్లు పిటిషనర్‌పై ఎలాంటి ఆరోపణలు లేవని పేర్కొన్నారు.

కోర్టులు ఆదేశించలేవు: పీపీ

పోలీసులు తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్(పీపీ) వై. నాగిరెడ్డి, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ దుష్యంత్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. నిందితుడిని అరెస్టు చేయాలా? వద్దా అనేది దర్యాప్తు అధికారి విచక్షణాధికారమని తెలిపారు. సీఆర్పీసీ సెక్షన్ 41(ఏ) నిబంధనలు పాటించాలని దర్యాప్తు అధికారిని న్యాయస్థానాలు ఆదేశించలేవన్నారు. ప్రభుత్వ అధికారి విధులు నిర్వర్తించకుండా పిటిషనర్ అడ్డుకున్నారని తెలిపారు. న్యాయమూర్తులను దూషిస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టిన వ్యవహారంలో ఏడేళ్లలోపు జైలు శిక్షకు వీలున్న కేసులే అయినప్పటికీ గతంలో అరెస్టు చేసి రిమాండ్‌కి పంపారని గుర్తు చేశారు. ఏడేళ్లలోపు శిక్షకు వీలున్న కేసుల్లో 41(ఏ)కింద నోటీసులు ఇవ్వడం తప్పనిసరి కాదన్నారు.

పత్రికల్లో వచ్చే వాటిని నిలువరించలేం

» భావ ప్రకటనా స్వేచ్ఛ ఉంది: న్యాయమూర్తి

"సీఆర్పీసీ 41(ఏ) నిబంధనలు పాటించకపోవడంపై కోర్టు వ్యాఖ్యలు చేసినట్లు పత్రికల్లో వార్తలు ప్రచురించారు. అవి పోలీసు అధికారుల స్థైర్యాన్ని దెబ్బతీసేవిగా ఉన్నాయి" అని అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ దుష్యంత్‌రెడ్డి హైకోర్టు దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి జస్టిస్ టి. మల్లికార్జునరావు స్పందిస్తూ.. పత్రికల్లో వచ్చే వార్తలను ఎలా నిలువరించగలమని ప్రశ్నించారు. భావప్రకటనా స్వేచ్ఛ, వాక్ స్వాతంత్ర్యం ఉన్నాయి కదా అని పేర్కొన్నారు. పత్రికా కథనాలపై అభ్యంతరముంటే పరువు నష్టం దావా వేసుకోవాలని సూచించారు. సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు స్పందిస్తూ.. చట్టనిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకే విచారణ ప్రక్రియపై పత్రికలు వార్తలు రాస్తాయని తెలిపారు.


అన్న క్యాంటీన్‌ను ప్రారంభించి పేదలకు అన్నం వడ్డిస్తున్న నారా భువనేశ్వరి

అన్న క్యాంటీన్లను మూసి వైసీపీ పేదల కడుపుకొట్టింది: భువనేశ్వరి

దుగ్గిరాల, ఫిబ్రవరి 6: అన్నదానం, మహాదానమని గుర్తించి టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 2019లో 368 అన్న క్యాంటీన్లను ప్రారంభించిందని మాజీ సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి తెలిపారు. గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం రేవేంద్రపాడులోని చెక్‌పోస్ట్ ఎదురుగా తెలుగు యువత నాయకుడు కాసరనేని జస్వంత్ ఆధ్వర్యంలో తెనాలి - విజయవాడ ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను ఆమె మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ... 'అన్న నందమూరి తారకరామారావు పేరిట ప్రారంభించిన ఈ క్యాంటీన్లలో నిత్యం 7.25 లక్షల మంది భోజనం చేసేవారు. ఇలాంటి క్యాంటీన్లను వైసీపీ అధికారంలోకి రాగానే మూసివేసి పేదలు ఆకలి తీర్చుకునే అవకాశం లేకుండా చేసి వారి కడుపు కొట్టింది. ప్రభుత్వం ఎన్నో అడ్డంకులు సృష్టించినా టీడీపీ నాయకులు కుప్పం, మంగళగిరి తదితర ప్రాంతాల్లో 140 అన్న క్యాంటీన్లను ప్రారంభించారు. వాటిని కూడా అడ్డుకోవాలని ప్రయత్నించినప్పటికీ ఎదురొడ్డి పోరాడి నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే అన్న క్యాంటీన్లను పునఃప్రారంభిస్తాం' అని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ, టీడీపీ అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చకపోతే చెప్పుతో కొట్టండని చెప్పలేదా.!

» పౌర సమాజం ప్రశ్నలకు సమాధానం చెప్పేందుకు సిద్ధమా?: ప్రొఫెషనల్ ఫోరం

విజయవాడ (ధర్నాచౌక్), ఫిబ్రవరి 6: 'యుద్ధానికి నేను సిద్ధం.. తోడేళ్ల గుంపు సిద్ధమా' అంటున్న సీఎం జగన్‌కు పౌర సమాజం నుంచి తాము అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పే దమ్ముందా ? అని ప్రొఫెషనల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు నేతి మహేశ్వరరావు సవాల్ విసిరారు. విజయవాడ గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన మాట్లాడారు. మీ తండ్రి రాజశేఖర్‌రెడ్డి లేకపోతే మీ స్థాయి ఏంటి ? ఆయన వారసుడినని చెప్పుకునే మీరు ఆయన ఆశయాలకు వారసులా లేదా ఆస్తులకు వారసులా అని జగన్‌ను ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మరలా ఓటు అడిగితే చెప్పుతో కొట్టండని 2019 ఎన్నికల ప్రచార సభల్లో చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నారా అని ప్రశ్నించారు. రాష్ట్ర అప్పులు రూ.7 లక్షల కోట్లకు చేరగా రూ. 3 లక్షల కోట్లు సంక్షేమానికి ఖర్చు పెడితే మిగిలిన డబ్బులు దేనికి వాడారో చెప్పాలని డిమాండ్ చేశారు. తీవ్ర ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో అంత మంది ప్రభుత్వ సలహాదారులు ఎందుకని ప్రశ్నించారు. ఒక్క సజ్జల రామకృష్ణారెడ్డికే రూ.140 కోట్లు ఖర్చు చేయడానికి ఆయనకున్న అర్హతలేంటో తెలపాలన్నారు. రాష్ట్రంలో కన్సల్టెంట్ రాజకీయాలు, ఉచితాలు పంచితే గెలుస్తామనే రాజకీయాలు, బూతు రాజకీయాలు, మొత్తం అధికార వ్యవస్థ బానిస భావజాలంతో పని చేసే పద్ధతిని తీసుకువచ్చింది మీరు కాదా ? అని సీఎం జగన్‌ను ప్రశ్నించారు. ఇప్పటికైనా మీరు చేసిన మంచి పనులను ప్రజలకు వివరించి మరలా అధికారంలోకి వస్తే ఎటువంటి మంచి చేస్తారో చెప్పుకొని ఓట్లు అభ్యర్థించాలని సూచించారు.

నేడు తెరవనున్న బెరైటీస్ టెక్నికల్ బిడ్లు

» రిజర్వ్ ధర టన్నుకు రూ.1200

» నిబంధనల పేరుతో తక్కువకు అమ్మేస్తున్న ఎండీసీ అధికారులు

» చక్రం తిప్పిన సీఎంవో అధికారి

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలోని మంగంపేట బెరైటీస్ అమ్మకాలకు సంబంధించిన టెక్నికల్ బిడ్లను బుధవారం తెరవనున్నారు. కోటి టన్నుల బెరైటీస్ విక్రయానికి సంబంధించి పిలిచిన టెండర్లలో ఎన్ని బిడ్లు దాఖలయ్యాయి? వీటిలో ఏపీఎండీసీ ప్రమాణాల ప్రకారం అర్హత సాధించినవి ఎన్ని? అన్న వివరాలు తెలియనున్నాయి. ఏపీఎండీసీ కార్యాలయంలో ఈ టెక్నికల్ బిడ్‌లను సంబంధిత అధికారులు తెరవనున్నారు. బిడ్‌లు దాఖలు చేసిన కంపెనీల వివరాలను అధికారికంగా గురువారం ప్రకటించే అవకాశముంది. ఇదిలా వుంటే, టెండర్లలో టన్ను రిజర్వ్ బెరైటీస్ సీ, డీ గ్రేడ్ ధరను రూ.1200లుగా నిర్ణయించారు. ప్రస్తుతం మార్కెట్‌లో దీని విలువ రూ.1650 నుంచి రూ.1900 వరకు ఉంది. మంగంపేటలో ఏ, బీ గ్రేడుల బెరైటీస్ నిల్వలు తక్కువగా ఉన్నాయి. దీంతో సీ, డీ గ్రేడులకు డిమాండ్ ఉంటుంది. ఈ నేపథ్యంలో వీటి మార్కెట్ ధర మరో 30-60 శాతం పెరిగే అవకాశముంది. అంటే, టన్ను రూ.1,650 నుంచి రూ.2,400 లేదా అంతకు మించి పెరిగే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఇటీవల జరిగిన ప్రీ-బిడ్ సమావేశంలో పలు కంపెనీలు కూడా ఇదే అంశాన్ని ప్రస్తావించాయి. టెండర్ విషయంలో ఎందుకు తొందరపడుతున్నారని, మార్కెట్ రేటు పెంచుకునే అవకాశమున్నా ఎందుకు వదులుకున్నారని ఆరు కంపెనీలు ప్రశ్నించాయి. దీనికి ఏపీఎండీసీ స్పందిస్తూ.. టెండర్ నిబంధనల మేరకే వ్యవహరిస్తామని స్పష్టం చేసింది. అంటే, నష్టపోయినా సరే బెరైటీస్ అమ్మేసుకుంటాం అని చెప్పకనే చెప్పినట్లయింది. ఇదే విషయాన్ని ఇటీవల 'ఆంధ్రజ్యోతి' వివరణాత్మకంగా వెలుగులోకి తెచ్చింది. నిజానికి టెండర్‌లకు వెళ్లడానికి ముందే రిజర్వ్ ధర తగ్గించాలన్న ఏపీఎండీసీ ప్రతిపాదనను ప్రభుత్వ స్థాయిలో గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వ్యతిరేకించారు. మార్కెట్ పెరుగుతోందని, దానికి అనుగుణంగా రిజర్వ్ ధర పెంచాలని సూచిస్తూ.. ఏపీఎండీసీ ప్రతిపాదనలను తిప్పి పంపించారు. అయితే, ఎండీసీ అధికారులు సీఎంవోలోని ఓ అధికారి సాయంతో ఫైలును ఆమోదించుకుని, టెండర్ పిలిచారు. ఇప్పుడు అదే ధర(రూ.1200)ను రిజర్వ్(బేస్ ప్రైస్)ధరగా నిర్ణయించారు. ఈ నెల 9న అర్హత కలిగిన కంపెనీలతో బెరైటీస్ అమ్మకానికి వేలం నిర్వహించనున్నారు. ఇదే ధరతో వేలం నిర్వహిస్తే ఏపీఎండీసీకి కొన్ని రూ.వందల కోట్ల నష్టం వచ్చే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

'చిత్రావతి' ఇసుకకు రెక్కలు


» అనుమతి లేకుండా నదిలో తవ్వకాలు

» కర్నూలు జిల్లాకు అక్రమంగా తరలింపు

» రోజూ 30- 50 భారీ వాహనాల్లో లోడింగ్

» ప్రతిమ సంస్థ పేరిట నంబరు లేని వే బిల్లులు

» సీఎం బంధువు కనుసన్నల్లో దందా?


చిత్రావతి నదిలో ఇసుక తవ్వకాలు

యల్లనూరు, ఫిబ్రవరి 6: చిత్రావతి నదిలోని ఇసుకకు రెక్కలొచ్చాయి. అధికార పార్టీ నేతలు ఇక్కడి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. సీఎం జగన్ బంధువు కనుసన్నల్లో ఈ దందా జరుగుతోందన్న ప్రచారం సాగుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లా యల్లనూరు మండలం నుంచి కర్నూలు జిల్లాకు గ్రీన్‌కో పేరుతో భారీ వాహనాల్లో తీసుకుపోతున్నారు. చిలమకూరు సమీపంలో నది నుంచి ఇసుక తరలించేందుకు అనుమతులు ఉన్నాయి. కానీ రోడ్డు సమీపంలోని తిరుమలాపురం, యల్లనూరు బ్రిడ్జికి మధ్యభాగంలో ఇసుకను అక్రమంగా తోడేసి టిప్పర్లు, లారీల్లో తరలిస్తున్నారు. లారీలకు ఇస్తున్న పర్మిట్లలో మాత్రం చిలమకూరు రీచ్ నుంచే తీసుకువెళుతున్నట్లు నమోదు చేస్తున్నారు. పర్మిట్‌లో 30 టన్నులుగా పేర్కొంటున్నారు. వే బిల్లుపై సంఖ్య నమోదు చేయకపోవడం, పర్మిట్ జారీచేసే అధికారి సంతకం మాత్రమే ఉండి, సీలు వేయకపోవడాన్ని చూస్తే.. ఇది అక్రమ రవాణా అని తేటతెల్లమవుతోంది. ఈ వాహనాలకు ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్, విజయవాడ పేరిట బిల్లులు ఇస్తున్నారు. ఇసుక తవ్వుతున్న ప్రదేశంలో ఎటువంటి హద్దులు ఏర్పాటు చేయలేదు. కంపెనీ ప్రతినిధులు మాత్రం 63వేల టన్నులకు పైగా అనుమతులు ఉన్నాయని చెబుతున్నారు. ఇక్కడి నుంచి రోజూ 30 నుంచి 50 భారీ వాహనాల్లో ఇసుక తరలివెళుతోంది. మూడురోజుల క్రితం ఉన్నతాధికారులు తనిఖీలకు వస్తున్నారనే సమాచారంతో ఇసుక తవ్వకాలకు వినియోగిస్తున్న యంత్రాలు, వాహనాలను పక్కకు తరలించారు. చిత్రావతి నుంచి ఇసుక తరలింపు వెనుక సీఎం జగన్ బంధువు ఉన్నారని సమాచారం. నదిలో తవ్వకాలకు ఈ ప్రాంతానికి చెందిన అధికార పార్టీ సర్పంచ్ ఒకరు నాలుగు రోజుల క్రితం అభ్యంతరం చెప్పినట్లు తెలిసింది. దీంతో పోలీసులు ఆయన్ను స్టేషన్‌కు పిలిపించి, 'రాష్ట్రస్థాయి ముఖ్య నాయకుడి కనుసన్నల్లో ఇసుక రవాణా జరుగుతోంది. మీరెలా అడ్డుకుంటారు..?' అని మందలించి పంపినట్లు సమాచారం.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

అవినీతిలో పురోగతి

అవినీతి, బంధుప్రీతి, కుటుంబపాలన మీద ప్రధాని నరేంద్రమోదీ వ్యాఖ్యానించడం కొత్తేమీ కాదు కానీ, ఎప్పుడూ వినసొంపుగానే ఉంటుంది. దేశంలో అవినీతిని అంతం చేసేంతవరకూ విశ్రమించేది లేదని ఆయన సోమవారం చేసిన ప్రతిజ్ఞ కచ్చితంగా సంతోషం కలిగించేదే. పదేళ్ళ క్రితం వరకూ పార్లమెంటులో కుంభకోణాలమీద చర్చలు జరిగేవని, ప్రతిసారి చర్యలు తీసుకోవాలని సభ పట్టుబట్టేదని, ఇప్పుడు అవినీతిమీద చర్యలు తీసుకుంటూ ఉంటే కొందరు విమర్శలు చేస్తున్నారని ఆయన అన్నారు. దేశాన్ని దోచుకుంటూ ఉంటే ఊరుకొనేది లేదని, దోచుకున్న సొమ్మును వాపస్ చేసేవరకూ అవినీతి నేతలను వదిలేదని ఆయన తీవ్ర హెచ్చరికలు చేశారు.

అవినీతికి పుట్టినిల్లుగా కాంగ్రెస్‌ను చిత్రీకరించి అధికారంలోకి వచ్చిన వారు కనుక, కాంగ్రెస్ ముక్త్‌భారత్ సాధించేవరకూ ఆ వాదన కొనసాగుతుంది. తాము, తమ మిత్రపక్షాలు తప్ప మిగతాపార్టీలన్నీ అవినీతిమయమైనవేనని, దర్యాప్తు సంస్థలు రాజ్యాంగానికి లోబడే విపక్షనేతలను చెడుగుడు ఆడుతున్నాయని బీజేపీ సహజంగానే వాదిస్తుంది. తమ ప్రభుత్వాలను కూల్చడానికి, ఏక్‌నాథ్ షిండేలు అవతరించడానికి సీబీఐ, ఈడీ, ఐటీ ఇత్యాది సంస్థలు బీజేపీకి ఉపకరిస్తున్నాయని విపక్షాలు అంటాయి. ఈ దేశంలో కుంభకోణాలు వెలుగుచూడటంలోనే కాదు, వాటిపై దర్యాప్తు జరగడంలోనూ రాజకీయం ఉంటుంది. యూపీఏ కొంపముంచిన టూజీ స్పెక్ట్రమ్ కుంభకోణంలో 1.76లక్షల కోట్ల అవినీతి జరిగిందంటూ అప్పటి 'కాగ్' వినోద్‌రాయ్ ఇచ్చిన నివేదిక వెనుక ఎవరి కుట్రలున్నాయో ఆ తరువాత ఆడిటింగ్ బృందం అధిపతి చెప్పకనే చెప్పారు. కుంభకోణమే లేదని సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సీబీఐ తేల్చినా, ఆ కేసు నిలబడకపోయినా నరేంద్రమోదీ అధికారంలోకి రావడానికి ఇది దారులుపరిచింది. ఇటువంటి ప్రమాదమే తమకు కూడా ఉన్నదని కాబోలు, స్వతంత్ర వ్యవస్థలన్నింటినీ అస్వతంత్రం చేసి దేశంలో బీజేపీ తప్ప మరేపార్టీ లేకుండా చేస్తామన్న ప్రతిజ్ఞకు అనుగుణంగా విపక్షాన్ని తుడిచిపెట్టేసే పనిలో బీజేపీ ఉంది. ప్రధాని తన ప్రసంగంలో హేమంత్ సొరేన్ పేరు ప్రస్తావించినప్పటికీ, ఆ హిట్‌లిస్టులో ఇంకా ఎవరెవరున్నారో అందరికీ తెలిసిందే.

ఈ రాజకీయ వైరాన్ని అటుంచితే, నేను తినను, ఎవరినీ తిననివ్వనని ప్రకటించిన నరేంద్రమోదీ ఈ పదేళ్ళకాలంలో అవినీతిపై పోరాటంలో ఎంతోకొంత విజయం సాధించివుండాలి. అవినీతి నిర్మూలనను ఒక ఆదర్శంగా, సమున్నత లక్ష్యంగా ప్రకటించి, ఎవ్వరినీ వదిలిపెట్టవద్దని సీవీసీ, ఐటీ అధికారులకు సందేశాలు ఇస్తుంటారు కనుక, ప్రభుత్వస్థాయిలో అవినీతి బక్కచిక్కివుండాలి. కానీ, ఇందుకు పూర్తి భిన్నంగా, ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ సర్వేలో దేశం ఒకేమారు ఎనిమిది ర్యాంకులు దిగజారి, 180 దేశాల్లో 93వ స్థానంలో మిగిలింది. ప్రభుత్వంలో అవినీతి పెరిగిందనీ, ముడుపులు ముట్టచెప్పవలసివస్తున్నదని, ప్రైవేటు లబ్ధి పెరిగిందన్నది ఈ సర్వే సారాంశం. ఈ నివేదికను సైతం బీజేపీ అంతర్జాతీయ కుట్రగా తీసిపారేయగలదేమో కానీ, కేంద్రంలో తామే అధికారంలో ఉంటూ, సగానికి పైగా రాష్ట్రాలు తమ చేతుల్లో ఉన్నందున మోదీ ప్రవచిత పోరాటం ప్రయోజనం చేకూర్చడం లేదని ప్రజలు భావించే ప్రమాదమైతే ఉంది.

పదేళ్ళక్రితం వరకూ పార్లమెంటులో కుంభకోణాలమీద చర్చలు జరిగేవని, చర్యలు తీసుకోవాలని సభ పట్టుబట్టేదని మోదీ తనకు తెలియకుండానే ఓ మంచి విషయం చెప్పారు. ఇప్పుడు పాలకులు ఉద్దేశపూర్వకంగానే చర్చకు వీల్లేకుండా చేస్తున్నారు. అధికారపక్షం అవినీతినీ, ఆశ్రితపెట్టుబడిదారుల అక్రమాలను ప్రస్తావించినవారిని సభనుంచి బహిష్కరించేవరకూ, శిక్షించే వరకూ వదలడం లేదు. అంతర్జాతీయ పత్రికలు, సంస్థలు వెలికి తీస్తున్న కుంభకోణాలను విదేశీకుట్రగా, వాటిమీద దర్యాప్తుకోరిన వారిని కుట్రదారులుగా ముద్రవేసి నోరుమూయిస్తున్నారు. ఐదేళ్ళవరకూ లోక్‌పాల్ ఏర్పాటు చేయకుండా, తరువాత పలు సవరణలతో చివరకు దానికి కోరలు లేకుండా చేశారు. అవినీతిని బహిర్గతం చేయడంలో ప్రధానాస్త్రంగా ప్రజలకు ఉపకరించే సమాచార హక్కు విషయంలోనూ ఇదే జరిగింది. అవినీతి నిర్మూలనకు వీలుగా సమస్త వ్యవస్థలనూ సిద్ధంచేయడానికి బదులు, ఫిర్యాదు చేస్తే ప్రాణంమీదకు వస్తుందని ప్రజలు భయపడే వాతావరణాన్ని నెలకొల్పుతున్నప్పుడు అవినీతిలో అగ్రస్థానానికి ఎగబాకుతూనే ఉంటాం.

అందెశ్రీ గీతం 'జయ జయహే తెలంగాణ' ప్రత్యేక తెలంగాణ ఉద్యమ వ్యాప్తిలో ప్రభాతగీతంగా భాసిల్లింది. తెలంగాణ అస్తిత్వ గొప్పదనం, సాహితీ సాంస్కృతిక విలువలు, పోరాటస్ఫూర్తిని నూరి పోసిన ఈ గేయాన్ని ప్రత్యేక తెలంగాణ సిద్ధించిన ఒక దశాబ్ద కాలానికి అధికారిక రాష్ట్ర గేయంగా నూతన ప్రభుత్వం గుర్తించింది. ఈ గుర్తింపు అందెశ్రీకి మాత్రమే కాకుండా, ఆయనతో పాటు తమ సాహిత్యం, కళలను పదునైన ఆయుధాలుగా మలుచుకుని తెలంగాణ ఉద్యమంలో అలుపెరగని పోరాటం చేసిన ప్రతి ఒక్కరికీ దక్కిన గౌరవంగా భావించవచ్చు. ప్రజల ఆకాంక్షను గౌరవించిన చరిత్రాత్మక సందర్భమిది.

జన తెలంగాణ జయ ధ్యానం

మనుషులకు సాపాటే కాదు, సంస్కృతి కూడా ముఖ్యం. ప్రతి సమాజానికి ఒక విలక్షణ సంస్కృతి ఉంటుంది. అది ఆ సమాజంలోని వారందరినీ ఆత్మీయంగా సంఘటితం చేస్తుంది. ఇందుకు దోహదం చేసే ఒక సాంస్కృతిక శక్తి గేయం. ప్రపంచంలో ఏ మూలలోనైనా ప్రజలపై ఈ సాంస్కృతిక ప్రభావం గణనీయంగా ఉంటుంది, అత్యాధునిక యూరోప్ గానీ, వెనుకబడిన ఆసియా దేశాలు గానీ అందుకు మినహాయింపు కాదు. ఒక జనసమూహ ఉమ్మడి లక్ష్య సాధన దిశగా ముందుకు సాగడంలో గేయాల ప్రభావం గణనీయంగా ఉంటుంది. అందునా తమ అస్తిత్వాన్ని ప్రతిబింబించే, ఆత్మగౌరవాన్ని చాటే గేయాలు ప్రజల హృదయాలలో సుస్థిరంగా ఉండడం కద్దు. అటువంటి గేయాలు కొన్ని చరిత్రలో సుస్థిర స్థాన మేర్పరుచుకున్న ఉద్యమాల్ని ఉప్పొంగించాయి. ప్రజల ఆకాంక్షలను గేయాల రూపంలో పదునైన ఆయుధాలుగా మార్చి పాలకుల గుండెల్లో గుచ్చుకునేలా చేసిన కవులు, కళాకారులు ఎందరో ఉన్నారు.

కుల మతాలకు అతీతంగా కొన్ని గేయాలు ప్రజలందర్నీ ఏక ధాటిపై నడిపిస్తూ అస్తిత్వాన్ని, సాంస్కృతిక విలువలతో కూడిన పోరాటస్ఫూర్తిని నూరి పోస్తాయి. మహాకవి ఇక్బాల్ స్వప్నమైన ముస్లిం దేశమైన పాకిస్థాన్‌లో తమ సంస్కృతికి గుర్తింపు లేదని భావించిన తూర్పు పాకిస్థాన్ ముస్లిం ప్రజానీకం విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన 'అమార్ సోనార్ బంగ్లా' గేయం స్ఫూర్తితో పాక్ పాలకులతో పోరాడి తమ ప్రత్యేక అస్తిత్వాన్ని చాటుకున్నారు.

గల్ఫ్ లేఖ

రవీంద్రుడు ఆ స్ఫూర్తిదాయక గేయాన్ని రచించిన అర్ధ శతాబ్ది అనంతరం జరిగిన విముక్తి పోరాటంలో అది బంగ్లా దేశీయుల ఆత్మగౌరవానికి ఊపిరి పోసింది. 1971లో ప్రత్యేక దేశంగా ఆవిర్భవించిన వెన్వెంటనే ఆ గేయాన్ని తమ జాతీయ గీతంగా ప్రకటించుకుని బంగ్లాదేశ్ తనను తాను గౌరవించుకున్నది.

సరిగ్గా అమార్ సోనార్ బంగ్లాతో తమ సంస్కృతి, ఆకాంక్షలకు అనుగుణంగా ప్రత్యేక దేశం కొరకు పోరాడుతున్న సమయంలో జై తెలంగాణ నినాదం జోరందుకొంది. అప్పటికే ప్రాచుర్యంలో ఉన్న అభ్యుదయ కవి దాశరథి రచించిన నా తెలంగాణ కోటి రత్నాల వీణను పాడినా జై తెలంగాణ అంటూ ఆవేశంతో హోరెత్తెక్కించిన వారే అధికంగా ఉండేవారు. ప్రత్యేక తెలంగాణ మలిదశ ఉద్యమ



సమయానికి గోరటి వెంకన్న, రసమయి, ఏపూరి సోమన్న, దేశపతి శ్రీనివాస్, పసునూరి రవీందర్, జయరాజ్, విమలక్క తదితరులు అనేక మంది తమ పాటలతో తెలంగాణ ఉద్యమాన్ని ఉత్తేజపర్చగా, అందులో అందెశ్రీ రచించిన 'జయజయహే తెలంగాణ జననీ జయకేతనం' ముక్కోటి గొంతుకలు ఒక్కటైన చైతన్యం నిస్సందేహంగా ముక్కోటి గొంతుకలను ఒక్కటి చేయడంలో ఒక ముఖ్య భూమికను పోషించింది.

'జయ జయహే తెలంగాణ' ఉద్యమ వ్యాప్తిలో ప్రభాతగీతమైంది. తెలంగాణ అస్తిత్వ విశిష్టత, పోరాటస్ఫూర్తిని నూరి పోసిన ఆ గీతం తెలంగాణ పొలిమేరను దాటి ప్రపంచవ్యాప్తంగా తెలంగాణ వాదులలో మార్మ్రోగిపోయింది. అటు అడవుల జిల్లా ఆదిలాబాద్ మొదలు అమెరికా, అరబ్బు దేశాల వరకు తెలంగాణ వాసులు నలుగురు కలిస్తే ఈ పాటతో భేటీకి శ్రీకారం జరిగేది. గల్ఫ్ దేశాలలోని భారతీయ, అంతర్జాతీయ పాఠశాలల్లో తెలంగాణ చిన్నారుల మొదలు యు.ఏ.ఇ లోని దుబాయి నుంచి సౌదీ అరేబియాలోని తబూక్ వరకు 2500 కిలోమీటర్ల దూరం వరకు లారీలు నడిపే డ్రైవర్ల వరకు అసంఖ్యాకులను అమితంగా ఆకర్షించి పాడించేది, అందెశ్రీ గీతం. ఈ పాట వింటున్నప్పుడల్లా తెలంగాణ వచ్చి తీరుతుందన్న విశ్వాసం కలిగించేది.

గల్ఫ్ దేశాలలో రోడ్లపై వేగ నియంత్రణ కెమరాలు ఉంటాయి. పరిమితి మించి వేగంగా వాహనం నడిపితే జరిమానాను వీసా నెంబర్‌తో అనుసంధించి వసూలు చేస్తారు, 'జయ జయహే తెలంగాణ – జననీ జయకేతనం' పాటకు పరవశించిపోయే డ్రైవర్లు వేగ పరిధి సూచికలను పట్టించుకోకుండా వాహనాలు నడుపుతూ అపరాధ రుసుం రూపంలో తమ జీతంలో సగం జీతం వరకు కూడ చెల్లించుకున్నవారు అనేక మంది ఉన్నారు. ఇలా ప్రజాదరణ పొందిన అందెశ్రీ గేయం కచ్చితంగా రాష్ట్ర గేయంగా ప్రకటన రావడమే తర్వాయి అన్నట్లుగా పాఠశాలలో చిన్నారుల మొదలు ప్రభుత్వ కార్యాలయాలలో అందరు జాతీయ గీతంతో సమానంగా ఆలపించారు. ఈ గేయాన్ని కొంత సవరించి తాను కూడ కొన్ని చరణాలను జోడించినట్లుగా ఒక సందర్భంలో అప్పటి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు వెల్లడించారు.

కారణాలు ఏమైనా అధికారికంగా మాత్రం జయ జయహే తెలంగాణ స్వరాష్ట్ర జాతీయ గీతంగా రూపుదాల్చలేదు, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించినా ఈ గీతం అధికారిక గేయంగా లేకపోవడం స్పష్టమైన ఒక లోటుగా కనిపించేది.

తమ అస్తిత్వ పోరాటం కంటే అర్ధ శతాబ్దికి ముందు రవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన అమార్ సోనార్ బంగ్లా గేయం తమ లక్ష్య సాధనకు దిక్సూచిగా ఉండగా, బంగ్లాదేశ్ ఏర్పడే నాటికి ఆయన మరణించి మూడు దశాబ్దాలయింది. మరీ, తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొంటూ ఒక కవిగా, వాగ్గేయకారుడిగా తన వంతుగా విలక్షణ పాత్ర పోషించిన అందెశ్రీ మన మధ్య ఉన్నా ఆయన రచించిన జయ జయహే తెలంగాణ గీతాన్ని ఎందుకు అధికారిక రాష్ట్ర గేయంగా ప్రకటించలేదో తెలియదు.

ప్రత్యేక తెలంగాణ సిద్ధించిన ఒక దశాబ్ద కాలనికి అస్తిత్వం, సాహితీ సాంస్కృతిక విలువలు, పోరాటస్ఫూర్తిని నూరి పోసిన ఈ గేయాన్ని తెలంగాణ అధికారిక రాష్ట్ర గేయంగా నూతన ప్రభుత్వం గుర్తించింది. ఈ గుర్తింపు, ఒక్క అందెశ్రీకే కాకుండా ఆయనతో పాటు తమ సాహిత్యం, కళలను పదునైన ఆయుధాలుగా మలుచుకుని తెలంగాణ ఉద్యమంలో అలుపెరగని పోరాటం చేసిన ప్రతి ఒక్కరికీ దక్కిన గౌరవంగా భావించవచ్చు. ప్రజల ఆకాంక్షను గౌరవించిన చరిత్రాత్మక సందర్భమిది.

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ఆలోచనలను గౌరవించని అవార్డులు!



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

'ఢిల్లీ వెళితే ప్రస్తుతం మన సమస్యలు చెప్పుకోవడానికి పెద్ద దిక్కుగా ఉన్న నాయకులు లేరు. వ్యాపారస్తులు ప్రజా ప్రతినిధులవుతున్నారు.' అని ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పద్మా పురస్కార గ్రహీతలకు సన్మానం చేస్తూ వాపోయారు. నిజమే. ఇప్పుడు దేశ రాజకీయాల్లో ఒక స్థాయి గల ప్రజా ప్రతినిధులు కనపడడం లేదు. కోట్ల విజయభాస్కర్ రెడ్డి, జైపాల్ రెడ్డి, వెంకయ్యనాయుడు, వైఎస్ రాజశేఖర్ రెడ్డి, వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఎర్రన్నాయుడు తదితరులు ప్రజా ప్రతినిధులుగా ఉన్న కాలంలో నిత్యం నేతలతో మాట్లాడుతూ, విలేఖరులకు సమయం కేటాయిస్తూ గడిపేవారు. ఒక రోజు ఏఐసీసీ ఏర్పాటు చేసిన ఒక కమిటీ సమావేశంలో కోట్ల విజయ భాస్కర్ రెడ్డి తెలంగాణను వ్యతిరేకించారని తెలిసి వార్త రాశాను. మరుసటి రోజు ఎప్పటి మాదిరే ఏఐసీసీలో రోజువారీ విలేఖరుల సమావేశం పూర్తి కాగానే నలుగురైదుగురు సీనియర్ జర్నలిస్టులతో పాటు ఆయన ఇంటికి వెళ్లినప్పుడు 'ఆ వార్త ఎందుకు రాశావు.. మళ్లీ నాకు కనపడకు' అని కోట్ల ఆగ్రహించారు. మరునాడు ఆయన ఇంటికి వెళ్లలేదు. దీనితో ఆయనే ఫోన్ చేశారు. 'నిన్న ఏదో కోపంతో అంటే మనసు మీదికి తీసుకుంటావా.. నీకంటే ఎంతో పెద్దవాడిని కదా..' అనేసరికి ఎంతో సంతోషంతో ఆయనను కలుసుకున్నాను. జైపాల్ రెడ్డి ఢిల్లీలో కేంద్రమంత్రిగా ఉన్నా సరే, ఆయన ఇంటి గేట్లు ఎప్పుడూ తెరిచే ఉండేవి. ఆయనతో మాట్లాడిన తర్వాత ఎన్నో పుస్తకాలు చదివిన జ్ఞానం కలిగేది. మురళీ మనోహర్ జోషి లాంటి సాంప్రదాయవాది కూడా జైపాల్ అంటే ఇష్టపడేవారు. వెంకయ్యతో ఆయనకు వ్యక్తిగత స్నేహం బలంగా ఉండేది. తెలంగాణ ఉద్యమం ఉధృతంగా జరుగుతున్న ఒక దశలో కూడా ఇరు ప్రాంతాల ఎంపీలు, నేతలు ఆయనను కలుసుకుని ముఖ్యమంత్రిగా ఉండమని జైపాల్‌ను కోరడం ఆయన పట్ల ప్రాంతాలకు అతీతంగా ఉన్న గౌరవానికి నిదర్శనం. కాని అందుకు ఆయన నిరాకరించారు. వెంకయ్యనాయుడు బీజేపీలో జాతీయ స్థాయికి ఎదిగి ఢిల్లీలో ప్రవేశించిన తర్వాత పార్టీకి ప్రజల్లో, ఆమోద యోగ్యత పొందడంలో కీలక పాత్ర పోషించారు. ఒక అజాత శత్రువుగా పేరు పొందిన వెంకయ్య పార్టీలకు అతీతంగా అందరికీ అందుబాటులో ఉండే ప్రజాస్వామ్యవాదిగా పేరు తెచ్చుకున్నారు. రాజశేఖర్ రెడ్డి కూడా ఎంపీగా ఉన్న కాలంలో ఇతరపార్టీ నేతలతో, మీడియాతో అరమరికలు లేకుండా ఉండేవారు. వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఎర్రన్నాయుడు పార్లమెంటరీ పార్టీ నేతలుగా ఉన్న కాలంలో తెలుగుదేశం పార్టీ జాతీయ స్థాయిలో ఒక వెలుగు వెలిగింది. ఎర్రన్నాయుడు పిల్లల కోడిలా ఎప్పుడూ ఎంపీలను, రాష్ట్ర నేతలను వెంటవేసుకుని కేంద్ర మంత్రుల వద్దకు తీసుకువెళ్లేవారు. కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ కూడా ఎర్రన్నాయుడును చూసి చిరునవ్వుతో పలకరించేవారు.


ఇప్పుడు ఢిల్లీలో ఆ వాతావరణమే లేదు. రేవంత్ అన్నట్లుగా ఢిల్లీకి వెళ్లే తెలుగు రాజకీయ నేతలకు వెంకయ్యలాంటి పెద్ద దిక్కు ఎవరూ లేరు. అమిత్ షాతో పాటు పలువురు కేంద్ర మంత్రులను తన వద్దకు పిలిపించి ఉభయ రాష్ట్రాల సమస్యలు చర్చించి పరిష్కారం సాధించగల శక్తి వెంకయ్యకు ఉండేది. ఎవరు ఢిల్లీకి వచ్చినా తన ఇంటికి పిలిచి సంభాషించే జైపాల్ రెడ్డి లాంటి విజ్ఞాన ఖని కనపడడం లేదు. వెంకయ్య, జైపాల్ ఇద్దరూ దక్షిణాది వారన్న అభిప్రాయం ఉత్తరాది వారికి కూడా ఉండేది కాదు. ఇద్దరూ తెలుగు, హిందీ, ఇంగ్లీషు భాషల్లో పట్టు సంపాదించారు. జైపాల్ రెడ్డి కేంద్రమంత్రిగా ఉన్నప్పుడు అంబానీ, రూపర్ట్ మర్డోక్ అయినా అపాయింట్‌మెంట్ తీసుకుని కలుసుకోవాల్సి వచ్చేది.

17వ లోక్‌సభ చిరి బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న సమయమది. ఆలోచిస్తుంటే గడిచిన అయిదేళ్లలో ఢిల్లీలో మన తెలుగువారి దుస్థితి గుర్తుకు వచ్చి ఆవేదన కలుగుతోంది. ఒక స్థాయిగల తెలుగు నేతలు పెద్దగా ఢిల్లీలో కనపడడం లేదు. వైసీపీకి ఉభయసభల్లో 30 మంది ఎంపీలున్నా వారు తమదైన ముద్ర ఢిల్లీలో వేయలేకపోయారు. బీఆర్ఎస్ ఎంపీలు సరే సరి. బీజేపీ అగ్రనేతలు కనపడితే వంగివంగి దండాలు పెడుతుంటే మన తెలుగు రాష్ట్రాల నేతలు ఇంత మరుగుజ్జులా అన్న అభిప్రాయం కలుగుతోంది.

రెండు రాష్ట్రాలకు చెందిన పద్మా పురస్కార గ్రహీతలకు, ముఖ్యంగా పద్మవిభూషణ్ పురస్కారాలు అందుకోనున్న వెంకయ్య, చిరంజీవిలకు సన్మానం చేయడం ద్వారా రేవంత్ అటు కేంద్రానికీ, ఇటు జగన్ ప్రభుత్వానికీ సంకేతాలు పంపారు. రాజకీయాలకు అతీతంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామంటూనే వెంకయ్యనాయుడు రాష్ట్రపతి కావాలని ఒక కాంగ్రెస్ ముఖ్యమంత్రి కోరుకోవడం రాజకీయ సందేశమే. రెండవది, సామాన్యుల్లో అసామాన్యులైన వ్యక్తులకు మోదీ ప్రభుత్వం పద్మా పురస్కారాలు ఇవ్వడం గొప్ప విషయమే అయినప్పటికీ కేవలం ఈ పురస్కారాల వల్ల ఏమి ఒరుగుతుంది? ప్రయాణ ఖర్చులు కూడా పెట్టుకోలేని వారికి చప్పట్ల వల్ల, దుప్పట్ల వల్ల ఏమి ప్రయోజనం? అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేసిన ప్రశ్న కూడా యోచించదగిందే. నిజానికి పద్మా పురస్కారాలు పొందినవారు అనేకమంది దుస్థితి వర్ణనాతీతం. ఒడిషాలో గత కొన్నేళ్లుగా పద్మశ్రీ పురస్కారాలు లభించిన 83 మందిలో పలువురు చాలీచాలని ఆదాయంతో దుర్భర జీవితాన్ని గడుపుతున్నారని ఒడిషా ప్రభుత్వమే ప్రకటించింది. ఆ రాష్ట్రంలో దైతరీ నాయక్ అనే వ్యక్తి గోనసికా పర్వతాన్ని తానొక్కడే మూడేళ్ల పాటు శ్రమించి త్రవ్వి కాలువ నిర్మించడంతో ఆ ప్రాంతంలో దాదాపు వంద ఎకరాలకు సాగు నీరు లభించింది. పద్మశ్రీ పురస్కారం లభించిన తర్వాత తనకు కూలీగా కూడా ఎవరూ పని ఇవ్వలేదని ఆయన వాపోయారు. పేదరికంతో మగ్గుతున్న దైతరీ నాయక్ దుస్థితి గురించి పేపర్లలో వార్త చదివిన తర్వాత స్పందించిన ఒడిషా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆయనకు నెలకు రూ. పదివేల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు.

ఇటీవలే శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠ జరిగిన అయోధ్యలో మొహల్లా ఖిర్కీ అలీబెయిగ్‌లో నివసించే మహమ్మద్ షరీఫ్ అనే వ్యక్తికి నాలుగేళ్ల క్రితం మోదీ ప్రభుత్వం పద్మశ్రీ ఇచ్చింది. గత పాతికేళ్లుగా ఇదే అయోధ్యలో ఆయన 25వేల అనాథ శవాలకు అంత్యక్రియలు చేస్తూ వచ్చారు. చనిపోయిన వారు ఏ మతం అన్న దానితో నిమిత్తం లేకుండా ఆయన వారి వారి ఆచారాల ప్రకారం అంత్యక్రియలు జరిపించారు. కాని ఇదే మహమ్మద్ షరీఫ్ ఇవాళ దుర్భర పేదరికంతో, అనేక జబ్బులతో కునారిల్లుతూ తానే ఒక శవంలా పడి ఉన్నారని వార్తలు వచ్చాయి.

ఇలాంటి వార్తలు వచ్చిన తర్వాత హర్యానాలో గత ఏడాది పద్మా పురస్కారాలు వచ్చిన తమ రాష్ట్ర పౌరులకు ముఖ్యమంత్రి మనోహర్ ఖట్టర్ రూ. 10 వేల పింఛను ప్రకటించారు. ఒడిషా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ కూడా పద్మాపురస్కారాలు పొందిన వారిలో నిరుపేదలకు రూ. పదివేల నెలసరి ఆర్థిక సహాయాన్ని అందించాలని నిర్ణయించారు. రేవంత్ ఒక్కడుగు ముందుకు వేసి రూ. 25 లక్షల నగదుతో పాటు పాతికవేల పింఛను ప్రకటించారు.



లాల్‌కృష్ణ అడ్వాణీకి 'భారతరత్న' పురస్కారం ప్రదానం చేయడమే కాదు, ఆయన ఆలోచనలను కూడా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గౌరవించాల్సిన అవసరమున్నది. ఎంతైనా ఆ కురువృద్ధుడు భారతీయ జనతా పార్టీ మార్గదర్శక మండలి సభ్యుడే కదా!

పద్మా పురస్కారాలు ఇచ్చిన తర్వాత వారి అతీగతీ పట్టించుకోకపోవడం ఒక ముఖ్యమైన విషయం అయితే వారి మనోభావాలకు, ఆలోచనలకు కూడా విలువ ఇవ్వడం అవసరం. అనేక అంతర్జాతీయ క్రీడల్లో పతకాలు గెలుచుకుని భారతదేశ కీర్తి ప్రతిష్ఠలను చాటిచెప్పిన మల్లయోధులు బజ్రంగ్ పునియా, వీరేందర్ సింగ్ యాదవ్ తమ పద్మశ్రీ పురస్కారాలను తిరిగి ఇచ్చేశారు. రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ తమను లైంగిక వేధింపులకు గురి చేశారని ఏడాదికి పైగా ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోనందుకు సుదీర్ఘ కాలం తీవ్ర నిరసన తెలిపిన తమ తోటి మహిళా మల్లయోధులకు సంఘీభావంగా వారు తమ అవార్డులను తిరిగి ఇచ్చారు. బజ్రంగ్ పునియా తన పద్మశ్రీ పతకాన్ని ఇండియాగేట్ వద్ద ఫుట్ పాత్ వద్ద పెట్టేసి తిరిగి వచ్చారు. కనీసం వారినైనా పిలిచి మాట్లాడి సమస్యను పరిష్కరించి ఉంటే బాగుండేది కదా! కాని రాజకీయ కారణాలు అందుకు అడ్డువచ్చి ఉంటాయనడంలో సందేహం లేదు.

రామజన్మభూమి ఉద్యమాన్ని నిర్వహించి బీజేపీ బలోపేతం కావడానికి ప్రధానకారకుడైన లాల్‌కృష్ణ అడ్వాణీకి మోదీ ప్రభుత్వం భారతరత్న ప్రకటించడంలో ఆశ్చర్యం లేదు. బాబ్రీ మసీదు కట్టడం కూల్చివేతకు ప్రధాన కారకుడైన అప్పటి ముఖ్యమంత్రి కల్యాణ్ సింగ్‌కు కూడా ఆయన మరణానంతరం 2022లో మోదీ ప్రభుత్వం పద్మవిభూషణ్ పురస్కారం ప్రకటించింది. కల్యాణ్ సింగ్‌ను అభిశంసించి, ఒక రోజంతా బోనులో నిలబెట్టిన సుప్రీంకోర్టు, తర్వాత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గొగోయ్ హయాంలో అయోధ్యలో మందిర నిర్మాణానికి అనుకూలంగా తీర్పునిచ్చింది. జస్టిస్ గొగోయ్‌ను రాజ్యసభ సభ్యత్వం వరించింది. ఇది బీజేపీ సైద్ధాంతిక విశ్వాసాలకు సంబంధించిన విషయం. కాని లాల్‌కృష్ణ అడ్వాణీ అనేకమంది నాయకులకంటే ఎక్కువగా ప్రజాస్వామ్యాన్నీ, పత్రికా స్వేచ్ఛనూ, రాజకీయాల్లో ఉన్నత ప్రమాణాల్నీ ప్రేమించారు. ఆయన శిష్యుడైన వెంకయ్య కూడా ఏ పదవిలో ఉన్నా అదే దారిలో పయనించారు. 'పటిష్ఠమైన ప్రతిపక్షం, పత్రికా స్వేచ్ఛ, స్వతంత్ర న్యాయ వ్యవస్థ ప్రజాస్వామ్యంలోని మూడు ప్రధాన లక్షణాలు' అని అడ్వాణీ తన ఆత్మకథలో వివరించారు. మెజారిటీ ఉన్నది కదా అని ఒక నియంత ఆ మెజారిటీనీ ఆయుధంగా మార్చుకోవడాన్ని, చట్టసభను కూడా ఇష్టారాజ్యంగా వాడుకోవడాన్ని ఆయన విమర్శించారు. పార్లమెంటరీ ముద్రపడితే చాలు ఎటువంటి దుర్మార్గాన్నైనా సమర్థించుకోవడాన్ని, ఎటువంటి పాపమైనా పవిత్రమవుతుందనుకోవడాన్ని ఆయన తీవ్రంగా నిరసించారు. రాజకీయాల్లో శత్రువులు ఉండరని, ప్రత్యర్థులు మాత్రమే ఉంటారని, రాజకీయ ప్రత్యర్థులను తుడిచిపెట్టాలనుకునే ఆలోచన సరిఅయినది కాదని ఆయన విశ్వసించారు. ప్రజాస్వామ్యంలో శత్రుత్వమనే భావన ప్రమాదకరమైనదని, వేర్వేరు సిద్ధాంతాలు ఉన్నప్పటికీ జాతీయ ప్రాధాన్యం గల అంశాలపై కీలక ఏకాభిప్రాయసాధన అవసరమని ఆయన భావించారు. అడ్వాణీకి భారతరత్న పురస్కారం ప్రదానం చేయడమే కాదు, ఆయన ఆలోచనలను కూడా గౌరవించడం ప్రధానమంత్రి నరేంద్రమోదీకి అవసరం. ఎంతైనా అడ్వాణీ బీజేపీ మార్గదర్శక మండలి సభ్యుడే కదా!

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

ఉత్తరాంధ్ర అభివృద్ధే లక్ష్యంగా ఓటు వేయాలి!

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో, అవశేష ఆంధ్రప్రదేశ్‌లో దగా పడుతున్న ఉత్తరాంధ్రులకు తమ లక్ష్యాలను నెరవేర్చుకొనే అస్త్రం త్వరలో జరగబోయే పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల ద్వారా లభిస్తోంది. నీళ్లు, నిధులు, నియామకాల డిమాండ్ ఈ ప్రాంత జనవాణిగా ఉంది. ఉత్తరాంధ్ర అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను అన్ని రాజకీయ పార్టీలు తమ ఎజెండాలో చేర్చేలా ఒత్తిడి తేవాల్సిన సమయం ఆసన్నమైంది. వివక్షకు గురవుతున్న ఈ ప్రాంత ప్రజలు త్వరలో జరగనున్న అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో విలువైన ఓటుతో సమాధానం చెప్పాలి.


సహజ వనరులు ఉండి కూడా ఉత్తరాంధ్ర ఎందుకు నానాటికీ వెనుకబాటుతనంలో మగ్గిపోతున్నదో తెలుసుకోవలసిన కీలక తరుణమిది. ఈ ప్రాంతం వెనుకబాటుతనానికి ప్రధాన కారణం స్థానికేతర రాజకీయ నేతలు ఇక్కడ ప్రజాప్రతినిధులుగా ఎన్నికై, పెత్తనం చెలాయిస్తూ ఇక్కడి వనరులను కొల్లగొడుతున్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి కేవలం మాటల్లో కాకుండా చిత్తశుద్ధితో కృషిచేయాలని ఇక్కడి పౌర సమాజం బలంగా కోరుకుంటోంది. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ప్యాకేజీ వచ్చి ఉంటే నేడు ఉత్తరాంధ్ర పరిస్థితి భిన్నంగా ఉండేది. ఈ ప్రాంతం పట్ల సాగుతున్న నిర్లక్ష్యం, వనరుల విధ్వంసం, అభివృద్ధి రాహిత్యం ముప్పేట దాడిని అడ్డుకోవాల్సిన బాధ్యత ఉత్తరాంధ్ర బిడ్డలుగా అందరిపై ఉంది. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ఫలాలలో మన ప్రాంత ప్రజల న్యాయమైన వాటా సాధించుకునే సమయమిది.

తెలంగాణ ఉద్యమం సందర్భంగా కేంద్రం నియమించిన జస్టిస్ శ్రీకృష్ణ కమిషన్ ఉత్తరాంధ్ర వెనుకబాటుతనాన్ని గణాంకాలతో సహా చూపింది. రాష్ట్ర విభజన సమయంలో వెనుకబడిన ప్రాంతాలైన ఉత్తరాంధ్ర, రాయలసీమలకు ప్రత్యేక రాయితీలు కల్పిస్తామని, ప్రత్యేక ప్యాకేజీలో నిర్దిష్ట కేటాయింపులు చేస్తామని పార్లమెంట్ సాక్షిగా హామీ ఇచ్చారు. విభజన జరిగి 10 సంవత్సరాలు కావొస్తున్నా ఇది అమలు కాలేదు. ఈ నేపథ్యంలో ఉత్తరాంధ్ర వెనుకబాటుతనం గురించి కూలంకషంగా చర్చించి, ప్రజాకాంక్షలను సవివరంగా ముందుకు తీసుకొచ్చి, అవి నెరవేరే దిశగా కృషి చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉంది.

నదులు, అడవులు, సముద్ర తీరం, ఖనిజ సంపద, రైలు, జాతీయ రోడ్లు, ఓడరేవు, విమానాశ్రయం, అన్నింటికీ మించి పుష్కలంగా మానవ వనరులున్న ప్రాంతం ఉత్తరాంధ్ర. కానీ బిడ్డకు దక్కని తల్లి స్తన్యంలా ఇతర ప్రాంతాల వారు, వలస వాదులు ఈ ప్రాంతం వనరులను కొల్లగొట్టుకుపోతున్నా అడిగే నాధుడు లేడు. 'మా వనరులను మా అభివృద్ధికే వెచ్చించాలి', 'మా వనరులు కొల్లగొట్టడానికి ఇతరులకు హక్కు లేదు' అని గొంతెత్తే వారినే రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఉత్తరాంధ్ర ప్రజల ఆకాంక్ష, కల ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు నిర్మాణం. ఈ ప్రాజెక్టు నిర్మాణమయితే ఈ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న కరువు కాటకాలను పారద్రోలవచ్చు, వలసల్ని అరికట్టవచ్చు. ఉత్తరాంధ్రలో మొత్తం 23.24 లక్షల ఎకరాలు సాగుభూమి ఉండగా, అందులో కేవలం 8 లక్షల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందుతోందని అధికారిక లెక్కలే చెబుతున్నాయి. ఉత్తరాంధ్ర ప్రజలు ఎదుర్కొంటున్న సాగునీరు, తాగునీరు కష్టాలను పరిష్కరించడానికి ఏకైక మార్గం బాబూ జగ్జీవన్‌రామ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టును పూర్తి చేయడమే. ఈ ప్రాజెక్టు పూర్తైతే విశాఖపట్నంలో 3.21లక్షల ఎకరాలు, విజయనగరంలో 3.94 లక్షల ఎకరాలు, శ్రీకాకుళం జిల్లాలో 0.85 లక్షల ఎకరాలు.. మొత్తం 8 లక్షల ఎకరాలకు సాగునీరు, 12 వందల గ్రామాలకు తాగునీరు లభిస్తుంది. 53.40 టీఎంసీలు వ్యవసాయం కోసం, 4.46 టీఎంసీలు తాగునీటి కోసం, 5.34 టీఎంసీల నీరు పారిశ్రామిక అవసరాల కోసం వినియోగించేలాగా ఈ ప్రాజెక్టు డిజైన్‌ను రూపొందించారు. ఇంత ప్రాధాన్యత కలిగి, ఉత్తరాంధ్రకు జీవనాడి అయిన ఈ ప్రాజెక్టును పట్టించుకునే నాధుడే లేకుండాపోయారు.

వైసీపీ ప్రభుత్వం ఉత్తరాంధ్రను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఉత్తరాంధ్ర ప్రాంతం అభివృద్ధి చెందాలంటే 'ప్రతీ చేతికి పని – ప్రతీ చేనుకు నీరు' అందించే స్థానికులకే ఈ ఎన్నికల్లో మద్దతు ఇవ్వాల్సిన సమయం ఆసన్నమైంది. ఉత్తరాంధ్ర అభివృద్ధే ఏకైక లక్ష్యంగా అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు ఐక్యంగా పోరాడినప్పుడే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది.



ఉత్తరాంధ్రలోని మూడు జిల్లాల్లో ఉన్న ఆదివాసి ప్రాంతాల అభివృద్ధికి 2012లో 'అరకు డిక్లరేషన్' సూచించిన అభివృద్ధి పథకాలు ఇంతవరకూ అమలులోకి రాలేదు. ఈ డిక్లరేషన్‌కు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వడమే కాకుండా, తాము అధికారంలోకి వస్తే కచ్చితంగా వాటిని అమలు చేస్తామని హామీ కూడా ఇచ్చాయి. ఉత్తరాంధ్రలో మరొక పెద్ద ప్రజా సమూహం సముద్రం మీద ఆధారపడిన మత్స్యకారులు. ఉత్తరాంధ్రకు 340 కి.మీల సముద్రతీరం ఉన్నందున మత్స్యకారులకు చట్టబద్ధమైన హక్కులు కల్పించాలి. ఫిష్ ప్రాసెసింగ్ పరిశ్రమలను, కోల్డ్ స్టోరేజీలను స్థాపించాలి.

విద్యారంగంలో కూడా ఉత్తరాంధ్ర బాగా వెనుకబడి ఉంది. ఇక్కడి మూడు జిల్లాలు రాష్ట్ర సగటు కన్న తక్కువ అక్షరాస్యతతో ఉన్నాయి. 19వ శతాబ్ది చివరికే విద్యా నగరంగా పేరు గాంచిన విజయనగరం 21వ శతాబ్దిలో అక్షరాస్యతలో చివరికి చేరడం నిర్లక్ష్యానికి నిదర్శనం. ప్రాథమిక ఆరోగ్యం, పర్యాటక రంగం, విద్యుచ్ఛక్తి, రవాణా, ప్రభుత్వరంగ పరిశ్రమలు, వలసలు, పాలన, స్థానిక స్వపరిపాలనా సంస్థలు, పారిశుద్ధ్యం, పర్యావరణం వంటి ఏ రంగాలను పరిశీలించినా ఉత్తరాంధ్ర వెనుకబాటుతనం స్పష్టంగా కనబడుతుంది. ఉత్తరాంధ్రలో సహకార రంగంలో ఉన్న షుగర్ ఫ్యాక్టరీలు, జూట్ మిల్లులు మూతపడ్డాయి. దీంతో అనేకమంది రోడ్డున పడ్డారు. వీటిని తెరిపించేందుకు కృషి చేయాలి. 'విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు' పేరిట ఉద్యమించి, తమ భూములను ఇచ్చి, అనేక మంది ప్రాణత్యాగం చేసి, విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సాధించారు. ప్రతిష్ఠాత్మకమైన ఈ స్టీల్ ప్లాంట్‌ను నిలబెట్టుకోవాలి.

ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం 2014, సెక్షన్ 46(3)లో నిర్దేశించినట్టుగా ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీని ఉత్తరాంధ్రకు ప్రకటించాలి. ఇది ఆంధ్రప్రదేశ్ వార్షిక బడ్జెట్‌లో కనీసం 15 శాతం (విస్తీర్ణాన్ని బట్టి) నుంచి 20 శాతం (జనాభాను బట్టి) ఉండాలి. ఉత్తరాంధ్రలోని 24 లక్షల ఎకరాలకు కనీసం ఒక పంటకైనా సాగునీరు సదుపాయం కల్పించాలి. గోదావరి జలాల్లో ఉత్తరాంధ్రకు న్యాయమైన నీటి వాటాను కేటాయించాలి. గోదావరితో ఉత్తరాంధ్రలోని నదులను అనుసంధానం చేయాలి, ఉత్తరాంధ్రలోని పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేయాలి. ఈ ప్రాంతం మరో భోపాల్‌గా మారకుండా పర్యావరణాన్ని రక్షించాలి, వలసలను అరికట్టాలి.

ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం ఉత్తరాంధ్ర ఆకాంక్షల పట్ల శ్రద్ధ చూపలేదు. జనజీవితాల్లో ఆశించిన మార్పు తీసుకువచ్చే చొరవ తీసుకోకపోగా, ఉత్తరాంధ్రను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఇక్కడ పరిపాలన రాజధాని ఏర్పాటు చేస్తామని ప్రజలను మభ్యపెడుతూ, ఈ ప్రాంతంలోని వనరులను కొల్లగొట్టడానికే అధిక ప్రాధాన్యత ఇస్తూ, ఉత్తరాంధ్రను 'ఉత్తి ఆంధ్ర'గా మార్చివేసింది.

ఉత్తరాంధ్ర ప్రాంతం అభివృద్ధి చెందాలంటే 'ప్రతీ చేతికీ పని – ప్రతీ చేనుకు నీరు' అందించే వారికి ఈ ఎన్నికల్లో మద్దతు ఇవ్వాల్సిన సమయం ఆసన్నమైంది. పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులు, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు పూర్తి కావాలన్నా, నదుల అనుసంధానం జరగాలన్నా, ఉత్తరాంధ్ర ప్రత్యేక అభివృద్ధి మండలి, ఆర్థిక ప్యాకేజీ సాధించాలన్నా, పరిశ్రమలు రావాలన్నా ఈ ప్రాంతం నుంచి చట్టసభల్లో స్థానికులకు ప్రాధాన్యత కల్పించాల్సిన బాధ్యత ఉత్తరాంధ్ర ప్రజానీకంపై ఉంది.

రాబోయే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఈ ప్రాంతంలోని మేధావులు, కవులు, రచయితలు, యువత, కార్మికులు, ఉద్యోగస్తులు, రైతులు, కళాకారులు, ఆలోచనాపరులు, సకల జనులు ఉత్తరాంధ్ర అభివృద్ధే ఎజెండాగా ప్రతీ ఒక్క రాజకీయ పార్టీ ముందుకు వచ్చే విధంగా ఒత్తిడి చేయాలి. ఇందుకు విభేదాలను విడనాడి, జెండాలను పక్కనపెట్టాలి. ఉత్తరాంధ్ర అభివృద్ధే ఏకైక లక్ష్యంగా అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు ఐక్యంగా పోరాడినప్పుడే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది.

• కొణతాల రామకృష్ణ
కన్వీనర్, ఉత్తరాంధ్ర చర్చావేదిక

అర్జునుడెలా అవుతారు?


ఒక్క ఛాన్స్ అని బతిమాలుకుని, ప్రజల్లో నెలకొన్న సానుభూతిని సొమ్ము చేసుకొని అధికారంలోకి వచ్చిన జగన్.. తన తల్లిని, రక్తం పంచుకు పుట్టిన చెల్లిని దారుణాతి దారుణంగా అవమానిస్తుంటే స్పందించడం లేదంటే ఆయనలో అసలు మానవత్వం ఉందా అనిపిస్తోంది. అధికారం కోసం సొంత కుటుంబాన్ని బజారుకీడుస్తున్నా నోరు మెదపడం లేదంటే ఆయన నీచ రాజకీయాలకు అది నిదర్శనం. తనను తాను అర్జునుడితో పోల్చుకోవడానికి జగన్‌కి ఉన్న అర్హతలు ఏమిటి? ఏం చేసారని జగన్ అర్జునుడు అవుతారు. దేశ రాజకీయ చరిత్రలో ఏ రాజకీయ నాయకుడు తనను తాను అర్జునుడుగా పోల్చుకున్న దాఖలాలు లేవు. రాజనీతికి, ధర్మానికి, మానవత్వానికి వీసమెత్తు విలువ ఇవ్వని అసురుడి పరిపాలనను అంతమొందించడానికి ప్రజలు సిద్ధం అయ్యారు. అరచేతిలో వైకుంఠం చూపించిన పనికిమాలిన నాయకుడిని గద్దె నెక్కించి తప్పు చేశామని ప్రజలు బాధపడుతున్నారు.

ముప్పై ఏళ్ళు అధికారంలో ఉంటానని బీరాలు పలికిన జగన్ పాలనకు అయిదేళ్లు ముగిసే సరికే నీలినీడలు కమ్ముకొన్నాయి. ఏలూరు జిల్లా దెందులూరు సిద్ధం సభలో జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ పేదల భవిష్యత్తును కాటేసే కరోనా లాంటి దుష్టచతుష్టయంపై సంగ్రామానికి అంతా సిద్ధంగా ఉండాలని కోరారు. రామాయణ, మహాభారతంలోని విలన్లు వంటి చంద్రబాబు, దత్తపుత్రుడు, పలు మీడియా సంస్థలు, ఇతర పార్టీల్లోని కోవర్టులు తోడేళ్లంతా ఏకమయ్యారని విషం కక్కారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాజకీయ పార్టీలు పొత్తు పెట్టుకున్నాయి. దేశంలో ప్రతిపక్షాలు ఏకం కావడం అనేది కొత్త పరిణామం కాదు. అంతమాత్రాన వారిని జంతువులతో పోల్చడం ఇంగితజ్ఞానం ఉన్నవారు చేసే పని కాదు.

57 నెలల పాలనా కాలంలో 124 సార్లు బటన్ నొక్కి మీ ఖాతాల్లో రూ.2.55 లక్షల కోట్లు వేశాం. మీరు ఎంఎల్ఏ అభ్యర్థికి, ఎంపీ అభ్యర్థికి రెండు బటన్‌లు నొక్కి ఈ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించండి. జగన్‌కు ఓటువేయకుండా, ప్రతిపక్షాలకు ఓటేస్తే పథకాల రద్దుకు ఆమోదం తెలిపినట్లే, మంచి జరగాలంటే జగన్‌ను మరిచిపోకూడదు. ఎన్నికల రణక్షేత్రంలో కృష్ణావతారంలో మీరు, అర్జునుడిలా నేను, ప్రభుత్వ మంచిని అస్త్రంలా సంధించాలి అన్నారు. ప్రతిపక్షాలకు ఓటు వేస్తే పథకాల రద్దుకు ఆమోదం తెలిపినట్లే అనడం హాస్యాస్పదం. జగన్ మాత్రమే సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు, గత ప్రభుత్వాలు అమలు చెయ్యనట్లు జనం చెవుల్లో పూలు పెడుతున్నారు. బటన్లు నొక్కి జనం ఖాతాల్లో రూ.2.55 లక్షల కోట్లు వేశామన్నారు. మరి అప్పు చేసిన రూ. పది లక్షల కోట్లలో రూ. 2.55 లక్షల కోట్లు పోతే మిగిలిన డబ్బులు ఎవరి జేబుల్లోకి వెళ్లినట్లు? అభివృద్ధి లేకుండా నవరత్నాలు అంటూ డబ్బులు పంచడం పరిపాలన కాదు.

జగన్ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి లేదు, ప్రాజెక్టులు లేవు, రోడ్లు లేవు. పన్నులు దరువు, పరిశ్రమలు కరువు, యువత పనులు లేక పొరుగు రాష్ట్రాలకు వలస పోతున్నారు. సంక్షేమంతో జనజీవితాలను తనఖా పెట్టారు. ఇన్ని మేళ్ళు చేసిన మీ పరిపాలనను ప్రజలు ఎలా మరచిపోతారు? మాటలతో కోటలు కట్టి జనాన్ని బురిడీ కొట్టించడంలో జగన్ నైపుణ్యం అని తరసాధ్యం! నటించి నవ్యాంధ్రను నట్టేట ముంచారు. ఆయన నటనలు అర్థం చేసుకొన్న ప్రజలు ముగింపు పలకడానికి సిద్ధమయ్యారు.

– నీరుకొండ ప్రసాద్



భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ, అనుబంధ సంస్థ అయిన నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సంస్కృతి శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అంతర్జాతీయ నాటక ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి. న్యూఢిల్లీకి చెందిన ఎన్ఎస్‌డీ రిపర్టరీ కంపెనీ బృందం ప్రదర్శించిన నాటకం ఆద్యంతం ఆకట్టుకుంది. రాజస్థానీ సంస్కృతిని, సంప్రదాయాన్ని ప్రతిబింబిస్తూ సమాజంలో స్త్రీ తన కోరికలు, భావోద్వేగాలు, సామాజిక నిబంధనల మధ్య పడే సంఘర్షణను ఇతివృత్తంగా దీనిని చూడచక్కగా ప్రదర్శించారు.



• స్త్రీకారం



• స్నాతకోత్సవం

హెల్త్ యూనివర్సిటీ 26వ స్నాతకోత్సవం నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో మంగళవారం ఘనంగా జరిగింది. చాన్సలర్ హోదాలో గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత బెంగళూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూరో సైన్స్ డైరెక్టర్ డాక్టర్ ప్రతిమామూర్తికి వర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. అనంతరం వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 60 మంది యూజీ, పీజీ విద్యార్థులు గవర్నర్ చేతులమీదుగా పతకాలు అందుకున్నారు.

• తనిఖీలు

సర్పంచుల 'చలో అసెంబ్లీ'తో పాటు అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో నగరంలో మంగళవారం పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ప్రకాశం బ్యారేజీ, కనకదుర్గమ్మ వారధి మీదుగా వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు.



గెలుపు కష్టమనీ..

సెంట్రల్‌లో డబ్బు వెదజల్లుతున్న వెలంపల్లి శ్రీనివాస్



- రోజువారీ.. వలంటీర్లతో ప్రత్యేక సమావేశాలు
- వచ్చిన వారికి కుక్కర్లు గిఫ్టులుగా..
- ఎన్నికల్లో తన తరపు పనిచేస్తే రూ.20 వేల తాయిలం
- గెలిచాక మరిన్ని ఆఫర్లు
- డివిజన్ కమిటీలకు రూ.లక్ష చొప్పున పంపకాలు

ఐదేళ్లు దండిగా దోచుకున్నారు.. దోచుకున్న సొత్తునంతా దాచుకున్నారు.. ఎన్నికలు దగ్గర పడుతుండటంతో ఇప్పుడు వెదజల్లుతున్నారు.. ఎన్నికలకు ముందే విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో జరుగుతున్న తంతు ఇది. పశ్చిమ ఎమ్మెల్యేగా, దేవదాయ శాఖ మాజీ మంత్రిగా అనేక అవినీతి ఆరోపణలు మూటగట్టుకున్న వెలంపల్లి శ్రీనివాస్ సీటు సెంట్రల్‌కు మారడంతో గెలుపు అంత సులువేం కాదనుకున్నారు. ఇంకేముంది.. వలంటీర్లను పావులుగా కదుపుతూ, వారికి గిఫ్టులు, డబ్బు ఆశ చూపుతూ, వైసీపీ డివిజన్ కమిటీలకు రూ.లక్షలు ముట్ట జెబుతూ ఎన్నికలకు ముందే విజయానికి బేరాలు కుదుర్చుకుంటున్నారు.

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం సచివాలయ సిబ్బంది, వలంటీర్లను రాజకీయ పార్టీలు తమ ప్రచారాల్లో ఉపయోగించుకోకూడదు. కానీ, సెంట్రల్ నియోజకవర్గంలోని సచివాలయ సిబ్బంది, వలంటీర్లు మొత్తం అధికార వైసీపీ సేవలో తరిస్తున్నారు. వైసీపీ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు తన ప్రచారంలో వలంటీర్లను, సచివాలయ సిబ్బందిని వెంటబెట్టుకుని తిరుగుతున్నారు. డివిజన్లవారీగా వలంటీర్లను సమావేశపరుస్తూ వారికి బహుమతులు ఇచ్చి ప్రలోభపెడుతున్నారు. తాను ఎన్నికల్లో గెలుపు కోసం వలంటీర్లనే నమ్ముకున్నానని, తన నమ్మకాన్ని వమ్ము చేయొద్దని వేడుకుంటున్నారు.

వెలంపల్లి ఫౌండేషన్ ముసుగులో..

ఈ సమావేశాలకు హాజరవుతున్న వలంటీర్ల వివరాలను వెలంపల్లి ఫౌండేషన్ సభ్యులు సేకరిస్తున్నారు. పేరు, ఏ డివిజన్‌కు, ఏ ప్రాంతానికి వలంటీరుగా ఉన్నారు, ఏ సామాజికవర్గానికి చెందినవారు, బ్యాంకు ఖాతా వివరాలు రాబడుతున్నారు. త్వరలో వలంటీర్ల ఖాతాలకు రూ.20 వేల చొప్పున వేస్తామని ఫౌండేషన్ సభ్యులు చెబుతుండటం గమనార్హం. ఎన్నికలయ్యే వరకు వెలంపల్లికి నమ్మినబంట్లుగా పనిచేయాలని, ఆ తర్వాత మరిన్ని తాయిలాలు అందజేస్తామని హామీ ఇస్తున్నారు.

డివిజన్ కమిటీలకు రూ.లక్షలు

సెంట్రల్ నియోజకవర్గంలోని డివిజన్లలో వెలంపల్లి పర్యటిస్తే ఆ డివిజన్ కమిటీకి ఖర్చుల కింద రూ.లక్ష ఇస్తున్నారు. పర్యటనకు ముందురోజే ఈ మొత్తం చేరిపోతోంది. ఈ మొత్తం కేవలం వారి నుంచి సహకారం కోసం మాత్రమే. పర్యటన ఏర్పాట్లన్నీ జన సమీకరణ సహా వెలంపల్లి మనుషులే చూసుకుంటారు. మల్లాది విష్ణు అనుచరుల నుంచి ఎదురవుతున్న సహాయ నిరాకరణకు ఈ విధంగా చెక్ పెడుతున్నారు.





ఆదివారం వెలంపల్లితో సమావేశం అనంతరం కుక్కర్లు తీసుకుని బయటకు వస్తున్న వలంటీర్లు

పశ్చిమలో గెలుపు కష్టమని..

పశ్చిమ సిటింగ్ ఎమ్మెల్యేగా ఉన్న దేవదాయ శాఖ మాజీ మంత్రి వెలంపల్లిని జగన్ సెంట్రల్ నియోజకవర్గానికి బదిలీ చేశారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా పశ్చిమ నియోజకవర్గంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలు మూటగట్టుకున్న వెలంపల్లికి పశ్చిమలో ఈసారి గెలుపు కష్టమన్న ఉద్దేశంతో సెంట్రల్‌కు పంపారు. వాస్తవానికి వెలంపల్లితో పోలిస్తే సెంట్రల్ సిటింగ్ ఎమ్మెల్యే మల్లాది విష్ణుపై ఉన్న అవినీతి ఆరోపణలు తక్కువ. కానీ వెలంపల్లి ఆడిన నాటకంలో మల్లాది టికెట్‌కు ఎసరు వచ్చింది. ఎలాగోలా టికెట్ తెచ్చుకున్న వెలంపల్లికి గెలుపుపై మాత్రం నమ్మకం లేకుండాపోయింది. దీంతో ఆయన అడ్డదారులు తొక్కుతున్నారు. డబ్బు వెదజల్లుతూ గెలుపు కోసం తంటాలుపడుతున్నారు. సిటింగ్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అనుచరగణం సహకారం అందించడం అనుమానాస్పదంగా ఉండటంతో వలంటీర్లను నమ్ముకున్నారు. వారిని మచ్చిక చేసుకునే పనిలో భాగంగా డివిజన్లవారీగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈనెల 4 నుంచి మొదలైన సమావేశాలు రోజూ జరుగుతూనే ఉన్నాయి. పైపుల రోడ్డులోని వైఎస్ రెడ్డి కన్వెన్షన్ హాల్లో, సింగ్‌నగర్‌లోని ఆహ్వానం కల్యాణమండపంలో, గాంధీనగర్‌లోని రామా ఫంక్షన్ హాల్లో, ముత్యాలంపాడులోని గోకరాజు గంగరాజు కల్యాణమండపంలో ఇప్పటి వరకు పలు సమావేశాలు నిర్వహించారు. వలంటీర్ల పరిచయ కార్యక్రమం పేరుతో జరుగుతున్న ఈ సమావేశాల్లో.. తన గెలుపునకు ప్రతి ఒక్క వలంటీర్ సహకరించాలని వెలంపల్లి కోరుతున్నారు. సమావేశం అనంతరం వలంటీర్లందరికీ విందు ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి ఒక్కరికీ కుక్కరును బహుమతిగా ఇచ్చి పంపుతున్నారు. సమావేశానికి హాజరైన వలంటీర్ల వివరాలను వెలంపల్లి ఫౌండేషన్ సభ్యులు సేకరించి, త్వరలో వారి ఖాతాల్లో రూ.20 వేలు వేస్తామని, తప్పకుండా వెలంపల్లి గెలుపునకు కృషి చేయాలని కోరుతున్నారు.

తాయిలాలపై విమర్శలు

- మునిసిపల్ కమిషనర్‌కు టీడీపీ ఫిర్యాదు
- ఈసీకి ఫిర్యాదు చేస్తాం.. : బొండా ఉమా

- 6లో..

ఇద్దరే..



బీసీ సంక్షేమ శాఖలో ఉద్యోగుల సంఖ్య ఇదీ

- ఐదారుగురు చేయాల్సిన పని ఇద్దరితో..
- ఖాళీగా డీడీ, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు
- డెప్యుటేషన్‌లో సీనియర్ అసిస్టెంట్

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : జిల్లాల విభజన అయితే జరిపేశారు కానీ, ఆయా శాఖలకు అవసరమైన సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం ఎలాంటి శ్రద్ధ చూపలేదు. ఫలితంగా ఏ కార్యాలయం ఎక్కడుందో తెలియని పరిస్థితి. ఒకవేళ కార్యాలయానికి బోర్డులు కనిపించినా అందులో సిబ్బంది కనిపించని దుస్థితి. ఇందుకు నిదర్శనమే జిల్లాలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ (బీసీ వెల్ఫేర్). ఈ కార్యాలయంలోకి అడుగుపెడితే ఇద్దరంటే ఇద్దరే ఉద్యోగులు కనిపిస్తారు.వారిలో ఒకరు ప్రభుత్వ ఉద్యోగి కాగా, మరొకరు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి.

ఎందుకిలా..?

వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖకు ఒక డిప్యూటీ డైరెక్టర్, సూపరింటెండెంట్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, రికార్డు అసిసెంట్లు ఉంటారు. ఎన్టీఆర్ జిల్లా బీసీ సంక్షేమ శాఖకు డిప్యూటీ డైరెక్టర్ లేరు. జిల్లా విభజన జరిగిన సమయంలో ఒక మహిళా అధికారిణి డీడీగా వ్యవహరించారు. తర్వాత ఆమె బదిలీపై మరో జిల్లాకు వెళ్లిపోయారు. ఆ తర్వాత నుంచి ఇన్‌చార్జుల పాలనలో డిప్యూటీ డైరెక్టర్ పోస్టు కొనసాగింది. ఇప్పుడు ఇన్‌చార్జి లేని అనాథగా మారిపోయింది. మహిళా అధికారిణి బదిలీపై వెళ్లిపోయాక డ్వామా పీడీ సునీతకు బాధ్యతలు అప్పగించారు. అనంతరం ఇబ్రహీంపట్నం ఎంపీడీవోగా ఉన్న నాయక్‌కు ఇచ్చారు. ఇటీవల జరిగిన బదిలీల్లో నాయక్ మరోచోటకు వెళ్లారు. దీంతో ఆయన డిప్యూటీ డైరెక్టర్ ఇన్‌చార్జి బాధ్యతలను వదిలేశారు. ఇక అప్పటి నుంచి బీసీ సంక్షేమ శాఖకు డీడీని నియమించలేదు. మరొకరికి ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించలేదు.

ఖాళీగా జిల్లా విభజన జరిగాక వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖకు ఐదారుగురు సిబ్బంది ఉండేవారు. ఇప్పుడు ఆ సంఖ్య రెండుకు చేరింది. డిప్యూటీ డైరెక్టర్ పోస్టు ఖాళీ ఉంది. ఇక్కడ పనిచేయాల్సిన ఒక సీనియర్ అసిస్టెంట్ బీసీ సంక్షేమ శాఖ ప్రధాన కార్యాలయానికి డెప్యుటేషన్‌పై వెళ్లిపోయారు. జిల్లా విభజన జరిగిన కొన్నిరోజులే ఆమె ఇక్కడ పనిచేశారు. ఆ తర్వాత ప్రధాన కార్యాలయానికి పరిమితమయ్యారు. మరో జూనియర్ అసిస్టెంట్ అనారోగ్యంతో కొద్దినెలల క్రితం మరణించారు. ఇప్పుడు బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో ఒక సూపరింటెండెంట్, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్ (డీఈవో) మాత్రమే ఉన్నారు. కార్యాలయాల వ్యవహారాలను ఈ ఇద్దరే చూసుకోవాల్సిన పరిస్థితి.

బియ్యం.. బెధరహో



రోజురోజుకూ పెరుగుతున్న ధరలు

రెండు జిల్లాల్లో బియ్యం కొరత లేదు.. ధాన్యపు రాశి పుష్టిగానే ఉంది.. మిల్లులు రోజూ ఆడుతూనే ఉన్నాయి.. మిల్లర్లకు చేతినిండా పని కూడా ఉంది.. మరి.. మార్కెట్‌లో బియ్యం రేట్లు ఎందుకలా పెరుగుతున్నాయి? ట్రేడర్లు, హోల్‌సేలర్లు కలిసి కృత్రిమ కొరత సృష్టిస్తున్నారా? ఇంత జరుగుతున్నా సివిల్ సప్లయిస్ శాఖ ఎందుకు మిన్నకుండిపోతోంది..? వంటి ప్రశ్నలు వాస్తవాలే అయినా సమాధానం మాత్రం దొరకని పరిస్థితి ఏర్పడింది.

మిల్లర్లు, ట్రేడర్లు, హోల్‌సేలర్ల సిండికేట్ దోపిడీ

- కృత్రిమ కొరత సృష్టించి రేట్లు పెంపు
- జిల్లాలో ధాన్యం దిగుబడికి ఢోకా లేదు..
- మద్దతు ధర కంటే తక్కువకే అమ్ముతున్న రైతులు
- అయినా రేట్లు ఎందుకు పెరుగుతున్నాయ్..?
- భారీగా లాభపడుతున్న వ్యాపారులు
- కనీస చర్యలు తీసుకోని సివిల్ సప్లయిస్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : బహిరంగ మార్కెట్‌లో కిలో బియ్యం రూ.68 పలుకుతోంది. బస్తా ధర రూ.1,700 పైనే ఉంటోంది. ఈ ధరలు ఇంకా ఎంతస్థాయికి పెరుగుతాయో తెలియని పరిస్థితి ఏర్పడింది. బియ్యం ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాల్సిన సివిల్ సప్లయిస్ అధికారులు పట్టించుకున్న పాపాన పోవట్లేదు. దీంతో వ్యాపారులకు పండుగ, సామాన్యులకు దండుగ అన్నట్టుగా మారింది పరిస్థితి. ప్రభుత్వం తరఫున రేషన్ ఇస్తున్నామన్న పేరుతో బహిరంగ మార్కెట్‌లో దోపిడీ జరుగుతుంటే, సివిల్ సప్లయిస్ అధికారులు కనీస తనిఖీలు, దాడులు కూడా చేయట్లేదు. ప్రభుత్వం పంపిణీ చేసే బియ్యంలో 80 శాతం తిరిగి రీ సైక్లింగ్ అయ్యి ప్రస్తుతం పెరిగిపోతున్న ధరలతో వ్యాపారులకు లాభాల పంట పండిస్తోంది. సివిల్ సప్లయిస్ అధికారులు ఇలాగే చోద్యం చూస్తుంటే, రానున్న రోజుల్లో కేజీ బియ్యం రూ.100కు చేరినా ఆశ్చర్యపోనవసరం లేదు.

'సివిల్ సప్లయిస్' స్పందించదా..?

వాస్తవానికి రేషన్ తీసుకున్న కార్డుదారుల్లో 80 శాతానికి పైగా ఆ బియ్యాన్ని తినరు. వీరంతా బహిరంగ మార్కెట్‌లో లభించే సన్నగా, నాణ్యంగా ఉండే బియ్యాన్నే కొంటారు. రేషన్ బియ్యం పౌష్టికమే అయినప్పటికీ లావుగా, అన్నం వండితే మెత్తగా మారిపోతాయి. ఇలాంటి బియ్యాన్ని కార్డుదారులు అమ్ముకుంటున్నారన్న విషయం సివిల్ సప్లయిస్ అధికారులకు కూడా తెలుసు. ఇలాంటపుడు బహిరంగ మార్కెట్‌లో రాకెట్‌లా దూసుకుపోతున్న ధరలకు అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత సివిల్ సప్లయిస్‌దే. విల్లులు, మిల్లర్ల గోడౌన్లు, జిల్లావ్యాప్తంగా ఉన్న ట్రేడర్లు, హోల్‌సేల్ వ్యాపారులు, రీటైలర్లపై దాడులు చేస్తే బియ్యం ధరలను నియంత్రణలోకి తీసుకురావటం సాధ్యమవుతుంది. ఇలా అయితే కాస్తంత అయినా ధరలు నియంత్రణలోకి వచ్చే అవకాశం ఉంటుంది.

ధాన్యం కొరత లేనపుడు ధరలెందుకు పెరుగుతున్నాయ్..!

ఉమ్మడి జిల్లాలో ధాన్యం కొరత లేదు. ఆర్‌బీకేల ద్వారా ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌గా ట్రేడర్లు రైతుల నుంచి పెద్ద ఎత్తున బియ్యం కొంటున్నారు. మిల్లులు కూడా పూర్తిస్థాయిలో ధాన్యాన్ని ఆడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో బియ్యం ధరలు ఎందుకు పెరుగుతున్నాయో అర్థంకాని పరిస్థితి. రైతులకు ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధర రూ.1,600. మధ్య దళారీలు రూ.1,400కే రైతుల వద్ద కొంటున్నారు. మిల్లర్లు అయితే రూ.1,300లే ఇస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర రూ.1,600 కాకుండా మరో రూ.400 పెంచి రూ.2,000 చొప్పున లెక్కించినా కూడా మిల్లు ఆడిస్తే ధాన్యం 70 కేజీల బియ్యం బస్తాకు కేజీ రూ.28 మించి ఖర్చు కాదు. మిల్లు ఆడినందుకు, పాలిష్ పట్టినందుకు, ప్యాకింగ్ చేసినందుకు, రవాణా చేసినందుకు మహా అయితే కేజీ బియ్యం రూ.40 కూడా అవ్వదు. మరి కేజీ బియ్యం రూ.68కు ఎందుకు పెరిగిందో అర్థంకాని పరిస్థితి. ఇదంతా ట్రేడర్లు, హోల్‌సేలర్లు కలిసి ఆడుతున్న నాటకమని తెలుస్తోంది. ధాన్యం దిగుబడి బాగానే ఉన్నా, బియ్యం బాగానే ఆడుతున్నా... కృత్రిమ కొరతను సృష్టించి, మార్కెట్‌లో రేట్లను పెంచి అడ్డగోలుగా ధరలు పెంచేస్తున్నారు. మిల్లర్లు, ట్రేడర్లు, హోల్‌సేలర్లు, రీటైలర్లపై దాడులు జరిపితే వాస్తవాలు బయటపడతాయి. ధరలకు ముకుతాడు పడుతుంది. ఇప్పటికైనా సివిల్ సప్లయిస్ అధికారులు జూలు విదల్చకపోతే మార్కెట్‌లో కేజీ బియ్యం రూ.100కు చేరుకున్నా ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడుతుంది.

తప్పు సరిచేశారు

జేవీడీలో ఆన్‌లైన్ లోపాలను చక్కదిద్దిన సాంఘిక సంక్షేమ శాఖ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విజయవాడ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థుల్లో జగనన్న విద్యాదీవెన (జేవీడీ)కు అర్హులైన వారి బెంగ తీరిపోయింది. జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో ఉన్న లోపాలను సాంఘిక సంక్షేమ శాఖ సరిచేసింది. 'సెట్ ఎలిజిబులిటీ నో' అని ఉన్న స్థానంలో సోమవారం రాత్రి నుంచి 'ఎస్' అని కనిపిస్తోంది. 'ఇంజనీరింగ్‌లో జేవీడీ బెంగ' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. జేవీడీకి అర్హులైన విద్యార్థులకు సాంకేతికలోపం కారణంగా జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో 'సెట్ ఎలిజిబులిటీ నో' అని చూపించడంతో ప్రభుత్వం నిధులు విడుదల చేసినప్పుడు బ్రేక్ పడుతుందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందారు. దరఖాస్తుపైన స్టేటస్‌లో ఓటీపీ పెండింగ్ ఎట్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ అని, కిందభాగంలో సెట్ ఎలిజిబులిటీ నో అని ఉండటంతో వారంతా కంగారు పడ్డారు. తాజాగా చేసిన మార్పుల్లో సెట్ ఎలిజిబులిటీ ఎస్ అని కనిపిస్తోంది. స్టేటస్ మాత్రం యథావిధిగానే ఉంది. దీనిపై సాంఘిక సంక్షేమ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. ఇలాంటి సమస్యలు ఉన్నాయని కళాశాల ప్రతినిధులు గానీ, విద్యార్థులు గానీ తమను సంప్రదించలేదని స్పష్టం చేసింది. 2023-24 విద్యా సంవత్సరంలో జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో ఏమైనా తప్పులుంటే వాటిని విద్యార్థులు ఇప్పటికీ అప్‌డేట్ చేసుకోవచ్చని తెలిపింది. అప్‌డేట్ చేసుకోని విద్యార్థులకు సెట్ ఎలిజిబులిటీ నో అని చూపుతోందని పేర్కొంది. సెట్ ఎలాట్‌మెంట్ ద్వారా కళాశాలల్లో చేరిన విద్యార్థులు జ్ఞానభూమి సైట్‌లో తమ వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని కోరారు. ఒకవేళ అప్‌డేట్ చేసుకోని విద్యార్థులు మేనేజ్‌మెంట్ కోటా కిందికి వస్తారని స్పష్టం చేసింది.

ఆరేళ్లుగా నిరీక్షణ!

మెగా డీఎస్సీ కోసం ఆశావహుల ఎదురుచూపులు

- వేలకు వేలు పెట్టుబడి పెట్టి.. కుటుంబాలకు దూరంగా శిక్షణ
- కడుపుమండి అవనిగడ్డలో రోడ్డెక్కుతున్న నిరుద్యోగులు

- 6లో..



రాజకీయపార్టీల నేతలతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

ఓటు హక్కుపై అవగాహన కల్పించండి

▸ కృష్ణా కలెక్టర్ రాజాబాబు

మచిలీపట్నం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : రానున్న ఎన్నికల్లో జిల్లాలో ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకునేలా రాజకీయపార్టీల నేతలు ప్రజలకు అవగాహన కల్పించాలని కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. కలెక్టర్ చాంబరులో మంగళవారం పలు రాజకీయపార్టీల నేతలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఓటర్ల తుది జాబితాల ప్రకారం జిల్లాలో పురుష ఓటర్లు, 737394 మంది, మహిళా ఓటర్లు 780796మంది, ఇతరులు 65మంది ఉన్నట్టు తెలిపారు. 18 సంవత్సరాలు నిండి ఇంకా ఓటుహక్కు పొందని వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఉద్దేశపూర్వకంగా ఓటర్ల జాబితాలపై ఫిర్యాదులు చేసేవారిపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. కలెక్టరేట్‌లో మోడల్ పోలింగ్ స్టేషన్‌ను ఏర్పాటుచేసి ఈవీఎంల ద్వారా ఓటుహక్కు వినియోగించుకునే అంశంపై అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. పోలింగ్ కేంద్రాలవద్ద కనీస వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సమావేశంలో డీఆర్వో చంద్రశేఖరరావు, వైసీపీ, టీడీపీ, సీపీఎం, బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ ప్రతినిధులు షేక్ సలార్‌దాదా, ఐ దిలీప్‌కుమార్, కొడాలిశర్మ, పంతం గజేంద్ర, కోకా ఫణిభూషణ్, ఎస్.బాలాజీ, ఎన్నికల విభాగం అధికారులు దుర్గాకిషోర్, శ్యామ్ పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి..

జిల్లాకు నూతనంగా వచ్చిన తహసీల్దార్లు, ఎంపీడీవోలు వారికి కేటాయించిన మండలాల్లో పరిపాలన సక్రమంగా సాగించేందుకు అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ రాజాబాబు అన్నారు. జేసీ గీతాంజలి శర్మ, డీఆర్వో కె.చంద్రశేఖరరావుతో కలిసి డివిజన్, మండలస్థాయి అధికారులతో మంగళవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. సంక్షేమపథకాలను ప్రజలకు చేరువచేయడంతో పాటు, ఎన్నికల విధుల్లో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు కాలువలకు నీటిని విడుదల చేశారని, చివరి ప్రాంతాల్లోని తాగునీటి చెరువులను నింపేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం సేకరణలో రైతులు పడుతున్న ఇబ్బందులను తొలగించాలన్నారు. వేసవిలో సాగునీటి కాలువలు, డ్రెయినేజీలలో పూడికతీసేందుకు చర్యలు తీసుకోవాలని, ఇప్పటివరకు చేసిన పనుల వివరాలను నీటిపారుదల శాఖ అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. గ్రామ సచివాలయాల్లో భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు.



లింగవరంలో మాజీ సర్పంచ్ మల్లిరెడ్డి నరసారెడ్డిని సన్మానిస్తున్న వెనిగండ్ల, రావి

వైసీపీ పాలనలో ప్రజలకు తీరని అన్యాయం

▸ రావి, వెనిగండ్ల

గుడివాడ రూరల్, ఫిబ్రవరి 6 : వైసీపీ పాలనలో ప్రజలకు తీరని అన్యాయం జరిగిందని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం లింగవరంలో 'బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. వెనిగండ్ల, మాజీ ఎమ్మెల్యేలకు కార్యకర్తలు, నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గుడివాడ పక్కనే ఉన్న లింగవరం గ్రామం అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతోందన్నారు. అధికార పార్టీ నేతలు గ్రామాన్ని పట్టించుకోకుండా ఓట్ల దృష్టితోనే చూశారని ఎద్దేవా చేశారు. లింగవరం గ్రామానికి మరలా పూర్వ వైభవం తీసుకురావటానికి అందరం కలిసి కృషి చేద్దామని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి భారీ మెజార్టీ తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్లిరెడ్డి నరసారెడ్డి, టీడీపీ నాయకులు గాదిరెడ్డి చిరంజీవి రెడ్డి, మందపాటి గోపాలస్వామి, కాటూరి ఏసుబాబు, గాదిరెడ్డి శ్రీనివాస రెడ్డి, బర్మా శివ, సత్యనారాయణ, మండల నాయకులు, గుడివాడ నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



కేశినేని చిన్ని, సౌమ్య సమక్షంలో టీడీపీలో చేరిన పొక్కునూరు మాజీ సర్పంచ్ దంపతులు

ప్రజలు చంద్రబాబు పాలన కోరుతున్నారు

▸ కేశినేని చిన్ని, సౌమ్య

నందిగామ, ఫిబ్రవరి 6 : జగన్ విధ్వంసకర పాలనపై విసుగు చెందిన ప్రజలు చంద్రబాబుపాలన కోసం ఎదురు చూస్తున్నారని కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. మంగళవారం మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యతో కలిసి ఆయన మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. నేతలకు టీడీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. పొక్కునూరులో కార్యకర్తలు భారీర్యాలీ నిర్వహించారు. మాజీ సర్పంచ్ దంపతులు మేకల చంద్రకళ, సాంబశివరావులు తమ అనుచరులతో టీడీపీలో చేరగా వారికి చిన్ని, సౌమ్యలు కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈసందర్భంగా కేశినేని చిన్ని మాట్లాడుతూ, జగన్ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. పొక్కునూరు పదో వార్డు మెంబరు ముత్తయ్య, కాసరబాద వైసీపీ నేత కడియం గోవర్ధన్, చందర్లపాడుకు చెందిన పలువురు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. బొప్పన భవకుమార్, కోట వీరబాబు, వాసిరెడ్డి ప్రసాద్, కేవీ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు, బాబూరావు

సమ్మె ఒప్పంద జీవోలు విడుదల చేయాలి

▸ మున్సిపల్ కార్మికుల నేత ఉమామహేశ్వరరావు

ధర్నాచౌక్, ఫిబ్రవరి 6 : సమ్మె ఒప్పందపు జీవోలను తక్షణమే విడుదల చేయాలని లేదంటే మళ్లీ సమ్మెకు దిగుతామని మున్సిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. యూనియన్ నగర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో మంగళవారం జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ఇంజనీరింగ్, స్కిల్డ్, సెమీ స్కిల్డ్ కార్మికుల జీతాల కోసం వేసిన కమిటీ నివేదికను విడుదల చేయాలన్నారు. ప్రభుత్వ ఇప్పటి వరకు స్పందించకపోవడం దారుణమన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్.బాబూరావు మాట్లాడుతూ సమ్మె కాలాన్ని జీతానికి సాధారణ పండుగ సెలవుకు ఆదివారం ఫుల్‌డే సెలవు లింకు పెట్టడం తగదన్నారు. సమ్మెలో పేరుకుపోయిన చెత్తను మున్సిపల్ కార్మికులే తరలించడం జరిగిందన్నారు. జ్యోతిబసు,ప్రవీణ్, తిరుపతమ్మ తదితర నేతలతో పాటు మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

అత్యాచార కేసులో నిందితులకు రిమాండ్

తోట్లవల్లూరు, ఫిబ్రవరి 6 : యాకమూరులో దళిత బాలిక(14)పై అత్యాచారానికి పాల్పడిన ఇద్దరు నిందితులను డీఎస్పీ శ్రీకాంత్ ఆధ్వర్యంలో మంగళవారం అరెస్ట్ చేసి కోర్టుకు తరలించగా రిమాండ్ విధించినట్టు ఎస్సై పి.విశ్వనాథ్ తెలిపారు. బోలెం దిలీప్‌ని ఉయ్యూరు కోర్టులో, బాలుడి(17)ని విజయవాడ కోర్టులో హాజరు పర్చగా రిమాండ్ విధించటంతో గన్నవరం జైలుకు తరలించినట్టు తెలిపారు.

ఆరేళ్లుగా నిరీక్షణ!

మెగా డీఎస్సీతో ఉపాధ్యాయ పోస్టులన్నీ భర్తీ చేస్తానంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష నేతగా ఇచ్చిన హామీని నమ్మి డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఆరేళ్లుగా శిక్షణ పొందుతున్న ఆశావహులు ప్రభుత్వం తాజాగా 6100 పోస్టులు మాత్రమే భర్తీ చేసేందుకు సన్నాహాలు చేస్తుండటంతో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు.

▸ మెగా డీఎస్సీ కోసం ఆశావహుల ఎదురుచూపులు
▸ వేలకు వేలు పెట్టుబడి పెట్టి.. కుటుంబాలకు దూరంగా శిక్షణ పొందుతున్న నిరుద్యోగులు
▸ ప్రభుత్వ నిర్వాకంతో ఆగ్రహావేశాలు

అవనిగడ్డ, ఫిబ్రవరి 6 : రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 7 లక్షల మందికి పైగా నిరుద్యోగులు డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నారు. 2018లో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 7900 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చిన సందర్భంలో అప్పటి ప్రతిపక్ష నేత జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా 23 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటే ప్రభుత్వం కేవలం 7900 పోస్టులు భర్తీ చేసిందని.. తాను అధికారంలోకి వస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులన్నీ భర్తీ చేయటమే కాక, ప్రతీ ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, క్రమం తప్పకుండా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి ఎప్పటికప్పుడు ఖాళీలను భర్తీ చేస్తానని హామీ ఇచ్చారు. అప్పటి నుంచి నిరుద్యోగ యువత ప్రభుత్వ నోటిఫికేషన్ కోసం ఆశతో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొందుతున్నారు. తాజాగా జగన్ ప్రభుత్వం 6100 టీచర్ పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇవ్వటం, అందులో ఎస్జీటీ పోస్టులు కేవలం 1728 మాత్రమే విడుదల చేయటంతో నిరుద్యోగులు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు.



మెగా డీఎస్సీ కోసం రోడ్డెక్కి నిరసన తెలుపుతున్న నిరుద్యోగులు (ఫైల్‌ఫొటో)

● మారిపోతున్న సిలబస్.. తప్పని శిక్షణ

2018లో డీఎస్సీ నాటికీ, నేటికీ పాఠశాలల్లో సిలబస్ మారిపోతుండటంతో నిరుద్యోగులు ఎప్పటికప్పుడు మారిన సిలబస్‌కు అనుగుణంగా శిక్షణ పొందాల్సిన పరిస్థితి. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఇప్పటికి మూడుసార్లు సిలబస్ మారగా, శిక్షణకు ఒక్కొక్క విద్యార్థి రూ.20 వేల వంతున, సుమారు రూ.60 వేలు ఖర్చు చేయాల్సి వచ్చింది. దీనికి తోడు ఎప్పటికప్పుడు ఇదిగో, అదిగో నోటిఫికేషన్ అంటూ ప్రభుత్వ ప్రకటనలతో నిరుద్యోగులు ప్రైవేట్ పాఠశాలల్లో, ఇతర సంస్థల్లో చేస్తున్న చిన్న చిన్న ఉద్యోగాలను కూడా వదిలివేసి శిక్షణ పొందటంలోనే నిమగ్నమయ్యారు. ఒక్క అవనిగడ్డ శిక్షణా కేంద్రాలలోనే సుమారు మూడువేల మందికిపైగా నిరుద్యోగులు ఐదేళ్లుగా శిక్షణ పొందుతూ ఇక్కడే ఉండి హాస్టల్‌లోనూ, బయట రూములు తీసుకుని పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు.

● శరాఘాతంగా 117 జీవో..

రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థ, విద్యావిధానంలో మార్పులు తెచ్చేందుకు 117 జీవోను తీసుకురాగా, ఈ జీవో ప్రకారం 3, 4, 5 తరగతులను హైస్కూళ్లలో విలీనం చేయటంతో ఎలిమెంటరీ పాఠశాలల్లో ఉపాధ్యాయుల అవసరం క్రమేణా తగ్గుతూ వచ్చింది. సంవత్సరం క్రితం కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నివేదిక ప్రకారం దాదాపు 50 వేలకుపైగా ఉపాధ్యాయ పోస్టులు రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉండగా, 117 జీవో కారణంగా పాఠశాలల విలీనం, రేషనలైజేషన్ కారణంగా ఉపాధ్యాయ పోస్టుల సంఖ్య తగ్గిపోతూ వచ్చింది. దీనికి తోడు రిటైర్‌మెంట్ వయస్సును 62 సంవత్సరాలు పెంచటంతో ఇప్పటికే ఖాళీ అవ్వాల్సిన దాదాపు 20 వేలకుపైగా పోస్టుల్లో 60 సంవత్సరాలు నిండిన వారే పని చేస్తున్నారని, దీంతో తాము నిరుద్యోగులుగానే మిగిలిపోతున్నామని, డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్న ఆశావాహులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

● విద్యార్థుల ఆగ్రహానికి గురిచేసిన ప్రకటన

తాజాగా రాష్ట్ర ప్రభుత్వం 6200 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోగా, అందులో ఎస్జీటీ పోస్టుల సంఖ్యను భారీగా తగ్గించేశారు. బిఇడి, టిటిసి చేసిన వారిలో దాదాపు 4 లక్షల మంది ఎస్జీటీ పోస్టుల కోసం పోటీపడే పరిస్థితి ఉండగా, సుమారు 3 లక్షల మంది బిఇడి పోస్టుల కోసం పోటీ పడుతుంటారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం చూపిన ఖాళీల్లో తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఎస్జీటి పోస్టుల ఖాళీలు సున్నా అని, అనంతపురంలో నాలుగు ఖాళీ పోస్టులను చిత్తూరులో 7 పోస్టులు, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో 8 చొప్పున, శ్రీకాకుళం జిల్లాలో 14 ఎస్జీటి పోస్టులు అందుబాటులో ఉన్నట్టుగా చూపించింది. కర్నూలు జిల్లాలో అత్యధికంగా 1646 ఎస్జీటి పోస్టులు ఖాళీ ఉన్నాయని, రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 1728 పోస్టులు ఖాళీగా ఉండగా, ఈ పోస్టుల భర్తీకి త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నది. ఇందులో స్థానిక కోటా కింద కొన్ని పోస్టులు ఉండగా, ఉమ్మడి తూర్పుగోదావరి, ఉమ్మడి పశ్చిమ గోదావరి, ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఒక్క పోస్టు కూడా ఖాళీ లేకపోవటంతో వీరంతా స్థానికేతర కోటాలో కర్నూలు జిల్లా అభ్యర్థులతో పోటీ పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో స్థానికేతర కోటాలో తమకు 10 శాతం పోస్టులు కూడా అందులో దక్కవని, దాదాపు ఆరేళ్లుగా తమను ఆశల్లో ఓలలాడించి నేడు ప్రభుత్వం ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేస్తున్నామని దగా చేసిందని డీఎస్సీ ఆశావాహులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

● కడుపు మండి రోడ్డెక్కుతున్న నిరుద్యోగులు

మెగా డీఎస్సీ కోసం దాదాపు ఆరేళ్లుగా ఎదురుచూపులు చూసి విలువైన కాలాన్ని డీఎస్సీ ఆశావాహులు శిక్షణ పేరుతో వృథా చేసుకున్నారని, దీని కారణంగా తమ కుటుంబాలకు భారమయ్యామన్న ఆక్రోశం నిరుద్యోగుల్లో వ్యక్తమవుతోంది. ఇటీవల పలుమార్లు నిరుద్యోగులు మెగా డీఎస్సీ కోసం అవనిగడ్డ, విజయవాడల్లో నిరసనలు తెలియజేశారు. తాజాగా ప్రభుత్వ ప్రకటనతో నిరుద్యోగులు తమ భవిష్యత్ పట్ల తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

యాజమాన్యాల మొండి వైఖరితోనే చర్చలు విఫలం : ఐఎఫ్‌టీయూ

ధర్నాచౌక్, ఫిబ్రవరి 6: పెరిగిన ధరలకు అనుగుణంగా జట్టు కార్మికులకు నూతన అగ్రిమెంట్ చేయడంలో యాజమాన్యాల మొండి వైఖరితోనే రాష్ట్ర లేబర్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన చర్చలు విఫలం అయ్యాయని రైస్‌మిల్లు జట్టు కార్మిక సంఘం (ఐఎఫ్‌టీయూ అనుబంధం) ప్రధానకార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వరరావు విమర్శించారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లోని మండపేట, ఆలమూరు, కపిలేశ్వరపురం మండలాల్లోని వంద రైస్‌మిల్లుల్లో పనిచేస్తున్న జట్టు కార్మికుల నూతన అగ్రిమెంట్ కోసం చర్చలు జరిగాయన్నారు. లోడింగ్, అన్‌లోడింగ్ చార్జీలు పెంచకుండా రెండున్నరేళ్ల కిందటి రేట్లను అమలు చేస్తున్నారన్నారు. సీఎం జగన్ స్పందించి కార్మికచట్టాల అమలుకు చొరవ చూపాలన్నారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.రామకృష్ణ కోరారు.

సచివాలయ సిబ్బందికి తాయిలాల పంపిణీ

▸ మునిసిపల్ కమిషనర్‌కు టీడీపీ నేత ఫిర్యాదు
▸ వెంటనే స్పందించి సీపీకి ఫిర్యాదు చేసిన కమిషనర్

చిట్టినగర్, ఫిబ్రవరి 6 : సెంట్రల్ నియోజకవర్గ సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది, వలంటీర్లు, రిసోర్స్ పర్సన్లకు వైసీపీ ఇన్‌చార్జ్ బహిరంగంగా తాయిలాలు పంపిణీ చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నవనీతం సాంబశివరావు మంగళవారం సంబంధిత వివరాలతో మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై కమిషనర్ వెంటనే స్పందించి పోలీసు కమిషనర్ కాంతి రాణాకు ఫిర్యాదు చేసినట్టు ఆయన చెప్పారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, పశ్చిమ నియోజకవర్గం నుంచి 10వేల ఓట్లు సెంట్రల్‌కు బదిలీకి దరఖాస్తులు చేయడం, సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు నగదు, కుక్కర్ల పంపిణీలు పోలీసుల సమక్షంలోనే నిర్వహించడంపై చీఫ్ ఎలక్షన్ కమిషన్ దృష్టికి తీసుకువెళతామన్నారు. వలంటీర్లు ఎన్నికల విధుల్లో, క్యాంపైన్‌లో పాల్గొనరాదని కలెక్టర్లు ఆదేశాలు ఉన్నప్పటికీ వైసీపీ నేతలు ఉల్లంఘిస్తున్నారన్నారు. మరోవైపు బహుమతులు తీసుకున్న వలంటీర్లు తాము పశ్చిమ నియోజకవర్గంలో నివసిస్తున్నామని, తమకు పథకం వచ్చిందని జగనన్న స్టార్ క్యాంపైనర్‌గా పనిచేస్తున్నామని తమచేత చెప్పిస్తున్నారని ఓ మహిళ చెబుతున్న మాటల వీడియోను ఆయన పత్రికలకు విడుదల చేశారు. సెంట్రల్ నియోజకవర్గం 21వ డివిజన్‌లో సచివాలయం కార్యదర్శులు, సిబ్బంది, వలంటీర్లు, రిసోర్స్ పర్సన్‌లకు వైసీపీ ఇన్‌చార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు పార్టీ కార్యక్రమాలలో, ఎన్నికల ప్రచార కార్యక్రమాలలో పాల్గొనాలంటూ వారికి బహుమతులు ఇస్తున్నారని సాంబశివరావు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. వైసీపీకి ఓటు వేయాలని జగన్మోహనరెడ్డి ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తీసుకురావాలని, ఇంటింటి ప్రచారం చేయాలని ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై చర్యలు తీసుకోవాలని మునిసిల్ కమిషనర్‌ను సాంబశివరావు కోరారు.



మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు ఫిర్యాదు పత్రం ఇస్తున్న సాంబశివరావు

బీజేపీ వస్తే ప్రజాస్వామ్యం కనుమరుగు

▸ సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

చల్లపల్లి, ఫిబ్రవరి 6 : కేంద్రంలో మళ్లీ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్యం, లౌకికవాదం కనుమరుగవుతాయని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు ఆందోళన వెలిబుచ్చారు. సీపీఐ, ప్రజానాట్యమండలి నేతలు కామ్రేడ్ రావి బాబూరావు, అడ్డాడ దుర్గానాగేశ్వరరావుల సంస్మరణ సభ వక్కలగడ్డలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ముప్పాళ్ల మాట్లాడుతూ, భారతదేశాన్ని బీజేపీ నుంచి విముక్తి కల్పించాల్సిన బాధ్యత లౌకికపార్టీలకు, మేధావులు, గ్రామీణ ప్రజానీకంపై ఉందన్నారు. దేశంలో కలుషిత రాజకీయాలు విలయతాండవం చేస్తున్నాయనీ, అధికారమే పరమావధిగా రాజకీయ నేతలు పని చేస్తున్నారన్నారు. రాష్ట్రానికి విభజన హామీలు సాధించటంలో ముఖ్యమంత్రి జగన్ పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. 25 ఎంపీ స్థానాలు ఇస్తే కేంద్రం మెడలు వంచుతానన్న ముఖ్యమంత్రి హోదా సాధించకపోగా బీజేపీ ముందు మెడలు వంచుతున్నారని ఎద్దేవా చేశారు. కమ్యూనిస్టు పార్టీలు ఎల్లప్పుడూ ప్రజలతో మమేకమై ఉంటాయనీ, కమ్యూనిస్టు పార్టీ నాయకులు చేసిన అనేక ఉద్యమాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని గుర్తు చేశారు. రావి బాబూరావు, అడ్డాడ దుర్గానాగేశ్వరరావు తదితర కమ్యూనిస్టు పార్టీ నాయకుల సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ, దేశానికి, రాష్ట్రానికి కమ్యూనిస్టు ఉద్యమాల ఆవశ్యకత ఉందన్నారు. నల్లచట్టాలకు వ్యతిరేకంగా రైతులు చేసిన ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని కోరారు. కమ్యూనిస్టులు బలహీనపడితే దేశానికే ప్రమాదమని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ అన్నారు. రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ అధ్యక్షతన జరిగిన సభలో ప్రజానాట్యమండలి రాష్ట్ర నేత ఆర్.పిచ్చియ్య, సీపీఐ నేతలు నార్ల వెంకటేశ్వరరావు, టి.తాతయ్య, పాలడుగు రత్నబాబు, చంద్రానాయక్, హనుమానుల జగన్‌మోహనరావు, నజీర్ శర్మ, మల్లుపెద్ది రత్నకుమారి, టీడీపీ నేత యార్లగడ్డ శ్రీనివాసరావు, కాంగ్రెస్ నేత మీర్ రిజ్వాన్ తదితరులు ప్రసంగించారు. ప్రజానాట్యమండలి హైదరాబాద్ నాయకులు హనుమానుల జగన్ మోహనరావు సారథ్యంలో 'రైతే రాజు' నాటికను ప్రదర్శించారు. సాంఘిక నాటకాలు కనుమరుగవుతున్న తరుణంలో రైతే రాజు నాటక ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది.



సభలో ప్రసంగిస్తున్న ముప్పాళ్ల

వన్‌స్టాప్ సెంటర్‌లో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

జిల్లా స్త్రీ శిశు సంక్షేమ, సాధికారత అధికారి ఉమాదేవి

కృష్ణలంక, ఫిబ్రవరి 6 : ఎన్టీఆర్ జిల్లా మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విజయవాడలో నడుస్తున్న వన్‌స్టాప్ సెంటర్‌లో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పద్ధతిపై పనిచేసేందుకు అర్హులైన మహిళా అభ్యర్థులు ఈనెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా స్త్రీ, శిశుసంక్షేమ, సాధికారత అధికారి జి.ఉమాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెంటర్ అడ్మినిస్ట్రేటివ్ 1, కేసు వర్కర్ 2, సైకో-సోషల్ కౌన్సిలర్ 1, పూర్తిస్థాయి కంప్యూటర్ పరిజ్ఞానం కలిగిన ఆఫీస్ అసిస్టెంట్ 1, మల్టీ పర్పస్ స్టాఫ్/కుక్ 3, సెక్యూరిటీ గార్డ్/నైట్ గార్డ్ 3 ఖాళీలు ఉన్నట్టు వెల్లడించారు. ఆసక్తిగల అభ్యర్థులు ఎన్టీఆర్.ఏపీ.జీఓవీ.ఇన్ నుంచి దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకొని, దరఖాస్తుకు గెజిటెడ్ అధికారితో అటెస్ట్ చేయించి, ధృవపత్రాల నకళ్లను జతచేసి జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం, డోర్ నెం.6-93, కార్మెల్ చర్చి ఎదురు రోడ్డు, కానూరు, విజయవాడలో ఈనెల 15వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా అందజేయాలన్నారు.

ముడా వీసీగా పీవీ రమణ

మచిలీపట్నం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ముడా) వీసీగా పీవీ రమణను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. బాపట్లజిల్లా రెవెన్యూ అధికారిగా పనిచేస్తున్న ఆయనను ముడా వీసీగా బదిలీ చేసింది. ఇటీవలనే ముడా వీసీగా బాధ్యతలు చేపట్టిన ఎం.వెంకటేశ్వర్లును కోనసీమ జిల్లా రెవెన్యూ అధికారిగా బదిలీచేశారు.

దిగజారుడు రాజకీయాలు చేస్తున్న పేర్ని నాని, అంబటికి ప్రజలే బుద్ధి చెబుతారు

▸ ఎంపీ బాలశౌరిపై విమర్శలు తగదు
▸ జనసేన రాష్ట్ర నేత బోన బోయిన



మచిలీపట్నం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : దిగజారుడు రాజకీయాలు చేస్తున్న ఎమ్మెల్యే పేర్ని నాని, మంత్రి అంబటి రాంబాబులకు రాబోయే ఎన్నికల్లో ప్రజలే తగిన విధంగా బుద్ధి చెబుతారని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ మండిపడ్డారు. మంగళవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరిపై పేర్ని, అంబటి చేసిన విమర్శలను బోనబోయిన ఖండించారు. ఒక ఎంపిగా ప్రభుత్వంలో ఏం జరుగుతుందో తనకు తెలుసని బాలశౌరి చెప్పగానే, మీరిద్దరూ ఎందుకు భుజాలు తడుముకుంటున్నారు..? అని ఆయన ప్రశ్నించారు. గత ఎన్నికల సమయంలో అమరావతి రాజధానిగా ఇక్కడే ఉంటుందని చెప్పిన జగన్, ఎన్నికలు ముగియగానే అమరావతి వద్దు, మూడు రాజధానులే ముద్దు అని రాష్ట్ర ప్రజలను మోసం చేయడం నిజం కాదా? అంటూ బోనబోయిన నిలదీశారు. మీలా చెల్లని వెయ్యి రూపాయల నోటు కాదు మా ఎంపీ. పేర్ని నాని నువ్వు బందర్‌లో తప్ప ఎక్కడా పోటీ చేయలేవు. ఒకవేళ చేసినా కనీసం వార్డు మెంబర్‌గా కుడా గెలవలేవు. ఇప్పుడు బందరులో ఎమ్మెల్యేగా గెలవనేనని కదా నీ కొడుక్కి సీటు ఇప్పించుకున్నావు అంటూ ఎద్దేవా చేశారు. ఇరిగేషన్ మంత్రిగా ఉండి పోలవరం పూర్తి చేయకుండా, సంక్రాంతికి లాటరీలు పెట్టి డాన్సులు చేసే అంబటి రాంబాబుకు రెండో పంటకు నీళ్ల లేక మొక్కజొన్న వేసిన గుంటూరు జిల్లా రైతులు ఎన్నికష్టాలు పడుతున్నారో తెలుసా? అని విమర్శించారు. రాజకీయం చేసి ఆడుక్కోవడం, దోచుకోవడం మీ నైజమని ఆయన దుయ్యబట్టారు.

ఇసుక తవ్వకాలపై ప్రతిష్టంభన

▸ ఇరుపక్షాలతో తహసీలార్, సీఐ చర్చలు
▸ మానవతా ధృక్పదంతో అనుమతించాలని మహిళల సూచన
▸ రైతులతో మాట్లాడి చెబుతామన్న పెద్దలు

చల్లపల్లి, ఫిబ్రవరి 6 : నడకుదురు రేవులో ఇసుక తవ్వకాల విషయమై చెలరేగిన వివాదం కొలిక్కిరాలేదు. తవ్వకాలు జరపటమా, నిలిపివేయటమా అన్న విషయమై ప్రతిష్టంభన నెలకొంది. పాగోలు లే అవుట్‌కు మెరక పేరుతో ప్రారంభమైన తవ్వకాలు వక్రబాట పట్టాయనీ, లేఅవుట్ కంటే ఎక్కువగా బయటకు విక్రయిస్తున్నారనే కారణంతో రైతులు తవ్వకాలను అడ్డుకోవటం, పాగోలు లబ్ధిదారులు తవ్వకాలకు మద్దతుగా సోమవారం రేవులోకి వెళ్లటం, ఇరుపక్షాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుని ఉద్రిక్త పరిస్థితి ఏర్పడిన విషయం తెలిసిందే. తాజాగా మంగళవారం చల్లపల్లి తహసీల్దార్ బి.సుమతి కార్యాలయంలో ఇరుపక్షాలతో సమావేశమయ్యారు. రైతుల నుంచీ అభ్యంతరాలను, లేఅవుట్ లబ్ధిదారులు, సర్పంచ్‌లు, వైసీపీ నేతల విజ్ఞప్తులు వేర్వేరుగా తె లుసుకున్నారు. సీఆర్‌జడ్ పరిధిలో అనుమతులు లేకుండా ఇష్టానురీతిన తవ్వకాలు ఎలా చేపడతారని రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇసుక తవ్వకాలకు రైతులు అంగీకరించబోరనీ, పంటచేలకు దగ్గరగా చేపట్టిన తవ్వకాలతో వ్యవసాయం ఇబ్బందికరంగా మారుతుందనీ, ఉప్పునీటి చొరబాటు అధికమవుతుందని తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ వస్తే మెరక పనులు చేయటం జరిగేపనికాదనీ, లే అవుట్ మెరకకు అవకాశం ఇవ్వాలని మహిళలు కోరారు.

చల్లపల్లి సీఐ సిహెచ్.నాగప్రసాద్, తహసీల్దార్ సుమతితో కలిసి ఇరుపక్షాల పెద్దలతోనూ చర్చించారు. లే అవుట్ మొత్తానికి ఒకే చోట నుంచీ కాకుండా కొంత వరకు నడకుదురు నుంచీ తరలించేందుకు అభ్యంతరం పెట్టవద్దని కోరారు. రైతులతో మాట్లాడి తమ అభిప్రాయం చెబుతామని పెద్దలు వెళ్లిపోయారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు గొరిపర్తి సురేష్, తోట వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ పైడిపాముల వెంకటేశ్వరరావు, వైసీపీ మండల కన్వీనర్ శీరం నాని, రైతు నేతలు కొర్రపాటి వీరసింహుడు, దేవభక్తుని గోపాలకృష్ణ, వడ్లమూడి గోపీచంద్, కైతేపల్లి శ్రీనివాసరావు, రాజులపాటి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



ఇరుపక్షాలతో మాట్లాడుతున్న తహసీల్దార్, సీఐలు

ఇసుక అక్రమ తరలింపుపై అధికారులకు ఫిర్యాదు

ఘంటసాల : శ్రీకాకుళం, పాపవినాశనం గ్రామాల్లో ఇసుక అక్రమ తవ్వకాలపై మంగళవారం టీడీపీ, జనసేన నాయకులు ఘంటసాల మండల తహసీల్దార్ విజయలక్ష్మి, పోలీసు సిబ్బందికి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం ఎంపీటీసీ సభ్యుడు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా) మాట్లాడుతూ, గత 15 రోజుల నుంచి పాపవినాశనం గ్రామంలోని కృష్ణానది నుంచి భారీ స్థాయిలో ఇసుక తరలిపోతోందని, ఈ విషయాన్ని రెవెన్యూ సిబ్బందికి తెలియజేసినా స్పష్టత లేదన్నారు. శ్రీకాకుళంలో గతంలో డంప్ చేసిన ఇసుకను భారీగా తరలిస్తున్నారన్నారు. కార్యక్రమంలో తాడేపల్లి గ్రామ ఉపసర్పంచ్ కొడాలి లక్ష్మణరావు, కుంపటి చిట్టిబాబు, ఆత్కూరి నాగరాజు, రుచిత్, మాదాసు వినయ్, కోన హరీష్, తాడికొండ సాయి తేజ, కోడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తారు డబ్బాలో వలస కూలీ..

▸ తారులో చిక్కుకుపోయి నరకయాతన
▸ రక్షించి ఆసుపత్రికి తరలించిన పోలీసులు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 6 : విజయవాడ రూరల్ మండలం రాయనపాడు వద్ద వ్యాగన్ వర్క్‌షాపుకు వెళ్లే రహదారి వెంట ఉన్న ఓ తారుడబ్బాలో ఇతర రాష్ట్రానికి చెందిన వలస కూలీ ఇరుక్కుపోయాడు. మంగళవారం కూరగాయల వ్యాపారి అయిన ఓ మహిళ విషయాన్ని రాయనపాడు గ్రామ సర్పంచ్‌కు తెలపడంతో పోలీసులు అక్కడకు చేరుకొని అతి కష్టం మీద తారులో ఇరుక్కుపోయిన వలస కూలిని బయటకు తీసి చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతడికి మతి స్థిమితం లేదని, ఏం మాట్లాడలేని పరిస్థితిలో ఉన్నాడని పోలీసులు తెలిపారు.



విజయవాడ

● తూర్పు ● సెంట్రల్ ● పశ్చిమ

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	129, 138, 149
చికెన్ విత్ స్కిన్	246
చికెన్ స్కిన్‌లెస్	256

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.46

మహిళా ఉత్సవ్‌లో మెహందీ పోటీలు



మొగల్రాజపురం: జనశిక్షణా సంస్థాన్ ఆధ్వర్యంలో మొగల్రాజపురం మొగల్ హాలులో జరుగుతున్న మహిళా ఉత్సవ్‌లో మంగళ వారం మహిళలకు మెహందీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సీనియర్ రిసోర్స్ పర్సన్స్ ఎస్.సునీత, ఒ.భవానీ దేవిలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిం చారు. మొత్తం 56 మందిలో మొదటి బహుమతి పి. జ్యోతి, ద్వితీయ బహుమతి బి.నందిని పొందారు. జనశిక్షణా సంస్థాన్ డైరెక్టర్ ఏ. పూర్ణిమ, సిబ్బంది, స్టాల్స్ నిర్వాహకులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగం

సెంట్రల్ నియోజకవర్గ ఎస్సీ సెల్ సమావేశంలో బొండా ఉమా

అజిత్‌సింగ్‌నగర్, ఫిబ్రవరి 6 : పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన గొప్ప మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని, అటువంటి మహోన్నత వ్యక్తి రాసిన రాజ్యాంగాన్ని పక్కన పెట్టి రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నాడని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు విమర్శించారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ ఎస్సీ సెల్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని నష్టాన్ని జగన్ ఐదేళ్ల పాలనలో దళితులకు చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో దళితులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. దళితుల హక్కులు, చట్టాల కోసం పోరాడి రాబోయే ఎన్నికల్లో జగన్‌కు బుద్ధి చెప్పాలని బొండా ఉమా పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న బొండా ఉమా



కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ బీసీ నేతలు

టీడీపీలోనే బీసీలకు న్యాయం

టీడీపీలోనే బీసీలకు న్యాయం జరిగిందని, వైసీపీ పాలనలో బీసీ సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని టీడీపీ నాగవంశ సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎరుబోతు రమణారావు అన్నారు. 57వ డివిజన్ న్యూ రాజరాజేశ్వరిపేటలో మంగళవారం సెంట్రల్ నియోజకవర్గ బీసీ కమిటీ పాదయాత్ర జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ వెళ్లి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో బీసీల అభ్యున్నతికి చేసిన కృషిని వివరిస్తూ ప్రచురించిన కరపత్రాలను స్థానికులకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో బీసీలు టీడీపీకి మద్దతుగా నిలువబోతున్నారని పేర్కొన్నారు. నేతలు పిరియా సోమేశ్వరరావు, లబ్బా వైకుంఠం, బెజవాడ తిరుపతి, బోని నాని, తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సవరణలో అలసత్వం వహిస్తే చర్యలు

అధికారులకు నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ హెచ్చరిక

చిట్టినగర్, ఫిబ్రవరి 6: ఓటర్ల జాబితా సవరణలలో పాల్గొంటున్న అధికారులు, సిబ్బంది ఎటువంటి అలసత్వం వహించినా చర్యలు తప్పవని మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ హెచ్చరించారు మంగళవారం ఆయన తన చాంబర్‌లో సెంట్రల్ నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి హోదాలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా రాజకీయపార్టీల ప్రతినిధులు వెలిబుచ్చిన సమస్యలకు పరిష్కారాలు చూపాలని అధికారులకు సూచించారు. నియోజకవర్గానికి సంబంధించిన ఓటర్ల జాబితాలో ఎటువంటి లోపాలు ఉండకూడదన్నారు. సెంట్రల్ నియోజకవర్గంలో వచ్చిన ఫారం 6,7,8ల గురించిన వివరాలను ఆయన వివరించారు.



రాజకీయ పార్టీలతో సమీక్షా సమావేశం నిర్వహించిన నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్

టీడీపీ నుంచి నవనీతం సాంబశివరావు, వైసీపీ నుంచి గుండె సుందర్‌పాల్, బీఎస్పీ నుంచి ఎం.వినోద్‌కుమార్, సీపీఐ నుంచి ఎన్.వీరభద్ర రావు, సీపీఐ(ఎం) నుంచి సీహెచ్ శ్రీనివాస్, సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వి ప్రసాద్, సెంట్రల్ నియోజకవర్గ తహసీల్దార్ వెన్నెల శ్రీను, డిప్యూటీ తహసీల్దార్ సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారాలు బాగుండాలంటే టీడీపీ- జనసేన ప్రభుత్వం రావాలి

జనసేన అధికార ప్రతినిధి పోతిన మహేశ్

వన్‌టౌన్, ఫిబ్రవరి 6: వ్యాపారాలు బాగుండాలంటే, అమరావతి రాజధాని నిర్మాణం కావాలంటే టీడీపీ-జనసేన ప్రభుత్వం వచ్చేందుకు ఓట్లు వేసి గెలిపించాలని జనసేన అధికార ప్రతినిధి, పశ్చిమ ఇన్‌ఛార్జి పోతిన మహేశ్ అన్నారు. మంగళవారం ఆయన కృష్ణవేణి హోల్‌సేల్ క్లాత్ మార్కెట్‌లో ఇంటింటికి రాబోయే జనసేన- టీడీపీ ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. తొలుత ఆయన సర్దార్ బచ్చు వెంకట నరసింహారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మార్కెట్ అధ్యక్షుడు బచ్చు వెంకట ప్రసాద్, కవిటీ సభ్యులు ఆయనకు సాదర స్వాగతం పలికి దుశ్శాలువాతో సత్కరించారు. మహేశ్‌కు తమ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ, అమరావతి రాజధానికి టీడీపీ- జనసేన కట్టుబడి ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా టీడీపీ- జనసేన ప్రభుత్వం వస్తే సులభతర ఇసుక పాలసీని తీసుకురావాలని వ్యాపారవర్గాలు కోరాయి.



బచ్చు వెంకట నరసింహారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన పోతిన మహేశ్

ప్రభుత్వోద్యోగి విధులకు ఆటంకం కలిగించి...

హత్యాయత్నం కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు

విజయవాడ లీగల్, ఫిబ్రవరి 6 : ప్రభుత్వోద్యోగి విధులకు ఆటంకం కలిగించి అతనిపై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో నిందితుడిపై నేరం రుజువుకావడంతో మూడేళ్ల జైలుశిక్ష విధిస్తూ 12వ అదనపు జిల్లా జడ్జి పి.భాస్కరరావు మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం 2018 మార్చి 13న కొత్తవంతెన బోసు బొమ్మసెంటర్ వద్ద బడ్డీకొట్టును పగులకొట్టేందుకు యత్నించిన ముగ్గురు వ్యక్తులు బైక్‌పై ఏకేటీపీ స్కూల్ వైపు పారిపోతున్నారని పోలీసు కంట్రోల్ రూంకు ఫోన్ వచ్చింది. సత్యనారాయణపురం ప్రాంతంలో బీట్‌లో వున్న కానిస్టేబుల్, హోంగార్డులకు బైక్‌పై పారిపోతున్న వారు తారసపడ్డారు. అందులో ఒక నిందితుడిని పట్టుకొనేందుకు పోలీసులు ప్రయత్నించిన సమయంలో బైక్‌పై నుంచి దూకి చీకటిలో పారిపోతుండగా పట్టుకోవడానికి ప్రయత్నించిన కానిస్టేబుల్‌ను నిందితుడు కత్తితో వీపుపై పొడిచి పారిపోయాడు. హోంగార్డు పట్టుకొనేందుకు ప్రయత్నించగా నిందితుడు అతనిపై రాయి విసరగా హోంగార్డు ముక్కుకి గాయమైంది.

వెంటనే పోలీసులిద్దర్నీ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించగా కానిస్టేబుల్ ఫిర్యాదుపై సత్యనారాయణపురం పోలీసులు నిందితుడైన భానునగర్‌కు చెందిన సింగరాతి ఏబేలు అలియాస్ హెబేలును అరెస్టు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి, నిందితుడిపై నేరం రుజువుకావడంతో పైవిధంగా శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే నష్టాలపై అవగాహన సదస్సు

పాయకాపురం, ఫిబ్రవరి 6 : యువత మత్తు పదార్థాలతో జీవితాలను చిత్తు చేసుకోవద్దని నవజీవన్ బాలభవన్ జోనల్ కో-ఆర్డినేటర్ నజ్మా అన్నారు. 63వ డివిజన్ రాజీవ్‌నగర్‌లోని వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో సిబ్బందికి మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే నష్టాలపై అవగాహన సదస్సును బాల భవన్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. కార్యక్రమంలో మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన వారిని డీ ఎడిక్షన్ చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకురావచ్చని తెలిపారు. మాదక ద్రవ్యాల నివారణ ప్రతి ఒక్కరూ తమవంతు సామాజిక బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. ఆరోగ్య కేంద్రం డాక్టర్ వంశీలాల్ రాథోడ్, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్య సమస్యలపై విద్యార్థినులకు అవగాహన

పటమట, ఫిబ్రవరి 6 : నిర్భయ క్రాంతి మహిళా మండలి ఆధ్వర్యంలో మంగళవారం పటమట విజయభారతి హైస్కూల్‌లో ఆరవ తరగతి నుంచి 10వ తరగతి చదివే విద్యార్థినులకు హెల్త్ అండ్ మెనుస్ట్రువల్ ఎవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి డాక్టర్ నీరజ మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో ఆడపిల్లలు 9, 10 ఏళ్ల వయస్సులోనే యుక్తవయస్సులవుతున్నారని, వారికి రకరకాల భయాలు ఉంటున్నాయని, కొంతమంది రక్తహీనతతో బాధపడుతున్నారని తెలిపారు. పోషకాహారం ఆవశ్యకత, పీరియడ్స్ వచ్చినప్పుడు సరైన శుభ్రత పాటించడం ఎలా అనే అంశంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ప్రెసిడెంట్ రత్నలక్ష్మి, డాక్టర్ సీతామహాలక్ష్మీ పాల్గొన్నారు.

టెన్త్ మోడల్ టెస్ట్‌కు మంచి స్పందన

వన్‌టౌన్, ఫిబ్రవరి 6: ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్‌ల ఆధ్వర్యంలో మంగళవారం వన్‌టౌన్‌లోని కేబీఎన్ కాలేజీలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన మోడల్ టెస్ట్‌కు మంచి స్పందన వచ్చింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకుడు సోమేశ్వరరావు మాట్లాడుతూ, మోడల్ టెస్ట్ పరీక్షలు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పర్యవేక్షణలో జరుగుతున్నాయని తెలిపారు. పశ్చిమలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాలయాల నుంచి విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. భవిష్యత్‌లో రాయబోయే పరీక్షలకు ప్రజ్ఞావికాసం మోడల్ టెస్ట్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని విద్యార్థులు అభిప్రాయపడ్డారు. అంతకుముందు సోమేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యుడు బి.మాధవ్, కేబీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరావు తదితరులు మోడల్ టెస్ట్ పేపర్‌ను విడుదల చేశారు.

అపోలో టైర్స్ ఉచిత వైద్యశిబిరం విజయవంతం

ఆటోనగర్(పెనమలూరు), ఫిబ్రవరి 6: ఆటోనగర్ వందడుగుల రోడ్డులో అపోలో టైర్స్ ఫౌండేషన్ నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష జనాదరణ లభించింది. వాసవ్య మహిళామండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి పరీక్షలు, షుగరు, బీపీ పరీక్షలు, టీబీ పరీక్షలకు వందల సంఖ్యలో స్థానికులు, ఆటోనగర్ కార్మికులు హాజరై ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకొని మందులను పొందారు.

కార్యక్రమాన్ని వాసవ్య మహిళామండలి ప్రతినిధి శ్రీనివాసరావు, ఐలా ఛైర్మన్ సుంకర దుర్గాప్రసాద్, బాహుబలేంద్ర కోటేశ్వరరావు, కొమ్మిడి శ్రీనివాసరెడ్డి, త్రిపురనేని హనుమాల్ నాగచంద్ పర్యవేక్షించారు.

చెస్ ఫిడే రేటింగ్‌లో రిత్విక్, హర్షిత్ సాయి ముందంజ

విజయవాడ స్పోర్ట్సు, ఫిబ్రవరి 6 : ముస్తాబాద స్పోర్ట్స్ ఎడ్యుకేషనల్ అకాడమీకి చెందిన విద్యార్థులు ఉప్పు రిత్విక్, ఉప్పలపాటి హర్షిత్ సాయిలు 2024 ఫిబ్రవరి చెస్ ఫిడేరేటింగ్‌లో ముందంజ వేశారు. వీరిద్దరూ గతేడాది డిసెంబరులో జరిగిన ఉదయ్‌పూర్, హైదరాబాద్‌ల్లో జరిగిన ఫిడే రేటింగ్ చెస్ టోర్నీల్లో సత్తా చాటి రేటింగ్‌లో దూసుకెళ్తున్నారు. రిత్విక్ 1088 పాయింట్లతోను, హర్షిత్‌సాయి 1072 పాయింట్లతో నిలిచారు. అకాడమీలో జరిగిన అభినందన కార్యక్రమంలో విజయ పవర్ సిస్టమ్స్ మేనేజింగ్ డైరెక్టర్ వేములపల్లి సోమశేఖర్, ఏపీఐసీసీ చీఫ్ జనరల్ మేనేజర్ సీహెచ్ లక్ష్మిదుర్గా, చీఫ్ కోచ్ వీఆర్.బొబ్బాలు అభినందించారు.



రిత్విక్, హర్షిత్‌లను అభినందిస్తున్న లక్ష్మీదుర్గ, సోమశేఖర్

ఐస్ స్కేటింగ్‌లో తేజస్వినికి రజతం

విజయవాడస్పోర్ట్సు, ఫిబ్రవరి 6 : లడఖ్‌లో జరిగిన 4వ ఖేలో ఇండియా వింటర్ గేమ్స్‌లో ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రాతినిధ్యం వహించిన యర్రంశెట్టి దేవిచందన తేజస్విని బాయి 100 మీటర్ల ఐస్ స్కేటింగ్ లాంగ్ ట్రాక్ ఈవెంట్‌లో రెండో స్థానంలో నిలిచి రజతం వశం చేసుకుంది. ఈ పోటీల్లో ఏపీ జట్టు పతకాల పట్టికలో ఏడోస్థానంలో నిలిచింది. రజతం సాధించిన తేజస్విని శాప్ వీసీ, ఎండీ హెచ్ఎం ధ్యాన్‌చంద్ర అభినందించారు.

ఆర్టీసీ స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ

బస్టేషన్, ఫిబ్రవరి 6: ఆర్టీసీ స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ 2024 డైరీని మంగళవారం ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది సమస్య ల పరిష్కారానికి సానుకూలంగా కృషి చేస్తామని తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈ.శివప్రసాద్, నాయకులు ఎంవీ కొండారెడ్డి, కే.హరినాథరెడ్డి, టీజే.రావు, మధు పాల్గొన్నారు.



డైరీని ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు

చిన్నారులకు పాలు, పండ్లు, దుప్పట్లు పంపిణీ

అజిత్‌సింగ్‌నగర్, ఫిబ్రవరి 6 : ది కృష్ణలంక వాకర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో కృష్ణలంకలోని నిర్మల శిశుభవన్‌లో మంగళవారం 50 మంది చిన్నారులకు పాలు, పండ్లు, దుప్పట్లు, డైపర్స్ పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా అసోషియేషన్ సభ్యులు అందుగల రాజ్‌కుమార్, రమేష్‌లు మాట్లాడుతూ అందుగల సుబ్బారావు జ్ఞాపకార్థం పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాకర్స్ అధ్యక్షుడు మూరం లక్ష్మయ్య, సయ్యపురెడ్డి రాజా, నిమ్మల దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా నెక్స్ జెన్ స్కూల్ వార్షికోత్సవం

పటమట, ఫిబ్రవరి 6 : స్థానిక గురునానక్ కాలనీలోని నెక్స్ట్‌జెన్ స్కూల్‌లో మంగళవారం స్కూలు 8వ వార్షికోత్సవాన్ని కోలాహలంగా నిర్వహించారు. చిన్నారులు డ్యాన్స్‌లు, స్టెప్పులతో అదరగొట్టారు. అంతేకాకుండా సంప్రదాయ దుస్తులతో చిన్నారులు సంప్రదాయ నృత్యాలతో హంగామా చేశారు. వివిధ రకాల ఆటపాటలతో స్కూలు ప్రాంగణం కోలాహలంగా మారింది.



చిన్నారుల డ్యాన్స్‌లు

దుర్గగుడి ట్రస్ట్‌బోర్డుకు ఏడాది పూర్తి

వన్‌టౌన్, ఫిబ్రవరి 6: దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో ట్రస్ట్‌బోర్డుకు ఏడాది పూర్తయిందని ఛైర్మన్ కర్నాటి రాంబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏడాది ఫిబ్రవరి 7న ట్రస్ట్‌బోర్డును జగన్మోహనరెడ్డి ప్రభుత్వం నియమించిందన్నారు. గత ఏడాది కాలంగా తాము దుర్గగుడి అభివృద్ధికి, భక్తులకు సౌకర్యాల మెరుగుదలలో పూర్తి శ్రద్ధ తీసుకున్నట్లు తెలిపారు. ఇంకా ఆలయ అభివృద్ధికి పలు కార్యక్రమాలను తీసుకోనున్నట్లు తెలిపారు.



ధర్మపథం వేదికపై భక్తిగీతాలను ఆలపిస్తున్న సంతాన వేణుగోపాల స్వామి భజన మండలి

ధర్మపథం వేదికపై భక్తి గీతాలాపన

ధర్మపథం వేదికపై మంగళవారం కృష్ణాజిల్లా కపులూరుకు చెందిన బీ.హెచ్ సువర్ణకుమారి ఆధ్వర్యంలోని సంతాన వేణుగోపాలస్వామి భజన మండలి భక్తి గీతాలను ఆలపించింది. పలు భక్తి గీతాలతో భక్తులను ఆకట్టుకున్నారు. ఉదయశ్రీ గీతా, సువర్ణకుమారి, శేషుకుమారి, దుర్గాలక్ష్మీ, కోటేశ్వరి, సుధారాణి, ద్రౌపది, కస్తూరి, శేషమ్మ, సుజాత, లక్ష్మీ కుమారి, భజన బృందంలో ఉన్నారు.

రాధానగర్ అపార్ట్‌మెంట్స్‌లో సమస్యలు పరిష్కరించాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాబూరావు

పాయకాపురం, ఫిబ్రవరి 6 : స్థానిక రాధానగర్ వద్ద ఉన్న అపార్ట్‌మెంట్స్‌లో సమస్యలు పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు డిమాండ్ చేశారు. రాధానగర్‌లోని ఏడు అపార్ట్‌మెంట్స్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన అపార్ట్‌మెంట్స్ సమస్యలకు నిలయాలుగా మారాయన్నారు. తాగటానికి మంచినీళ్లు లేక, బోర్లు పనిచేయక ఈ ప్రాంత వాసులు నరకయాతన అనుభవిస్తున్నారని చెప్పారు. అస్తవ్యస్తంగా డ్రెయినేజీ వ్యవస్థ ఉండటంతో మ్యాన్‌హోల్స్ పొంగి దుర్వాసనతో నానా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దోమల నివారణకు చర్యలు లేవని, అపార్ట్‌మెంట్స్‌కు మరమ్మతులు చేసి డ్రెయినేజీ పైపులను, వాటర్ ట్యాంక్‌లను బాగు చేయాలని కోరారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని లేని పక్షంలో కాలనీవాసులను కలుపుకుని పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. శ్రీదేవి, రమణ, కె. దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

నగరాన్ని అందంగా తీర్చిదిద్దుదాం

● కార్పొరేషన్ న్యాయమూర్తి విజయ్‌కుమార్ రెడ్డి



సత్యనారాయణపురం, ఫిబ్రవరి 6: నగరాన్ని పరిశుభ్రంగా, అందంగా ఉంచుకునేందుకు తమ వంతు బాధ్యతగా ప్రతీ ఒక్కరూ నిబంధనలు పాటించాలని కార్పొరేషన్ న్యాయమూర్తి బి.విజయ్ కుమార్ రెడ్డి అన్నారు. సత్యనారాయణపురం సర్కిల్‌టూ కార్యాలయంలో మంగళవారం జరిగిన మొబైల్‌కోర్టులో కార్పొరేషన్ నిబంధనలు ఉల్లఘించిన వారికి ఫైన్‌లు విధించారు. రోడ్డుపైన చెత్త వేసినందుకు, మురుగుప్రవాహానికి అడ్డు పెట్టినందుకు, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు నమోదు చేసిన 9కేసుల పైన విచారణ జరిపి రూ.2680 జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జరిమానా విధించిన తర్వాత రెండోసారి తప్పు చేస్తే కఠినంగా చర్యలు తీసుకుంటామని, ట్రేడ్‌లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. అసిస్టెంట్ హెల్త్ ఆఫీసర్ -2, డాక్టర్ రామకోటేశ్వరరావు, శానిటరీ సూపర్‌వైజర్ -2 నవకిషోర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు పాల్గొన్నారు.

కారణాలు లేకుండా

రైలులో అలారం చైన్ లాగితే జరిమానాలు

వన్‌టౌన్, ఫిబ్రవరి 6: కారణాలు లేకుండా రైలులో అలారం చైన్ లాగితే జరిమానాలు, శిక్షలు పడతాయని విజయవాడ రైల్వే డివిజన్ పౌర సంబంధాల అధికారిణి నుస్రత్ ఎం మండ్రుప్కర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరిలో నిర్వహించిన డ్రైవ్‌లో నమోదు చేసిన కేసుల వివరాలను తెలియచేశారు. జనవరిలో సహేతుకమైన కారణాలు లేకుండా అలారం చైన్‌ను లాగిన 112 మందిని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ అధికారులు అరెస్టు చేశారన్నారు. 1097 మంది నుంచి రూ. 6. 39 లక్షల జరిమానా వసూలు చేశారని తెలిపారు. ఇటువంటి సంఘటనలను నివారించేందుకు విస్తృతంగా ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కారణాలు లేకుండా అలారం చైన్‌ను లాగితే ఏడాది వరకు పొడిగించేందుకు అవకాశం ఉన్న జైలు శిక్ష, లేదా రూ. 1000 జరిమానా, లేదా రెండూ విధిస్తారని తెలిపారు. కారణం లేకుండా అలారం చైన్‌ను లాగినందువల్ల తోటి ప్రయాణికులకు ఇబ్బంది కరంగా ఉండడమే కాకుండా ఇతరత్రా రైలు రాకపోకలకు సంబంధించి కూడా ఇబ్బందులు ఏర్పడతాయని వివరించారు.



గగనంలో ప్రేమపక్షుల ప్రణయ గీతం



వరుణ్‌తేజ్ కథానాయకుడిగా రూపొందిన తెలుగు-హిందీ ద్విభాషా చిత్రం 'ఆపరేషన్ వాలెంటైన్'. భారత వైమానిక దళ వీరుల అలుపెరుగని పోరాటాన్ని, దేశాన్ని రక్షించడానికి వారు ఎదుర్కొంటున్న సవాళ్లను ఈ చిత్రంలో ఆవిష్కరించబోతున్నారు. మానుషి చిల్లర్ కథానాయిక. శక్తి ప్రతాప్ సింగ్ హడా దర్శకుడు. మార్చి 1న విడుదలవుతోంది. మంగళవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో చిత్రబృందం రెండో గీతాన్ని విడుదల చేసింది. 'గగనాల' అంటూ సాగే ఈ గీతంలో హీరో, హీరోయిన్ల మధ్య ప్రణయాన్ని ఆవిష్కరించారు. మిక్కీ జే మేయర్ స్వరపరిచిన ఈ రొమాంటిక్ గీతాన్ని అర్మాన్ మాలిక్ ఆలపించారు. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించారు. ఈ సందర్భంగా వరుణ్‌తేజ్ మాట్లాడుతూ "ఆపరేషన్ వాలెంటైన్' మరో స్థాయిలో ఉంటుంది. 130 కోట్ల మంది ప్రజలను తన కుటుంబంగా భావించే సైనికుల త్యాగాలను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ సినిమా చేశాం' అన్నారు. మానుషి చిల్లర్ మాట్లాడుతూ "ఆపరేషన్ వాలెంటైన్' అందరూ గర్వపడే అద్భుతమైన సినిమా' అని చెప్పారు.

ఊచకోతకు సిద్ధం



'అలాంటోడు మళ్లీ తిరిగొస్తున్నాడంటే...?' ఎలా ఉండబోతోందో చూసేందుకు డేట్ ఖరారైంది. పవన్ కల్యాణ్ కథానాయకుడిగా నటిస్తోన్న 'ఓజీ' చిత్రం విడుదల తేదీ అధికారికంగా ఖాయమైంది. సెప్టెంబర్ 27న ఈ చిత్రాన్ని విడుదలచేస్తున్నట్లు యూనిట్ ప్రకటించింది. ఈ విషయాన్ని ప్రకటిస్తూ మంగళవారం రిలీజ్ డేట్ పోస్టర్‌ను వదిలింది. ఇందులో పవన్ కల్యాణ్ టీ గ్లాస్ పట్టుకొని స్టైలిష్‌గా కనిపించారు. ముంబై-జపాన్ బ్యాక్‌డ్రాప్‌లో గ్యాంగ్‌స్టర్ కథాంశంతో ఈ చిత్రం తెరకెక్కుతోంది. 'సాహో' ఫేమ్ సుజీత్ దర్శకత్వం వహిస్తున్నారు. డి.వి.వి. దానయ్య నిర్మాత. బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ ప్రతినాయక పాత్ర పోషిస్తున్నారు. ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయిక. అర్జున్‌దాస్, శ్రియారెడ్డి, వెంకట్ కీలకపాత్రలు పోషిస్తున్నారు.

నిర్మాతగా గర్వపడుతున్నాను

అలియాభట్



హీరోయిన్‌గా తిరుగులేని స్టార్‌డమ్‌ను ఎంజాయ్ చేస్తున్నారు బాలీవుడ్ కథానాయిక అలియాభట్. ఓ వైపు సినిమాలతో తీరిక లేకుండా ఉన్నా నిర్మాతగానూ తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. తన అభిరుచి మేరకు వినూత్న కథలతో సినిమాలు, సిరీస్‌లు నిర్మిస్తున్నారు. ఆమె సహ నిర్మాతగా మారి నిర్మించిన వెబ్‌సిరీస్ 'పోచర్' ఈ నెల 23న ప్రముఖ ఓటీటీలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా అలియాభట్ మాట్లాడుతూ 'ఈ పుడమిపై జీవించే సమస్త జీవరాశిపై మానవులు దయ చూపించాలనే సందేశాన్ని 'పోచర్' సిరీస్ అందిస్తుంది. వన్యప్రాణుల పట్ల మృగాల్లా వ్యవహరించే శక్తుల గురించి ప్రజల్లో చైతన్యం కలిగిస్తుంది. ఇలాంటి మంచి ప్రాజెక్ట్‌లో నిర్మాతగా భాగమైనందుకు గర్వంగా ఉంది. దర్శకుడు రిచీ ఈ సిరీస్‌ను ఎంతో శ్రమకోర్చి అద్భుతంగా తెరకెక్కించారు' అని చెప్పారు. ఏనుగు దంతాలను స్మగ్లింగ్ చేసే ముఠాల నేపథ్యంలో కథ సాగుతుంది. ఇందులో నిమేషా సజయన్, రోషన్ మాథ్యూ ప్రధాన పాత్రలు పోషించారు.

ప్రపంచంలోని బూతులన్నీ మీర్జాపూర్‌లో ఉన్నాయి కదా!

యానిమల్‌పై విమర్శలకు సందీప్ రెడ్డి వంగా కౌంటర్







రణ్‌బీర్‌కపూర్ హీరోగా తెలుగు దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా తెరకెక్కించిన 'యానిమల్' చిత్రం బాక్సాఫీసు దగ్గర భారీ హిట్‌గా నిలిచిన విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా విడుదలైనప్పటి నుంచి వసూళ్లతోపాటు వివాదాలతోనూ వార్తల్లో నిలుస్తోంది. సినిమా ఫుల్ రన్ పూర్తయినా సోషల్ మీడియా వేదికగా ఇంకా పలువురు ప్రముఖులు 'యానిమల్'పై దుమ్మెత్తి పోస్తున్నారు. ఏదో ఒక ఇంటర్వ్యూ ఇస్తూ అందులో ఈ సినిమాపై తమ అభ్యంతరాలను, అసహనాన్ని వ్యక్తం చేయడం బాలీవుడ్ సెలబ్రిటీలకు పరిపాటిగా మారింది. అయితే సందీప్‌రెడ్డి వంగా కూడా ఏ మాత్రం తగ్గడం లేదు. తన ఇంటర్వ్యూల్లో విమర్శకులకు అదే స్థాయిలో బదులిస్తున్నారు. 'యానిమల్' లాంటి సినిమాలు సభ్య సమాజానికి ప్రమాదకరం' అంటూ రచయిత జావేద్ అక్తర్ చేసిన వ్యాఖ్యలకు సందీప్ ఘాటుగా బదులిస్తూ 'మీ కొడుకు ఫర్హాన్ అక్తర్ నిర్మించిన 'మీర్జాపూర్' వెబ్‌సిరీస్ మాటేమిటి' అని ప్రశ్నించారు. 'ప్రపంచంలో ఉన్న బూతులన్నీ అందులోనే ఉన్నాయి, ప్రచార చిత్రాలు చూస్తుంటేనే వాంతి వచ్చినట్లు అనిపించింది. ముందు మీ కొడుక్కి సంస్కారం నేర్పండి' అని స్పందించారు. మహిళలు శృంగారానికి మాత్రమే పనికొస్తారనేలా యానిమల్‌లో చూపించడాన్ని కంగన గతంలో తప్పుపట్టారు. పనిలో పనిగా కంగన వ్యాఖ్యలకు కూడా సందీప్ కౌంటర్ ఇచ్చారు. ఆమెకు సరిపోయే పాత్ర తన సినిమాలో ఉంటే తప్పకుండా అవకాశం ఇస్తానని వ్యంగ్యంగా బదులిచ్చారు. మీ సినిమాల్లో నాకు ఎలాంటి అవకాశం వద్దు, మీరు సినీ పరిశ్రమకు కావాలి అని కంగన బదులిచ్చారు. స్త్రీలపై వేధింపుల్ని ప్రోత్సహించేలా ఉందని అమీర్‌ఖాన్ మాజీ భార్య కిరణ్‌రావు గతంలో 'యానిమల్' సినిమాను పరోక్షంగా విమర్శించారు. 'ఆమె ఒకసారి అమీర్‌ఖాన్ నటించిన 'దిల్' సినిమా చూసిన తర్వాత మాట్లాడాలి' అని సందీప్ కోరారు. దాంతో "నా వ్యాఖ్యలు 'యానిమల్' సినిమా, సందీప్ గురించి కాదు, ఆయన అలా ఎందుకు అనుకున్నారో నాకు తెలియదు" అని సందీప్ విమర్శలపై కిరణ్‌రావు స్పందించడం గమనార్హం.

ముద్దు సీను.. లీగల్ నోటీసు!



సినిమాల్లో ఇప్పుడు ముద్దు సీన్లు కామన్ అయ్యాయి. తెలుగు సినిమాల్లో హీరోహీరోయిన్లు తెరపై తెగబడి లిప్ టు లిప్ కిస్సులు ఇచ్చుకుంటుంటే ఆడియన్స్ కూడా ఎంజాయ్ చేస్తున్నారు. 'ముద్దుకు లేదు హద్దు' అని సినిమా వాళ్లు అంటుంటే ఓకే ఓకే అంటూ సెన్సార్ బోర్డ్ కూడా సరిపుచ్చుకుంటోంది. అయితే ఇప్పుడు ఓ సినిమాలో ముద్దు చూసి ఒళ్లు మండిన ఓ మహిళ లీగల్ నోటీసు ఇవ్వడంతో ఆ వార్త వైరల్ అయింది. విషయం ఏమిటంటే ఇటీవల విడుదలైన 'ఫైటర్' చిత్రంలో హృతిక్ రోషన్, దీపికా పదుకోన్ జంటగా నటించారు. పనిలో పనిగా వీరిద్దరి మీద ఓ ముద్దు సీన్ కూడా గాఢంగా చిత్రీకరించారు దర్శకుడు. ఆడియన్స్ కూడా ఆ సీన్‌ని ఆస్వాదించేశారు. అయితే ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఆఫీసర్స్ గెటప్‌లో ఉండి ఇలా ముద్దు పెట్టుకోవడం చూసి ఆగ్రహించారు వింగ్ కమాండర్ సౌమ్య దీప్ దాస్. ఇలాంటి సన్నివేశం పెట్టడం ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌ని, అధికారులను అవమానించడమే అంటూ ఆమె మండిపడి దర్శకనిర్మాతలకు లీగల్ నోటీసు పంపించారు. దీనిపై చిత్ర యూనిట్ స్పందించాల్సి ఉంది.

'బేబి' సినిమాతో పోలిక లేదు



ఎస్‌కేఎన్

'బేబి' చిత్రంతో ఇండస్ట్రీ హిట్ అందుకొని మంచి జోరు మీదున్నారు నిర్మాత ఎస్‌కేఎన్. తాజాగా ఆయన తమిళ చిత్రం 'ట్రూ లవర్' హక్కులను సొంతం చేసుకున్నారు. దర్శకుడు మారుతితో కలసి తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ చిత్రంలో మణికందన్, శ్రీ గౌరీప్రియ, కన్నరవి లీడ్‌రోల్స్‌లో నటించారు. ప్రభురామ్ వ్యాస్ దర్శకత్వం వహించారు. ఈ నెల 10న 'ట్రూ లవర్' విడుదలవుతోంది. ఈ సందర్భంగా సినిమా విశేషాలను ఎస్‌కేఎన్ మీడియాతో పంచుకున్నారు.

- ఒక స్నేహితుడి ద్వారా 'ట్రూ లవర్' సినిమా గురించి తెలిసింది. మారుతితో కలసి సినిమా చూశా. ఇద్దరికీ నచ్చడంతో తెలుగులో విడుదల చేయాలనుకున్నాం.
- ఏ రిలేషన్‌కు అయినా నమ్మకమే పునాది. 'ట్రూ లవర్' సినిమాలో మెయిన్ పాయింట్ అదే. 'బేబీ' సినిమాతో 'ట్రూ లవర్'ను పోల్చలేం. సినిమా చూస్తున్నంతసేపు ప్రేక్షకులు పాత్రలతో అనుభూతి చెందుతారు. ఈ తరం యువతీ యువకులు ప్రేమలో ఎదుర్కొంటున్న సమస్యలను ఈ సినిమాలో దర్శకుడు చూపించారు. కొన్ని సీన్లు అద్భుతం అనిపించాయి. దర్శకుడు తను ఎంచుకున్న కథకు పూర్తి న్యాయం చేశాడు.
- మాది 'ఈగల్' చిత్రంతో పోటీపడగల సినిమా కాదు. చిన్న సినిమా. చాలా తక్కువ థియేటర్లలో విడుదలచేస్తున్నాం. అయినా అందరికీ ఆమోదయోగ్యంగా ఉండాలని 'ఈగల్' రిలీజైన మరుసటి రోజు థియేటర్లలోకి వస్తున్నాం.
- రాజా సాబ్ సినిమాను మారుతి దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తోంది. ఆ టీమ్‌లో నేనూ ఉన్నాను. ఆ సంస్థ మా ఫ్రెండ్లీ బ్యానర్ లాంటిదే. ప్రస్తుతం నిర్మాతగా నాలుగు చిత్రాలు చేస్తున్నా. మూడు యూత్ ఫుల్ లవ్‌స్టోరీస్. ఒకటి సైన్స్ ఫిక్షన్ జానర్‌లో ఉంటుంది. అలాగే అతీంద్రియ శక్తుల నేపథ్యంలో సాగే చిత్రం ఒకటి చేయాలనుంది. 'బేబీ' సినిమాను హిందీలో రీమేక్ చేస్తున్నాం. త్వరలో పూర్తి వివరాలు ప్రకటిస్తాం. నిర్మాతగా నేను ఇంకా ఓనమాలు దిద్దుతున్నాను. మరింత అనుభవం గడించాక అల్లు అర్జున్‌తో సినిమా చేస్తా.

విహార యాత్రకు వెళ్లినట్లుంది



రవితేజ కథానాయకుడిగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించిన చిత్రం 'ఈగల్'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజ విశ్వ ప్రసాద్ నిర్మించారు. ఈ నెల 9న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా రవితేజకు జోడీగా నటించిన కావ్యాథాపర్ మీడియాతో మాట్లాడారు.

- కార్తిక్ చెప్పిన కథ కొత్తగా, అద్భుతంగా అనిపించింది. హీరో రవితేజ కావడంతో తప్పకుండా 'ఈగల్' సినిమా చేయాలనుకున్నా. ఇందులో యాక్షన్, రొమాన్స్, లవ్ సరికొత్తగా ఉంటాయి. కచ్చితంగా ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారు. ఈ చిత్రంలో నా పాత్ర పేరు రచన. జీవితంలో తనకంటూ కొన్ని లక్ష్యాలు ఉంటాయి.
- రవితేజకు నేను పెద్ద అభిమానిని. ఆయన చాలా పాజిటివ్ ఎనర్జీతో ఉంటారు. సెట్స్‌లో ఉంటే సరదాగా ఉండేది. రవితేజతో పనిచేయడం మర్చిపోలేని అనుభూతి. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ లాంటి సంస్థలో అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను. సినిమాను చాలా గ్రాండ్‌గా నిర్మించారు.
- 'ఈగల్' షూటింగ్ పోలాండ్, లండన్‌లో ఎక్కువగా జరిగింది. విహార యాత్రలకు వెళ్లినట్లు అనిపించింది. చాలా ఎంజాయ్ చేశాను. ప్రస్తుతం 'డబుల్ ఇస్మార్ట్' షూటింగ్ జరుగుతోంది. భవిష్యత్‌లో మాస్, యాక్షన్ సినిమాలు చేయాలనుంది.

పన్నెండేళ్ల వైవాహిక బంధానికి వీడ్కోలు



సినీ దంపతులు ధర్మేంద్ర, హేమమాలినిల కుమార్తె ఈషా డియోల్ తన భర్త భరత్ తక్తాని నుంచి విడిపోతున్నారు. ఇక నుంచి తమ మార్గాలు వేర్వేరు అని ఇద్దరూ ఆంగ్ల మీడియాకు వెల్లడించారు. 'ఒకరి అభిప్రాయాలు మరొకరు గౌరవించుకుంటూ తీసుకున్న నిర్ణయం. దీని వల్ల మా ఇద్దరి పిల్లల భవిష్యత్ దెబ్బ తినకూడదు. ఆ విషయంలో పూర్తి జాగ్రత్త వహిస్తాం' అని చెప్పారు ఈషా, భరత్. తల్లి, తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ 2002లో హీరోయిన్‌గా చిత్ర రంగం ప్రవేశం చేసిన ఈష కొన్ని సినిమాల్లో నటించారు. ఆ సమయంలోనే వ్యాపారవేత్త భరత్ పరిచయం కావడంతో మనసులు కలసి కొంత కాలం ఆయనతో డేటింగ్ చేశారు. 2012 జూన్ 29న వీరిద్దరూ పెళ్లి చేసుకున్నారు. పెళ్లయిన పన్నెండేళ్లకు, ఇద్దరు పిల్లలు పుట్టిన తర్వాత ఈషా, భరత్ విడిపోవాలని నిర్ణయించుకున్నారు. ప్రేమించి పెళ్లి చేసుకున్న వీరిద్దరూ ఇలాంటి నిర్ణయం తీసుకోవడం బాలీవుడ్‌లో చర్చనీయాంశం అయింది. ఇటీవలే ఓటీటీ వేదికపైకి అడుగుపెట్టిన ఈషా నటిగా కొనసాగుతుందేమో చూడాలి.

హెల్తీ ఫుడ్

ఆ రెండింట్లో ఏది మేలు?

సబ్జా, షియా... ఈ రెండూ ఒకటేనా? ఏది ఎక్కువ ఆరోగ్యకరం? వీటిని ఎలా తీసుకోవాలి? ఇలా ఈ విత్తనాల గురించిన అనుమానాలు ఉన్నాయా? అయితే వీటి గురించి కొంత అవగాహన పెంచుకుందాం!

సబ్జా, షియా... ఈ రెండింట్లో సమాన పోషక విలువలుంటాయి. అధిక బరువు తగ్గాలి అనుకునేవాళ్లకు ఇవి రెండూ సూపర్ ఫుడ్స్! ఈ రెండింటినీ నీళ్లలో నానబెట్టి తీసుకోవచ్చు. అయితే చూడడానికి ఒకేలా ఉండడంతో రెండూ ఒకటేనని పొరపాటు పడుతూ ఉంటాం. అయినా ఫర్వాలేదు. పోషకాల పరంగా రెండూ ఉత్తమమైనవే! అయితే నీళ్లలో నానబెట్టే సమయాలు రెండిటికీ భిన్నంగా ఉంటాయి. మధ్య, దక్షిణ మెక్సికో నుంచి వచ్చిన షియా విత్తనాలలో పీచు, ఒమేగా - 3, ప్రొటీన్లు ఉంటాయి. మన దేశానికి చెందిన తులసి విత్తనాలైన సబ్జాలో ఛాతీలో మంట, శరీరంలోని టాక్సిన్లను తగ్గించే గుణాలుంటాయి. ఇక షియా విత్తనాలు నానడానికి కనీసం అరగంట సమయమైనా పడుతుంది. సబ్జా విత్తనాలు నీళ్లలో వేసిన క్షణాలలోపే నాని, ఉబ్బిపోతాయి. షియా విత్తనాలు నీళ్లలో నాని, బరువెక్కి, జెల్‌లాగా మారి పాత్ర అడుగుకు చేరుకుంటాయి. నానిన తర్వాత వాటి అసలు బరువుకు పదింతలు పెరుగుతాయి. సబ్జా విత్తనాలు నీళ్లలో క్షణాల్లో నానిపోయి, వాటి చుట్టూ పారదర్శక పొర ఏర్పడుతుంది.



ఇలా వాడుకోవాలి: షియా విత్తనాలను నానబెట్టి లేదా నానబెట్టకుండా నేరుగా కూడా తినవచ్చు. కానీ సబ్జా విత్తనాలను కచ్చితంగా నానబెట్టిన తర్వాతే తీసుకోవాలి. స్మూదీలు, మిల్క్‌షేక్స్‌లో షియా, సబ్జా రెండింటినీ కలుపుకుని తాగవచ్చు. సబ్జా విత్తనాలు లెమనేడ్స్, సలాడ్స్‌లో కూడా బాగుంటాయి.

బరువు తగ్గాలంటే: షియా, లేదా సబ్జా ఈ రెండింట్లో దేన్నైనా మధ్యాహ్న భోజనం లేదా రాత్రి భోజనానికి అర గంట ముందు నీళ్లలో నానబెట్టి తీసుకోవాలి. ఇలా తీసుకోవడం వల్ల కడుపు నిండుగా మారి, అతిగా తినే కోరిక తగ్గిపోతుంది.

వ్యాధినిరోధకశక్తి పెరగాలంటే

శరీరంలోని బ్యాక్టీరియా, వైరస్‌లాంటి వాటితో పోరాడాలంటే వ్యాధి నిరోధక శక్తి(ఇమ్యూనిటీ) అవసరం. ఇందుకోసం ఈ చిట్కాలు పాటిస్తే చాలు.

- కాలుష్యం బారిననుంచి తప్పించుకోవాలంటే చేతులు, కాళ్లు శుభ్రం చేసుకున్న తర్వాతనే ఆహార పదార్థాలు తినాలి. ముఖ్యంగా తిండి తినటానికి సరైన సమయం ఏర్పరచుకోవాలి. డైట్ పర్ఫెక్ట్‌గా ఉంటేనే జీర్ణ సంబంధ సమస్యలు వచ్చే అవకాశాలు తక్కువ. సరైన డైట్ పాటిస్తేనే ఇమ్యూనిటీ పెరుగుతుంది.



- ఇమ్యూనిటీ ఫుడ్ అంటే మాంసాహారం, చేపలు, ఆకుకూరలు, పండ్లు.. ఇవన్నీ తాజాగా ఉంటేనే తినాలి. అప్పుడే శరీరానికి పడుతుంది. తద్వారా ఇమ్యూనిటీ పెరుగుతుంది. ముఖ్యంగా సిట్రస్ పండ్లయిన నిమ్మ, ఉసిరి, నారింజలను తినాలి. వీటిలోని విటమిన్-సి వల్ల తెల్లరక్తకణాల ఉత్పత్తి పెరుగుతుంది. ఫ్రైడ్‌ఫుడ్‌ను మానేసి నట్స్ తినాలి. యాంటీ ఆక్సిడెంట్స్‌ను ఉత్పత్తి చేసే వెల్లుల్లి లాంటి వల్ల వాటి వల్ల ఇమ్యూనిటీ పెరుగుతుంది.
- కచ్చితంగా రోజుకు కనీసం ఆరేడు గంటల నిద్ర ఉండాలి. దీనివల్ల శరీరంలోని తెల్లరక్తకణాల సంఖ్య పెరుగుతుంది. శరీరాన్ని కాపాడగలిగే ఇమ్యూనిటీ మనకు వస్తుంది.
- ప్రకృతిలో గడపటం వల్ల ఆక్సీజన్ అందుతుంది. తద్వారా ఇమ్యూనిటీ పెరుగుతుంది. దీంతో పాటు ఒత్తిడి లేకుండా సంతోషంగా గడపటం వల్ల కూడా శరీరంలో తెలీకుండా ఇమ్యూనిటీ బూస్ట్ అవుతుంది. ఎక్కువగా నీళ్లు తాగటం.. తక్కువ చక్కెర తినటం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది.

అదిరిపోయే... అటాచ్డ్ దుపట్టా

ఫ్యాషన్




దుపట్టాలను విడిగా సింగారించుకునే రోజులు పోయాయి. జారిపోకుండా సర్దుకునే శ్రమ లేకుండా, డ్రస్‌కు కలిపి కుట్టినట్టుండే అటాచ్డ్ దుపట్టాలు తాజా ఫ్యాషన్ ట్రెండ్‌గా మారాయి. వాటి మీద ఓ లుక్కేద్దామా?

అన్ని సందర్భాల్లో...

అటాచ్డ్ దుపట్టాను కలిగి ఉన్న దుస్తులు మోడర్న్‌గా కనిపిస్తాయి కాబట్టి అవి కేవలం పార్టీ వేర్‌కే పరిమితం అనుకుంటే పొరపాటు. ఈ డ్రస్సులను పెళ్లి, పుట్టినరోజు వేడుకలు, ఈవినింగ్ పార్టీలకు కూడా ధరించవచ్చు. అయితే సాధారణ సందర్భాల్లో కాటన్‌తో తయారైన డ్రస్‌ను ఎంచుకోవాలి. ఇవి డైలీ వేర్‌కు కూడా బాగుంటాయి. వేడుకల కోసం ఫ్లాషీగా ఉండే డ్రస్‌ను ఎంచుకోవాలి.

అదనపు హంగుతో...

షరారాలు, గౌన్లు, చుడీదార్‌లు... వీటిలో దేన్నికైనా దుపట్టాను కలిపి కుడితే మరింత మోడర్న్‌గా కనిపించే డ్రస్ తయారవుతుంది. అటాచ్డ్ దుపట్టాలను కలిగి ఉండే డ్రస్సులన్నీ రెట్టింపు మోడర్న్ లుక్‌ను సంతరించుకోడానికి కారణం ఇదే! అయితే డ్రస్‌కు దానికి కలిపి కుట్టిన దుపట్టాకూ మధ్య కాంట్రాస్ట్ ఉండేలా చూసుకోవాలి. అదనపు హంగుల కోసం ఫ్రిల్స్, సెక్విన్ వర్క్ లాంటివి ఉండేలా చూసుకోవాలి.



యాక్సెసరీస్

హై హీల్స్, సింపుల్ జ్యువెలరీ, చిన్న హ్యాండ్ బ్యాగ్ ఈ దుస్తులకు మ్యాచ్ అవుతాయి. షరారాకు న్యూడ్ హీల్స్ ధరించాలి. ఫ్రాక్స్‌కు పెన్సిల్ హీల్, లాంగ్ గౌన్‌కు బ్లంట్ హీల్స్ బాగుంటాయి. నడుముకు బెల్ట్ కూడా చక్కగా మ్యాచ్ అవుతుంది.



న్యూస్‌మేకర్

పాప్ ప్రపంచపు రాణి



అమెరికా... లాస్‌ఏంజెలెస్ మహానగరం... 'క్రిప్టో డాట్ ఎరీనా' ప్రాంగణం. వెలిగిపోతున్న వేదికపైకి... ఆకాశంలో ఒక తారలా వచ్చి... తళుక్కుమన్నది టేలర్ స్విఫ్ట్. తెల్లని సిల్క్ గౌనులో... ముఖంపై పడుతున్న ముంగురులను పక్కకు నెట్టి... ప్రతిష్ఠాత్మక 'గ్రామీ అవార్డు' అందుకుంది. 'ఆల్బమ్ ఆఫ్ ది ఇయర్' పురస్కారాన్ని నాలుగోసారి గెలుచుకుని... ఈ ఘనత సాధించిన ఏకైక పాప్ స్టార్‌గా నిలిచింది. పద్నాలుగేళ్లకే పాటలు రాయడం మొదలుపెట్టిన టేలర్... గీత రచయితగా, పాప్ గాయనిగా మరపురాని విజయాలనెన్నిటినో అందుకుంది.

సంగీతంలో 'ఆస్కార్‌'గా భావించే 'గ్రామీ అవార్డు'ను అందుకున్నప్పుడు 34 ఏళ్ల టేలర్ స్విఫ్ట్ ఎంతో భావోద్వేగానికి లోనైంది. ఈ వేదికపై అవార్డును తీసుకోవడం ఆమెకు ఇదే మొదటిసారి కాదు. నాలుగోసారి. 'ఆల్బమ్ ఆఫ్ ది ఇయర్‌'గా తన పేరు ప్రకటించినప్పుడు... ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయింది. ఆహూతుల కరతాళ ధ్వనుల మధ్య.. పరుగున వెళ్లి అవార్డును అందుకుని, ముద్దాడింది. తన 'మిడ్‌నైట్స్' ఆల్బమ్‌కు ఈ పురస్కారం దక్కింది. మిలే సైరస్, బిల్లీ ఎలిష్, ఎమ్మా స్టోన్.. పాప్ ప్రపంచంలో మహామహులను వెనక్కు నెట్టి టేలర్ సాధించిన విజయం ఇది. 'నా హృదయాంతరాళం నుంచి చెబుతున్న మాట... ఇది నా జీవితంలోనే అత్యద్భుత ఘట్టం. నా కష్టానికి తగిన ఫలితం. మరింత ఉత్సాహంగా పని చేయడానికి ఈ అవార్డు ప్రేరణనిస్తుంది' అంటూ 'గ్రామీ' స్వీకరించిన అనంతరం టేలర్ తన సంతోషాన్ని పంచుకుంది. అమెరికాలోని పెన్సిల్‌వేయినాలో పుట్టిన టేలర్ అలిసన్ స్విఫ్ట్ తండ్రి.. స్కాట్ కింగ్స్‌లే ఒకప్పటి స్టాక్ బ్రోకర్. తల్లి అండ్రియా గార్డ్‌నర్ గృహిణి. ప్రముఖ అమెరికన్ గాయకుడు, పాటల రచయిత జేమ్స్ టేలర్ పేరునే టేలర్ స్విఫ్ట్‌కు పెట్టారు.

చదువుకొంటూనే...

తొమ్మిదేళ్లప్పుడే టేలర్‌కు పాటలపై మక్కువ కలిగింది. గాత్ర సంగీతం, నటనలో శిక్షణ కోసం తరచూ న్యూయార్క్ నగరానికి వెళ్లి వచ్చేది. షానియా ట్వైన్ పాటలతో ప్రేమలోపడ్డ ఆమె.. సంగీత సాధన మొదలుపెట్టింది. 'ఆరంభంలో స్థానికంగా నిర్వహించే ఈవెంట్స్‌లో పాడేదాన్ని. కొన్నాళ్లకు అర్థమైంది... సంగీతమే నా ప్రపంచం అని. అందులోనే కెరీర్ వెతుక్కొనే క్రమంలో అమ్మతో కలిసి నాష్‌విల్లే నగరానికి వెళ్లాను. అప్పుడు నాకు పదకొండేళ్లు. అక్కడి మ్యూజిక్ స్టూడియోలకు వెళ్లి, నేను పాడిన రికార్డులు కొన్ని ఇచ్చాను. వాళ్లకు నచ్చలేదు. ఎందుకంటే నగరంలో ఔత్సాహికులందరూ నాలానే ఎవరో పాడిన పాటలు పాడి వినిపిస్తున్నారు. ఇక వాటిల్లో కొత్తదనం ఏముంటుంది? నలుగురికీ భిన్నంగా, మనకంటూ ఏదో ఒక ప్రత్యేకత లేకపోతే ఈ రంగంలో రాణించలేమని అర్థమైంది. అయితే కొత్తగా ఏం చేయాలి? దీనికి సమాధానం వెతుక్కోవడం మొదలుపెట్టాను. వారాంతాలు స్టోన్‌హార్బర్, న్యూజెర్సీల్లో గడుపుతూ... అక్కడి కాఫీ షాపుల్లో పాటలు పాడేదాన్ని. పద్నాలుగేళ్ల వయసు వరకు అలానే గడిచిపోయింది' అంటూ ఓ సందర్భంలో తన బాల్యాన్ని గుర్తు చేసుకుంది టేలర్ స్విఫ్ట్. అయితే పన్నెండేళ్ల వయసులో మ్యుజీషియన్ రోనీ క్రైమర్ ఆమెకు గిటార్‌ను పరిచయం చేశారు. సొంతంగా పాటలు రాయడంలో కూడా తర్ఫీదునిచ్చారు. అలా 'లక్కీ యూ' పేరుతో తన మొదటి పాట రాసింది. చదువుకొంటూనే టేలర్ తన కెరీర్‌కు పునాదులు వేసుకుంది. స్కూల్‌లో రోజు ఎలా గడిచిందో స్పష్టంగా, ఆసక్తిగా రాయడం మొదలుపెట్టి, నైపుణ్యం పెంచుకుంది. గతంలో జాతీయ స్థాయి కవితల పోటీలో విజేతగా నిలిచింది.

పద్నాలుగేళ్లకే...

నైపుణ్యం సంపాదిస్తూ... తనను తాను నిరూపించుకొంటూ... ఆత్మవిశ్వాసంతో అడుగులు వేసింది టేలర్ స్విఫ్ట్. పద్నాలుగేళ్ల ప్రాయంలోనే 'బిగ్ మిషన్ రికార్డ్స్' కోసం ప్రొఫెషనల్ కెరీర్‌లో తొలి పాట రాసింది. జానపద సంగీతంతో తన ప్రయాణం ప్రారంభించింది. ఈ లేబుల్ కింద 2006లో 'టేలర్ స్విఫ్ట్' పేరిట మొదటి ఆల్బమ్ విడుదల చేసింది. తొలి వారంలోనే దాదాపు నలభై వేల కాపీలు అమ్ముడయ్యాయి. ఆ తరువాత 'సోనీ/ ఏటీవీ మ్యూజిక్ పబ్లిషింగ్ హౌస్‌'తో ఒప్పందం కుదుర్చుకుంది. ఆ సంస్థ నుంచి ఆల్బమ్ అందించిన అతి పిన్న వయస్కురాలిగా చరిత్ర సృష్టించింది. 2008లో విడుదల చేసిన 'ఫియర్‌లెస్' అత్యధికంగా అమ్ముడైన ఆల్బమ్స్‌లో ఒకటిగా నిలిచింది.

'గ్రామీ'ల వరుస...

ఇరవై ఏళ్ల వయసులో టేలర్ స్విఫ్ట్ మొదటిసారి 'గ్రామీ అవార్డు' (ఆల్బమ్ ఆఫ్ ది ఇయర్) గెలుచుకుంది. తద్వారా ఈ అవార్డు అందుకున్న అతి పిన్న కళాకారిణిగా చరిత్రను తిరగరాసింది. తాజాగా 'ఆల్బమ్ ఆఫ్ ది ఇయర్' కేటగిరీలో నాలుగోసారి 'గ్రామీ' దక్కించుకుని సరికొత్త రికార్డు నెలకొల్పింది. ఇది ఆమెకు ఎంతో ప్రత్యేకం. ఎందుకంటే అరుదైన నరాల సంబంధిత వ్యాధితో బాధపడుతున్న టేలర్.. ఇప్పుడిప్పుడే దాని నుంచి కోలుకుంటోంది. ఏడాది కిందట బయటపడ్డ ఈ వ్యాధి వల్ల తన షోస్ అన్నిటినీ ఆమె రద్దు చేసుకుంది. మళ్లీ 'గ్రామీ'తో గ్రాండ్ ఎంట్రీ ఇచ్చింది. ఇరవై ఏళ్ల కెరీర్‌లో టేలర్ స్విఫ్ట్ ఎన్నో ఆటుపోట్లు. అన్నిటినీ అధిగమించి నేను ఈ స్థాయిలో నిలబడింది. 'ఫోర్బ్స్ మ్యాగజైన్' అంచనా ప్రకారం ప్రస్తుతం ఆమె ఆస్తుల విలువ 1.1 బిలియన్ డాలర్లు. కేవలం తన పాటలు, ప్రదర్శనల ద్వారా వచ్చిన సంపాదన పరంగా



చూస్తే... ప్రపంచంలో బిలియనీర్ అయిన తొలి సంగీత కళాకారిణి. అంతేకాదు... అత్యధిక పారితోషికం తీసుకొంటున్న కళాకారిణిగా 2016లో 'గిన్నిస్ బుక్ రికార్డు'లకు కూడా టేలర్ పేరు ఎక్కింది. ఇవికాకుండా ఎన్నో సేవా కార్యక్రమాలను చేపట్టి.. సమాజాభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తోంది. 'మిడ్‌నైట్స్'తో 'గ్రామీ' గెలుచుకున్న టేలర్... ఏప్రిల్‌లో 'ది టార్చర్డ్ పోయట్స్ డిపార్ట్‌మెంట్' ఆల్బమ్ విడుదల చేయనున్నట్టు ప్రకటించింది.

విశేష ఆదరణ...

టేలర్ కెరీర్ గ్రాఫ్ 2009 నుంచి దూసుకుపోయింది. అవార్డులు ఆమెను వెతుక్కుంటూ వచ్చాయి. 'యూ బిలాంగ్ విత్ మీ'కి గానూ 'బెస్ట్ ఫిమేల్ వీడియో'గా ఎంటీవీ వీడియో మ్యూజిక్ అవార్డు స్విఫ్ట్‌ను వరించింది. 'కంట్రీ మ్యూజిక్ అసోసియేషన్' నుంచి 'ఎంటర్‌టైనర్ ఆఫ్ ది ఇయర్' అవార్డు తీసుకున్న అతిపిన్న పాప్ కళాకారిణిగా రికార్డులకు ఎక్కింది. 2010లో విడుదలైన 'స్పీక్ నౌ' ఆల్బమ్‌లోని పాటలన్నీ స్విఫ్ట్ రాసుకుంది. ఆసియా, ఐరోపా, ఆస్ట్రేలియా, ఉత్తర అమెరికాల్లోని ప్రముఖ నగరాల్లో ఏడాదికి పైగా ప్రదర్శనలు ఇచ్చింది. ఈ పర్యటనతో ప్రపంచ వ్యాప్తంగా ఆమెకు కోట్లాదిమంది అభిమానులయ్యారు. ఎక్కడికు వెళ్లినా బ్రహ్మరథం పట్టారు. అంతేకాదు... పాప్ సంగీత ప్రపంచంలో కీర్తి గడించిన జస్టిన్ బీబర్, సెలీనా గోమెజ్, నిక్కీ మినాజ్, బాబ్, ఉషర్, ఆండీ గ్రామర్ లాంటి ప్రముఖుల నుంచి 'తమ షోలో కనిపించాలని' ఆహ్వానం అందింది. వారందరితో కలిసి ఎన్నో వేదికల్లో మెరిసిన టేలర్... అద్భుతమైన గీత రచయితగా, పాప్ స్టార్‌గా మరింత ఎత్తుకు ఎదిగింది.

ప్రమాదాల్లో ప్రాణదాతగా...

"రోడ్డు ప్రమాదాల నివారణ కోసం భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నాం. ప్రచారం చేస్తున్నాం. కానీ దురదృష్టవశాత్తూ ప్రమాదం జరిగినప్పుడు... బాధితుల్ని సకాలంలో రక్షించే చైతన్యం, నైపుణ్యం మన సమాజంలో ఉందా?..." డాక్టర్ మాయా టాండన్‌ను వేధించిన ప్రశ్న ఇది. అందరికీ అవగాహన కల్పించడం ద్వారా ఆ ప్రశ్నకు తానే ఒక సమాధానంగా నిలిచారు. తన ముప్పయ్యేళ్ల కృషికి గుర్తింపుగా ఈ ఏడాది పద్మశ్రీ పురస్కారానికి ఎంపికయ్యారు.

"రోడ్డు ప్రమాదాల నివారణ కోసం భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నాం. ప్రచారం చేస్తున్నాం. కానీ దురదృష్టవశాత్తూ ప్రమాదం జరిగినప్పుడు... బాధితుల్ని సకాలంలో రక్షించే చైతన్యం, నైపుణ్యం మన సమాజంలో ఉందా?..." డాక్టర్ మాయా టాండన్‌ను వేధించిన ప్రశ్న ఇది. అందరికీ అవగాహన కల్పించడం ద్వారా ఆ ప్రశ్నకు తానే ఒక సమాధానంగా నిలిచారు. తన ముప్పయ్యేళ్ల కృషికి గుర్తింపుగా ఈ ఏడాది పద్మశ్రీ పురస్కారానికి ఎంపికయ్యారు.

"న్యూస్ పేపర్లలో, టీవీల్లో రోడ్డు ప్రమాదాల గురించి వార్తలులేని రోజంటూ ఉండదు. అలాంటి ప్రమాదాల్ని మనం కూడా చూస్తూ ఉంటాం. కానీ వాటిని పెద్దగా పట్టించుకోం. అదే ఆ బాధితుల స్థానంలో మన ఆత్మీయులుంటే? వారికి తొందరగా వైద్య సహాయం అందాలని ఆరాటపడతాం. అందరి విషయంలోనూ మన స్పందన ఇదే విధంగా ఉండాలి. అదే మానవత్వం" అంటారు డాక్టర్ మాయా టాండన్. ఆమె నేతృత్వంలోని 'సహాయత' సంస్థ ద్వారా శిక్షణ పొందిన వ్యక్తులు వేలాది మంది రోడ్డు ప్రమాద బాధితులకు ప్రాణదాతలుగా నిలుస్తున్నారు.

శిక్షణ కోసం 'సహాయత'

మాయ ప్రాథమిక విద్య రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో సాగింది. జైపూర్‌లో మెడిసిన్ పూర్తి చేసి, అక్కడే వైద్యురాలిగా వృత్తి జీవితం ప్రారంభించారు. జె.కె.లాన్ హాస్పిటల్‌లో సూపరింటెండెంట్‌గా పదవీ విరమణ చేశారు. వైద్యురాలిగా ఎన్నో ప్రాణాలను నిలబెట్టిన ఆమె సామాజిక కార్యక్రమాల్లోనూ చురుగ్గా ఉండేవారు. "రాజస్థాన్ పోలీస్ అకాడమీలో పోలీసుల కోసం 'అత్యవసర స్పందన' (ఎమర్జెన్సీ రెస్పాన్స్) మీద ఒక కార్యక్రమాన్ని 1994లో నిర్వహించాను. పోలీస్ అధికారులతో మాట్లాడుతున్నప్పుడు... ఈ అంశంపై మనకు తెలిసింది తక్కువేనని అర్థమయింది. నిజానికి ఇది ఏ ఒక్కరి వల్లనో అయ్యే పని కాదు. ప్రజలకు ప్రాథమిక శిక్షణ ఇచ్చినట్టయితే, ఎన్నో ప్రాణాలను కాపాడవచ్చనిపించింది" అని వివరించారు మాయ. అనంతరం తన మిత్రులతో చర్చించి... 'సహాయత' అనే సంస్థను నెలకొల్పారు. 1995లో పదవీవిరమణ చేసిన తరువాత... పూర్తి స్థాయిలో రహదారి భద్రతా శిక్షణకే అంకితమయ్యారు. ప్రమాదాల నివారణతో పాటు ప్రమాదాలు సంభవించినప్పుడు అత్యవసర చికిత్స అందించడంపై ప్రభుత్వ విభాగాల్లో, విద్యా సంస్థల్లో శిక్షణ ప్రారంభించారు. దానికోసం వైద్యులు, ఇతర నిపుణులతో బృందాలను ఏర్పాటు చేశారు. వారితో కలిసి రాజస్థాన్ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు, వాలంటీర్లకు, పౌరులకు శిక్షణ కార్యక్రమాలను ముప్పయ్యేళ్ళుగా నిర్వహిస్తున్నారు. "నేను నిర్వహించిన అతి పెద్ద శిక్షణ కార్యక్రమం... జైపూర్-ఢిల్లీ హైవేని ఆనుకొని నివసించే ప్రజల కోసం. అది ప్రమాదాలకు ప్రసిద్ధి చెందిన రహదారి. ఆ కార్యక్రమానికి మేము ఊహించనంత స్పందన వచ్చింది. వందలమంది శిక్షణ తీసుకున్నారు. కళ్ళెదుట ప్రమాదం జరిగి, వ్యక్తులు ప్రాణాపాయంతో ఉన్నా... వారికి ఎలా సహాయం అందించాలో చాలామందికి తెలీదు. మరోవైపు పోలీసు కేసుల్లో చిక్కుకుంటామనే బెదురు కూడా



ఉంటుంది. అలాగే బాధితులకు శరీరంలో వివిధ భాగాలకు గాయాలు తగిలినప్పుడు, ఊపిరి ఆడడం కష్టమైనప్పుడు, కాలిన గాయాలైనప్పుడు, మానసికమైన షాక్‌లో ఉన్నప్పుడు... స్వస్థత కలిగించడానికి అనుసరించవలసిన పద్ధతులు భిన్నంగా ఉంటాయి. ఈ అంశాను ప్రధానంగా నేర్పిస్తున్నాం. మా దగ్గర శిక్షణ పొందినవారు ప్రాణాలను కాపాడారన్న సమాచారం దాదాపు ప్రతిరోజూ మేము అందుకుంటున్నాం" అని చెబుతారు మాయా టాండన్.

ప్రమాదాలు జరిగినప్పుడు మొదటి గంట సమయాన్ని 'గోల్డెన్ అవర్' అంటారు. ఎవరైనా రోడ్డు ప్రమాదంలో చిక్కుకుంటే, ఆ బాధితుణ్ణి ఆసుపత్రికి తీసుకువెళ్ళే లోపు ఫస్ట్ ఎయిడ్ అందిస్తే వారి ప్రాణాలను నిలబెట్టవచ్చు.

తప్పనిసరి బోధనాంశం చెయ్యాలి...

'సహాయత' ద్వారా మాయ, ఆమె బృందం అందించే శిక్షణలో... సిపిఆర్, ప్రమాద స్థలాల్లో చేపట్టాల్సిన సహాయక చర్యల క్రమం, ప్రోటోకాల్స్, వైద్య బృందాలకు, పోలీసులకు సమాచారం అందించడం తదితర అంశాలు ప్రధానంగా ఉంటాయి. స్థానికులు సహాయం చేయలేని పరిస్థితుల్లో ఉన్నప్పుడు... తక్షణమే తమకుగానీ, దగ్గరలో ఉన్న ఆసుపత్రులకు కానీ సమాచారం అందించేలా ప్రజలకు చైతన్యాన్ని కలిగిస్తున్నారు. "ఇప్పుడు రాజస్థాన్ రాష్ట్ర వ్యాప్తంగా మా శిక్షణ కొనసాగిస్తున్నాం. ప్రమాదాలు జరిగినప్పుడు మొదటి గంట సమయాన్ని 'గోల్డెన్ అవర్' అంటారు. ఎవరైనా రోడ్డు ప్రమాదంలో చిక్కుకుంటే, ఆ బాధితుణ్ణి ఆసుపత్రికి తీసుకువెళ్ళే లోపు... తగిన విధంగా ఫస్ట్ ఎయిడ్ అందిస్తే... వారి ప్రాణాలను నిలబెట్టవచ్చు. అత్యవసర పరిస్థితుల్లో గుండెపై ఒత్తిడిని అప్లై చెయ్యడం, నోటి ద్వారా శ్వాసను అందించడం (సిపిఆర్) లాంటి చర్యలు ప్రధానం. అయితే గాయపడిన ప్రతి ఒక్కరికీ సిపిఆర్ అవసరం లేదు. బాధితుడికి గాయం ఎక్కడయిందో ముందుగా గమనించాలి. ఏవైనా భాగాలు బయటికి వస్తే, వాటిని తిరిగి లోపలికి పంపాలని ప్రయత్నించకూడదు. ఆ భాగాన్ని శుభ్రమైన వస్త్రంతో కప్పి, వెంటనే అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వాలి. అంబులెన్స్ రావడానికి సమయం పట్టేలా ఉంటే... దగ్గరలో ఉన్న ప్రభుత్వ లేదా ప్రైవేట్ ఆసుపత్రికి బాధితుణ్ణి తక్షణమే తరలించాలి. ఇటువంటి అనేక అంశాలను ప్రజలకు మేము వివరిస్తున్నాం. దేశవ్యాప్తంగా ఈ అంశాలపై ఉద్యమస్థాయిలో ప్రచారం జరగాలి. రోడ్డు ప్రమాదాలు ఎక్కడైనా జరగవచ్చు. ప్రతి పౌరుడికీ ప్రథమ చికిత్స తెలిసి ఉంటే... ఎన్నో ప్రాణాలను కాపాడవచ్చు" అని వివరించారామె. ముప్పయ్యేళ్ళ తన కృషికి ఎన్నో అవార్డులను, గౌరవాలను అందుకున్న 87 ఏళ్ళ మాయా టాండన్‌కు ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం 'పద్మశ్రీ' పురస్కారం ప్రకటించింది. "ఇది మా బాధ్యతను మరింత పెంచింది. ఈ గుర్తింపు సమష్టి కృషి ఫలితం. మనిషి పట్ల మరొక మనిషికి ఉన్న బాధ్యతను తెలుసుకొని... అత్యవసర సమయాల్లో ఆదుకోవాలనే తపనతో ఎందరో మాతో చేతులు కలిపారు. నా కుటుంబ సభ్యులు కూడా అండగా నిలిచారు. అందరికీ ధన్యవాదాలు" అంటున్నారు మాయ. ఆమె జాతీయ రహదారి భద్రతా మండలిలో సభ్యురాలుగానూ కొంతకాలం వ్యవహరించారు. "పాఠశాలల్లో 'అత్యవసర ప్రథమ చికిత్స'ను తప్పనిసరి బోధనాంశంగా చెయ్యాలి. ప్రభుత్వాలు ఈ దిశగా చర్యలు చేపట్టాలి" అనేది ఆమె విజ్ఞాపన.



డైనింగ్ రూల్స్

రెస్టారెంట్‌లో ఇలా

ఫ్యాన్సీ రెస్టారెంట్‌కి వెళ్లాలంటే డైనింగ్ నియమాలు తెలిసి ఉండడం అవసరం. ఆ నియమాలు ఇవే...

- టేబుల్ పైన ఫోన్, తాళాలు, పర్సు లాంటివి ఉంచకూడదు.
- ఆతిథ్యం ఇస్తున్నది మీరైతే ఒకడుగు ముందే బిల్ చెల్లించాలి.
- ఆర్డర్ చేసే అవకాశం అతిథికే ఇవ్వాలి.
- అందంగా తయారవడమూ ముఖ్యమే!
- వెయిటర్ మీద కోప్పడడం లాంటివి చేయకూడదు. సంభాషణ మృదువుగా సాగాలి.
- కలిసి వచ్చిన వ్యక్తి భోజనాన్ని రుచి చూడడం కోసం చేతులను టేబుల్ అవతలి వైపుకు చాపి పదార్థాలను అందుకోకూడదు.
- కంపానియన్ ఆర్డర్ చేసిన వాటి కంటే ఎక్కువ కోర్సులు ఆర్డర్ చేయకూడదు.
- సరిగా ఉడకని పదార్థాలను తిప్పి వెనక్కి పంపవచ్చు.
- న్యాప్కిన్‌ను ఒళ్లో ఉంచుకోవాలి.
- ప్రతిసారీ సాల్ట్, పెప్పర్‌లు రెండింటినీ కలిపి అందించాలి.





ఆరేళ్లలో రూ.5.56 లక్షల కోట్లు

- సహజవాయు రంగంలోకి పెట్టుబడులు
- వినియోగం 15 శాతానికి పెంచడం లక్ష్యం
- ఇండియా ఎనర్జీ వీక్ సదస్సులో ప్రధాని మోదీ

బెతుల్ (గోవా): ప్రపంచంలో శరవేగంగా వృద్ధి చెందుతున్న బడా ఆర్థిక వ్యవస్థగా అవతరించిన భారత్ అవసరాలు తీర్చేందుకు ఇంధన రంగంలోకి అసాధారణ స్థాయిలో పెట్టుబడులు వస్తున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఇందులో భాగంగా, వచ్చే 5-6 ఏళ్లలో సహజ వాయువు సరఫరా విభాగంలోకి 6,700 కోట్ల డాలర్ల (రూ.5.56 లక్షల కోట్ల పైమాటే) మేర పెట్టుబడులు రావచ్చన్నారు. మంగళవారం 'ఇండియా ఎనర్జీ వీక్ 2024' సదస్సు ప్రారంభ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. తమ ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు దేశీయంగా సహజ వాయువు ఉత్పత్తి పెరుగుదలకు దోహదపడుతున్నాయన్నారు. మొత్తం ఇంధన వినియోగంలో సహజ వాయువు వాటాను 2030 నాటికి 15 శాతానికి పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ప్రస్తుతం ఈ వాటా 6.3 శాతంగా ఉంది. 2070 నాటికి భారత్ కర్బన తటస్థ దేశంగా ఎదిగేందుకు సహజ వాయువు కీలక ఇంధనం కాగలదన్నారు. నేచురల్ గ్యాస్‌ను విద్యుత్, ఎరువుల ఉత్పత్తికి వినియోగించడంతో పాటు వాహనాల్లో ఉపయోగించే సీఎన్‌జీ, వంటకు ఉపయోగించే ఎల్‌పీజీగా మార్చవచ్చు. అంతేకాదు, బొగ్గు వంటి సంప్రదాయ ఇంధన వనరులతో పోలిస్తే ఇది తక్కువ కాలుష్యం విడుదల చేస్తుంది. ఈ సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఎక్సాన్ మొబిల్, బీపీ, ఖతార్ ఎనర్జీ, టోటల్ ఎనర్జీస్ వంటి 20 అంతర్జాతీయ ఆయిల్ అండ్ గ్యాస్ కంపెనీల సీఈఓలు, నిపుణులతో మోదీ సమావేశమయ్యారు. ఇంధన రంగంలో పరిస్థితులపై చర్చించడంతోపాటు భారత ఆయిల్ అండ్ గ్యాస్ సెక్టార్‌లో పెట్టుబడులు పెట్టాలని వారిని కోరారు.

వేదాంత రూ.33,220 కోట్ల పెట్టుబడులు

వచ్చే మూడేళ్లలో చమురు ఉత్పత్తిని రెట్టింపు చేసేందుకు 400 కోట్ల డాలర్ల (రూ.33,220 కోట్లు) పెట్టుబడులు పెట్టనున్నట్లు వేదాంత లిమిటెడ్ చైర్మన్ అనిల్ అగర్వాల్ తెలిపారు. ఈ గ్రూప్ కంపెనీ కెయిర్న్ ఎనర్జీ (గతంలో కెయిర్న్ ఎనర్జీ) వచ్చే మూడేళ్లలో రోజుకు 3 లక్షల బ్యారెళ్ల (ఏడాదికి 1.5 కోట్ల టన్నులు) ఆయిల్ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుందని ఇండియా ఎనర్జీ వీక్‌లో అనిల్ అగర్వాల్ వెల్లడించారు.

టాటా @ రూ.30 లక్షల కోట్లు



మార్కెట్ క్యాప్‌లో కొత్త రికార్డు • ఈ ఘనత సాధించిన ఏకైక గ్రూప్

ముంబై: స్టాక్ మార్కెట్ ర్యాలీ టాటా గ్రూప్ కంపెనీలకు బాగా కలిసి వచ్చింది. మంగళవారం మార్కెట్లో ఏర్పడిన రిలీఫ్ ర్యాలీతో టాటా గ్రూప్‌లోని లిస్టెడ్ కంపెనీలన్నింటి షేర్ల మార్కెట్ విలువ రూ.30 లక్షల కోట్లు దాటింది. దేశంలో మరే పారిశ్రామిక గ్రూప్ కంపెనీల మార్కెట్ క్యాప్ ప్రస్తుతం ఈ స్థాయిలో లేదు. ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ గ్రూప్ కంపెనీల మార్కెట్ క్యాప్ సైతం ప్రస్తుతం రూ.21.3 లక్షల కోట్లు మాత్రమే. టాటా గ్రూప్ ప్రధాన కంపెనీ టీసీఎస్ కూడా తొలిసారిగా రూ.15 లక్షల కోట్ల మార్కెట్ విలువను దాటింది. కంపెనీ షేర్లు మంగళవారం బీఎస్ఈలో 4.05 శాతం లాభంతో రూ.4,133.45 వద్ద ముగిశాయి. దీంతో కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.15,12,450.59 కోట్ల వద్ద స్థిరపడింది. టాటా గ్రూప్‌లోని మరో రెండు ప్రధాన కంపెనీలు టాటా మోటార్స్, టాటా స్టీల్ కంపెనీల షేర్లు కూడా మంగళవారం 52 వారాల గరిష్ఠ స్థాయి వద్ద ముగిశాయి.

లాభాలతో ముగిసిన సెన్సెక్స్

ఈక్విటీ మార్కెట్ మంగళవారం లాభాలతో ముగిసింది. సెన్సెక్స్ 454.67 పాయింట్ల లాభంతో 72,186.09 వద్ద, నిఫ్టీ 157.70 పాయింట్ల లాభంతో 21,929.49 వద్ద ముగిశాయి. టీసీఎస్, ఇన్ఫోసిస్ వంటి ఐటీ కంపెనీల షేర్లకు కొనుగోళ్ల మద్దతు, ఎఫ్‌పీఐల కొనుగోళ్లు, సానుకూల అంతర్జాతీయ సంకేతాలు ఇందుకు దోహదం చేశాయి. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల షేర్లలో 19 కంపెనీల షేర్లు లాభాలతో, 11 కంపెనీల షేర్లు నష్టాలతో ముగిశాయి. బ్యాంకింగ్, పవర్, యుటిలిటీస్ సూచీలు తప్ప, మిగతా అన్ని సూచీలు మంగళవారం లాభాలతో ముగిశాయి.

నేటి నుంచి మరో మూడు ఐపీఓలు

బుధవారం నుంచి మరో మూడు కంపెనీలు ఐపీఓకు వస్తున్నాయి. రాశి పెరిఫెరల్స్, జన స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, క్యాపిటల్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఈ ఐపీఓల ద్వారా రూ.1,700 కోట్లు సమీకరించనున్నాయి. ఇందులో రాశి పెరిఫెరల్స్ రూ.295-311, జన స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ రూ.393-414, క్యాపిటల్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ రూ.445-468 ధరల శ్రేణిలో ఐపీఓలు జారీ చేస్తున్నాయి.

9 నుంచి ఎంటిరో హెల్త్‌కేర్ ఐపీఓ: ఈ నెల 9 నుంచి ఎంటిరో హెల్త్‌కేర్ సొల్యూషన్స్ కంపెనీ ఐపీఓ ప్రారంభమవుతోంది. ఫిబ్రవరి 13న ముగిసే ఈ ఐపీఓ ద్వారా కంపెనీ రూ.1,600 కోట్లు సమీకరించనుంది. ఇందుకోసం ఒక్కో షేరును రూ.1,195-1,258 ధరల శ్రేణిలో జారీ చేస్తోంది. ఈ రూ.1,600 కోట్లలో రూ.1,000 కోట్లు కొత్తగా ఈక్విటీ షేర్లు జారీ చేయడం ద్వారా, మరో రూ.600 కోట్లు ఆఫర్ ఫర్ సేల్ కింద జారీ చేస్తోంది.

వ్యాన్‌బరీ ఎబిటా రికార్డు

ఫార్మా ఏపీఐ రంగంలోని వ్యాన్‌బరీ డిసెంబరు త్రైమాసికంలో రికార్డు స్థాయిలో ఎబిటా సాధించింది. డిసెంబరు 31తో ముగిసిన త్రైమాసికంలో రూ.22 కోట్లు, 9 నెలల కాలంలో రూ.54 కోట్లు ఎబిటా సాధించినట్టు కంపెనీ ప్రకటించింది. కాగా క్యు3లో రూ.146 కోట్ల అమ్మకాలపై రూ.10 కోట్ల నికరలాభం ఆర్జించినట్టు వెల్లడించింది. డిసెంబరు చివరి నాటికి రుణభారాన్ని కూడా రూ.608 కోట్ల నుంచి రూ.117 కోట్లకు తగ్గించుకున్నట్టు తెలిపింది.

అజాద్ ఇంజనీరింగ్ లాభం 49% వృద్ధి

అజాద్ ఇంజనీరింగ్ డిసెంబరు త్రైమాసికానికి రికార్డు ఫలితాలు సాధించింది. కంపెనీ త్రైమాసికాదాయం రూ.89.2 కోట్లుగా నమోదయింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.59.8 కోట్లతో పోల్చితే ఆదాయం 49 శాతం పెరిగింది. అలాగే లాభం ఏకంగా 339 శాతం పెరిగి రూ.రూ.3.83 కోట్ల నుంచి రూ.16.8 కోట్లకు పెరిగింది.

ఐసీఐసీఐ బ్యాంక్ ఈక్విటీలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు వాటా

న్యూఢిల్లీ: ఆరు ప్రధాన బ్యాంకుల ఈక్విటీలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ గ్రూప్ వాటా మరింత పెరగనుంది. ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, సూర్యోదయ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, బంధన్ బ్యాంక్, ఎస్ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్‌ల ఈక్విటీలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ గ్రూప్ వాటా ప్రస్తుత ఐదు శాతం నుంచి 9.5 శాతానికి పెంచుకునేందుకు ఆర్‌బీఐ అనుమతించింది. తన గ్రూప్ సంస్థలైన హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ, హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఈ వాటాలను కొనుగోలు చేయనుంది.

ఖతార్ నుంచి ఎల్‌ఎన్‌జీ దిగుమతి ఒప్పందం
మరో 20 ఏళ్లు పొడిగింపు

డీల్ విలువ రూ.6.48 లక్షల కోట్లు

భారత్‌కు రూ.50,000 కోట్ల ఆదా

ఖతార్ నుంచి ద్రవ రూప సహజ వాయువు(ఎల్‌ఎన్‌జీ) దిగుమతి ఒప్పందాన్ని భారత్ మరో 20 ఏళ్ల (2048 వరకు) పొడిగించుకుంది. ఈ పొడిగింపు డీల్ విలువ 7,800 కోట్ల డాలర్లు. మన కరెన్సీలో దాదాపు రూ.6.48 లక్షల కోట్లు. ఈ ఒప్పందంలో భాగంగా బ్రిటిష్ థర్మల్ యూనిట్ ఎల్‌ఎన్‌జీని ప్రస్తుత మార్కెట్ రేటు కంటే 0.8 డాలర్లు తక్కువకు భారత్ దిగుమతి చేసుకోనుంది. తద్వారా దేశానికి 20 ఏళ్లలో 600 కోట్ల డాలర్ల (దాదాపు రూ.50,000 కోట్లు) ఆదా కానుంది. దేశంలో అతిపెద్ద సహజవాయువు దిగుమతిదారైన పెట్రోనెట్ ఎల్‌ఎన్‌జీ లిమిటెడ్. ఖతార్ ఎనర్జీతో కుదుర్చుకున్న రెండు ఒప్పందాల ద్వారా ఏటా 85 లక్షల టన్నుల ఎల్‌ఎన్‌జీని దిగుమతి చేసుకుంటోంది. అందులో 75 లక్షల టన్నుల దిగుమతికి సంబంధించిన 25 ఏళ్ల కాంట్రాక్టు 2028తో ముగియనుంది. మరో పది లక్షల టన్నుల దిగుమతి ఒప్పందాన్ని 2015లో కుదుర్చుకుంది. కాగా, ఏటా 75 లక్షల టన్నుల ఎల్‌ఎన్‌జీ కొనుగోలు ఒప్పందాన్ని 2048 వరకు పొడిగించే ఒప్పందంపై రెండు కంపెనీలు మంగళవారం సంతకం చేశాయి.

సిగ్నిటీ కన్సాలిడేటెడ్ లాభం రూ.48 కోట్లు

హైదరాబాద్: సిగ్నిటీ టెక్నాలజీస్ కన్సాలిడేటెడ్ లాభం వర్తమాన ఆర్థిక సంవత్సరం డిసెంబరు త్రైమాసికంలో 9.4 శాతం వృద్ధితో రూ.468.02 కోట్లుగా నమోదయింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన ఆదాయం రూ.427.99 కోట్లు. కన్సాలిడేటెడ్ లాభం 3.2 శాతం వృద్ధితో రూ.46.55 కోట్ల నుంచి రూ.48.04 కోట్లకు పెరిగింది. ఇదే తేదీతో ముగిసిన తొమ్మిది నెలల కాలంలో కంపెనీ ఆదాయం 11.2 శాతం పెరిగి రూ.1222.61 కోట్ల నుంచి రూ.1359.37 కోట్లకు చేరగా లాభం 16.3 శాతం పెరిగి రూ.119.08 కోట్ల నుంచి రూ.138.46 కోట్లుగా నమోదయింది. ఎన్నో సవాళ్లను తట్టుకుని కూడా తాము మంచి ఆర్థిక ఫలితాలు సాధించినట్టు కంపెనీ సీఈఓ శ్రీకాంత్ చక్కిలం తెలిపారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	63,000 ▼	57,750 ▼	76,000 ▼
ముంబై	62,480 ▼	57,230 ▼	69,980 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

6వ తేదీ		విజయవాడ	546
హైదరాబాద్	545	విశాఖపట్నం	555
7వ తేదీ		వరంగల్	547
చిత్తూరు	583		
గోదావరి	546	డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	113	గోదావరి	115
వరంగల్	113	విజయవాడ	115
కరీంనగర్	113	గుంటూరు	119
మహబూబ్‌నగర్	113	ఒంగోలు	119
కర్నూలు	113	చిత్తూరు	126
విశాఖపట్నం	110		

రంగంలోకి ఈడీ, ఎఫ్ఐయూ!

పేటీఎంపై చర్యల వివరాలివ్వండి
ఆర్‌బీఐకి సూచన

న్యూఢిల్లీ: పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ (పీపీబీఎల్) వ్యవహారం నానాటికీ ముదురుతున్నట్టు కనిపిస్తోంది. ఆ వ్యవహారంలో దర్యాప్తు చేపట్టాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నిర్వహణలోని ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఎఫ్ఐయూ) భావిస్తున్నాయి. పీపీబీఎల్‌పై తీసుకున్న చర్యలకు సంబంధించిన వివరాల నివేదిక తమకు అందించాలని ఈడీ, ఎఫ్ఐయూ అధికారులు ఆర్‌బీఐని కోరారు. ఆ సమాచారం ఆధారంగా పేటీఎం పేమెంట్ బ్యాంక్ అక్రమ నగదు లావాదేవీలకు పాల్పడిందీ, లేనిదీ తెలుసుకుని కేసులు నమోదు చేయాలని ఈ రెండు సంస్థలు భావిస్తున్నాయంటున్నారు. చర్యల నివేదిక అందించినట్టయితే ఆ వ్యవహారంలో మరింత లోతైన దర్యాప్తు చేపట్టాలా అనే అంశం పరిశీలిస్తామని ఈడీ తెలిపింది. మనీలాండరింగ్ వ్యవహారంలో పేటీఎం సహా పలు ఆన్‌లైన్ పేమెంట్ వాలెట్లపై ఈడీ ఇప్పటికే దర్యాప్తు జరుపుతోంది. నివేదిక అందినట్టయితే తాజా దర్యాప్తు చేపట్టే అవకాశంతో పాటు ఇప్పటికే జరుపుతున్న దర్యాప్తులోనే తాజా అభియోగాలు జోడించే ఆస్కారం సైతం ఉన్నదని పరిశీలకులంటున్నారు. అలాగే మనీలాండరింగ్, నల్లధనం కేసులను పరిశీలించే అధికారం ఎఫ్ఐయూకి కూడా ఉంది. ఇదిలా ఉండగా ప్రస్తుత పరిస్థితి నుంచి బయటపడేందుకు పేటీఎం ప్రధాన ప్రమోటర్ విజయ్ శేఖర్ శర్మ మంగళవారం ఆర్‌బీఐ ఉన్నతాధికారులతో సమావేశమైనట్టు సమాచారం. అయితే ఈ భేటీపై పేటీఎం గానీ, ఆర్‌బీఐగానీ అధికారికంగా స్పందించలేదు.

చర్చలు నిజమే : హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్

వాలెట్ వ్యాపారాన్ని విక్రయించే విషయంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌తో చర్చలు జరుపుతున్నట్టు పీపీబీఎల్ తెలిసింది. బ్యాంకు సీనియర్ అధికారి ఒకరు ఈ విషయాన్ని ధ్రువీకరించారు. అయితే ఈ చర్చలు వ్యాలెట్ కొనుగోలు కోసమా లేక ఇతర అంశాలపైనా అనే విషయాన్ని ఆయన వెల్లడించలేదు. మరోవైపు పేటీఎం వ్యాలెట్ కొనుగోలు కోసం తాము ప్రయత్నిస్తున్నట్టు వచ్చిన వార్తలను జియో ఫైనాన్సియల్స్ తోసిపుచ్చింది.

ఆర్చరీలో శివానికి స్వర్ణం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): యూఎస్ఏ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో విజయవాడ యువ ఆర్చర్ చెరుకూరి డాలీ శివాని పసిడి పతకం కొల్లగొట్టింది. అమెరికాలోని లాస్‌వెగాస్‌లో జరిగిన ఈ పోటీల్లో అండర్-12 క్లబ్ రికర్వ్ కేటగిరీలో శివాని 600కు గాను 579 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచింది. యూత్ విభాగంలో వెంకట సాయి మణిదీప్ రెడ్డి 5వ స్థానంలో నిలిచాడు. వీరిని జాతీయ ఆర్చరీ సంఘం ఉపాధ్యక్షుడు సీహెచ్. సత్యనారాయణ అభినందించారు.

కెప్టెన్సీ నుంచి రోహిత్‌ను ఎందుకు తప్పించామంటే..

- ముంబై కోచ్ బౌచర్ వివరణ
- రోహిత్ భార్య రితిక కౌంటర్



కేప్‌టౌన్: ఇటీవల ఐపీఎల్ జట్టు ముంబై ఇండియన్స్ కెప్టెన్సీ బాధ్యతల నుంచి రోహిత్ శర్మను తప్పించడంపెను సంచలనమే అయింది. హిట్‌మ్యాన్ స్థానంలో హార్దిక్ పాండ్యాకు జట్టు పగ్గాలు అప్పగించిన సంగతి తెలిసిందే. అయితే, జట్టు నాయకత్వ మార్పుపై ముంబై కోచ్ మార్క్ బౌచర్ వివరణ ఇచ్చాడు. 'ఇది ఆటపరంగా తీసుకొన్న నిర్ణయం. జట్టు ప్రస్తుతం మార్పు దశలో ఉంది. ఫ్యాన్స్ ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలి. గత రెండు సీజన్లలో బ్యాటర్‌గా హిట్‌మ్యాన్ రాణించలేదు. నాయకత్వ బాధ్యతల నుంచి తప్పించడం వల్ల రోహిత్ మరింత స్వేచ్ఛగా ఆడే అవకాశం దక్కుతుంది. అందరం కలసి చర్చించిన తర్వాతనే ఈ నిర్ణయం తీసుకొన్నాం. ఆటకు సంబంధించినంత వరకు భావోద్వేగాలను పక్కనబెట్టాల'ని ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో బౌచర్ చెప్పాడు. పాండ్యా ఆడిన తొలి సీజన్‌లోనే గుజరాత్ టైటాన్స్‌ను విజేతగా నిలబెట్టాడు. నాయకుడిగా అతడిలో ఎంతో ప్రతిభ ఉందని బౌచర్ ప్రశంసించాడు. కాగా, బౌచర్ వివరణపై రోహిత్ భార్య రితిక కౌంటరిచ్చింది. 'ఈ నిర్ణయం వల్ల చాలా తప్పిదాలు జరిగాయ'ని ఆమె సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది.

కుర్రాళ్లు కేక

అండర్-19 వరల్డ్‌కప్

వరుసగా ఐదోసారి ఫైనల్‌కు భారత్

సెమీస్‌లో దక్షిణాఫ్రికాపై 2 వికెట్లతో గెలుపు

సచిన్, కెప్టెన్ ఉదయ్ సూపర్ ఇన్నింగ్స్

ఆరో టైటిల్‌పై కన్నేసిన భారత యువ క్రికెటర్లు అంచనాలకు తగ్గట్టే చెలరేగుతున్నారు. దక్షిణాఫ్రికాపై సెమీస్‌లో 32 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయినా.. ఒత్తిడిని తట్టుకుంటూ నిలిచి గెలిచారు. కెప్టెన్ ఉదయ్ సహరన్ ఫామ్ నిరూపించుకోగా.. సచిన్ దాస్ వరుసగా రెండో శతకాన్ని తృటిలో కోల్పోయాడు. అయితేనేం.. మెరుపు ఆటతో జట్టు అద్భుత విజయం సాధించేందుకు తోడ్పడ్డాడు. తద్వారా అండర్-19 వరల్డ్‌కప్‌లో వరుసగా ఆరో విజయంతో భారత్ తుది పోరుకు చేరింది.



సచిన్ దాస్ (96)

ఉదయ్ సహరన్ (81)

5 అండర్-19 ప్రపంచకప్‌లో భారత్ ఫైనల్ చేరడం ఓవరాల్‌గా ఇది తొమ్మిదోసారి. ఇక, రికార్డు స్థాయిలో ఐదుసార్లు విజేతగా నిలిచింది.

బెనోని: ఉత్కంఠభరితంగా సాగిన అండర్-19 వరల్డ్‌కప్ తొలి సెమీస్‌లో యువ భారత్ అదరగొట్టింది. ఓ దశలో ఓటమి తప్పదా? అనిపించినా.. సచిన్ దాస్ (95 బంతుల్లో 11 ఫోర్లు, 1 సిక్స్‌తో 96), కెప్టెన్ ఉదయ్ సహరన్ (124 బంతుల్లో 6 ఫోర్లతో 81) అసమాన ఆటతీరుతో అండగా నిలిచారు. ఫలితంగా.. మంగళవారం దక్షిణాఫ్రికాతో జరిగిన ఈ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత్ 2 వికెట్ల తేడాతో నెగ్గింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన సౌతాఫ్రికా 50 ఓవర్లలో 7 వికెట్లకు 244 పరుగులు చేసింది. ఓపెనర్ ప్రిటోరియస్ (76), రిచర్డ్ (64) అర్ధసెంచరీలు చేశారు. రాజ్ లింబానికి మూడు, ముషీర్‌కు రెండు వికెట్లు దక్కాయి. లక్ష్య ఛేదనలో భారత్ 48.5 ఓవర్లలో 8 వికెట్లకు 248 పరుగులు చేసి గెలిచింది. మఫాక, లూస్‌లకు మూడేసి వికెట్లు దక్కాయి. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా ఉదయ్ నిలిచాడు. ఆస్ట్రేలియా, పాకిస్థాన్ జట్ల మధ్య జరిగే రెండో సెమీఫైనల్ విజేతతో భారత్ ఈనెల 11న ఫైనల్ మ్యాచ్ ఆడనుంది.

32 రన్స్‌కే 4 వికెట్లు కోల్పోయినా..: 245 పరుగుల లక్ష్యం కోసం బరిలోకి దిగిన భారత్‌కు టోర్నీలో తొలిసారిగా గట్టిపోటీనే ఎదురైంది. ఇన్నింగ్స్ తొలి బంతికే ఓపెనర్ ఆదర్శ్ వికెట్‌ను కోల్పోయింది. ఆ తర్వాత పేసర్ లూస్ మరింతగా దెబ్బతీశాడు. భీకర ఫామ్‌లో ఉన్న ముషీర్ ఖాన్ (4)ను నాలుగో ఓవర్‌లో అవుట్ చేయగా, కాసేపటికే వరుస ఓవర్లలో అర్షిన్ (12), మోలియా (5)ల వికెట్లు పడగొట్టాడు. అప్పటికి జట్టు స్కోరు 32/4 మాత్రమే. ఈ దశలో జట్టుకు ఓటమి తప్పదా అనిపించింది. కానీ పరుగులు రావడం కష్టంగా మారిన ఈ పిచ్‌పై సచిన్ దాస్, ఉదయ్ సమయోచితంగా ఆడారు. ఉదయ్ నిదానంగా ఆడినా మరో ఎండ్‌లో సచిన్ చెలరేగాడు. చక్కటి సమయస్ఫూర్తితో రిస్కీ షాట్లకు వెళ్లకుండా ఈ జోడీ జట్టును విజయంవైపు నడిపించింది. 47 బంతుల్లోనే సచిన్ అర్ధసెంచరీ సాధించాడు. అయితే 40వ ఓవర్‌లో సిక్సర్ బాదిన తను సెంచరీకి అతి చేరువలో వచ్చాడు. కానీ మరో నాలుగు పరుగుల దూరంలో క్యాచ్ అవుట్‌గా వెనుదిరిగాడు. అప్పటికే ఐదో వికెట్‌కు 171 పరుగులు జత చేరడం విశేషం. ఇక విజయానికి మరో 19 పరుగుల దూరంలో అవనీశ్ (10), అభిషేక్ (0) అవుట్ కావడంతో ఉత్కంఠ పెరిగింది. అప్పటికి 16 బంతుల్లో 18 రన్స్ కావాల్సి ఉండగా చేతిలో మూడు వికెట్లున్నాయి. అయితే 48వ ఓవర్‌లో రాజ్ లింబాని (13 నాటౌట్) అలవోకగా సిక్సర్ బాదేసి ఒత్తిడి తగ్గించాడు. 12 బంతుల్లో 9 రన్స్ అవసరమైన వేళ 49వ ఓవర్‌లో ఉదయ్ ఫోర్ కొట్టి రనౌట్ కాగా, లింబాని మరో ఫోర్‌తో మ్యాచ్‌ను ముగించాడు.

సంక్షిప్త స్కోర్లు

దక్షిణాఫ్రికా: 50 ఓవర్లలో 244/7 (ప్రిటోరియస్ 76, రిచర్డ్ సెలెట్స్వేన్ 64; లింబాని 3/60, ముషీర్ ఖాన్ 2/43).

భారత్: 48.5 ఓవర్లలో 248/8. (సచిన్ దాస్ 96, ఉదయ్ 81; మఫాకా 3/32, లూస్ 3/37).

ఫుట్‌బాల్ ఫైనల్లో అమ్మాయిలు

శాఫ్ అండర్-19 చాంపియన్‌షిప్

ఢాకా: దక్షిణాసియా ఫుట్‌బాల్ సమాఖ్య (శాఫ్) అండర్-19 మహిళల చాంపియన్‌షిప్‌లో భారత జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. మంగళవారం ఇక్కడ జరిగిన తమ లీగ్ చివరి మ్యాచ్‌లో భారత్ 4-0 గోల్స్ తేడాతో నేపాల్‌ను చిత్తుచేసింది. నేహా (54వ, 80వ) రెండు గోల్స్‌తో చెలరేగగా.. రౌల్ (85వ), సిండీ (90+3వ) చెరో గోల్ చేశారు. గురువారం జరిగే టైటిల్ పోరులో డిఫెండింగ్ చాంపియన్, ఆతిథ్య బంగ్లాదేశ్‌తో భారత్ తలపడనుంది.

జూలైలో జింబాబ్వే టూర్‌కు టీమిండియా

హరారే: ఐదు టీ20ల సిరీస్ కోసం భారత ద్వితీయ శ్రేణి జట్టు జింబాబ్వేలో పర్యటించనుంది. టీ20 వరల్డ్‌కప్ ముగిసిన తర్వాత.. జూలై 6 నుంచి 14 వరకు ఈ ద్వైపాక్షిక సిరీస్‌ను షెడ్యూల్ చేసినట్టు జింబాబ్వే క్రికెట్ (జెడ్‌సీ) ప్రకటించింది. హరారే వేదికగా జూలై 6, 7, 10, 13, 14న మ్యాచ్‌లు జరుగుతాయని తెలిపింది. వీటిల్లో మూడో మ్యాచ్‌ను మాత్రమే డే/నైట్‌గా నిర్వహించనున్నారు.

జాతీయ హాకీ ఆటగాడు వరుణ్‌పై అత్యాచార ఆరోపణలు

పోక్సో చట్టం కింద కేసు నమోదు




బెంగళూరు: భారత హాకీ జట్టు ఆటగాడు, అర్జున అవార్డు గ్రహీత వరుణ్ కుమార్‌పై ఓ మహిళ లైంగిక వేధింపుల ఆరోపణలు చేసింది. వివాహం చేసుకుంటానని నమ్మించి మైనర్‌గా ఉన్నప్పుడే తనపై వరుణ్ పలుమార్లు అత్యాచారం చేశాడని సోమవారం బెంగళూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు పోక్సో చట్టం కింద వరుణ్‌పై కేసు నమోదు చేశారు. జలంధర్‌లో నివసిస్తున్న 28 ఏళ్ల వరుణ్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడని, అతడి కోసం గాలిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. 2018లో ఇన్‌స్టాగ్రామ్‌లో వరుణ్ పరిచయమైనప్పుడు ఆ యువతికి 17 ఏళ్లు. ఆ సమయంలో వరుణ్ స్థానిక సాయ్ సెంటర్‌లో శిక్షణ తీసుకుంటున్నాడని యువతి పేర్కొంది. టోక్యో ఒలింపిక్స్‌లో పాల్గొన్న భారత జట్టులో వరుణ్ స్టాండ్‌బై ప్లేయర్‌గా ఉన్నాడు. మరోవైపు ఎఫ్ఐహెచ్ ప్రొలీగ్‌లో ఆడేందుకు జాతీయ జట్టుతో పాటు వరుణ్ భువనేశ్వర్‌లోనే ఉన్నట్టు హాకీ ఇండియా వర్గాలు పేర్కొనడం గమనార్హం. 2017 నుంచి జాతీయ జట్టులో సభ్యునిగా ఉన్న వరుణ్.. టీమిండియా తరఫున 142 మ్యాచ్‌లు ఆడి 40 గోల్స్ చేశాడు.

కేన్ మరో శతకం

కివీస్ ఆధిక్యం 528 పరుగులు

సౌతాఫ్రికాతో తొలి టెస్టు



మౌంట్ మాంగనుయ్: కేన్ విలియమ్సన్ (109) రెండో ఇన్నింగ్స్‌లోనూ శతకంతో చెలరేగడంతో.. దక్షిణాఫ్రికాతో తొలి టెస్టులో ఆతిథ్య న్యూజిలాండ్ పట్టుబిగించింది. 349 పరుగుల భారీ ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన కివీస్ మూడో రోజు ఆట ముగిసేసరికి 179/4 స్కోరు చేసింది. డారెల్ మిచెల్ (11), బ్లండెల్ (5) క్రీజులో ఉన్నారు. నీల్ బ్రాండ్ 2 వికెట్లు పడగొట్టాడు. ప్రస్తుతం న్యూజిలాండ్ 528 పరుగుల భారీ ఆధిక్యంలో ఉంది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 80/4తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన సౌతాఫ్రికా 162 రన్స్‌కు కుప్పకూలింది. కేగన్ పీటర్సన్ (45) టాప్ స్కోరర్. హెన్రీ, శాంట్నర్ చెరో 3 వికెట్లు తీశారు. అయితే, ప్రత్యర్థిని ఫాలో ఆన్ ఆడించడానికి కివీస్ నిరాకరించింది. మొదటి ఇన్నింగ్స్‌లో కివీస్ 511 పరుగులు చేసింది. కాగా, తొలి ఇన్నింగ్స్‌లోనూ 118 రన్స్ చేసిన విలియమ్సన్.. ఓ టెస్టులో రెండు ఇన్నింగ్స్‌లోనూ సెంచరీలు చేసిన ఐదో కివీస్ ఆటగాడిగా రికార్డులకెక్కాడు.

ఆసీస్ క్లీన్‌స్వీప్

మూడో వన్డేలోనూ విండీస్ ఓటమి

కాన్‌బెర్రా: వెస్టిండీస్‌తో మూడు వన్డేల సిరీస్‌ను ఆస్ట్రేలియా 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. మంగళవారం జరిగిన ఆఖరిదైన మూడో వన్డేలో ఆసీస్ 8 వికెట్లతో విజయం సాధించింది. ముందుగా విండీస్ 24.1 ఓవర్లలో 86 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ అథనజె (32) మినహా అంతా విఫలమయ్యారు. జేవియర్ బార్ట్‌లెట్‌కు 4. మోరిస్, జంపాలకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో ఆసీస్ 6.5 ఓవర్లలోనే 2 వికెట్లకు 87 పరుగులు చేసి నెగ్గింది. ఓపెనర్లు జేక్ ఫ్రేజర్ (41), ఇన్‌గ్లిస్ (35 నాటౌట్) ఆకట్టుకున్నారు.

పీసీబీ చైర్మన్‌గా సయ్యద్ మోసిన్

లాహోర్: పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) పూర్తిస్థాయి చైర్మన్‌గా వెటరన్ పరిపాలకుడు సయ్యద్ మోసిన్ రజా నఖ్వీ నియమితులయ్యాడు. మంగళవారం ఇక్కడ జరిగిన బోర్డు ప్రత్యేక సమావేశంలో నఖ్వీని ఎన్నుకున్నారు. 45 ఏళ్ల నఖ్వీ మూడేళ్లపాటు ఆ పదవిలో కొనసాగనున్నాడు. నజామ్ సేథి, జకా అష్రాఫ్ ఇప్పటిదాకా బోర్డు తాత్కాలిక చైర్మన్‌లుగా వ్యవహరించిన సంగతి తెలిసిందే.

రేసులోనే తలైవాస్



న్యూఢిల్లీ: ప్రొ కబడ్డీ లీగ్‌లో తమిళ్ తలైవాస్ ప్లేఆఫ్ రేసు ఆశలు నిలబెట్టుకుంది. మంగళవారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో తలైవాస్ 32-25 స్కోరు తేడాతో యూపీ యోధాస్‌పై విజయం సాధించింది. స్టార్ రైడర్ నరేందర్ 'సూపర్ 10' సాధించి తలైవాస్ గెలుపులో కీలకపాత్ర పోషించాడు.

విండీస్ ఆల్‌రౌండర్ ఫాబియెన్ ఆలెన్‌పై దాడి



జొహాన్నెస్‌బర్గ్: వెస్టిండీస్ ఆల్‌రౌండర్ ఫాబియెన్ ఆలెన్‌ను దుండగులు తుపాకీతో బెదిరించి అతని వస్తువులను దోచుకెళ్లారు. ప్రస్తుతం అతడు దక్షిణాఫ్రికాలో జరుగుతున్న ఎస్ఏ20 లీగ్‌లో పార్ల్ రాయల్స్ తరఫున ఆడుతున్నాడు. గత నెల 25న జట్టు హోటల్ బయట ఆలెన్‌పై దాడి జరిగింది. ఈ ఘటనలో అతడి ఫోన్‌తో పాటు వ్యక్తిగత వస్తువులున్న బ్యాగ్‌ను దుండగులు లాక్కొని పరారయ్యారు. ఈ దాడితో ఆటగాళ్ల భద్రతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఆలెన్ సురక్షితంగానే ఉన్నట్టు జట్టు వర్గాలు పేర్కొన్నాయి.



నేడే ఓటాన్ అకౌంట్ బడ్జెట్

(మొదటి పేజీ తరువాయి)

వివరాలు ఉంటాయి. అందుకే బడ్జెట్ అంటే రాష్ట్ర ఆర్థిక స్థితిని ప్రతిబింబించే ఒక వాస్తవ సంఖ్య. కానీ, వైసీపీ హయాంలో బడ్జెట్ అంటే కేవలం ఒక ఫ్యాన్సీ నంబర్. జగన్ సర్కార్ బడ్జెట్ అంకెలు చూస్తుంటే, రాష్ట్ర ఆర్థిక స్థితిని కాకుండా న్యూమరాలజీ ప్రకారం బడ్జెట్ అంకెను ఓకే చేశారా అన్న అనుమానమైతే వస్తుంది. 2019-20లో రూ.2,27,974 కోట్లు, 2020-21లో రూ.2,24,789 కోట్లు, 2021-22లో రూ.2,29,779 కోట్లు , 2022-23లో రూ.2,56,256 కోట్లు, 2023-24లో రూ.2,79,279 కోట్లు బడ్జెట్ అంకెగా నిర్ణయించారు.

ఇలా నిర్ణయిస్తున్నారు..

ఆర్థిక శాఖ ఉద్యోగులు చెప్పే వివరాల ప్రకారం.. ఆర్థిక శాఖ కార్యదర్శులు ఇద్దరూ కలిసి ముందుగా ఒక నెంబర్ అనుకుంటారట. ఆ తర్వాత మరో ఇద్దరు కన్సల్టెంట్లను పిలిచి ఆ నెంబర్‌కు మ్యాచయ్యేలా కేటాయింపుల లెక్కలు వేయిస్తారంట. ఐదేళ్ల నుంచి ఇదే విధానం అమలవుతోంది. ఇలా ఆ నలుగురే బడ్జెట్ మొత్తం చూసుకుంటారు. మరి ఆర్థిక శాఖలోని ఉద్యోగులంతా ఏం చేస్తారు? జగన్ హయాంలో పనుల్లేవు కాబట్టి ఫైళ్ల తాకిడి కూడా తక్కువే. అయినప్పటికీ కనీసం బడ్జెట్ వైపు వీరెవరూ కన్నెత్తి కూడా చూడరు. ఎందుకంటే బడ్జెట్ సచివాలయంలో కాకుండా ఎక్కడో బయట ఆ ఇద్దరు కన్సల్టెంట్ల ఆధ్వర్యంలో తయారవుతుంది. ముందుగా కార్యదర్శులు నిర్ణయించిన నెంబర్‌కి మ్యాచయ్యేలా కేటాయింపులు జరుగుతుంటాయి. ఈ తంతు అయిపోయాక, మమ అనిపించడానికి బడ్జెట్ ప్రవేశపెట్టే ముందురోజు సచివాలయంలోని ఆర్థిక శాఖలో కార్యదర్శులు సమావేశం నిర్వహించి, మొక్కుబడిగా ముందు అనుకున్న నెంబర్‌ను ఓకే చేసి, వాటిని అర్ధరాత్రి ముద్రణకు పంపిస్తారు. ముద్రించిన బడ్జెట్ కాపీలు అర్ధరాత్రి తర్వాత సచివాలయానికి చేరుకుంటాయి. ఆర్థిక శాఖ ఉద్యోగులు చేయాల్సిన పని అప్పుడే మొదలవుతుంది. ఆ శాఖలోని పురుష ఉద్యోగులు రకరకాల బడ్జెట్ పుస్తకాలను కలిపి సెట్లుగా సిద్ధం చేస్తారు. మహిళా ఉద్యోగులు ఆ సెట్లను బ్యాగుల్లో సర్దుతారు. ఈ బ్యాగులనే ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు, అధికారులకు అందజేస్తారు. మొత్తం బడ్జెట్ తయారీలో ఆర్థిక శాఖ ఉద్యోగుల పాత్ర ఇదే.

రూ.45వేల కోట్ల అదనపు ప్రతిపాదనలు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి 10 నెలల్లో బడ్జెట్ కేటాయింపులు కాకుండా రూ.45,000 కోట్ల అదనపు ప్రతిపాదనలను ఆర్థికశాఖ ఓకే చేసింది. బడ్జెట్‌లో డొల్లతనానికి ఈ అంకెలే నిదర్శనం. బడ్జెట్ పక్కాగా రూపొందిస్తే అదనపు కేటాయింపుల అవసరం పెద్దగా ఉండదు. కానీ, ఈ ఐదేళ్ల నుంచి బడ్జెట్ పెట్టిన మరుసటిరోజు నుంచే అదనపు నిధుల కోసం ఆర్థికశాఖకు ఫైళ్లు వెల్లువెత్తుతున్నాయి. సీఎం జగన్ గొప్పగా చెప్పుకునే వలంటీర్లు, సెంటు భూమి లాంటి పథకాలను కూడా ఆయా సంవత్సరాల బడ్జెట్‌లో పెట్టలేదు. వాటిని అదనపు ప్రతిపాదనలుగా పంపించి నిధులు ఖర్చు చేశారు.



సీఎం కాన్వాయ్ అసెంబ్లీకి వెళ్తున్న సమయంలో అమరావతిలో రాజధాని రైతుల ధర్నా శిబిరం వద్దకు వెళ్తున్న మహిళలను నెట్టేస్తున్న పోలీసులు

పబ్లిక్ అకౌంట్లో మాయాజాలం

వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల నుంచి బడ్జెట్‌లో చూపిస్తున్న పబ్లిక్ అకౌంట్ నంబర్లకు, వాస్తవిక అంకెలకు ఏ మాత్రం పొంతన ఉండదు. బడ్జెట్ మొత్తమ్మీద ఎక్కువ మాయ జరిగేది ఇక్కడే. పబ్లిక్ అకౌంట్‌లో ఉద్యోగుల జీతాల నుంచి కట్ చేసే జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ లాంటి నిధులు ఉంటాయి. 2019-20లో దాదాపు రూ.10,000 కోట్లకు చేరువగా ఉన్న నిధి ఈ ఏడాది రూ.16,000కోట్లు దాటింది. ఈ డబ్బు మొత్తాన్ని ప్రభుత్వం వాడేసుకుంటుంది. దీన్ని అప్పు కింద పరిగణిస్తారు. కానీ, బడ్జెట్ పుస్తకాల్లో మాత్రం పబ్లిక్ అకౌంట్‌లో రూ.500 కోట్ల లోపుగానే ఉన్నట్టు చూపిస్తున్నారు. అంటే రూ.15,000కోట్ల వరకు అప్పును దాచేసి, పరిమితి లేకపోయినా ఆమేర కొత్త అప్పులు తెస్తున్నారు.

నిర్వహణ పేరిట భారీ ఖర్చు

బడ్జెట్‌లో మెయింటెనెన్స్ పేరుతో ప్రభుత్వం భారీగా ఖర్చు పెడుతోంది. కానీ, ఆ పనులు మాత్రం కంటికి కనిపించడం లేదు. రాష్ట్ర సచివాలయంలోని కార్యాలయాలు అపరిశుభ్రంగా ఉంటాయి. ఏసీలు పనిచేయవు. ఇంకా ఎన్నెన్నో సమస్యలు.. వాటి రిపైర్లకు అయ్యే బిల్లులను ప్రభుత్వం చెల్లించడం లేదు. అయినా మెయింటెనెన్స్ కింద జగన్ ప్రభుత్వం 2019-20లో రూ.547కోట్లు, 2020-21లో రూ.918 కోట్లు, 2021-22లో రూ.844 కోట్లు, 2022-23లో రూ.709 కోట్లు ఖర్చు చేసినట్టు గణాంకాలు చెబుతున్నాయి. అయినా ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి.

బడ్జెట్ మాయలు

ఈ ఖర్చు ఏ ఖాతాలో?

రూ. 1,04,607 కోట్లకు లెక్కల్లేవ్

నాన్ అసైన్డ్ హెడ్స్..వేటికీ కేటాయించని ఖాతాలు.. ఈ హెడ్ కింద ఏకంగా రూ.1,04,607 కోట్లు ఖర్చు పెట్టారు. ఖజానా నుంచి తీసిన రూపాయినైనా దేనికి ఖర్చు చేశారో చెప్పాలి. కనీసం బడ్జెట్ పుస్తకాల్లో అయినా రాయాలి. కానీ, వైసీపీ హయాంలో కొత్తగా వచ్చిన ఈ హెడ్‌కి సంబంధించి ఎక్కడా ఒక్క ఆధారం కూడా కనిపించదు. 2020-21లో రూ.3,266 కోట్లు, 2021-22లో రూ.20,854 కోట్లు, 2022-23లో రూ.40,487 కోట్లు, 2023-24లో డిసెంబరు నాటికి రూ.40,000 కోట్ల పైచిలుకు ఈ హెడ్ కింద ఖర్చు చేశారు. ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి ఇది మరింత పెరగొచ్చు కూడా. పేరు లేని ఈ ఖర్చుల గురించి ఏజీ కార్యాలయం అడిగినా ప్రభుత్వం సమాధానం చెప్పడం లేదు. ఖర్చు సక్రమమైనప్పుడు ఏ అవసరానికి వాడారో శాసన సభకు చెప్పి ఆమోదం తీసుకోవచ్చు. కనీసం ఏజీకైనా చెప్పుకోవచ్చు. అయినా నాన్ అసైన్డ్ పేరుతో ఎందుకు రహస్యంగా ఉంచుతున్నారో తెలియదు. సాధారణంగా రెవెన్యూ, క్యాపిటల్ అనే రెండు విభాగాల కింద ఖర్చులు చేస్తుంటారు. మరి ఈ రూ.1,04,607 కోట్లు ఏ విభాగం కిందకి వస్తాయో మరి.

లక్ష కోట్లు దాటిన అప్పులు

కొత్తగా మరో 4,000 కోట్ల రుణం

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జగన్ సర్కారు లక్ష కోట్లకు పైగా అప్పులు చేసింది. ఇందులో ప్రతి మంగళవారం రిజర్వ్ బ్యాంక్ ద్వారా తెస్తున్న అప్పులే రూ.66,000 కోట్లకు చేరుకున్నాయి. మంగళవారం ఆర్‌బీఐ నిర్వహించిన వేలంలో ప్రభుత్వం సెక్యూరిటీలు విక్రయించి రూ.4,000 కోట్ల అప్పు తెచ్చింది. వీటిపై 7.39 శాతం నుంచి 7.52 శాతం వరకు వడ్డీ పడింది. కాగా, రిటైర్డ్ ఉద్యోగుల్లో దాదాపు 90 శాతం మందికి పైగా ఈ నెల ఇంకా పెన్షన్లు అందలేదు. వీరి పింఛన్లకు ప్రతి నెలా దాదాపు రూ.1800 కోట్ల వరకు కావాలి. కానీ, మంగళవారం సాయంత్రం వరకు పెన్షనర్లకు చెల్లింపులు జరగలేదు.

ఓటాన్ అకౌంట్ కోసం కేబినెట్

రాష్ట్ర మంత్రివర్గం బుధవారం ఉదయం ఎనిమిది గంటలకు సమావేశం కానున్నది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో 2024-25 ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌కు కేబినెట్ ఆమోదం తెలుపుతుంది. మంత్రివర్గం ఆమోదం పొందిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను శాసనసభలో ఉదయం 11 గంటల 3 నిమిషాలకు ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి ప్రవేశపెడతారు.

చేతకాక.. చేయలేక!

(మొదటి పేజీ తరువాయి)

ఉండటం గమనార్హం. ఈ సందర్భంగా జగన్ అనేక అంశాలపై తనదైన శైలిలో, చిత్రవిచిత్రమైన వాదనలు చేశారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఇప్పటిదాకా... కేంద్రంతో ఒక్క అంశంపైనా పోరాడిందీ లేదు, గట్టిగా నిలదీసిందీ లేదు. ఢిల్లీ యాత్రల ద్వారా సాధించిందేమిటో ఎవరికీ తెలియదు. ప్రత్యేక హోదా నుంచి నిధుల సాధన దాకా అసెంబ్లీలో జగన్ చెప్పిందేమిటి... ఆయన అసలు వైఖరి, వాస్తవాలు ఏమిటి...



హోదాపై ఉత్తుత్తి బాధ

ముఖ్యమంత్రి: ప్రత్యేక హోదా ఎండమావిగా మారింది. హోదా అంశాన్ని చట్టంలో పెట్టించి ఉన్నా... కోర్టుల్లో దాన్ని సాధించుకునేవాళ్లం. అందుకే కేంద్రంలో ఏ పార్టీకీ పూర్తి మెజారిటీ రావొద్దని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం.

మాట మడత: విపక్షంలో జగన్ ఊరూరా 'హోదా' పేరుతో హోరెత్తించారు. కేంద్రం మెడలు వంచి హోదా సాధిస్తామన్నారు. కానీ... అధికారంలోకి రాగానే, మాట మడతేశారు. 'ఏం చేద్దాం... దేవుని దయ లేదు. కేంద్రంలో ఏర్పడిన ప్రభుత్వానికి మన అవసరం లేకుండా పోయింది' అని ముఖ్యమంత్రిగా తాను మాట్లాడిన తొలి (అదే చివరిది కూడా) ప్రెస్‌మీట్‌లోనే తేల్చేశారు. ఇప్పుడు మళ్లీ అదే మాట చెబుతుండటం గమనార్హం. రాష్ట్రానికి ప్రత్యేక హోదా రావాలంటే... కేంద్రంలో ఏ పార్టీకీ మెజారిటీ రాకూడదట! ఈ మాత్రానికి 'మెడలు వంచుతాం'... అనే బీరాలు ఎందుకు పలికినట్లు?

తమరేం చేస్తున్నట్లు?

ముఖ్యమంత్రి: చంద్రబాబు హయాంలో ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు కేంద్రం నుంచి వచ్చిన నిధులు... మా హయాంలో అందలేదు.

అడిగిందేదీ: ఆర్థిక సంఘం సిఫారసు మేరకు రాష్ట్రాలకు నిధులు ఇవ్వాల్సిందే. చంద్రబాబు ఎప్పుడు ఢిల్లీకి వెళ్లినా... రాష్ట్రానికి రావాల్సిన నిధుల గురించి అడిగి, సాధించుకునే వారు. నిబంధనల ప్రకారం నిధులు రాలేదని వాపోతున్న జగన్... వాటిని తెచ్చుకునేందుకు ఏం చేసినట్లు? కేంద్రం అడక్కముందే అన్ని అంశాలపైనా మద్దతిస్తున్న ఆయన... రాష్ట్ర ప్రయోజనాల కోసం ఏం సాధించినట్లు?

విశాఖను ఉద్ధరించారా?

ముఖ్యమంత్రి: రెవెన్యూ లోటుకు మూలకారణం మనకు హైదరాబాద్ లాంటి నగరం లేకపోవడమే. పెద్ద నగరం ఉంటే మన సంపద పెరుగుతుంది. అందుకే నేను పదేపదే విశాఖపట్నం అంటున్నాను.

ఏం చేసినట్లు: హైదరాబాద్‌లాంటి నగరం ఏపీకి లేదనే విషయం జగన్‌కు ఇప్పుడే గుర్తుకొచ్చినట్లుంది! పైగా... ఆయన పదేపదే 'విశాఖపట్నం' అంటున్నది అందుకేనట! మరి... విశాఖను ఉద్ధరించేందుకు ఈ ఐదేళ్లలో ఆయన చేసిందేమిటి? ఉన్న ఐటీ పరిశ్రమలను తరిమేయడం, కొత్తగా ఏమీ తేలేక పోవడం, రుషికొండకు గుండు కొట్టడం, పెట్టుబడిదారులు అటువైపు రాకుండా భయపెట్టడం... ఇదేనా విశాఖను ఉద్ధరించడం?

అప్పులపైనా తప్పుడు లెక్కలే!

ముఖ్యమంత్రి: విభజన నాటికి రూ.1.53 లక్షల కోట్లు అప్పు ఉంటే, చంద్రబాబు దిగిపోయే సమయానికి రూ.4.12 లక్షల కోట్లకు చేరింది. చంద్రబాబు హయాంలో అప్పులు 21.87 శాతం పెరుగుదల ఉంటే... మా ప్రభుత్వ హయాంలో అప్పుల పెరుగుదల కేవలం 12 శాతమే.

అసలు విషయం: 'అప్పుల పెరుగుదల శాతం' అంటూ జగన్ మళ్లీ మళ్లీ మాయ లెక్కలు చెప్పారు. ఆయన మాట ప్రకారమే చూసుకుంటే... చంద్రబాబు హయాంలో కొత్తగా చేసిన అప్పు... రూ.2.59 లక్షల కోట్లు. రాష్ట్ర విభజన నాటికి వచ్చిన వాటాతో కలిపితే అది 4.12 లక్షల కోట్లు! ఇక... జగన్ ఈ ఒక్క ఆర్థిక సంవత్సరంలోనే ఆర్బీఐ నుంచి మాత్రమే రూ.60వేలకోట్లకు పైగా అప్పు తెచ్చారు. మొత్తం ఐదేళ్లలో ఆర్బీఐ, కార్పొరేషన్లు, ఇతరత్రా మార్గాల్లో ఎడాపెడా అప్పులు తెచ్చారు. ఇది కాదని... భారీగా పెండింగ్ బిల్లులు! వెరసి... జగన్ హయాంలో రాష్ట్ర రుణ భారం దాదాపు రూ.10 లక్షల కోట్లకు చేరుకుంది. మరి... ఎవరు ఎక్కువ అప్పులు చేసినట్లు?

ఇదేనా పారదర్శకత?

ముఖ్యమంత్రి: 57 నెలల మన ప్రయాణంలో ఎక్కడా అవినీతికి తావివ్వలేదు. లంచాలు, వివక్ష లేకుండా పారదర్శక పాలన చేశాం.

అంతులేని గోప్యత: 'పారదర్శక' పాలన చేశామని జగన్ చెప్పడం పెద్ద జోక్! జీవోలను ప్రజలకు అందుబాటులో లేకుండా చేశారు. ఇసుక టెండర్లు ఎవరు దక్కించుకున్నారో, ఎవరు తవ్వుకుంటున్నారో పెద్ద మిస్టరీ. బ్రైటీస్ తవ్వకాలదీ అదే పరిస్థితి. అస్మదీయులైన కొందరికి మాత్రమే బిల్లుల చెల్లింపు! మద్యం పాలసీ మరో భారీ స్కామ్!

ఇవన్నీ చేసేశారా?

- ఇచ్చిన హామీల్లో 99% నెరవేర్చామని అసెంబ్లీ సాక్షిగా జగన్ చెప్పారు. మరి..ఇవన్నీ చేశారా!?
- 2020నాటికే పోలవరం పూర్తిచేస్తామన్నారుగా?
- ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ అన్నారుగా?
- పదివేల పోస్టులతో మెగా డీఎస్సీ... ఇచ్చేశారా?
- అధికారం చేపట్టిన వారం రోజుల్లోనే సీపీఎస్ రద్దు చేస్తానన్నారుగా?
- మద్య నిషేధం తెచ్చాకే ఓట్లు అడుగుతానన్నారుగా?
- కడప స్టీల్ ప్లాంట్ వచ్చేసిందా?
- అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేశారా?
- 'అధికారంలోనికి వస్తే.. విద్యుత్తుచార్జీలను పెంచం'...అన్నారుకదా!? మరి...తొమ్మిదిసార్లు చార్జీలు పెంచి, జనంపై 64వేలకోట్ల భారం వేయలేదా?



జగన్ ప్రభుత్వంలో సామాన్యులపై ధరల భారాన్ని నిరసిస్తూ అసెంబ్లీకి ర్యాలీగా వెళ్తున్న టీడీపీ ఎమ్మెల్యేలు

ధరలపై చర్చకు టీడీపీ పట్టు

- స్పీకర్ పోడియం వద్దకెళ్లి ఎమ్మెల్యేల నినాదాలు.. సస్పెన్షన్

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): నిత్యావసర ధరల పెరుగుదలపై చర్చ చేపట్టాలని టీడీపీ ఇచ్చిన వాయిదా తీర్మానం శాసనసభలో గందరగోళానికి దారితీసింది. పెరుగుతున్న ధరలపై చర్చ జరగాలని ప్రతిపక్షం పట్టుబట్టగా, సభాపతి తమ్మినేని సీతారాం తిరస్కరించారు. దీంతో టీడీపీ ఎమ్మెల్యేలు సభలో నిరసనకు దిగారు. అచ్చెన్నాయుడు మినహా అందరూ స్పీకర్ పోడియంపైకి వెళ్లి నినాదాలు చేశారు. ధరల పెరుగుదలపై ప్లకార్డులు ప్రదర్శించారు. కాగితాలు చించి పైకి విసిరేశారు. ఈ గందరగోళం మధ్యే న్యాయవాదుల సంక్షేమ నిధి సవరణ బిల్లుకు సభ ఆమోదం తెలిపింది. ఆ వెంటనే గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ చేపట్టారు. అయినా టీడీపీ ఎమ్మెల్యేలు నిరసన కొనసాగించారు. దీంతో సభను స్పీకర్ టీ విరామం కోసం వాయిదా వేశారు. వాయిదా అనంతరం కూడా టీడీపీ ఎమ్మెల్యేల నిరసన కొనసాగింది. ఈసారి ప్రతిపక్ష ఎమ్మెల్యేలు విజిల్స్ తీసుకొచ్చి ఊదారు. దీనిపై కొందరు అధికార పార్టీ ఎమ్మెల్యేలు అభ్యంతరం వ్యక్తం చేయగా 'మీకు సీటు ఉందో లేదో చూసుకోండి' అంటూ టీడీపీ ఎమ్మెల్యేలు ఎద్దేవా చేశారు. చివరకు స్పీకర్ పోడియం బల్లపై పెద్దగా చరచడంతో సభలో గందరగోళం నెలకొంది. ఆ వెంటనే టీడీపీ ఎమ్మెల్యేలను ఒకరోజుపాటు సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. అయినా వారంతా స్పీకర్ పోడియం మెట్లపై కూర్చోవడంతో మార్షల్స్ వారిని బలవంతంగా బయటకు తీసుకెళ్లారు. బయటకు వెళ్తూ 'స్పీకర్ గారూ మీకు సీటు ఉందా' అని టీడీపీ సభ్యులు వ్యాఖ్యానించారు. వారు నిరసన వ్యక్తం చేస్తున్న సమయంలో మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ... 'పేపర్లు చించి విసరడం స్పీకర్‌ను అవమానించడమే'నని అన్నారు. అలా రెచ్చగొట్టడం మర్యాద కాదని.. 'రెచ్చగొడుతున్నారు జాగ్రత్త' అని వ్యాఖ్యానించారు. ధైర్యం ఉంటే చర్చకు రావాలని, స్పీకర్ పోడియం వద్ద గేలి చేయడం సరికాదని టీజేఆర్ సుధాకర్‌బాబు అన్నారు. ఈ సందర్భంగా పోడియం వద్ద స్పీకర్ వినియోగించే బెల్‌ను వెలగపూడి మూడుసార్లు కొట్టడంతో తమ్మినేని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, ఆకాశాన్ని అంటుతున్న నిత్యావసర వస్తువుల ధరలపై అసెంబ్లీలో చర్చ చేపడితే తన బాగోతం బయటపడుతుందన్న భయంతోనే ముఖ్యమంత్రి తమను సస్పెండ్ చేయించారని టీడీపీ సభ్యులు మండిపడ్డారు. స్పీకర్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ, సీఎం చెప్పిందే వేదం అన్నట్లు సభను నడుపుతున్నారని ఆరోపించారు. సభ నుంచి సస్పెండ్ అయిన తర్వాత టీడీపీ సీనియర్ సభ్యుడు గోరంట్ల బుచ్చయ్య చౌదరి మీడియాతో మాట్లాడారు. 'అసెంబ్లీలో మాట్లాడకుండా ప్రతిపక్షం గొంతు ప్రభుత్వం నొక్కేస్తోంది. జగన్ 4 ఏళ్ల 10 నెలల పాలనలో టీడీపీ సభ్యులు అసెంబ్లీలో మాట్లాడటానికి ఎన్ని నిమిషాలు అవకాశమిచ్చారో స్పీకర్ చెప్పాలి' అని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ... జగన్ పాలనలో ప్రజలు ఏమీ కొనేట్టు, తినేట్టు లేదన్నారు.

ధరల పెరుగుదలపై టీడీపీ ప్రదర్శన

నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలపై అసెంబ్లీ వద్ద టీడీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మంగళవారం నిరసన తెలిపారు. టీడీపీ శాసనసభాపక్షం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రెండో రోజు అసెంబ్లీ సమావేశాలకు ప్రదర్శనగా తరలివచ్చారు. బైబై జగన్‌అంటూ టీడీపీ సభ్యులు నినాదాలు చేశారు. ధరలు, పన్నులు, చార్జీల భారంతో సామాన్యుడు విలవిల.. విద్యుత్, ఆర్టీసీ చార్జీల పెంపు, ప్రజలపై చెత్త పన్ను అని ప్లకార్డులు ప్రదర్శించారు.

గంటా రాజీనామా ఆమోదం: విశాఖపట్నం నార్త్ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు రాజీనామాను ఆమోదించినట్లు సభలో స్పీకర్ ప్రకటించారు.

మండలిలోనూ నిరసనలు

- చైర్మన్ తిరస్కరణతో టీడీపీ సభ్యుల వాకౌట్
- డీఎస్సీ పోస్టులపై పీడీఎఫ్ నిరసన

నిత్యావసరాల ధరలు, విద్యుత్, ఆర్టీసీ చార్జీలు పెంచి జగన్ సర్కార్ సామాన్యులపై భారం మోపిందంటూ టీడీపీ ఎమ్మెల్సీలు శాసనమండలిలో నిరసనలతో హోరెత్తించారు. బైబై జగన్ అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఉదయం సభ ప్రారంభంకాగానే నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలపై చర్చించాలంటూ టీడీపీ సభ్యులు వాయిదా తీర్మానాన్ని ఇచ్చారు. డీఎస్సీలో సీట్ల పెంపుపై చర్చించాలంటూ పీడీఎఫ్ ఎమ్మెల్సీలు వాయిదా తీర్మానాన్ని ఇచ్చారు. వీటిని తిరస్కరిస్తున్నట్టు చైర్మన్ ప్రకటించడంతో ప్రజా సమస్యలపై చర్చించేందుకు సమయం ఇవ్వాలని టీడీపీ సభ్యులు, డీఎస్సీ పోస్టులపై చర్చించాలంటూ పీడీఎఫ్ సభ్యులు తమ స్థానాల్లో నిల్చొని నిరసన తెలిపారు. వారి నిరసనల మధ్యే చైర్మన్ గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చను చేపట్టారు. దీంతో టీడీపీ ఎమ్మెల్సీలు ప్లకార్డులు పట్టుకుని వెల్‌లోకి వెళ్లి నిరసన కొనసాగించారు. ఆతర్వాత పోడియం వద్దకు వెళ్లి, నినాదాలతో సభను హోరెత్తించారు. దీంతో చైర్మన్ సభను వాయిదావేసి 10.58కి తిరిగి ప్రారంభించారు. టీడీపీ సభ్యులు నిరసన కొనసాగించి, సభ నుంచి వాకౌట్ చేసి, మళ్లీ తిరిగి వచ్చారు.

గవర్నర్‌తో అవాస్తవాలు చెప్పించారు: టీడీపీ

గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే చర్చ సందర్భంగా టీడీపీ సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వం గవర్నర్‌తోనూ అవాస్తవాలు చెప్పించిందని మండిపడ్డారు. అబద్ధాలు చెప్పించినందుకు గవర్నర్ కూడా బాధపడ్డారని బీటీ నాయుడు అన్నారు. రాజధాని, మద్య నిషేధం, మెగా డీఎస్సీ, రైతు ఆత్మహత్యలు, పోలవరం, జాబ్ క్యాలెండర్ తదితర సమస్యలను ఆయన ప్రస్తావించారు. జగన్ 730 హామీలు ఇచ్చి 28 మాత్రమే అమలు చేశారన్నారు. గండికోట నిర్వాసితులకు ఇంకా రూ.400 కోట్లు ఇవ్వాల్సి ఉండగా పూర్తిగా చెల్లించినట్లు గవర్నర్‌తో చెప్పించారని భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి అన్నారు. గవర్నర్ ప్రసంగంలో అభివృద్ధి ఎక్కడ అని పీడీఎఫ్ ఎమ్మెల్సీ లక్ష్మణరావు ప్రశ్నించారు. రాష్ట్రంలో రోడ్ల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. ప్రభుత్వం టోటల్ ఫెయిల్యూర్ అన్నారు. విలీనం పేరుతో ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేశారన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు వేల కోట్ల బకాయిలు చెల్లించలేదని ఐ.వెంకటేశ్వరరావు మండిపడ్డారు.

విద్యపై శ్వేతపత్రం ఇవ్వాలి: పీడీఎఫ్

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): విద్యారంగంపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. ఐదేళ్లలో ఒక్క టీచర్ పోస్టు భర్తీ చేయకుండా ఇప్పుడు 6,100 పోస్టులకు డీఎస్సీ అంటున్నారు. సీపీఎస్ రద్దు, సకాలంలో పీఆర్సీ, 11వ పీఆర్సీ బకాయిలు ఏమయ్యాయని ప్రశ్నించారు.

అవినీతిని నిరూపించాలి: దూలం

కైకలూరు నియోజకవర్గంలో అవినీతి జరిగిందనే విమర్శలను ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు తోసిపుచ్చారు. నామినేషన్ వేసే లోపు అవినీతిని నిరూపించుకోవచ్చని సవాల్ చేశారు. తనకు పార్టీ మారే ఆలోచన లేదని మడకశిర ఎమ్మెల్యే తిప్పేస్వామి స్పష్టం చేశారు. చంద్రబాబు, పెద్దిరెడ్డి చదువుకునే రోజుల్లో తనకు సమకాలికులని వివరించారు. కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ మాట్లాడుతూ... తాను అసంతృప్తితో ఉన్నానన్న మాట వాస్తవం కాదని చెప్పారు. శాసనసభలో టీడీపీ ఎమ్మెల్యేల తీరు ఆక్షేపణీయంగా ఉందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. టీడీపీ సభ్యులు అసెంబ్లీలో గొడవ సృష్టించి, సభ నుంచి వాకౌట్ చేస్తున్నారని వైసీపీ ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ఆరోపించారు.

ఇంతలోనే ఎంత తేడా!

గత బడ్జెట్ భేటీలో దూకుడుగా వైసీపీ ఎమ్మెల్యేలు
స్పీకర్ పోడియంపైకెళ్లి టీడీపీ ఎమ్మెల్యేలపై దాడి

- పది నెలల్లోనే పూర్తిగా సీన్ రివర్స్
- టీడీపీ సభ్యులు పోడియం ఎక్కినా మౌనం
- సంబంధం లేదన్నట్టుగా వైసీపీ ఎమ్మెల్యేలు

అమరావతి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఉండరు అనే నానుడి నిజమేనని వైసీపీ ఎమ్మెల్యేలు నిరూపిస్తున్నారు. సరిగ్గా ఏడాది కాలంలో వారి వ్యవహారశైలిలో వచ్చిన మార్పే ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణగా కనిపిస్తోంది. గతేడాది మార్చిలో జరిగిన బడ్జెట్ సమావేశాల్లో స్పీకర్‌పై ఈగ వాలినా ఊరుకోం అన్నట్టు వ్యవహరించిన అధికార పార్టీ ఎమ్మెల్యేలు....ఈసారి ఎందుకో మౌనం దాల్చారు. అప్పట్లో స్పీకర్ పోడియం ఎక్కిన టీడీపీ ఎమ్మెల్యేలను ఈడ్చిపడేసి భౌతిక దాడులకు దిగారు. ఇప్పుడు స్పీకర్ పోడియంపైకి విపక్ష సభ్యులు వెళ్తే తమకేం సంబంధం అన్నట్టు అధికార పార్టీకి చెందిన చాలామంది శాసనసభ్యులు మిన్నకుండిపోవడం చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల అనంతరం ఎవరు అధికారంలోకి వస్తారో...ఏం జరుగుతుందో....అన్న సందేహంలో వైసీపీ ఎమ్మెల్యేలు ఉన్నారని చెబుతున్నారు. అందువల్లే దూకుడుగా వ్యవహరించే నైజాన్ని విడిచిపెట్టారన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

తగ్గిన బలం.. ఓటమి భయం: వైసీపీ ఎమ్మెల్యేల్లో ఆకస్మాత్తుగా వచ్చిన మార్పుపై అనేక అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వైసీపీకి 151 మంది ఎమ్మెల్యేలు ఉన్నా వారిలో ఈసారి చాలా మందికి సీటు లేదని చెప్పడంతో వారంతా సభలో మౌనం దాల్చారు. కొందరు ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయడంతో వారు సభలో టీడీపీ వైపు చేరారు. ఇక చాలా మంది టికెట్ వస్తుందో రాదోనన్న సందేహంలో ఉన్నారు. ప్రభుత్వంపై వ్యతిరేకత దృష్ట్యా మళ్లీ వైసీపీ అధికారంలోకి రాదేమోనన్న సందేహాలూ ఉన్నాయి. ఇప్పుడు గొడవలు పెట్టుకుంటే రేపటి రోజున ఇబ్బందులు పడతామనే వైసీపీ ఎమ్మెల్యేలు మౌనం దాల్చారని అంటున్నారు.

అప్పుడలా...


గతేడాది మార్చి 20న జీవో నంబరు 1ను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ టీడీపీ ఎమ్మెల్యేలు స్పీకర్ పోడియంపైకి వెళ్లి నినాదాలు చేశారు. ఈ క్రమంలో టీడీపీ ఎమ్మెల్యే డోలా బాలవీరాంజనేయస్వామి.... స్పీకర్‌కు అడ్డుగా ప్లకార్డు పెట్టారు. చింతలపూడి ఎమ్మెల్యే ఎలీజా అక్కడకు వెళ్లి...డోలాను లాగే ప్రయత్నం చేశారు. ఆ వెంటనే సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు వెళ్లి....డోలాపై దాడికి దిగారు. కడుపులో గుద్దడంతో డోలా కింద పడిపోయారు. ఈ ఘటన చూసి నిర్ఘాంతపోయిన స్పీకర్ తమ్మినేని సీతారాం....సభను వాయిదా కూడా వేయకుండానే ఆయన చాంబర్‌లోకి వెళ్లిపోయారు. వాయిదా తర్వాత సభ మరింత రణరంగంగా మారింది. విపక్ష ఎమ్మెల్యేలను కొట్టేందుకు అధికార పార్టీ ఎమ్మెల్యేలు వారిపైకి దూసుకెళ్లారు. అప్పట్లో ఆ ఘటన మొత్తం సభను స్తంభింపజేసింది.

ఇప్పుడిలా..

మంగళవారం సభలో నిత్యావసరాల ధరల పెరుగుదలపై చర్చకు టీడీపీ డిమాండ్ చేసింది. దానిని స్పీకర్ తిరస్కరించడంతో పోడియం పైకి వెళ్లి నినాదాలు చేశారు. ప్లకార్డులు ప్రదర్శించారు. పేపర్లు చించి పైకి విసిరారు. అనంతరం సభలో విజిల్స్‌తోనూ నిరసన వ్యక్తంచేశారు. స్పీకర్‌కు రెండువైపులా చేరి నిరసన తెలిపారు. అయితే, ఇదంతా అధికార పార్టీ ఎమ్మెల్యేలు కేవలం చూస్తూ కూర్చున్నారు. మంత్రి అంబటి రాంబాబు, టీజేఆర్ సుధాకర్‌బాబు, బియ్యపు మధుసూదన్‌రెడ్డి మినహా ఎవరూ దాన్ని పెద్దగా ఖండించలేదు. ఆ సమయంలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ జరుగుతోంది. అందులోభాగంగా మాట్లాడుతున్న సుధాకర్‌బాబు విపక్ష సభ్యుల చర్యను ఖండించారు. గతంలో ఇలాంటి వ్యవహారంలోనే దాడికి దిగే స్థాయికి వెళ్లిన ఆయన ఈసారి నాలుగు మాటలతో సరిపెట్టారు. అప్పట్లో ఇలాంటి నిరసనలు జరిగినప్పుడు ఖండించేందుకు మంత్రులు పోటీపడేవారు. కానీ మంగళవారం అంబటి తప్ప ఏ మంత్రీ మైకు కావాలని అడగలేదు.

'చలో అసెంబ్లీ'పై ఉక్కుపాదం

(మొదటి పేజీ తరువాయి)



శాసనసభ సమీపంలోని పోలీసు స్టేషన్ వద్ద చలో అసెంబ్లీకి వచ్చిన సర్పంచులను అరెస్టు చేస్తున్న పోలీసులు

చేయాలంటూ మంగళవారం సర్పంచ్‌లు తలపెట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తలకు దారితీసింది. రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం చలో అసెంబ్లీకి పిలుపునివ్వడంతో అన్ని జిల్లాల్లో పోలీసులు ముందుగానే సర్పంచ్‌లను అరెస్ట్ చేసి, నిర్బంధించారు. అయినా ఉమ్మడి పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు చెందిన కొందరు సర్పంచ్‌లు వెలగపూడిలోని అసెంబ్లీ వరకు వచ్చారు. 14, 15 ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిందని, వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, 'వుయ్ వాంట్ జస్టిస్' అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. 'సీఎం డౌన్, డౌన్' అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. మహిళా సర్పంచ్‌లు అసెంబ్లీ గేటు ముందు రోడ్డు మీద బైఠాయించారు. ఈ క్రమంలో పోలీసులు, సర్పంచ్‌లకు మధ్య తోపులాట జరిగింది. పలువురు సర్పంచ్‌లు కింద పడిపోగా రక్తగాయాలయ్యాయి. తమ ఆవేదన, నిరసన తెలియజేయనివ్వాలని పలువురు సర్పంచ్‌లు పోలీసుల కాళ్లు పట్టుకున్నారు. అయినా వారిని బలవంతంగా అరెస్టు చేసి, వ్యాన్లలో కుక్కి వివిధ స్టేషన్లకు తరలించారు. ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్‌ను కృష్ణా జిల్లా ఉయ్యూరులో మంగళవారం గృహనిర్బంధం చేశారు. ప్రకాశం జిల్లాలో 60 మందికిపైగా సర్పంచ్‌లకు సోమవారమే నోటీసులు ఇచ్చారు. ఆర్టీసీ బస్సుల్లో విజయవాడ వెళ్తున్న కొందరిని మార్టూరు సమీపంలోని టోల్‌గేట్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. రాజధానిలోని మందడం రైతుల ధర్నా శిబిరం వద్ద నిరసనకు సిద్ధంగా ఉన్న కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల సర్పంచ్‌లను పోలీసులు గుర్తించి అరెస్టు చేశారు.

సత్తా చూపుతాం!

అసెంబ్లీ ముట్టడికి ముందు పలువురు సర్పంచ్‌లు మాట్లాడుతూ 14, 15 వ ఆర్థిక సంఘం నిధులను దారి మళ్లించి పని చేసే అవకాశం లేకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'సీఎం జగన్‌రెడ్డి మా విధులు, నిధులను అపహరించారు.. సేవ చేస్తామనే భావనతో ఓట్లు వేసి జనం ఎన్నుకున్నారు.. అయితే వైసీపీ ప్రభుత్వం మమ్మల్ని కనీసం మనుషులుగా కూడా గుర్తించడంలేదు' అంటూ వివిధ జిల్లాలకు చెందిన సర్పంచ్‌లు ధ్వజమెత్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు తిరిగి పంచాయతీలకు జమ చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే మరో రెండు నెలల్లో గ్రామాల్లో తమ సత్తా ఏంటో ఈ ప్రభుత్వానికి రుచిచూపిస్తామని హెచ్చరించారు.

సర్పంచుల అరెస్టు దుర్మార్గం: పురందేశ్వరి

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పల్లె ప్రజల ఇబ్బందుల్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించిన సర్పంచ్‌లను అరెస్టు చేయడం దుర్మార్గమని, జగన్ ప్రభుత్వ నియంతృత్వ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి మండిపడ్డారు. 'చలో అసెంబ్లీ' కార్యక్రమాన్ని పోలీసులు భగ్నం చేయడం దుర్మార్గమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఖండించారు.



కృష్ణా జిల్లా అవనిగడ్డ ప్రధాన సెంటర్‌లో రాస్తారోకో చేస్తున్న నిరుద్యోగులు

మెగా డీఎస్సీ ప్రకటించాల్సిందే

- అవనిగడ్డలో రోడ్డెక్కిన నిరుద్యోగులు
- డీఎస్సీ శిక్షణార్థుల నిరసన దీక్ష రాస్తారోకో.. టీడీపీ, జనసేన మద్దతు

అవనిగడ్డ, విజయవాడ(అజిత్‌సింగ్‌నగర్), ఫిబ్రవరి 6: మెగా డీఎస్సీ వేస్తామని కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకొచ్చిన సీఎం జగన్మోహన్‌రెడ్డి నిరుద్యోగులను దారుణంగా వంచించారని రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి కృష్ణా జిల్లా అవనిగడ్డకు వచ్చి ఇక్కడ కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొందుతున్న నిరుద్యోగులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం నిరాహారదీక్ష, రాస్తారోకోలతో ప్రభుత్వానికి నిరసన తెలిపారు. దగా డీఎస్సీ వద్దు - మెగా డీఎస్సీ కావాలంటూ జిల్లా తెలుగుయువత ఆధ్వర్యంలో అవనిగడ్డ గాంధీక్షేత్రంలో జరిగిన దీక్షా కార్యక్రమంలో వందలాది మంది నిరుద్యోగులు పాల్గొన్నారు. ఐదేళ్లుగా తమ అమూల్యమైన కాలాన్ని, శక్తిని దోచేసిన సీఎం జగన్.. కేవలం 6 వేల పోస్టులు మాత్రమే తీయడం దారుణమన్నారు. 13 జిల్లాలకుగాను ఏడు జిల్లాల్లో ఒక్క ఎస్‌జీటీ పోస్టు కూడా ఇవ్వకుండా జగన్ నిరుద్యోగులను దారుణంగా మోసగించారని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 7లక్షల మంది డీఎస్సీ ఆశావాహుల కన్నీటిలో ఈ ప్రభుత్వం కొట్టుకుపోతుందని హెచ్చరించారు.

అండగా ఉంటాం: బుద్ధప్రసాద్

డీఎస్సీ కోసం ఐదేళ్లుగా ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు తెలుగుదేశం, జనసేన పార్టీలు అండగా నిలుస్తాయని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. నిరాహారదీక్ష కార్యక్రమానికి మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణతో కలిసి వెళ్లి నిరుద్యోగులకు సంఘీభావం ప్రకటించారు. రాష్ట్రంలో లక్షల సంఖ్యలో నిరుద్యోగులు డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఐదేళ్లుగా ఎదురుచూస్తుంటే సీఎం జగన్ 117 జీవో తీసుకొచ్చి అనేక పాఠశాలలు మూయించి ఉపాధ్యాయ పోస్టులు లేకుండా కుట్ర పన్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ, నిరుద్యోగుల ఆశలతో ఆడుకున్న జగన్ నేడు వారి కన్నీటిలో కొట్టుకుపోతారని దుయ్యబట్టారు. జిల్లా తెలుగుయువత అధ్యక్షుడు దండమూడి చౌదరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుయువత అధ్యక్షుడు శ్రీరామ్ చిన్నబాబు, జనసేన నేతలు మత్తి వెంకటేశ్వరరావు, గుడివాక శేషుబాబు తదితరులు పాల్గొన్నారు. కాగా, సాయంత్రం వరకు నిరాహారదీక్ష చేపట్టిన డీఎస్సీ నిరుద్యోగులు నిరాహారదీక్ష ముగిసిన అనంతరం ర్యాలీగా బయలుదేరి అవనిగడ్డ ప్రధాన సెంటర్‌లో రాస్తారోకో చేపట్టారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి.. వారికి నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు.

తక్షణమే మెగా డీఎస్సీ ప్రకటించాలి: జాక్


వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో అదిగో డీఎస్సీ, ఇదిగో డీఎస్సీ అంటూ నిరుద్యోగులను మోసం చేస్తూ వచ్చిందని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్ ప్రభుత్వంపై మండిపడ్డారు. ఈ మేరకు నగరంలోని సర్వోత్తమ్ గ్రంథాలయంలో మంగళవారం భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15004 పోస్టులతో డిజిటల్ గ్రంథాలయ నోటిఫికేషన్, 26 వేల పోస్టులతో పోలీసు నోటిఫికేషన్ విడుదల చేయాలని, పోలీసు కానిస్టేబుల్ అభ్యర్థులకు ప్రశ్నలోపాలకు సంబంధించి ఐదు గ్రేస్ మార్కులు కలపాలని, ఉద్యోగ వయో పరిమితి ఏపీపీఎస్సీ, ఏపీ డీఎస్సీ జనరల్ అభ్యర్థులకు 47 సంవత్సరాలకు పెంచాలని.. తదితర నిరుద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.

రాయలకోటలో శంకర్‌దాదా

ఎమ్మెల్యే, సోదరుల అడ్డగోలు దోపిడీ

(పుట్టపర్తి-ఆంధ్రజ్యోతి)

సొంత నియోజకవర్గంలో బలమైన నేత ఉండటంతో సీటు దక్కలేదు. సామాజిక సమీకరణాలు కలసి రావడంతో గత ఎన్నికల్లో పొరుగు నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. అదృష్టం కలసి రావడంతో మంత్రి కూడా అయ్యారు. అప్పటి వరకు సౌమ్యుడిగా కనిపించిన సదరు ప్రజా ప్రతినిధి.. పదవి రావడంతో తనలోని మరో కోణాన్ని బయటకు తీశారు. సొంత పార్టీ నేతలే విస్తుపోయేలా అక్రమార్జనకు తెరలేపారు. అవినీతి దందాలో ఎమ్మెల్యేకు సోదరులు అండగా నిలిచారు. అంతా కలసి అడ్డూ అదుపూ లేకుండా దోపిడీ సాగించారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచే నియోజకవర్గంలో ఆదాయ వనరులపై గురి పెట్టారు. కియ కార్ల పరిశ్రమ ఏర్పాటుతో ఆటోమొబైల్ హబ్‌గా నియోజకవర్గం ఏర్పడటం వారికి బాగా కలసి వచ్చింది. టీడీపీ హయంలో ఏర్పాటైన కియ కార్ల పరిశ్రమలో తుక్కు నుంచి కాంట్రాక్టు కార్మికుల ఏజెన్సీ దాకా అంతా ఎమ్మెల్యే సోదరులే చూసుకుంటూ భారీగా దోచుకుంటున్నారు. అడ్డదారుల్లో వందల కోట్లు వెనకేసుకున్నారు. రియల్ ఎస్టేట్ వెంచర్లు, అక్రమ ఇసుక రవాణా.. ఇలా దేన్నీ వదలకుండా మామూళ్లు దండుకుంటున్నారు. సొంత పార్టీ నేతలే భరించలేనంతగా ఎమ్మెల్యే, ఆయన సోదరుల అవినీతి తారస్థాయికి చేరుకుంది. ఎమ్మెల్యే ఆయన సోదరులపై అధికార పార్టీ నేతలు బహిరంగంగా విమర్శలు గుప్పిస్తున్నారు. ఎమ్మెల్యే అయ్యాక ఓ సామాజిక వర్గాన్ని తొక్కిపెట్టారన్న ఆరోపణలు ఉన్నాయి. వారిపై అక్రమ కేసులు బనాయించి, ముప్పుతిప్పలు పెట్టారు.



కియలో కుమ్ముడే కుమ్ముడు

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పుణ్యమా అంటూ వచ్చిన కియ పరిశ్రమ, అనుబంధ సంస్థలు వేలాది మందికి ఉపాధి కల్పించగా.. వైసీపీ వచ్చాక ఒక్క పరిశ్రమనూ తీసుకురాలేకపోయింది. ఇక సదరు నేత ఎమ్మెల్యేగా గెలిచాక కియను తన ప్రధాన ఆదాయ వనరుగా మార్చుకున్నారు. చివరకు ఆ పరిశ్రమలో శ్రమను కూడా వదలకుండా దోచుకుంటున్నారు. కాఫీ కప్పు మొదలుకొని ఉద్యోగులను తరలించే ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టు బస్సులు, లేబర్ కాంట్రాక్ట్ ఏజెన్సీలు.. అన్నీ వారివే. తుక్కు రవాణా, కంటైనర్లు, క్యాంటీన్.. అన్నీ బెదిరించి మరీ లాక్కున్నారు. తన బినామీల ద్వారా నడిపిస్తున్నారు. లేబర్ ఏజెన్సీల ద్వారా కాంట్రాక్ట్ కార్మికులను కియతో పాటు అనుబంధ సంస్థల్లో పెట్టి.. వారికి వచ్చే వేతనాల్లో కమీషన్లను దండుకుంటున్నారు. ప్రైవేటు బస్సులు, కంటైనర్లకు కర్ణాటక నుంచి డీజిల్‌ను ట్యాంకర్లతో తెస్తున్నారు. కియ ఉద్యోగులను తరలించే బస్సుల ద్వారా నెలకు రూ.10 లక్షల వరకు ఆర్జిస్తున్నారు. పరిశ్రమలో కార్ల తయారీలో ఉత్పన్నమయ్యే స్క్రాప్ అమ్మకాల ద్వారా నెలకు రూ.2 కోట్ల దాకా సంపాదిస్తున్నారని సమాచారం. ఈ వ్యవహారమంతా ఎమ్మెల్యే సోదరుల్లో ఒకరు చూసుకుంటున్నారు. తన బంధువు (మండల స్థాయి ప్రజాప్రతినిధి) పేరిట ఏజెన్సీ పెట్టి నియోజకవర్గ కేంద్రం మండలంతో పాటు మరో రెండు మండలాల్లో కియతో పాటు అనుబంధ సంస్థలలో పని చేసేందుకు 150 మంది వరకు సెక్యూరిటీ గార్డులను పంపుతున్నారు. పరిశ్రమ ఒక్కొక్కరికి రూ.13 వేలు వేతనం ఇస్తుండగా, వారికి రూ.8 వేలు మాత్రమే ఇస్తూ, ఒక్కో గార్డుపై నెలకు రూ.5 వేల వరకూ దండుకుంటున్నారు. ఈ లెక్కన నెలకు రూ.7.5 లక్షలు నొక్కుతున్నారు. అదే విధంగా 150 వరకు గాలిమరల వద్ద సెక్యూరిటీ ఏర్పాటు చేసి, బినామీ పేరుతో నెలకు రూ.7 లక్షల వరకు దోచుకుంటున్నారు.

లే అవుట్ వేస్తే కప్పం కట్టాల్సిందే..

నియోజకవర్గంలో పరిశ్రమ ఏర్పడ్డాక అన్ని మండలాలలో భూముల విలువ అమాంతంగా పెరిగింది. ఇంతకుముందు ఎకరా రూ.5 లక్షలు విలువ ఉన్న భూమి ప్రస్తుతం రూ.2 కోట్లకు చేరింది. అంతేగాక ఈ నియోజకవర్గ పరిధిలో జాతీయ రహదారుల నిర్మాణం జరిగింది. దీంతో భూముల ధరలు చుక్కల్ని అంటుతున్నాయి. ఈ నేపథ్యంలో నియోజకవర్గ కేంద్రానికి ఆగ్నేయ దిశలో ఉన్న ఓ మండలంలో సదరు నేత కొంతమంది నాయకులను బినామీలుగా ఏర్పాటు చేసుకున్నారు. అక్కడ ఎవరు లే అవుట్ వేయాలన్నా వీరిని కలవాల్సిందే. ఎకరంలోగా లే అవుట్ వేస్తే ఒక రేటు, అంతకు పైన వేస్తే మరో రేటు కప్పం కట్టాలి. అంతేగాక వాస్తుకు అన్ని విధాలుగా సరిపోయే ఒకటి లేదా రెండు ప్లాట్లు ప్రజాప్రతినిధి సోదరుడి పేరిట రిజిస్ట్రేషన్ చేయించాలి. ఇదే మండలంలో సుమారు 200 ఎకరాల భూమి కొనుగోలు చేసినట్లు సమాచారం. తాము కొనుగోలు చేసే భూముల పక్కన అసైన్డ్ భూములు ఉండేలా చూసుకుంటారు. కొనుగోలు చేసిన భూముల్లో వాటిని కూడా కలుపుకొంటారు. ఇలా అక్రమాల్లో ఆరితేరిపోయారు.

ఇసుకలో మామూళ్లు

ఇసుక అక్రమంగా తరలించేవారి నుంచి సదరు ప్రజాప్రతినిధి సొంత మనుషులు నెలవారీ మామూళ్లు వసూలు చేస్తున్నారు. ఇటీవల ఓ మండల కేంద్రం వద్ద ఏర్పాటైన ఇసుక రీచ్ నుంచి నెలకు రూ.10 లక్షల వరకు వసూలు చేస్తున్నారని సమాచారం. మొదట రీచ్ నిర్వాహకులు అడిగినంత మొత్తం ఇవ్వడానికి నిరాకరించడంతో సొంత పార్టీ నాయకులతో రీచ్ నిర్వహణకు అడ్డుపడేలా చేసినట్లు సమాచారం. దీంతో నిర్వాహకులు వారి దారికొచ్చినట్లు తెలుస్తోంది. కర్ణాటక మద్యం తీసుకువచ్చి నియోజకవర్గంలో విక్రయించే వారి నుంచి కూడా నెలవారీ మామూళ్లు పిండుకుంటున్నారు.

అక్రమ సంపాదనతో భూములు

ప్రతి నెలా భారీగా వస్తున్న అక్రమ సంపాదనను నియోజకవర్గంలోని మండలాలతో పాటు పొరుగు నియోజకవర్గం, కర్ణాటక ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఎమ్మెల్యే పెట్టుబడిగా పెడుతున్నారు. ఆ ప్రాంతాల్లో 400 ఎకరాలకు పైగా విలువైన భూములు కొనుగోలు చేసినట్లు సొంత పార్టీ నేతలే బహిరంగంగా విమర్శిస్తున్నారు. నియోజకవర్గంలోని మూడు మండలాల్లో ఎమ్మెల్యే సోదరులు బినామీల పేరుతో రియల్ వెంచర్లు ఏర్పాటు చేశారు. నియోజకవర్గ కేంద్రానికి ఆగ్నేయ దిశలో ఉన్న మండల కేంద్రం వద్ద కొత్తగా నిర్మాణం చేపడుతున్న జాతీయ రహదారి పక్కన భారీ వెంచర్ వేస్తున్నారు.

సొంతపార్టీ వారిపైనే కేసులు

తాను గెలుపొందేందుకు ఎంతగానో కృషి చేసిన ముఖ్య నాయకులపైనే ఎమ్మెల్యే అక్రమ కేసులు బనాయించారు. ఏ విషయంలోనైనా ప్రశ్నించినా, వ్యతిరేకించినా కేసులు పెట్టిస్తారు. నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 50 మంది సొంత పార్టీ నాయకులు ఎమ్మెల్యే బాధితులుగా ఉన్నారు. దీన్ని బట్టి ఆయన అరాచకం ఏ స్థాయిలో ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఎమ్మెల్యే వేధింపుల గురించి అధికార పార్టీలో ఓ పెద్దనేతకు చెప్పేందుకు బాధిత నాయకులు వెళ్లిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఇటీవల నియోజకవర్గ కేంద్రంలో జరిగిన సమావేశానికి హాజరయ్యేందుకు ఆ పెద్దనేత వస్తుండగా నియోజకవర్గ కేంద్రం వై జంక్షన్‌లో వాహనాలను అడ్డుకుని చెప్పులు విసిరారు. అలాగే పక్కనే ఉన్న మండలంలో నిర్వహించిన గడప గడపకు కార్యక్రమానికి వెళుతుండగా ఎమ్మెల్యే వాహనాన్ని అడ్డగించి చెప్పులు విసిరేందుకు ప్రయత్నించారు. పంపకాల్లో ప్రజాప్రతినిధి సోదరుడికి, ఆ కార్యకర్తకు మధ్య విభేదాలు రావడంతో కార్యకర్త పేరు మీద ఉన్న నాలుగు ప్లాట్లను వేరే వారి పేరిట రిజిస్ట్రేషన్ చేయించాలని ఒత్తిడి తెచ్చారు. కార్యకర్త ఒప్పుకోకపోవడంతో అక్రమ కేసు బనాయించి నానా ఇబ్బందులకు గురిచేశారు.



విజయవాడ ధర్నాచౌక్‌లో ఎన్ఎంఆర్, మినిమం టైమ్‌స్కేల్ ఉద్యోగుల ఆందోళన

పాదయాత్ర హామీని నిలబెట్టుకోండి

- సర్వీసులు క్రమబద్ధీకరించండి
- ఎన్ఎంఆర్, మినిమం టైమ్ స్కేల్ ఉద్యోగుల డిమాండ్

విజయవాడ(ధర్నాచౌక్), ఫిబ్రవరి 6: పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు తమ సర్వీసులను క్రమబద్ధీకరించాలని ఎన్ఎంఆర్, మినిమం టైమ్‌స్కేల్ ఉద్యోగులు ముఖ్యమంత్రి జగన్‌ను డిమాండ్ చేశారు. సీనియారిటీని ప్రాధాన్యంగా పరిగణించి 1993 నవంబరు 25 ముందు నుంచి విధులు నిర్వహిస్తున్న తమను రెగ్యులర్ చేయాలని వేడుకున్నారు. ఎంప్లాయిస్ యూనియన్ జేఏసీ ఆధ్వర్యంలో విజయవాడ ధర్నాచౌక్‌లో మంగళవారం "ముఖ్యమంత్రిని వేడుకోలు సభ' నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నేతలు మాట్లాడుతూ.. తమ సర్వీసులను క్రమబద్ధీకరించేందుకు అడ్డుగా ఉన్న నిబంధనను తొలగించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా 3వేల మంది ఉద్యోగులం పదవీ విరమణకు దగ్గరలో ఉన్నామని, తమను రెగ్యులర్ చేస్తే తమ కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. జేఏసీ ఛైర్మన్ బి.సురేష్, జాయింట్ సెక్రటరీ చంద్రశేఖర్‌రెడ్డి, జేఏసీ నేతలు కె.శ్రీనివాసరావు, ఐ.వెంకటేశ్వరరావు, రవిశంకర్ పాల్గొన్నారు.

వైసీపీ గుర్తింపు రద్దు చేయండి

- ఈసీఐకి ప్రత్యేక హోదా సాధన విద్యార్థి, యువజన జేఏసీ విజ్ఞప్తి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): తప్పుడు ఎన్నికల హామీలు, ఎన్నికలలో అక్రమాలకు పాల్పడుతున్న వైసీపీ గుర్తింపును రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదా సాధన విద్యార్థి, యువజన జేఏసీ అధ్యక్షుడు షేక్ జిలానీ, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వారు కేంద్ర ఎన్నికల సంఘం కార్యాలయంలోని చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా షేక్ జిలానీ మాట్లాడుతూ.. ప్రత్యేక హోదాపై వైసీపీ ఎన్నికలకు ముందు హామీ ఇచ్చి విస్మరించిన తీరును వివరించారు. జాతీయ మాల మహానాడు అధ్యక్షుడు గోళ్ల అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. 'సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ అవకతవకలకు, అనేక కుట్రలకు తెరతీసింది. తప్పుడు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన వైసీపీ పార్టీ గుర్తింపును రద్దు చేయాలి' అని డిమాండ్ చేశారు. శాస్త్రి భవన్‌లో సామాజిక న్యాయ శాఖ మంత్రి రాందాస్ అథావలేని ఆయన కార్యాలయంలో షేక్ జిలానీ, అరుణ్ కుమార్ కలిసి ప్రత్యేక హోదా, విభజన హామీలపై వినతి పత్రం ఇచ్చారు.



డీజీపీకి వినతిపత్రం అందజేస్తున్న మస్తాన్‌వలి తదితరులు

వారిపై చర్యలు తీసుకోండి

- షర్మిలపై అనుచిత పోస్టులు.. డీజీపీకి కాంగ్రెస్ నేతల విజ్ఞప్తి

గుంటూరు, ఫిబ్రవరి 6: ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలపై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెడుతున్న వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ డీజీపీకి విజ్ఞప్తి చేసింది. మంగళవారం ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు తాంతియా కుమారి, పలువురు నాయకులు రాష్ట్ర డీజీపీ కసిరెడ్డి రాజేంద్రనాథ్‌రెడ్డిని కలిసి ఆమేరకు వినతి పత్రం అందజేశారు.

జగన్ అర్జునుడు కాదు... సైతాన్

- బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్

అనంతపురం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): 'ముఖ్యమంత్రి జగన్ అర్జునుడు కాదు. అభిమాన్యుడు అంతకన్నా కాదు. ఆయనో సైతాన్' అని బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ మండిపడ్డారు. ఈ అవినీతి సైతాన్‌ను శిక్షించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. అనంతపురం నగరంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'జీసస్, సైతాన్‌ను శిక్షించినట్లు రాష్ట్రంలో ప్రజాకంటక పాలన సాగిస్తున్న జగన్‌ను ప్రజలు శిక్షిస్తారు. ఆయన పాలన నుంచి ప్రజలు విముక్తి కోరుకుంటున్నారు. జగన్, షర్మిల ఒకే తాను గుడ్డలు. వైఎస్ఆర్ కుటుంబాన్ని చీదరించుకునేలా అన్నా చెల్లెళ్లు వ్యవహరిస్తున్నారు. చివరికి శీల పరీక్ష కోసం తల్లిని నడిబజారులోకి తీసుకొచ్చారు. ఇద్దరినీ ప్రజలే తరిమికొడతారు. జగన్ అబద్ధాలతో పాలన సాగిస్తున్నారు. చివరికి అసెంబ్లీలో గవర్నర్‌తో అబద్ధాలు చెప్పించారు. గవర్నర్ వ్యవస్థకే మచ్చ తీసుకొచ్చేలా జగన్ వ్యవహరిస్తున్నారు. పులివెందులలో ఉపాధి హామీ పథకంలో రూ.26 కోట్ల అవినీతిపై విచారణ చేయించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రికి లేఖ రాస్తా' అని సత్యకుమార్ స్పష్టం చేశారు.

అడ్డొస్తే.. లేపేస్తాం!

- ఎర్రచందనం అక్రమ రవాణాలో వెనక్కితగ్గని స్మగ్లర్లు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ప్రపంచ వ్యాప్తంగా శేషాచలం అడవుల్లో మాత్రమే లభించే అరుదైన ఎర్ర చందనం కోసం స్మగ్లర్లు ఎంతకైనా తెగిస్తున్నారు. తమకు అడ్డొచ్చిన అటవీ సిబ్బందితో పాటు పోలీసులను ప్రాణాలు తీసేందుకు కూడా వెనుకాడటం లేదు. తాజాగా అన్నమయ్య జిల్లాలో టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుల్ గణేశ్‌ను కారుతో ఢీకొట్టి చంపేయడంతో స్మగ్లింగ్ వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. గత టీడీపీ ప్రభుత్వం 2015లో పోలీసు, అటవీ సిబ్బందితో కలిపి 450మంది సాయుధులతో రెడ్ శాండర్స్ యాంటీ స్మగ్లింగ్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. ఐజీ స్థాయి అధికారి నేతృత్వంలో సిబ్బంది వేలాది మంది ఎర్ర దొంగలను అరెస్టు చేసి పదుల సంఖ్యలో స్మగ్లర్లను కాల్చి చంపారు. నిరంతరం అడవిలో కూంబింగ్ చేస్తూ, దారి పొడవునా కెమెరాలు ఏర్పాటు చేసి, భారీగా డంప్‌లు స్వాధీనం చేసుకున్నారు. విదేశాలకు పారిపోయిన అంతర్జాతీయ స్మగ్లర్ కొల్లం గంగిరెడ్డి లాంటివారిని ఏపీ సీఐడీ పోలీసులు దేశానికి తీసుకొచ్చి జైల్లో పెట్టారు. దాడుల్లో స్వాధీనం చేసుకున్న ఎర్ర బంగారాన్ని అంతర్జాతీయ స్థాయిలో వేలం వేసిన ప్రభుత్వం ఖజానాకు రూ.వేల కోట్లు జమచేసింది. 2019లో ప్రభుత్వం మారిపోవడంతో ఆర్ఎస్ఏఎస్‌టీఎఫ్ కాస్తా ఎస్పీ స్థాయికి పడిపోయింది. జైళ్లలో ఉన్న స్మగ్లర్లు బెయిలుపై బయటికి వచ్చారు. అధికార పార్టీ నేతలకు భారీగా ముడుపులు చెల్లిస్తూ, అడ్డొచ్చిన వారిని అంతమొందిస్తున్నారు.

వైసీపీ నేతలకు ఎర్ర తివాచీ

రాష్ట్రంలోని 4జిల్లాల పరిధిలో 5.5లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో విస్తరించిన ఎర్రచందనం కోసం తమిళనాడులో వేలూరు, కాట్పాడి, జావాది మలై ప్రాంతాల నుంచి కూలీలు, మేస్త్రీలు బృందాలుగా వస్తుంటారు. కర్ణాటకలోని కటికెన హళ్లి స్మగ్లర్లకు రాత్రి, పగలు తేడా లేకుండా దుంగలు తరలించుకు పోయేందుకు చిత్తూరు, కడప, నెల్లూరు జిల్లాల్లోని కొందరు చోటా నేతలు, అవినీతి పోలీసు సిబ్బంది సహకరిస్తుంటారు. పదేళ్ల క్రితం వరకూ స్మగ్లర్లకు కనక వర్షం కురిపించిన ఎర్రచందనం స్మగ్లింగ్ ఆయా జిల్లాల్లో పలువురు చోటా నేతల్ని ఎమ్మెల్యేలను చేసే స్థాయికి చేర్చింది. వైసీపీ ప్రభుత్వంలో పలువురు ఎర్రదొంగలు వైసీపీ కండువా కప్పుకుని ఎర్ర బంగారాన్ని రాష్ట్రం దాటిస్తున్నారు. స్మగ్లింగ్ చేసే వాహనం స్టీరింగ్ ముందు అద్దంలో కనిపించేలా పార్టీ కండువా ఉంచి దర్జాగా వెళ్తున్నారు. ఎన్నికల్లో చిత్తూరు అసెంబ్లీకి పోటీ చేయబోతున్న వైసీపీ నాయకుడి రూ.కోట్ల సంపాదన ఎర్ర చందనం మాటున ఆర్జించిందేనన్నది బహిరంగ రహస్యం. ఇదే జిల్లా బైరెడ్డిపల్లెకు చెందిన ఎంపీటీసీ అభినవ్‌ను గతేడాది కర్ణాటకలోని కోలారు పోలీసులు పట్టుకుంటే మంత్రి పెద్దిరెడ్డి అనుచరుడినంటూ బెదిరించాడు. తమిళనాడు అటవీ అధికారులు తిరుపత్తూరు జిల్లా అంబూర్‌లో ఎర్ర స్మగ్లర్‌ను వాహనంతో సహా పట్టుకుంటే దానిపై సీఎం జగన్ బొమ్మతో పాటు ఆలిండియా జగన్మోహన్‌రెడ్డి పేరవై అధ్యక్షుడు ఎం.భాస్కరన్ అని రాసి ఉంది. అన్నమయ్య జిల్లాకు చెందిన వైసీపీ నాయకుడికి చెందిన రూ.8కోట్ల విలువైన ఎర్ర దుంగలు పట్టుబడితే ఒక అనామకుడిని కేసులో ఇరికించి అసలు వ్యక్తిని చిత్తూరులో వదిలేశారు.

ఎన్నికల వేళలో తనిఖీల జోరు

ఎన్నికల వేడి మొదలవడంతో పోలీసులు ఎక్కడికక్కడ తనిఖీలు చేపడుతున్నారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులూ రాత్రింబవళ్లు వాహనాల్ని ఆపుతున్నారు. అదే ఇప్పుడు కానిస్టేబుల్ ప్రాణాల మీదికి తెచ్చిందని కింది స్థాయి సిబ్బంది వాపోతున్నారు. ఆర్ఎస్ఏఎస్‌టీఎఫ్‌ను కొనసాగించి ఉంటే సంపద అక్రమ తరలింపు ఆగిపోవడంతో పాటు స్మగర్లు రెచ్చిపోయేవారు కాదనే అభిప్రాయం పోలీసుల్లో వ్యక్తం అవుతోంది. కాగా, షార్జా, యూఏఈకి ఎగుమతి చేసేందుకు సిద్ధంగా ఉన్న రూ.12కోట్ల విలువైన మొదటిరకం ఎర్రచందనాన్ని 2022 మే నెలలో డీఆర్ఐ సీజ్ చేసింది. ఆపరేషన్ రక్త చందన్‌లో భాగంగా 14.63 టన్నుల బరువున్న 840 దుంగల్ని పట్టుకుంది. అదే ఏడాదిలో దేశవ్యాప్తంగా పలుచోట్ల రూ.150కోట్ల విలువైన 96 టన్నుల అక్రమ ఎర్రచందనాన్ని సీజ్ చేసింది. మార్చిలో కృష్ణపట్నం పోర్టులో మలేసియాకు ట్రాక్టర్ విడిభాగాల మధ్య అక్రమంగా ఎగుమతి చేయడానికి సిద్ధంగా ఉంచిన 11.7 టన్నులను గుర్తించారు. గుజరాత్‌లోని ముంద్ర పోర్టు నుంచి ఇనుప పైపుల మధ్యలో దాచి తరలించడానికి ఢిల్లీలోని తుగ్లక్‌బాద్ నుంచి బుక్ చేసిన సరుకును డిసెంబరులో స్వాధీనం చేసుకుంది. హరియాణా నుంచి ఇత్తడి సామాన్ల మధ్యలో చైనాకు తరలిస్తున్న 12.16టన్నుల ఎర్రచందనాన్ని సీజ్ చేసింది. కానీ మన రాష్ట్రంలో మాత్రం అందుకు భిన్నంగా స్మగ్లర్లకు అటవీ అధికారులు సహకరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాత ఎర్రచందనం నిల్వ ఉందంటూ ఎగుమతికి అనుమతులు తీసుకుని అడవిలో కొత్తగా చెట్లు నరికి తరలించే స్మగ్లర్లకు సహకరిస్తున్న అధికారి ఒకరు గుంటూరు జిల్లాలో రూ.కోట్లల్లో ఆస్తులు కూడబెట్టినట్లు అటవీ శాఖలో ప్రచారం జరుగుతోంది. అడవి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకూ స్మగ్లింగ్‌లో ఏడు దశలు ఉండగా ఒకరికి ఒకరితో తప్ప ఆ తర్వాతి వ్యక్తితో లింక్ ఉండదు. ఇటీవల చిత్తూరు జిల్లాలో ఇద్దరు స్మగ్లర్ల మధ్య వాటాల పంపకాల్లో తేడాలు రావడంతో ఒకరు మరొకరి వద్ద రూ.2.5కోట్లు లాక్కొని పరారయ్యారు. అతడ్ని పట్టుకోవడానికి పోలీసులు బయలుదేరే లోగా జిల్లాకు చెందిన కీలక నాయకుడి నుంచి ఫోన్ రావడంతో ఆగిపోయారు. దీనిపై ఆరా తీయగా ఎర్రచందనం స్మగ్లర్లతో అధికార పార్టీ నేతలకు ఉన్న రహస్య బంధం బయటపడింది. బయటకు రాని ఇలాంటి వ్యవహారాలు కడప జిల్లాలోని ఒక ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఎన్నో జరుగుతాయని అక్కడి పోలీసులే చెబుతున్నారు.



ఎన్నికల ప్రధానాధికారి మీనాకు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నేతలు

ఈసీ వద్ద భద్రంగా డేటా!

- 'ఆంధ్రజ్యోతి' కథనంపై సీఈవో మీనా వివరణ

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) కార్యాలయం డేటా మొత్తం ఈసీఐ వద్ద భద్రంగా ఉందని సీఈవో ముఖేశ్‌కుమార్ మీనా తెలిపారు. ఈసీఐ నిర్దేశించిన బలమైన డేటా సెక్యూరిటీ ఆధారంగా తమ కార్యాలయం పారదర్శకంగా పని చేస్తుందని అన్నారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'ఈసీలో దొంగలు పడ్డారు' కథనంపై ఆయన స్పందించారు. పబ్లిక్ డొమైన్‌లో అందుబాటులో ఉన్న డేటా ఎలా పోతుందని ప్రశ్నించారు. 'ఈసీ పరిధిలో ఉండే ఈఆర్‌వో నెట్ నుంచి ఎలాంటి సమాచారం డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం లేదు. ఏదైనా సమాచారం కోసం సీఈవో, డీఈవో, ఈఆర్వోకి కేవలం కొద్దిపాటి సౌలభ్యమే ఉంటుంది' అని తెలిపారు. ఈసీ దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా తయారీకి ఈఆర్‌వో నెట్ 2.0 ఉపయోగిస్తుందని.. ఈ డేటా మొత్తం సైబర్ సెక్యూరిటీ నిబంధనల ప్రకారం దాని భద్రంగా ఉంటాయని తెలిపారు. సీఈవో వెబ్‌సైట్‌లో సాధారణ ప్రజల కోసం కొంత సమాచారాన్ని అందుబాటులో ఉంచుతామన్నారు. ఓటర్ల జాబితా ప్రచురించిన తర్వాత అన్ని రాజకీయ పార్టీలకు హార్డ్‌డిస్క్‌లు అందిస్తామని తెలిపారు. ఓటర్ల జాబితాలో కొత్త ఓటర్లను చేర్చడం.. కొందరిని తొలగించడం లాంటివి సీఈవో వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. వీటిని ప్రతి వారం సీఈవో వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు ఉందన్నారు.

ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖల సమన్వయానికి ప్రత్యేక యాప్

ఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రభావాన్ని తగ్గించాలంటే కేంద్ర, రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖలు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందని మీనా పేర్కొన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖల మధ్య సమన్వయం కోసం త్వరలో ప్రత్యేక యాప్ అందుబాటులోకి తీసుకురానున్నామన్నారు.

డేటా చోరీపై సీబీఐ విచారణ చేయాలి: టీడీపీ

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల అధికారి కార్యాలయంలో ఓటర్ల డేటా చోరీ ఘటనపై సీబీఐతో విచారణ జరిపించాలని టీడీపీ నేతలు డిమాండ్ చేశారు. ఐప్యాక్ సంస్థ సిబ్బంది ఓటర్ల వ్యక్తిగత సమాచారాన్ని దొంగిలించి ఓటర్లను తొలగిస్తున్నారని, డోర్ నంబర్లు లేని చోట ఓటర్లను చేర్పించడం, ఒక నియోజకవర్గ ఓటర్లను మరో నియోజకవర్గానికి బదిలీ చేయడం వంటి అంశాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు మంగళవారం అమరావతి సచివాలయంలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేశ్ కుమార్ మీనాను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, నేతలు బొండా ఉమ, వర్ల రామయ్య పాల్గొన్నారు.

విరాళాలిచ్చాం.. టికెట్ ఇవ్వండి!

- జనసేనానికి ప్రముఖుల పోరు.. సీరియస్ అయిన పవన్ కల్యాణ్

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): "పార్టీకి విరాళాలిచ్చాం.. మాకు టికెట్ ఇవ్వండి" అంటూ ఇటీవల కాలంలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు కొందరు ప్రముఖుల నుంచి ఒత్తిళ్లు మొదలయ్యాయి. పార్టీకి విరాళాలు ఇచ్చి.. ఆ వెంటనే, వచ్చే ఎన్నికల్లో టికెట్ కావాలంటూ వారు సతాయిస్తున్నారు. ఇలాంటి వారిపై పవన్ సీరియస్ అయ్యారు. ముఖ్యంగా 'ప్రెసిడెంట్ టీమ్'గా ఉన్న కొంతమందిని గట్టిగానే హెచ్చరించారు. ఇప్పటి వరకు చెక్కులు ఇచ్చిన వారి వివరాలు తెలుసుకుని, ఆ చెక్కులను వెనక్కి పంపించాలని ఆదేశించారు. అధినేత ఆదేశాల మేరకు పార్టీ కార్యాలయ సిబ్బంది చెక్కులు ఇచ్చిన వారికి ఫోన్లుచేసి, వాటిని తీసుకువెళ్లాలని కోరుతున్నారు. కాగా, కొన్నేళ్లుగా పార్టీ కోసం కష్టపడి పని చేసిన నేతలను కాదని, కొత్త వారికి సీట్లు ఇచ్చే అవకాశం లేదని పవన్ తేల్చి చెప్పేసినట్టు అయిందని జనసేన నాయకులు అభిప్రాయపడుతున్నారు.

కారుతో ఢీకొట్టి.. ఆపై తొక్కించి..

(మొదటి పేజీ తరువాయి)

జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అన్నమయ్య జిల్లా సుండుపల్లె, సానిపాయ అటవీ ప్రాంతాల నుంచి తమిళనాడుకు పెద్దఎత్తున ఎర్రచందనం స్మగ్లింగ్ జరుగుతుండడంతో ఇటీవల ఫారెస్టు, టాస్క్‌ఫోర్సు పోలీసులు ఆ ప్రాంతాల్లో గస్తీ పెంచారు. అందులో భాగంగా సుండుపల్లె-పీలేరు మార్గంలో తరచూ వాహనాల తనిఖీ చేపడుతున్నారు. ఈ క్రమంలో సానిపాయ అడవుల నుంచి చెన్నైకి ఎర్రచందనం స్మగ్లింగ్ జరుగుతోందన్న సమాచారంతో సోమవారం రాత్రి ఆర్ఎస్ఐ విశ్వనాథం నేతృత్వంలో ఏఆర్ పోలీసు సిబ్బంది కేవీపల్లె మండలం గుండ్రేవారిపల్లె సమీపంలోని గొల్లపల్లె చెరువు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. మంగళవారం తెల్లవారుజాము 2.30 గంటల ప్రాంతంలో సుండుపల్లె వైపు నుంచి వేగంగా వస్తున్న మారుతీ స్విఫ్ట్ కారును ఆపేందుకు పోలీసులు ప్రయత్నించారు. కానీ, అందులోని స్మగ్లర్లు కారును ఆపినట్టే ఆపి మళ్లీ వేగంగా ముందుకు పోనిచ్చారు. దీంతో అప్రమత్తమైన ఏఆర్ కానిస్టేబుల్ కురుబ గణేశ్ (30) ఆ కారును అడ్డుకునేందుకు ప్రయత్నించారు. స్మగ్లర్లు కారుతో అతన్ని ఢీకొట్టి తొక్కించుకుంటూ వెళ్లిపోయారు. మిగిలిన సిబ్బంది అప్రమత్తమై కారును అడ్డుకున్నారు. ఇద్దరిని అదుపులోకి తీసుకోగా మరో ముగ్గురు పారిపోయారు. గాయపడిన గణేశ్‌ను వైద్యం కోసం పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే ప్రాణాలు విడిచారు.

30 లక్షల ఎక్స్‌గ్రేషియా: అన్నమయ్య జిల్లా ఎస్పీ కృష్ణారావు, తిరుపతి టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. గణేశ్ కుటుంబానికి ప్రభుత్వం రూ.30 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిందని తెలిపారు. కాగా, గణేశ్ ఎర్రచందనం స్మగ్లర్ల చేతిలో బలవ్వడంతో ఆయన స్వస్థలం, శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో విషాదఛాయలు అలముకున్నాయి. ధర్మవరం పట్టణంలోని గుట్టకిందపల్లి ప్రాంతానికి చెందిన శ్రీరాములు, అలివేళమ్మ దంపతుల కుమారుడైన గణేశ్ 2013లో కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరారు. అనంతపురంలోని ఏపీఎస్పీ 14వ బెటాలియన్‌కు చెందిన ఆయన ప్రస్తుతం ఎర్రచందనం స్మగ్లింగ్ నివారణ యూనిట్‌లో పనిచేస్తున్నారు. గణేశ్‌కు భార్య అనూష, కుమారులు రాజ్‌కిశోర్, వేదాంత్ ఉన్నారు. గణేశ్ మృతదేహాన్ని మంగళవారం రాత్రి ధర్మవరానికి తెస్తారు. గుట్టకిందపల్లి వద్ద పోలీసు లాంఛనాలతో బుధవారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

జగన్ పాలనలో పోలీసులకూ భద్రత లేదు: బాబు

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం స్మగ్లర్లకు టికెట్లు ఇచ్చే జగన్‌రెడ్డి ప్రభుత్వంలో పోలీసులకూ భద్రత లేదని టీడీపీ అధినేత చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఎర్రచందనం దొంగల చేతిలో పోలీస్ కానిస్టేబుల్ చనిపోవడంపై ఆయన విచారం వ్యక్తం చేశారు. కాగా, ఎర్రచందనం స్మగ్లర్లను పార్టీ అభ్యర్థులుగా ప్రకటించిన జగన్‌రెడ్డి రెడ్ శాండిల్ స్మగ్లింగ్‌కు గ్రీన్ చానల్ ఏర్పాటు చేశాడని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ ఆరోపించారు. జగన్ పాలన ఎర్రచందనం స్మగ్లర్ల పాలిట స్వర్ణయుగమైందని లోకేశ్ వ్యాఖ్యానించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas,
RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.



గన్నవరం విమానాశ్రయం వద్ద భువనేశ్వరికి బొకే అందజేస్తున్న యార్లగడ్డ వెంకట్రావు

నారా భువనేశ్వరికి ఘనస్వాగతం

గన్నవరం, ఫిబ్రవరి 6 : టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరీకి గన్నవరం విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. మంగళవారం హైదరాబాద్ నుంచి ఇండిగో విమానంలో ఇక్కడికి విచ్చేశారు. టీడీపీ గన్నవరం ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్, జడ్పీ మాజీ చైర్మన్ గద్దె అనురాధ, తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శి మూల్పూరి సాయికల్యాణి తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. అనంతరం రోడ్డు మార్గాన గుంటూరు వెళ్లారు.



విరాళం అందజేస్తున్న బండి కిషోర్ కుమార్, కుటుంబసభ్యులు

దుర్గగుడిలో అన్న వితరణకు రూ. 2.50 లక్షలు

వన్‌టౌన్, ఫిబ్రవరి 6: దుర్గామల్లేశ్వరస్వామి దేవ స్థానంలో అన్నవితరణకు విశాఖపట్నంలోని బుచ్చి రాజుపాలానికి చెందిన బండికిషోర్ కుమార్ ఆయన కుటుంబ సభ్యులు మంగళవారం రూ. 2.50లక్షలు విరాళంగా సమర్పించారు. ట్రస్ట్‌బోర్డు చైర్మన్ రాంబాబుకు చెక్కు అందజేసిన దాతలు అమ్మవారి దర్శనం చేసుకున్నారు. అనంతరం వారికి ప్రసాదం, ఆశీర్వాదం, శేషవస్త్రం అందజేశారు.

వైద్య విద్యలో ప్రత్యూషకు పతకాలు



విజయవాడ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి) : మంగళగిరి ఎన్ఆర్ఐ వైద్య కళాశాల విద్యార్థిని కారు మూడి ప్రత్యూష ఎంబీబీఎస్ ఉత్తమ ప్రతిభను కనబరి చారు. విజయవాడలో మంగళవారం జరిగిన డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం స్నాతకోత్సంలో గవర్నరు అబ్దుల్ నజీర్ నుంచి ఆమె ఆరు పతకాలందుకున్నారు. ఎంబీబీఎస్‌లో కోస్తా జిల్లాల్లో అత్యధిక మార్కులు సాధించినందుకు రామ చంద్రుల హనుమంతరావు, రాజ్యలక్ష్మి మెరిట్ స్కాలర్‌షిప్, ఎంబీబీఎస్‌లో రాష్ట్రంలో అధిక మార్కులు సాధించి నందుకు డాక్టర్ టి.శ్రీనివాసన్ మెమోరియల్ గోల్డ్ మెడల్, ఉత్తమ అవుట్ గోయింట్ స్టూడెంట్ కేటగిరిలో డాక్టర్ కేఏన్ రావు గోల్డ్ మెడల్, మెడిసిన్‌లో బెస్ట్ అవుట్‌గోయింట్ స్టూడెంట్ విభాగంలో డాక్టర్ పసుపులేటి శ్రీనివాస్ మెమోరియల్ గోల్డ్‌మెడల్, ఎంబీబీఎస్‌లో బెస్ట్ అవుట్‌గోయింగ్ కేటగిరిలో కావూరి హైమావతి, కావూరి చలపతిరావు పతకం, మెడిసిన్ ప్రథమ స్థానం సాధించినందుకు టి.సరోజ మూర్తి గోల్డ్‌మెడల్‌ను ప్రత్యూష దక్కించుకున్నారు.

నేడు రాయపూడిలో ఇగ్నో భవన నిర్మాణానికి శంకుస్థాపన

వన్‌టౌన్, ఫిబ్రవరి 6: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో) విజయవాడ ప్రాంతీయ కార్యాలయం, ఏపీ రాష్ట్ర విభాగం కార్యాలయాల శాశ్వత భవన నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ సంచాలకురాలు డాక్టర్ కే సుమలత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం అమరావతి రాజధాని ప్రాంతమైన రాయపూడిలో ప్రభుత్వం నుంచి భూమిని కొనుగోలు చేసినట్లు తెలిపారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఆన్‌లైన్ ద్వారా శంకుస్థాపన చేస్తారన్నారు. దేశంలోని మరో ఆరు ప్రాంతీయ కేంద్రాలకు కూడా ఇదే సమయంలో శంకుస్థాపన చేస్తారని తెలిపారు. కులపతి ఆచార్య నాగేశ్వరరావు అధ్యక్షత వహిస్తా రన్నారు. సీపీడబ్ల్యూడీ చీఫ్ ఇంజనీర్ ఎం వెంకటేశ్వ రరావు, ఈఈ కె.కృష్ణకిషోర్, ఇగ్నో విజయవాడ ప్రాంతీయ కేంద్ర ఉపసంచాలకుడు డాక్టర్ ప్రసాదబాబు, సహాయకులపతి సి.బాలచందర్ తదితరులు కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు,

తిరుపతిలో విజయవాడవాసి మృతి



దుర్గాప్రసాద్ (ఫైల్ ఫొటో)

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 6: విజయవాడకు చెందిన వ్యక్తి తిరుపతిలోని ఓ హోటల్లో మృతి చెందాడు. ఈస్ట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడకు చెందిన దుర్గాప్రసాద్ (39) చోళమండలం ఫైనాన్స్ కంపెనీకి న్యాయ సలహాదారుగా ఉంటున్నారు. కంపెనీ పనిపై సోమవారం తిరుపతికి వచ్చిన ఆయన ఓ హోటల్లో బస చేశారు. మంగళవారం ఆయన స్నేహితులు ఎన్నిసార్లు ఫోన్‌చేసినా సమాధానం లేకపోవడంతో హోటల్ సిబ్బందిని సంప్రదించారు. డూప్లికేట్ తాళంతో గదిని తెరిచారు. అప్పటికే ఆయన అపస్మారక స్థితిలో ఉన్న అతనిని రుయా ఆస్పత్రికి తరలించగా మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సర్వేల పేరుతో ఎస్సీ ఎమ్మెల్యేల గొంతు కోస్తున్న జగన్

ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు పేరుపోగు

ధర్నాచౌక్, ఫిబ్రవరి 6: సర్వేల పేరుతో సీఎం జగన్ ఎస్సీ ఎమ్మెల్యేలను మారుస్తూ వారి గొంతు కోస్తున్నారని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ ధ్వజమెత్తారు. గాంధీనగర్‌లోని తన కార్యాలయంలో మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ దళితుడిని చంపి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీ అనంతబాబును తన పక్కన కుర్చీబెట్టుకుని సీఎం జగన్ నా ఎస్సీ, నా ఎస్టీ అనడం సిగ్గుచేటన్నారు. వర్గీకరణకు అసెంబ్లీలో తీర్మానించి కేంద్రానికి పంపాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.



మైరి మె కాసె కహా నాటకంలోని ఓ సన్నివేశం

కళలతో జాతీయ సమైక్యతా భావం

● నాటకరంగానికి నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా నిరంతర సేవలు ● కేంద్ర సంగీత నాటక అకాడమీ కార్యదర్శి శ్రీనివాస్

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 6 : ఆరున్నర దశాబ్దాలుగా దేశంలో నాటకరంగానికి నిరంతరాయమైన సేవలను అత్యున్నత స్థాయిలో భారత ప్రభుత్వ నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా అందిస్తుందని కేంద్ర సంగీత నాటక అకాడమీ కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ, సంస్కృతిక శాఖ అనుబంధ సంస్థ నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతి శాఖ సంయుక్త అధ్వర్యంలో మంగళవారం నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అంతర్జాతీయ నాటక ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ దేశంలోని ప్రతి ప్రాంతానికి ప్రదేశానికి భారతదేశంలోని అతి ఉత్తమమైన నాటకాలు తీసుకొని వెళ్లడంలో, రంగ స్థల కళాకారులను నాటక దర్శకులను తీర్చి దిద్దడంలో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ఎంతో దోహదం చేసిందన్నారు. ఇలాంటి ప్రదర్శనలు జాతీయ సమైక్యత భావానికి దోహదపడతా యన్నారు.

సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు కార్యక్రమాన్ని ప్రారంభించి కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ప్రతినిధి వివేక్ ఇమ్మనేని, సాంస్కృతిక శాఖ రాష్ట్ర డైరెక్టర్ ఆర్.మల్లిఖార్జునరావులు పాల్గొన్నారు. న్యూఢిల్లీకి చెందిన ఎన్.ఎస్.డి రిపర్టరీ కంపెనీ బృందం ప్రదర్శించిన మైరి మె కాసె కహా నాటకం ఆద్యంతం అలరించింది. రాజస్థాని సంస్కృతిని, సంప్రదాయాన్ని ప్రతిబింబిస్తూ సమాజంలో స్త్రీ తన కోరికలు, భావోద్వేగాలు, సామాజిక నిబంధనల మధ్య పడే సంఘర్షణను ఇతివృత్తంగా ఈ నాటిక సాగింది. రాజస్థానీ సాహిత్యంలో ప్రసిద్ధ రచయిత పద్మశ్రీ విజయదాన్ దేతా రాసిన 'దువిధ' కథకు అజయ్ కుమార్ దర్శకత్వంలో అద్భుత నటనా సౌందర్యాన్ని నాటకరూపంలో ఆవిష్కరించారు. స్త్రీలు పురుషులతో సమానమైన స్థితి ఇచ్చి, సమానమైన హక్కులు కల్పించాలని చెప్తున్న సమాజం అసమానతని చూపిస్తూనే ఉందని హాస్యాన్ని మేళవించి సందేశాత్మకంగా నటించారు. వినసొంపైన సంగీతం, గానం, నృత్యమిళితంగా సాగిన ప్రదర్శన ప్రేక్షకుల ప్రశంసలు అందుకొంది. స్త్రీకి స్వయం నిర్ణయాధికారం వంటగదిలోను, జీవిత చివరి అంకంలో శ్మశాన నాటికలో చేరుకొన్న తరువాతే సమానత్వం, స్వేచ్ఛ వస్తున్నాయనే సత్యాన్ని కళ్లకు కట్టారు. విజ్ఞానంలో, మేధస్సులో ఉన్నత స్థాయికి చేరుకొన్నట్లు చెప్పుకొనే సమాజంలో, స్త్రీ తన మానసిక, శారీరక హక్కులను వినియోగించుకోవడానికి ఇప్పటికీ స్వేచ్ఛ లేదని, ఇప్పటికీ సమాజం సృష్టించిన రెండు పరిమిత చట్రాలకే పరిమితం చేయబడ్డాయంటూ నాటకంలో 'స్త్రీ సమాజ సమానత'కు అసంపూర్ణ ముగింపు ఇచ్చి ప్రేక్షకుల మనసులు తట్టి లేపారు. నాటకంలో నటీనటులు పూజా గుప్తా, రెహ్మన్, అనంత్, శిల్ప, మాధురిమ, సత్యేంధర్, అంకుర్, విక్రమ్‌లు ప్రధాన పాత్రలో రక్తి కట్టించారు.



ఆకట్టుకున్న ప్రదర్శనలు





చలో అసెంబ్లీకి వెళ్లకుండా ఉయ్యూరులో పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్‌ను అడ్డుకుంటున్న పోలీసులు, బైఠాయింపు

పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీబీ గృహ నిర్బంధం

ఉయ్యూరు, ఫిబ్రవరి 6 : సర్పంచుల చలో అసెంబ్లీ కార్యక్రమానికి బయలుదేరిన ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్‌ను మంగళవారం పోలీసులు అడ్డుకుని గృహనిర్బంధం చేశారు. రాష్ట్రంలో గ్రామ పంచాయతీలకు కేంద్రప్రభుత్వం విడుదల చేసిన ఆర్థిక సంఘాల నిధులు రాష్ట్రప్రభుత్వం దారిమళ్లించడాన్ని నిరసిస్తూ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీల డిమాండ్లు ఆమోదించాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్, రాష్ట్ర సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో తలపెట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమంలో భాగంగా అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన రాజేంద్రప్రసాద్‌ను పోలీసులు గృహనిర్బంధం చేశారు. సమాచారం అందుకున్న టీడీపీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు రాజేంద్రప్రసాద్ నివాసానికి చేరుకుని అందరూ కలిసి బయలుదేరేందుకు చేసిన ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకోగా తోపులాట జరిగి ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు రాజేంద్రప్రసాద్‌ను, ఆయన అనుచరులను లోపలికి పంపి తిరిగి బయటకు రాకుండా గేటువద్ద, ఇంటి చుట్టుపక్కల కాపలాకాశారు. దీంతో రాజేంద్రప్రసాద్, టీడీపీ నాయకులు అక్కడే నేలపై కూర్చుని ముఖ్యమంత్రి, రాష్ట్రప్రభుత్వం, పోలీసుల వైఖరిని నిరసిస్తూ నినాదాలు చేశారు.

భారీగా పోలీసుల మోహరింపు

రాజేంద్రప్రసాద్ అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా భారీగా పోలీసులు మొహరించారు. ఉయ్యూరు పట్టణ సీఐ బాషా, ఎస్సై గణేశ్‌కుమార్, కంకిపాడు సీఐ శ్రీనివాస్, ఉయ్యూరు, కంకిపాడు, ఉయ్యూరు రూరల్ ఎస్సైలు, ఏఎస్సైలు, సిబ్బంది మోహరించారు. సోమవారం నుంచి రాజేంద్రప్రసాద్ నివాసం వద్ద పోలీసులు మొహరించి గృహనిర్బంధం చేశారు.

రాష్ట్రవ్యాప్త డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి

ఐలా చైర్మన్ సుంకర దుర్గాప్రసాద్, హెచ్‌ఎంసీ అసోసియేషన్ అధ్యక్షుడు ఆసిఫ్ బాషా



మాట్లాడుతున్న ఐలా అధ్యక్షుడు సుంకర దుర్గాప్రసాద్

ఆటోనగర్ (పెనమలూరు), ఫిబ్రవరి 6: రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రంగాల్లోని కమర్షియల్ డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి తాము ఎల్లప్పుడూ ముందుంటామని ఐలా చైర్మన్ సుంకర దుర్గాప్రసాద్, న్యూ హెచ్‌ఎంసీ మినీ ట్రక్ ఓనర్స్, వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆసిఫ్ బాషాలు ఉద్ఘాటించారు. మంగళవారం డ్రైవర్స్ డే సందర్భంగా ఐలా ప్రతినిధి బాహుబలేంద్ర కోటేశ్వరరావు అధ్యక్షతన ఆటోనగర్ వందడుగుల రోడ్డులో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ డ్రైవర్లకు కేవలం డ్రైవింగ్ మాత్రమే కాదని, తమ వెనుక ఓనరుతో పాటు భార్య పిల్లలు, కుటుంబం ఉందన్న విషయాన్ని గుర్తుంచుకొని డ్రైవింగ్ రంగంలో జాగరూకతతో మెలగాలని సూచించారు. డ్రైవర్లకు రాష్ట్రంలో ఏమూలన ఇబ్బంది జరిగినా తమకు వెంటనే సమాచారం అందించిన పక్షంలో తాము సదరు డ్రైవరుకు సహాయం చేసేందుకు సిద్ధంగా ఉంటామని హామీ ఇచ్చారు. డ్రైవర్ల సంక్షేమానికి వైద్యులు ఇచ్చే సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. ఐలా సెక్రటరీ అన్నే శివనాగేశ్వరరావు, లారీ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణలు డ్రైవర్లకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఉత్తమ డ్రైవర్లకు సన్మానాలు చేసి మెమెంటోలను అందించారు. కార్యక్రమంలో ఏపీ లారీ అసోసియేషన్ కార్యదర్శి వైవీ విశ్వేశ్వరరావు, కృష్ణా జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు చలపతిరావు, మెకానిక్ అసోసియేషన్ ప్రెసిడెంటు గంధం వెంకటేశ్వరరావు, డాక్టర్ కలాం, కొమ్మిడి శ్రీనివాసరెడ్డి, కొట్టి కృష్ణ, జమాక్ అధ్యక్షుడు త్రిపురనేని హనుమాల్ నాగచంద్, ఇంజనీరింగ్ వర్క్ షాప్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సాంబశివరావు, కార్యదర్శి అబ్దుల్ హాయ్, బ్లాక్‌స్మిత్ అసోసియేషన్ అధ్యక్షుడు వాడపల్లి శ్రీరాములు, లైటింగ్ ఇంజనీర్ల సంఘం అధ్యక్షుడు శివ పాల్గొన్నారు.



దివ్యపూజాబలి సమర్పిస్తున్న గురువులు

7వ రోజుకు నవదిన ప్రార్థనలు

గుణదల, ఫిబ్రవరి 6: గుణదల కొండపై ఉన్న లూర్దుమాత తనను ఆశ్రయిస్తున్న వారిని తన అనుంగ బిడ్డలుగా ఆదరిస్తూ భక్తులపాలిట దీవెనల సిరిగా వెలుగొందుతుందని హైదరాబాద్ పునీత యోహాన్ ప్రాంతీయ గురు విద్యాలయం రెక్టర్ ఫాదర్ కొమ్మారెడ్డి మర్రెడ్డి అన్నారు. గుణదలమాత శతాబ్ది మహోత్సవ నవదిన ప్రార్థనల్లో భాగంగా మంగళవారం 7వ రోజు జరిగిన నవదిన ప్రార్థనలకు ముఖ్యఅతిథిగా కొమ్మారెడ్డి మర్రెడ్డి హాజరై సందేశమిస్తూ మరియ తల్లి దేవుని తల్లి అయినప్పటికీ ఏసు ప్రభువు పట్ల ఎప్పుడూ వినయ విధేయతలతో భక్తిశ్రద్ధలతో మెలిగిందని తెలిపారు. పుణ్యక్షేత్రం రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు మాట్లాడుతూ ఈ యేడు జరిగే నూరు వసంత మహోత్సవాలకు భక్తులు మరింత ఎక్కువగా వస్తారని అంచనాతోనే ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. నవదిన ప్రార్థనలను పురస్కరించుకుని జపమాలతో లూర్దుమాతను తలచుకుంటూ కొండమధ్యన ఉన్న మరియమాత గుహ వద్దకు చేరుకున్నారు. ఫాదర్ మువ్వల ప్రసాద్, ఫాదర్ గాబ్రియేలు, ఫాదర్ తోట సునీల్‌రాజు తదితర గురువులు దివ్యసత్ప్రసాదంతో కొండపైకి చేరుకుని సమష్టి దివ్యపూజాబలి సమర్పించారు. సత్యనారాయణపురం, అజ్జంపూడి, వేల్పూరు విచారణల నుంచి భక్తులు నవదిన ప్రార్థనలకు తరలివచ్చారు.

స్ట్రాంగ్ రూంలు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దిల్లీరావు ఆదేశం

కృష్ణలంక, ఫిబ్రవరి 6 : అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు స్ట్రాంగ్ రూంలు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.దిల్లీరావు అధికారులను ఆదేశించారు. రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లను (ఈవీఎం) భద్రపరచడానికి స్ట్రాంగ్ రూంలు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు కోసం మంగళవారం ఇబ్రహీంపట్నం, నోవా, నిమ్రా ఇంజినీరింగ్ కళాశాలలను కలెక్టర్ దిల్లీరావు, జేసీ డాక్టర్ పి.సంపత్‌కుమార్‌లు పరిశీలించారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాలు, ఒక పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి ఈవీఎం, వీవీప్యాట్స్, కంట్రోల్ యూనిట్లను భద్రపరిచేందుకు వీలుగా స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్‌కు అనువుగా వుండేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ కోరారు. ఎన్నికల పరిశీలకులకు అనువైన రూములను, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాలలను పరిశీలించారు. అన్ని రూమ్‌లలో లైట్లు, గాలి, వెలుతురు వుండేలా చూడాలని, టాయిలెట్స్, నీటి సరఫరా ఉండాలని అన్నారు. స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాలకు అవసరమయ్యే గదులను, రూట్ మ్యాప్‌లను పరిశీలించి ఎన్నికల మార్గదర్శకాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట డీఆర్వో వి.శ్రీనివాసరావు, విజయవాడ ఆర్డీవో బిహెచ్.భవానీశంకర్, తహసీల్దార్ బీఎస్‌వీఎస్ఆర్ఎల్ రాజు వున్నారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలి

డీఈవో తాహెరా సుల్తానా

ఉయ్యూరు, ఫిబ్రవరి 6 : ప్రస్తు విద్యాసంవత్సరం పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేందుకు కృషిచేయాలని, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులను జిల్లా విద్యాశాఖ అధికారి తాహెరా సుల్తానా ఆదేశించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశా లలో గత సంవత్సరం పదవతరగతి పరీక్షల ఫలితాలపై మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యా యులతో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం సమీక్ష నిర్వహిం చారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇప్పటివరకు జరిగిన ఎఫ్ఏ-1, 2, 3 ఎస్ఏఐ పరీక్షలలో సాధించిన ప్రగతిని సమీక్షించారు. 50శాతం ఫలితాలు వచ్చిన వారిని మందలించి ప్రస్తుత సంవత్సరంలో అవే ఫలితాలు పునరావృతమైతే చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు. తక్కువ ఫలితాలు సాధించిన పాఠశాలలను ఎంఈవోలు, డీవైఈవో లు తరచు సందర్శించి మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు, పమిడిముక్కల, తోట్లవల్లూరు, పెదపా రుపూడి, పామర్రు మండలాల విద్యాశాఖ అధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



శుక్లాకు అవార్డు అందిస్తున్న దీన్‌దయాళ్ విద్యాపీఠ్ ప్రతినిధులు

డాక్టర్ పరమానంద్ శుక్లాకు విద్యా వాచస్పతి సరస్వత్ సమ్మాన్ అవార్డు

పెనమలూరు, ఫిబ్రవరి 6 : కానూరు వాసి డాక్టర్ పరమానంద్ శుక్లాకు జాతీయ విద్యా వాచస్పతి సరస్వత్ అవార్డు లభించింది. హిందీ భాషలో ఆయన చేసిన పరిశోధన, బోధన, హిందీ సాహిత్యంలో చేసిన సేవలకు గాను ఈ అవార్డు లభించింది. గత ఆదివారం న్యూఢిల్లీలో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ హిందీ విద్యాపీఠ్‌లో జరిగిన జాతీయ హిందీ సెమినార్‌లో ముఖ్య అతిథి పద్మశ్రీ డాక్టర్ అరవిందకుమార్ చేతుల మీదుగా ఈ అవార్డును ఆయన అందుకొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ పరమానంద్ మాట్లాడుతూ, జాతీయంగా, అంతర్జాతీయంగా సాహిత్య సేవలకు దక్కిన పురస్కారంగా దీన్ని భావిస్తున్నానని పేర్కొన్నారు. భారతదేశం మొత్తంమీద 21మంది సాహిత్యాభిలాషులు ఈ అవార్డుకు ఎంపికవగా ఆంధ్రప్రదేశ్ నుంచి డాక్టర్ పరమానంద్ ఒక్కరే ఎంపికవడం విశేషం.



మలేరియా జ్వరాలపై సత్వర వైద్యసేవలందించండి

జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతిబాబు

కృష్ణలంక, ఫిబ్రవరి 6 : దోమకాటు ద్వారా వచ్చే మలేరియా, డెంగ్యూ జ్వరాలపై సత్వర చికిత్స అందించాలని ఎన్టీఆర్ జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతిబాబు కింది స్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. విజయవాడ అర్బన్, రూరల్, సబ్ యూనిట్ అధికారులతో లబ్బీపేటలోని మలేరియా కార్యాలయంలో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్ యూనిట్ అధికారులు కింది స్థాయి సిబ్బంది చేత డోర్ టు డోర్ ఫీవర్ సర్వే నిర్వహించాలని, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్ల ద్వారా రక్త నమూనాలు సేకరించేలా చర్యలు చేపట్టాలని అన్నారు. నగరంలో కార్పొరేషన్ బయాలజిస్ట్ సూర్యకుమార్ ఆధ్వర్యంలో యాంటీ లార్వెల్ మెజర్స్ బందర్ కాల్వ, రైవస్ కాల్వల్లో దోమలను, దోమ గుడ్లను నివారించేందుకు డ్రోన్ల ద్వారా ఎంఎల్ ఆయిల్ స్ప్రే చేస్తున్నట్లుగా వివరించారు. ప్రతి ఒక్కరు యాంటీ లార్వా మెజర్స్ పాటించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో రక్త నమూనా పరీక్షలు సత్వరమే నిర్వహించేందుకు ప్రత్యేకంగా ల్యాబ్ టెక్నీషియన్‌లను సిద్ధం చేశామని, డెంగ్యూ రోగ నిర్ధారణ కోసం రాపిడ్ కిట్లను కూడా నగరంలోని 6 యూనిట్లలో అందుబాటులో ఉంచామని తెలిపారు. పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల్లో కూడా రాపిడ్ డెంగ్యూ కిట్లను అందుబాటులో వుంచామని తెలిపారు. డ్రెయినేజీల్లో నిత్యం ఎంఎల్ ఆయిల్ స్ప్రే జరుగుతోందని, ఆయిల్ బాల్స్‌ను కూడా నీటిలో వుంచుతున్నట్లుగా తెలియజేశారు. మున్సిపల్ కార్పొరేషన్ బయాలజిస్ట్ సూర్యకుమార్, సబ్ యూనిట్ అధికారులు నగేష్, శ్రీనివాస్, శ్యామ్‌బాబు, రాజంరాజు, రామచంద్రారెడ్డి, జక్కంపూడి సబ్ యూనిట్ అధికారి రాధాకృష్ణ అధికారులు పాల్గొన్నారు.


నిన్నే పెళ్లాడతా...

● బాలికకు మేనమామ వేధింపులు

విజయవాడ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి) : నువ్వు నన్నే పెళ్లి చేసుకోవాలి. నిన్ను తప్ప మరొకరిని నా జీవితంలో ఊహించుకోలేను. ఓ బాలికకు మేనమామ వేధింపులివి. న్యూరాజరాజేశ్వరిపేటకు చెందిన ప్రేమ్‌కుమార్ చికెన్ షాపులో పనిచేస్తున్నాడు. భానునగర్‌లో ఉండే 14ఏళ్ల బాలికకు వరుసకు మేనమామ అవుతాడు. కొన్నాళ్ల క్రితం బాలిక తల్లిదండ్రులు ఆమెను ప్రేమ్‌కుమార్‌కు ఇచ్చి వివాహం చేయాలనుకున్నారు. దీనిపై రెండు కుటుంబాలవారు మాట్లాడుకున్నారు. కొద్దిరోజుల క్రితం నుంచి బాలిక ఈ వివాహం తనకు ఇష్టం లేదని తల్లిదండ్రులకు చెబుతోంది. అయినా ప్రేమ్‌కుమార్ తనను ఎందుకు పెళ్లి చేసుకోవంటూ బాలిక ఇంటికి వచ్చి పదేపదే వివాదం చేస్తున్నాడు. దీనిపై బాలిక తల్లిదండ్రులు గుణదల పోలీసులకు మంగళవారం రాత్రి ఫిర్యాదు చేశారు. దీనిపై ప్రేమ్‌కుమార్ కుటుంబ సభ్యుల వాదన మరోలా ఉంది. తాము ఇప్పటికిప్పుడు పెళ్లి చేయడం లేదని, నిశ్చితార్థం చేసుకుని మా అమ్మాయి అనిపించుకోవాలనుకున్నామని చెబుతున్నారు.

బడ్జెట్‌లో చూపని అప్పులూ చెప్పండి

▸▸ వైసీపీ పాలనలో పెరిగిన ద్రవ్య, రెవెన్యూ లోటు: యనమల



అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): తన అసమర్థ పాలన కప్పిపుచ్చుకోవడానికి ముఖ్యమంత్రి జగన్మోహన రెడ్డి అసెంబ్లీ వేదికగా అబద్ధాల డబ్బా కొట్టుకున్నారని శాసన మండలి ప్రతిపక్ష నేత, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు విమర్శించారు. సభలో ముఖ్యమంత్రి ప్రసంగంపై మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 'టీడీపీ ప్రభుత్వం రూ.రెండు లక్షల కోట్లు అప్పులు చేస్తే వైసీపీ ప్రభుత్వం రూ.మూడు లక్షల కోట్లు అప్పులు చేసిందని ముఖ్యమంత్రి చెబుతున్నారు. బడ్జెట్‌తో సంబంధం లేకుండా చేసిన అప్పుల లెక్కలు తీస్తే టీడీపీ తెచ్చిన అప్పుల కంటే మూడు రెట్లు అధికమో నాలుగు రెట్లు అధికమో తేలుతుంది' అని ఆయన పేర్కొన్నారు. '2018-19లో టీడీపీ హయాంలో రెవెన్యూ లోటు రూ.13 వేల కోట్లు. వైసీపీ హయాంలో అది రెండేళ్లలో రూ.35 వేల కోట్లకు చేరింది. వైసీపీ పాలనలో మొదటి రెండేళ్లలో లోటు రూ.65 వేల కోట్లు. ఇది టీడీపీ ఐదేళ్ల పాలనలో ఉన్న లోటుతో సమానం. టీడీపీ హయాంలో ఏనాడూ నాలుగు శాతం దాటని ద్రవ్యలోటు వైసీపీ పాలనలో మొదటి ఏడాది 6.5.. రెండో ఏడాది ఏకంగా 9.5 శాతానికి పెరిగింది. ఆ తర్వాత ఆడిట్ జరగలేదు' అని ఆయన వ్యాఖ్యానించారు. కేంద్రం నుంచి ఆదాయం తగ్గిందని చెప్పడం కూడా అసత్యం. 2018-19లో కేంద్రం నుంచి రూ.19 వేల కోట్లు వస్తే 2022-23లో 43 వేల కోట్లు వచ్చింది. మీ తప్పుడు ప్రచారాలతో ప్రజలను నమ్మించలేరు' అని ఆయన పేర్కొన్నారు.

పథకాల్లో కోతలు... పన్నుల మోతలు: బుచ్చయ్య

పథకాల్లో కోతలు... ప్రజలపై పన్నుల మోతలు... హామీలు అమల్లో వైఫల్యం... రాష్ట్రంపై రూ.12 లక్షల కోట్ల అప్పుల భారం... అంతిమంగా తాడేపల్లి ప్యాలెస్‌కు టన్నుల్లో నోట్ల కట్టలు. ఇదీ జగన్‌రెడ్డి సాధించిన ప్రగతి' అని ఎమ్మెల్యే బుచ్చయ్యచౌదరి విమర్శించారు. గవర్నర్ ప్రసంగంలో అబద్ధాలు గొప్పగా చెప్పించిన ముఖ్యమంత్రి జగన్ తన అవినీతి ప్రస్తావన లేకుండా జాగ్రత్త పడ్డాడని ఎద్దేవా చేశారు.

టీడీపీ సహకారంతో గల్ఫ్‌లో 12 ఉద్యోగాలు

ఎన్నారై టీడీపీ ఆధ్వర్యంలోని ఎంపవర్‌మెంట్ సెంటర్ సహకారంతో ఉచితంగా శిక్షణ పొందిన 12 మంది విద్యార్థులు దుబాయ్‌లో ఎలక్ట్రీషియన్లుగా ఉద్యోగాలు పొందారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు వారికి జాబ్ ఆఫర్ లెటర్స్ అందజేశారు. ఐటీఐ చదివిన 12 మంది విద్యార్థులు గత మూడు నెలలుగా టీడీపీ ఎంపవర్‌మెంట్ సెంటర్లో ఎలక్ట్రీషియన్ విభాగంలో ఉచితంగా శిక్షణ పొందారు. వీరికి తాజ్ అల్ సఫా టెక్నికల్ సర్వీసెస్ సంస్థ ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలు కల్పించింది.

మేనిఫెస్టోలో మా సమస్యలనూ చేర్చండి: డీలర్లు

రాష్ట్రవ్యాప్తంగా రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, వారికి న్యాయం చేసేలా టీడీపీ మేనిఫెస్టోలో ప్రతిపాదనలు పొందుపరచాలని రాష్ట్ర రేషన్ డీలర్ల అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈమేరకు డీలర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దివి లీలామాధవరావు, ముఖ్య నాయకులు బోడేపూడి ఫణికుమార్, మాజీ డైరెక్టర్ లుక్కా సాయిరాంప్రసాద్ గౌడ్ మంగళవారం విజయవాడలో టీడీపీ మేనిఫెస్టో కమిటీ చైర్మన్ యనమల రామకృష్ణుడిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.

బాబు కోసమే పవన్ పార్టీ: మంత్రి వేణు

చంద్రబాబు కోసమే పవన్ కల్యాణ్ పార్టీ పెట్టారని మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ఆరోపించారు. మంగళవారం మీడియా పాయింట్‌లో మంత్రి మాట్లాడుతూ... 'ప్రజాసంక్షేమాన్ని కాంక్షించే వాళ్లే రాజకీయ పార్టీ పెట్టాలి. లోకేశ్ అవినీతిపరుడని మాట్లాడిన పవన్ ఇప్పుడు అతనితో అంటకాగుతున్నాడు. పేదలకు సాయం చేస్తున్న జగన్‌ని ఓడిస్తానని ప్రగల్భాలు పలుకుతున్నాడు' అని విమర్శించారు.

పవన్‌ది శల్యుడి పాత్ర: పేర్ని నాని

కలియుగ భారతంలో పవన్ కల్యాణ్ శల్యుడి పాత్ర పోషిస్తున్నాడని మాజీ మంత్రి పేర్ని నాని విమర్శించారు. మంగళవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ... 'కుటుంబ, మానవ సంబంధాల గురించి పవన్ దగ్గర నేర్చుకోవడం కంటే హాస్యాస్పదం ఏముంటుంది? ఎన్నికల యుద్ధానికి సిద్ధమైన జనసేన కార్యకర్తల మానసిక స్థైర్యాన్ని ఆయన నిర్వీర్యం చేస్తున్నాడు' అని విమర్శించారు.

పవన్ నాపై పోటీ చేయాలి: ద్వారంపూడి

కాకినాడలో పవన్ కల్యాణ్ తనపై పోటీ చేయాలని వైసీపీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి సవాల్ చేశారు. మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ.. 'కాకినాడలో పోటీ చేయాలని పవన్ కల్యాణ్‌కు గతంలోనే చాలెంజ్ చేశా. నాపై పవన్ అనేక ఆరోపణలు చేశారు. నాపై పోటీ చేసి గెలిస్తే, ఆరోపణలు నిజం అని తేలుతాయి. అందువల్ల నా చాలెంజ్‌ను స్వీకరించి, పవన్ నాపై పోటీ చేయాలని ఆశిస్తున్నా' అని అన్నారు.

కృష్ణానదిపై ముక్త్యాల ప్రాజెక్టుకు గ్రీన్‌సిగ్నల్

కృష్ణానదిపై ముక్త్యాల-మద్దిపాడు వద్ద రో రో టెర్మినల్ అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పదేళ్ల కాల పరిమితితో పీపీపీ కింద ఈ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు ఈ ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రక్రియ ద్వారా ఎంపిక చేసిన కాంట్రాక్టు సంస్థ శర్వాణి ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు పనులు అప్పగిస్తూ అంగీకార పత్రాన్ని జారీ చేయడానికి ఏపీఐడబ్ల్యూఏ ఆమోదం తెలిపింది. ఈమేరకు పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి యువరాజ్ మంగళవారం ఉత్తర్వులు విడుదల చేశారు.

విద్యా హక్కు చట్టం నిబంధనలు యథాతథం

విద్యా హక్కు చట్టం నిబంధనలు యథావిధిగా కొనసాగుతాయని పాఠశాల విద్యాశాఖ స్పష్టం చేసింది. ఈ చట్టాన్ని అనుసరించి ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించే అంశంపై గత ఏడాది నిబంధనలు రూపొందించింది. త్వరలో ఈ విద్యా సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో వచ్చే ఏడాదికి కూడా అవే నిబంధనలు వర్తిస్తాయని స్పష్టం చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. నిబంధనలు మార్చే వరకూ ఇవే ఉంటాయని పేర్కొంది.

పంచాయతీల నిధులను స్వాహా చేసిన పబ్జీ స్టార్

▸▸ వలంటీర్ల దన్నుతో వ్యవస్థ ధ్వంసం: ఎంపీ రఘురామరాజు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం ఖర్చు చేయాల్సిన పంచాయతీ నిధులను పబ్జీ స్టార్ జగన్మోహన్‌రెడ్డి స్వాహా చేశారని ఎంపీ రఘురామకృష్ణరాజు ఆరోపించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'వలంటీర్లను చూసుకొని విర్రవీగుతున్న వ్యక్తిని సమర్థించకండి. పంచాయతీ వ్యవస్థకు ఇలాంటి దురవస్థను తీసుకువచ్చిన దుష్ట పాలకుల్ని భూస్థాపితం చేయాలి. సర్పంచులు చేపట్టిన అసెంబ్లీ ముట్టడే ఈ దుష్ట పాలకుల పతనానికి నాంది కాబోతోంది' అని పేర్కొన్నారు.

ద్వారకా తిరుమల ఈవోగా ఎంఎస్ మురళి

▸▸ డీసీ నుంచి తహసీల్దార్‌గా రివర్షన్ పొందిన అధికారికి ఆ పోస్టు!


(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఆయన ఓ డిప్యూటీ కలెక్టర్. పూర్వాశ్రమంలో ప్రకాశం జిల్లాలో పనిచేసినప్పుడు సదావర్తి సత్రం భూముల పరాధీనం కేసులో తప్పుచేశారని గతనెలలోనే ఆయనకు డిప్యూటీ కలెక్టర్ నుంచి తహసీల్దార్‌గా రివర్షన్ ఇచ్చారు. అయినా, వైసీపీ ప్రభుత్వం ఆయనను డిప్యూటీ కలెక్టర్‌గానే భావిస్తూ తాజాగా ద్వారకా తిరుమల ఆలయ కార్యనిర్వహణాధికారి(ఈవో)గా నియమించింది. ఆయన మరెవరో కాదు ఎంఎస్ మురళి. మొన్నటి వరకు మదనపల్లి ఆర్డీవోగా పనిచేశారు. సదావర్తి భూముల కేసుల్లో ఆయనకు రివర్షన్ ఇస్తూ రెవెన్యూశాఖ జనవరి 24న ఉత్తర్వులు (జీఓ46) జారీ చేసింది. 31వ తేదీన భారీగా జరిగిన డిప్యూటీ కలెక్టర్ల బదిలీల్లో ఆయన్ను ఆర్డీఓ పోస్టు నుంచి తప్పిస్తూ జీఏడీకి రిపోర్టు చేయాలని ఆదేశించారు. తన రివర్షన్ కేసును ఆయన రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు కోర్టులో అప్పీల్ చేశారు. మంత్రి ఈ కేసును రివిజన్ చేశారు. ఇంకా ఆయన ఏ నిర్ణయం తీసుకున్నారో బయటకు రాలేదు. ఏ ఉత్తర్వూ వెలుగుచూడలేదు. కానీ, రివిజన్ ముగిసిన మరుసటి రోజే మురళిని డిప్యూటీ కలెక్టర్ హోదాలో ద్వారకా తిరుమల ఈవోగా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి ఉత్తర్వులు(జీఓ-281) జారీ చేశారు. ఇదెలా సాధ్యమని రెవెన్యూ వర్గాల్లో ఆసక్తికరమైన చర్చ సాగుతోంది. సోమవారం మంత్రి ధర్మాన వద్ద జరిగిన రెవెన్యూ కోర్టులో మురళిపై ఉన్న రివర్షన్ ఉత్తర్వుల అమలును నిలుపుదల చేస్తూ మంత్రి ఆదేశాలు జారీ చేసి ఉండాలి. లేదా, అసలు కేసులతో సంబంధం లేకుండా పోస్టింగ్ అయినా ఇచ్చి ఉండాలని అధికారవర్గాల్లో చర్చ జరుగుతోంది.

బీజేపీకి కుక్కలు ఏం హాని చేశాయి?

▸▸ బీజేపీ నాయకుల విమర్శలపై రాహుల్ ప్రశ్న

న్యూఢిల్లీ/గుమ్లా(ఝార్ఖండ్), ఫిబ్రవరి 6: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ యాత్రలో ఒక కుక్కపిల్లకు బిస్కట్ పెట్టిన వీడియో వైరల్ అవుతోంది. బీజేపీ నాయకులు ఈ వీడియోను 'ఎక్స్'లో పోస్టు చేస్తూ రాహుల్, కాంగ్రెస్‌పై వ్యంగ్యాస్త్రాలు సంధించగా... ఆయన స్పందిస్తూ 'బీజేపీకి కుక్కలు ఏమి హాని చేశాయ'ని చురకంటించారు. ఈ వీడియో ఆదివారం ఝార్ఖండ్‌లోని ధన్‌బాద్ జిల్లాలో రాహుల్ యాత్ర జరుగుతున్నప్పటిది. ఓ వ్యక్తి తీసుకొచ్చిన కుక్కపిల్లకు రాహుల్ బిస్కట్ పెట్టారు. అది తినకపోవడంతో ఆ బిస్కట్‌ను ఆ వ్యక్తికి ఇచ్చారు. బీజేపీ నేత అమిత్ మాలవీయ ఈ వీడియోను పోస్టు చేస్తూ నాయకుడు కార్యకర్తలను కుక్కల్లా చూసే పార్టీ అంతరించిపోవడం సహజమని వ్యాఖ్యానించారు. మరో బీజేపీ నేత పల్లవి సీటీ కొన్నేళ్ల కిందటి ఘటనను ప్రస్తావించారు. 'అప్పట్లో కాంగ్రెస్‌లో ఉన్న అసోం ముఖ్యమంత్రి హిమంత్ బిశ్వశర్మ రాష్ట్ర సమస్యలపై మాట్లాడేందుకు రాహుల్ గాంధీ ఇంటికెళ్లారు. అక్కడ ప్లేట్‌లో పెట్టిన బిస్కట్లను రాహుల్ పెంపుడు కుక్క వచ్చి ముట్టుకుంది. కానీ ఆ ప్లేట్‌ను మార్చలేదు. అందులో బిస్కట్లనే రాహుల్ హిమంత్‌కు ఆఫర్ చేశారని పల్లవి పేర్కొన్నారు. ఇటీవల ఖర్గే కాంగ్రెస్ కార్యకర్తలను కుక్కలతో పోల్చారని, రాహుల్ ఇప్పుడు కుక్క తినని బిస్కట్‌ను కార్యకర్తకు ఇచ్చారని విమర్శించారు. బీజేపీ నేతల విమర్శలు ఇలా సాగుతుండడంతో రాహుల్ ఘాటుగా స్పందించారు. తాను బిస్కట్ పెట్టినప్పుడు కుక్కపిల్ల భయంతో తినలేదని, దాని యజమాని పెడితే తింటుందని ఆయనకు ఇచ్చానని చెప్పారు. ఆయన పెట్టగానే కుక్కపిల్ల తిన్నదని, ఇందులో సమస్య ఏముందన్నారు. కుక్కపిల్లని తీసుకుని రమ్మని దాని యజమానిని పిలిచానని, ఆయన కాంగ్రెస్ కార్యకర్త కాదని తెలిపారు. 'బీజేపీ వాళ్లకి కుక్కపిల్లలతో సమస్యేంటి. అవి వాళ్లకు ఏమి హాని చేశాయ'ని ప్రశ్నించారు.



వయనాడ్ నుంచి రాహుల్ అవుట్?

రాహుల్ గాంధీ ప్రాతినిధ్యం వహిస్తున్న కేరళలోని వయనాడ్ లోక్‌సభ స్థానానికి పోటీ చేయాలని సీపీఐ భావిస్తోంది. సీట్ల పంపకాల్లో భాగంగా అధికార ఎల్‌డీఎఫ్ కూటమిలో భాగస్వామ్య పక్షం సీపీఐకి వయనాడ్ సహా నాలుగు స్థానాలు కేటాయించారు. అయితే వయనాడ్ స్థానాన్ని ఖాళీ చేయాలని కాంగ్రెస్‌ను కోరడంపై ఎలాంటి చర్చ జరగలేదని, సమీప భవిష్యత్తులో ఆ అవకాశాలను తోసిపుచ్చలేమని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా తెలిపారు. రాహుల్ మరో నియోజకవర్గం నుంచి పోటీ చేస్తే వయనాడ్ స్థానానికి సీపీఐ జాతీయ మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి, డి. రాజా సతీమణి అనీ రాజాను పార్టీ అభ్యర్థిగా ప్రకటించే అవకాశాలున్నాయి. సీట్ల పంపకాలపై చర్చలు జరిపేందుకు డి. రాజా, కె. నారాయణ, రామకృష్ణ పండాతో కూడిన త్రిసభ్య కమిటీ ఏర్పాటైంది. ఈ కమిటీ తొలుత కాంగ్రెస్ రాష్ట్ర శాఖతో చర్చలు జరపనుంది.

'లక్క ఇల్లు' హిందూ పక్షానిదే

▸▸ రుజువుగా బ్రిటిష్ పాలన గెజిట్

▸▸ అక్కడ దర్గా, శ్మశానం ఉన్నట్టు ముస్లిం పక్షం ఆధారాలు చూపలేదు

▸▸ 53 ఏళ్ల వివాదంపై యూపీ కోర్టు తీర్పు

బాగ్‌పట్ (ఉత్తరప్రదేశ్), ఫిబ్రవరి 6: ఉత్తరప్రదేశ్‌లో అర్ధశతాబ్దానికిపైగా సాగిన 'లక్క ఇల్లు'- దర్గా స్థల వివాదంపై న్యాయస్థానం నిర్ణయాన్ని వెల్లడించింది. ఆ స్థలం హిందూ పక్షానికి చెందుతుందంటూ సోమవారం భాగపట్‌లోని జూనియర్ డివిజన్ సివిల్ జడ్జి శివం ద్వివేది తీర్పు చెప్పారు. బ్రిటిష్ కాలం నాటి గెజిట్‌ను ఆధారం చేసుకొని 53 ఏళ్లనాటి ఈ కేసుపై నిర్ణయాన్ని వెలువరించారు. ప్రస్తుతం ఈ స్థలం భారత పురావస్తు సర్వే విభాగం (ఏఎస్ఐ) సంరక్షణలో ఉండడం గమనార్హం. బాగ్‌పట్ జిల్లా బర్నావా గ్రామంలోని హిండన్-కృష్ణి నదుల సంగమ ప్రాంతం వద్ద ఉన్న 100 బీఘాల (సుమారు 62 ఎకరాలు) మట్టి దిబ్బ మహాభారతంలో పేర్కొన్న 'లక్క ఇల్లు' (లాక్షా గృహం) అన్నది స్థానికుల విశ్వాసం. అయితే ఇక్కడ సూఫీ మతగురువు బద్రుద్దీన్ షా దర్గా (మజార్)తో పాటు, శ్మశానం కూడా ఉందన్నది ముస్లిం పక్షం వాదన. తమ స్థలాన్ని హిందువులు ఆక్రమించుకొని సమాధులు తొలగిస్తున్నారని, హోమాలు చేస్తున్నారని పేర్కొంటూ 1970లో ఆ శ్మశానం ముతావల్లి ముకీం ఖాన్ వక్ఫ్ బోర్డు కార్యవర్గ సభ్యుని హోదాలో 1970లో మీరట్ కోర్టులో దావా వేశారు. అక్కడి దర్గా 600 ఏళ్ల నాటిదని తెలిపారు. బద్రుద్దీన్ మరణం తరువాత అక్కడ చాలా మంది సమాధులు నిర్మించుకోవడంతో అనంతర కాలంలో అది శ్మశానంగా మారిందని వివరించారు. స్థానిక హిందూ పూజారి, లాక్షా గృహ గురుకులం నిర్వాహకుడు, బ్రహ్మచారి కృష్ణ దత్త మహరాజ్‌ను ప్రత్యర్థిగా పేర్కొన్నారు. అనంతరం కేసు బాగ్‌పట్ జిల్లాకు బదిలీ అయింది. ఈ వాదనను హిందూ పక్షం ఖండించింది. షేక్ బద్రుద్దీన్ సమాధి 600 ఏళ్లనాటిదని చెప్పినా అందుకు సంబంధించి ఆధారాలు చూపలేదని తెలిపింది. ఆ ప్రాంతాన్ని ఏలిన 'షా' ఆ భూమిని ఇచ్చారని తెలిపినా ఆ రాజు పేరేమిటో చెప్పలేదని గుర్తు చేసింది. తన వాదనకు మద్దతుగా భారత పురావస్తు విభాగం 1920 డిసెంబరు 12న వెలువరించిన అధికారిక గెజిట్‌లోని అంశాలను ప్రస్తావించింది. "మీరట్‌కు వాయువ్య దిశగా 19 మైళ్ల దూరంలో ఉన్న సార్ధానా తహసీల్ బార్నావాలోని దక్షిణ భాగంలో పాండవులను దహనం చేయడానికి ఉద్దేశించినదని భావిస్తున్న 'లక్షా మండప్' ఉంది" అని గెజిట్‌లో రాశారు. దీన్ని ఆధారం చేసుకునే తాజాగా కోర్టు తీర్పు ఇచ్చింది. 1920లో అక్కడ శ్మశానం ఉందనడానికిగానీ, అది వక్ఫ్ ఆస్తి అని నిరూపించడానికి గానీ ముస్లిం పక్షం ఎలాంటి ఆధారాలు చూపించలేదని తెలిపింది. దీనిపై అప్పీలు చేస్తామని ముస్లిం పక్షం న్యాయవాది షహీద్ ఖాన్ తెలిపారు.

జ్ఞాన్‌వాపీ అన్ని సెల్లార్లలో సర్వేపై 15న విచారణ

లఖ్‌నవూ, ఫిబ్రవరి 6: జ్ఞాన్‌వాపీ మసీదులో మూసి ఉంచిన అన్ని సెల్లార్లలో కూడా భారత పురావస్తు సర్వే విభాగం ద్వారా సర్వే చేయించాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యంపై ఈ నెల 15న విచారణ జరపనున్నట్టు మంగళవారం వారాణసి జిల్లా కోర్టు తెలిపింది. బేస్‌మెంట్‌లో ఎనిమిది రహస్య గదులు ఉన్నాయని వాటన్నింటినీ తెరిపించి సర్వే జరపాలని పిటిషనర్ కోరారు. మందిరాన్ని కూలగొట్టి మసీదును నిర్మించారని నిరూపించడానికి ఈ సర్వే అవసరమని విన్నవించారు. మసీదుగోడపై ఉన్న హిందూ దేవతలను పూజించడానికి అనుమతించాలంటూ తొలుత దావా వేసిన విశ్వహిందూ సనాతన్ సంఘ్ వ్యవస్థాపక సభ్యురాలు రాఖీసింగే ఈ పిటిషన్ వేశారు. ఆమె తరఫున న్యాయవాది వాదనలు వినిపిస్తూ మసీదు బేస్‌మెంట్‌లో పూర్తిగా సర్వే జరపలేదన్నారు. అన్ని బేస్‌మెంట్లలో సర్వే జరపాలని 1991లో హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చిందని చెప్పారు. ఈ వాదనపై మసీదు కమిటీ అభ్యంతరం చెప్పింది.

'ఏపీ డిజిటల్ ఇన్‌ఫ్రా' మూత

▸▸ ఏపీటీఎల్, పేస్ డిజిటెక్ మధ్య ఒప్పందం రద్దు

▸▸ ఆమోదం తెలిపిన రాష్ట్ర ప్రభుత్వం

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ టవర్స్ లిమిటెడ్, పేస్ డిజిటెక్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ మధ్య జాయింట్ వెంచర్ ఒప్పందం రద్దుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో ఈ రెండు సంస్థలతో కూడిన ఏపీ డిజిటల్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ మూతపడనుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్. యువరాజ్ మంగళవారం ఉత్తర్వులు విడుదల చేశారు. రాష్ట్రంలో టెలికాం సంబంధిత సేవల పరిధిని విస్తరించడం, నాణ్యతను మెరుగుపరచడం, రాష్ట్రవ్యాప్తంగా స్మార్ట్ టవర్లు, మొబైల్ టవర్లు తదితర టెలికమ్యూనికేషన్ సంబంధిత మౌలిక సదుపాయాలు కల్పించడం కోసం ఏపీటీఎల్, పేస్ డిజిటెక్ జాయింట్ వెంచర్ ఒప్పందం చేసుకున్నాయి. మార్గదర్శకాలు అందిన తేదీ నుంచి 60రోజుల్లోగా పేస్ డిజిటెక్ తన వ్యాపార ప్రణాళికను సమర్పించడంతో పాటు కార్యకలాపాలను ప్రారంభించాల్సి ఉంది. అయితే రేట్లు ఆమోదయోగ్యంగా లేవనే కారణంతో కార్యకలాపాలు ప్రారంభించలేదు. దీనిపై చాలాసార్లు అభ్యర్థించినప్పటికీ ఆ సంస్థ కన్సార్షియం ఒప్పందాన్ని అమలు చేయడంలో విఫలమైంది. ఈ నేపథ్యంలో జాయింట్ వెంచర్ ఒప్పందాన్ని రద్దు చేయడంతో పాటు 'ఏపీ డిజిటల్ ప్రైవేట్ లిమిటెడ్' మూసివేసేందుకు ఏపీటీఎల్ ఎండీ ప్రతిపాదించగా, ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

పవర్ హౌస్ కావాలంటూ
జగన్ మొసలి కన్నీరు: లోకేశ్

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్ తీరుపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ విమర్శలు చేశారు. "తల్లిదండ్రులను చంపేసిన ముద్దాయి.. తాను అనాథనని, కరుణ చూపండని జడ్జిగారిని వేడుకున్నాడట! సేమ్ టు సేమ్ ఇలాగే ఉంది జగన్ తీరు. ఆంధ్రప్రదేశ్ పాలిట కల్పవృక్షం లాంటి సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టు ప్రజా రాజధాని అమరావతిని అంతం చేసి.. ఏపీకి హైదరాబాద్, చెన్నై, బెంగుళూరు లాంటి పవర్ హౌస్ కావాలంటూ అసెంబ్లీలో మొసలి కన్నీరు కారుస్తున్నాడు" అంటూ లోకేశ్ విమర్శించారు.

రాళ్లన్నీ విగ్రహాలు కావు

▸▸ మూఢనమ్మకాలు పెరగడం దురదృష్టకరం

▸▸ మద్రాసు హైకోర్టు వ్యాఖ్య

చెన్నై, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రాళ్లన్నీ విగ్రహాలు కావని మద్రాసు హైకోర్టు వ్యాఖ్యానించింది. రోడ్డు పక్కన ఉండే రాళ్లకు వస్త్రాలు చుట్టి, పసుపు-కుంకుమ రాసి, విగ్రహాలు అని చెప్పుకొనే స్థాయికి దేశంలో మూఢనమ్మకాలు పెరగడం దురదృష్టకరమని పేర్కొంది. తన స్థలం ముందు గుర్తు తెలియని వ్యక్తులు పెట్టిన రాయిని తొలగించాలని, తనకు తగిన భద్రత కల్పించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ తమిళనాడులోని చెంగల్పట్టు జిల్లా పల్లావరానికి చెందిన శక్తిమురుగన్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్.ఆనంద్ వెంకటేష్ మంగళవారం ఈ వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి వ్యవహారంపై విచారణ జరపడమంటే న్యాయస్థానం సమయం వృథా కావడమేనని కటువుగా వ్యాఖ్యానించారు. అయితే పిటిషనర్‌కు ఇబ్బంది కలిగించేలా ఉన్న రాయిని వారం రోజుల్లోగా తొలగించాలని పల్లావరం పోలీసులను ఆదేశించారు.

నెహ్రూ మాటల వక్రీకరణ సిగ్గుచేటు

▸▸ లోక్‌సభలో ప్రధాని మోదీ వ్యాఖ్యలపై ప్రియాంక వాద్రా ఆగ్రహం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: జవహర్‌లాల్ నెహ్రూ ప్రసంగాన్ని ఉటంకిస్తూ ప్రధాని మోదీ లోక్‌సభలో సోమవారం చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ భగ్గుమంది. భారతదేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ప్రసంగంలోని మాటలను ప్రధాని మోదీ వక్రీకరించడం సిగ్గుచేటు అని కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ ప్రియాంక గాంధీ వాద్రా ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వాతంత్ర్య పోరాటం, దేశ పునర్నిర్మాణం వంటి అంశాలపై బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కి ఉన్న విద్వేషం ప్రధాని మోదీ ప్రసంగంలో బయటపడిందని అన్నారు. రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై లోక్‌సభలో సోమవారం జరిగిన చర్చలో మోదీ మాట్లాడుతూ.. భారతీయులు సోమరులు, తెలివితక్కువ వారని దేశ తొలి ప్రధాని నెహ్రూ స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఎర్రకోట మీది నుంచే చెప్పారని, ఇందిరా గాంధీ కూడా ఆయన కంటే భిన్నమైన నేత ఏమీ కారని అన్నారు. కాంగ్రెస్ నేతలు, గాంధీ కుటుంబంపై తీవ్ర విమర్శలు చేశారు. ఇందుకు స్పందించిన ప్రియాంక.. నెహ్రూ ప్రసంగానికి సంబంధించిన ఆడియో క్లిప్‌ను ఎక్స్(ట్విటర్)లో పోస్ట్ చేశారు. దేశ తొలి ప్రధాని మాటలను ప్రస్తుత ప్రధాని వక్రీకరించారనే విషయం ఈ ఆడియోను వింటే అర్థం అవుతుందని పేర్కొన్నారు. ప్రధాని మంత్రి స్థానాన్ని, స్థాయిని దిగజార్చేలా మోదీ నడుచుకుంటున్నారని విమర్శించారు. ఇక, మోదీ వ్యాఖ్యలపై స్పందించిన కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ జైరాం రమేశ్.. పదేళ్ల అన్యాయకాల్ త్వరలోనే అంతం కాబోతుందని వ్యాఖ్యానించారు. మోదీ తీవ్ర అసహనంతో రగలిపోతున్నారనే, అందుకే వ్యక్తిగత దూషణకు దిగి నెహ్రూపై విషం కక్కారని విమర్శించారు. వాజ్‌పేయి, ఎల్‌కే అద్వాణీ ఇలాంటి విష రాజకీయాలు చేయలేదని అన్నారు. కానీ, తన కంటే తెలివైనవాడు లేడు అనుకునే మోదీ మాత్రం ప్రధాని స్థాయిని కించపరిచేలా ప్రవర్తిస్తున్నారన్నారు.



బ్రిటన్ వీసా చార్జీల మోత

▸▸ 66% హెల్త్ సర్ చార్జీ విధింపు


▸▸ జనవరి 6కు ముందు దరఖాస్తులకు వర్తించవన్న సునాక్ ప్రభుత్వం

ఇంగ్లాండ్, ఫిబ్రవరి 6: బ్రిటన్‌లోని రుషి సునాక్ ప్రభుత్వం వీసా చార్జీలను భారీగా పెంచింది. అన్ని రకాల వీసాలపైనా ఇమ్మిగ్రేషన్ హెల్త్ సర్ చార్జీ(ఐహెచ్ఎస్)ని 66% విధిస్తున్నట్టు తెలిపింది. దీంతో వీసా చార్జీలు భారీగా పెరగనున్నాయి. ఈ పెంపు మంగళవారం(నిన్న) నుంచే అమల్లోకి వచ్చేసింది. అయితే, జనవరి 6లోపు వీసాల కోసం దరఖాస్తు చేసుకున్నవారిని ఈ పెంపు నుంచి మినహాయించినట్టు ప్రభుత్వం పేర్కొంది. బ్రిటన్‌లో నివాసం ఉండాలన్నా, ఆ దేశంలోకి ప్రవేశించాలన్నా ఐహెచ్ఎస్ తప్పనిసరి. ఈ ఫీజును దరఖాస్తు సమర్పించే సమయంలోనే చెల్లించాలి. సునాక్ ప్రభుత్వం గత ఏడాది అక్టోబరు నుంచి వీసా ఫీజుల పెంపుపై కసరత్తు చేస్తోంది. కాగా, ఐహెచ్ఎస్ పెంపుతో ఒక్కొక్క వీసాపై రమారమి 624 పౌండ్ల(రూ.65 వేలు) నుంచి 1035 పౌండ్ల(రూ.1,08,000) భారం పడనుంది. మరోవైపు, పర్యాటక, విద్యార్థి వీసాల ఫీజును మరింత పెంచారు. పర్యాటక వీసాపై 15 పౌండ్లు(రూ.1,565), విద్యార్థి వీసాలపై 127 పౌండ్ల(రూ.13,250)ను అదనంగా పెంచినట్టు ప్రభుత్వం వెల్లడించింది.

పౌష్టికాహారానికి కొవిడ్ దెబ్బ..!

▸▸ కొనుగోలు శక్తి తగ్గడంతో అరకొర ఆహారంతో సరి

▸▸ భారత్‌లో 14 శాతం పెరిగిన బరువుతక్కువ పిల్లలు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: కొవిడ్ మహమ్మారి సమయంలో భారత్‌లో ఆహార వ్యవస్థ అస్తవ్యస్తమైందని, దీనివల్ల లాక్‌డౌన్ [illegible] చిన్నారుల్లో పౌష్టికాహార లోపం గణనీయంగా [illegible] అధ్యయనంలో వెల్లడైంది. ఫలితంగా దేశంలో బరువు [illegible] పిల్లల సంఖ్య 14 శాతం పెరిగిందని ఈ అధ్యయనం [illegible] టాటా కార్నెల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ [illegible] (టీసీఐ) పరిశోధకులు కొవిడ్‌కి ముందు, ఆ తర్వాత భారత్‌[illegible] పిల్లల ఆరోగ్యం, పౌష్టికాహారంపై నిర్వహించిన సర్వే డేటాలను విశ్లేషించారు. ఈ క్రమంలో కొవిడ్ మహమ్మారి సృష్టించిన అంతరాయాల కారణంగాణంగా పౌష్టికాహారం అందక పిల్లలు బరువు తగ్గిపోయారని కనుగొన్నారు. ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ జర్నల్‌లో ఆ వివరాలు ప్రచురితమయ్యాయి. ఆహార సరఫరా గొలుసుకు భంగం కలగడం, ధరల ద్రవ్యోల్బణం, పనుల్లేక ఉపాధికి దూరమవడం.. వంటివి పౌష్టికాహారం అందకపోవడానికి కారణాలని ఈ అధ్యయనంలో గుర్తించారు. అలాగే కరోనా సమయంలో మహిళలకు కూడా సరైన పౌష్టికాహారం అందలేదని గుర్తించారు. పరిశోధకుల బృందం 2017 జూన్‌లో బిహార్‌లో, 2021 జూలైలో ఒడిశాలో.. 511 కుటుంబాల నుంచి సేకరించిన డేటాను విశ్లేషించింది. తక్కువ బరువున్న పిల్లలు 2017లో 31 శాతం ఉంటే అది 2021 నాటికి 45 శాతానికి పెరిగిందని పరిశోధకులు గుర్తించారు. రెండేళ్ల కంటే తక్కువ వయసున్న పిల్లలపై ఈ ప్రభావం ఎక్కువగా ఉందని పేర్కొన్నారు.

మయన్మార్ సరిహద్దుల్లో కంచె

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: భారత్- మయన్మార్ సరిహద్దుల్లో కంచె నిర్మించేందుకు కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఆ దేశం నుంచి భారత్‌కు అక్రమ వలసదారుల పోటు ఎక్కువ కావడంతో మొత్తం 1,643 కిమీ మేర కంచె వేసేందుకు సిద్ధమైంది. భారత్‌లోని మొత్తం నాలుగు రాష్ట్రాలతో మయన్మార్ సరిహద్దులు పంచుకుంటోంది. యాక్ట్ ఈస్ట్ పాలసీలో భాగంగా 2018లో కేంద్రం ఇరు దేశాల మధ్య స్వేచ్ఛా కదలిక విధానాన్ని ప్రవేశపెట్టింది. అయితే కొంతకాలంగా మయన్మార్‌లో సంక్షోభ పరిస్థితులు ఏర్పడడంతో ఆ దేశం నుంచి భారత్‌కు భారీ సంఖ్యలో వలసదారులు వస్తున్నారు. ఇదే అదనుగా తీవ్రవాదులు ఆయుధాలను, మాదకద్రవ్యాలను భారత్‌లోకి అక్రమంగా చేరవేస్తున్నారు. ఈ నేపథ్యంలో సరిహద్దులను మరింత కట్టుదిట్టం చేసి దేశంలో శాంతి భద్రతలను పెంపొందించేందుకు భారత్-మయన్మార్ సరిహద్దుల వెంబడి కంచె వేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది.

ఉన్నత విద్యా సంస్థల్లో తనిఖీలు

▸▸ ప్రమాణాల పరిశీలనకు కమిషన్ ఆదేశాలు

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఉన్నత విద్యా సంస్థల్లో తనిఖీలకు ఉన్నత విద్య పర్యవేక్షణ, నియంత్రణ కమిషన్ చర్యలు ప్రారంభించింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్నత విద్య పరిధిలోకి వచ్చే సంస్థలను తనిఖీ చేసే అధికారాన్ని ఇద్దరు సభ్యుల కమిటీకి అప్పగించింది. అందుకు అనుగుణంగా కమిటీ రాష్ట్రంలో పలు కాలేజీల్లో తనిఖీలు ప్రారంభించింది. కాలేజీల్లో ప్రమాణాలు పరిశీలించడంతో పాటు విద్యార్థులతో కూడా కమిటీ మాట్లాడుతుందని కమిషన్ తెలిపింది. అయితే దీనిని కళాశాలల యాజమాన్యాలు వ్యతిరేకిస్తున్నాయి. విద్యా సంవత్సరం మధ్యలో ఇలా తనిఖీలు చేయడం యాజమాన్యాలను ఇబ్బంది పెట్టడమేనని అభిప్రాయపడుతున్నాయి.

కృష్ణాబోర్డును విశాఖకు తరలించొద్దు!

▸▸ కార్యాలయాన్ని విజయవాడలోనే పెట్టాలి: సాగునీటి సంఘాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): కృష్ణా నదీ యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) కార్యాలయాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ విశాఖపట్నంకు తరలించరాదని, కృష్ణా బేసిన్‌లో ఉన్న విజయవాడలోనే ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య డిమాండ్ చేసింది. సమాఖ్య అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాల కృష్ణారావు నేతృత్వంలోని ప్రతినిధులు మంగళవారం ఈమేరకు బోర్డు చైర్మన్ శివ్‌నందన్‌కుమార్‌ను కలిసి వినతిపత్రాన్ని అందించారు. విశాఖలో కార్యాలయం పెడితే కృష్ణా డెల్టాకు 400 కిలోమీటర్లు, సాగర్‌కు 700 కిలోమీటర్లు, శ్రీశైలంకు 800 కిలోమీటర్ల దూరంలో ఉంటుందని, దీనివల్ల ప్రాజెక్టుల నిర్వహణ ఏవిధంగా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. కృష్ణా జలాలను 50-50 నిష్పత్తితో పంచితే శ్రీశైలం దిగువన ఎస్ఆర్‌బీసీతోపాటు సాగర్ కుడి, ఎడమ కాలువల కింద 15 లక్షల ఎకరాలు బీడు బారిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. బోర్డు పరిధిలోకి శ్రీశైలం, నాగార్జునసాగర్ ఉమ్మడి ప్రాజెక్టులను తీసుకోవాలన్న నిర్ణయానికి స్వాగతం పలుకుతూ, సాగర్ ఎడమ కాలువ కింద ఉన్న అన్ని రెగ్యులేటర్లపై సీఐఎస్ఎఫ్ బలగాలు ఏర్పాటు చేసి, చివరి ఆయకట్టుకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని నివేదించారు. చైర్మన్‌ను కలిసిన వారిలో కృష్ణా తూర్పు డెల్టా ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ గుత్తా శివరామ కృష్ణ, నాగార్జున సాగర్ ఎడమకాలువ ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ యనమద్ది పుల్లయ్య చౌదరి, సంఘాల సమాఖ్య కార్యవర్గ సభ్యులు అంకాళ్ల ప్రభుదాసు, గుడిపూడి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఈఏపీసెట్ బాధ్యతలు జేఎన్టీయూ-కేకు

▸▸ చైర్మన్‌గా ఉపకులపతి జీవీఆర్ ప్రసాదరాజు

జేఎన్టీయూకే, ఫిబ్రవరి 6: రాష్ట్రవ్యాప్తంగా ఏపీ ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో నిర్వహించే ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్ అగ్రికల్చర్ ఫార్మసీ కామన్ ప్రవేశ పరీక్ష(ఏపీ ఈఏపీసెట్)-2024 నిర్వహణ బాధ్యతలను జేఎన్టీయూ-కే(కాకినాడ)కు అప్పగించినట్లు ఉపకులపతి ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు. రాష్ట్ర విభజన అనంతరం వరుసగా 7సార్లు ఏపీఈఏపీసెట్‌ను జేఎన్టీయూ-కే విజయవంతంగా నిర్వహించిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఈ పరీక్షలను అవరోధాలకు తావులేకుండా షెడ్యూల్ ప్రకారం నిర్వహించేందుకు తగిన చర్యలు చేపడుతున్నామని చెప్పారు. కాగా, జేఎన్టీయూ-కే ఉపకులపతి జీవీఆర్ ప్రసాదరాజు దీనికి చైర్మన్‌గా వ్యవహరించనున్నారని రిజిస్ట్రార్ సుమలత తెలిపారు. ఏపీఈఏపీసెట్ నిర్వహణ బాధ్యతలను తమకు అప్పగించడం పట్ల రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఉన్నత విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి జె.శ్యామలరావు, రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ కె.హేమచంద్రారెడ్డిలకు వీసీ కృతజ్ఞతలు తెలిపారు. జేఎన్టీయూ-కే ఆధ్వర్యంలో 2015 నుంచి 2019 వరకు నిర్వహించిన ఏపీఈఏపీసెట్‌లకు ప్రొఫెసర్ సీహెచ్ సాయిబాబు కన్వీనర్‌గా వ్యవహరించగా 2015, 2016 సంవత్సరాలలో ఆఫ్‌లైన్‌లో, ఆ తర్వాతి సంవత్సరాలలో ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించారు. 2020, 2021 సంవత్సరాలలో ఏపీఈఏపీసెట్‌కు ప్రొఫెసర్ వి.రవీంద్ర కన్వీనర్‌గా వ్యవహరించారు. జేఎన్టీయూ-కేలో గతంలో పలు ప్రవేశ పరీక్షలను విజయవంతంగా నిర్వహించిన, ప్రావీణ్యం కలిగిన సీనియర్ ప్రొఫెసర్లను కాదని అనుభవంలేని వ్యక్తిని కన్వీనర్‌గా నియమిస్తున్నారన్న ప్రచారం జరగడం వర్సిటీ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

కాపుల ఐక్యతను దెబ్బతీయొద్దు!

▸▸ జోగయ్యకు టీడీపీ నేత రమణ విజ్ఞప్తి

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 6: టీడీపీ-జనసేన ఉమ్మడి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న సమయంలో కాపుల్లో చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తారా? అని మాజీ ఎంపీ చేగొండి హరిరామజోగయ్యను టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు, టీడీపీ నేత ఓవీ రమణ నిలదీశారు. తిరుపతిలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మీడియాకు లేఖలు రాస్తూ హరిరామజోగయ్య అనవసర చర్చలకు చోటిస్తున్నారని అన్నారు. కాపుల ఐక్యత కోసం పోరాడిన ముద్రగడ పద్మనాభానికి మద్దతుగా రాయలసీమ నుంచి కదిలిన కాపులపై ఆనాడు పాలకొల్లులో జోగయ్య కుమారుడు దాడికి దిగడం మరిచిపోయారా? అని ప్రశ్నించారు. ఆనాటి దాడుల ద్వారా కాపు జాతికి ఏం సందేశం ఇచ్చారో చెప్పాలన్నారు. జనసేన, టీడీపీలకు మద్దతుగా కాపులను ప్రభావితం చేయాలే కానీ, ఇలా అనవసరమైన లేఖలు పంపించడం మానుకోవాలన్నారు. ఈ ప్రయత్నాల వెనుక ఏ కుట్ర దాగి ఉందో చెప్పాలన్నారు. ఎమ్మెల్యేగా గెలవలేకపోయాను, ముఖ్యమంత్రి స్థానాన్ని ఎలా అడగ్గలను అని నిర్మొహమాటంగా పవన్ చెబుతుంటే జనసేన పార్టీలో సభ్యుడు కూడా కాని జోగయ్య ఎన్ని సీట్లు అడగాలో సూచించడం సబబేనా అని అన్నారు. స్వార్థ ప్రయోజనాల కోసం కాపుల్లో చీలిక తెస్తే కాపు ద్రోహిగా మిగిలిపోతారని హెచ్చరించారు. హరిరామజోగయ్య తన వయసుకు తగ్గట్టు నడుచుకోవాలని హితవు పలికారు.

SCHOLARSHIP ALERT

Inlaks Shivdasani Scholarships

Description: Inlaks Shivdasani Scholarships 2024 is a merit-based opportunity offered by the Inlaks Shivdasani Foundation (a non-profit organisation), to Indian students pursuing postgraduate studies at European, American, and UK universities abroad.
Eligibility: Open for an Indian passport holders who have a first-class or equivalent degree from recognised Indian universities/institutions. Students must have scored 65% in the Arts related subjects and 70% in Maths and Science related subjects. Applicants must be proficient in English and have received a valid deferred offer letter for the current academic year.
Prizes & Rewards: A maximum of USD 1,00,000 and other benefits (one-time)
Last Date: 22-03-2024 *Application:* Online Only
Short Url: www.b4s.in/aj/INLAKS1

JN Tata Endowment Loan Scholarship for Fall 2024 to Spring 2025

Description: The J N Tata Endowment invites loan scholarship applications from Indian students who wish to pursue higher studies overseas. Students who are selected for the loan scholarship may be recommended for a partial 'Travel Grant' and a 'Gift Award' which is linked to their academic performance in their overseas studies at the sole discretion of the Trustees of the concerned Trusts.
Eligibility: Open for Indian citizens who have completed at least one undergraduate degree OR students who are in the final year of any undergraduate programme at a recognised university/college/institution in India. • Candidates must be interested to pursue Postgraduate/Doctoral/Postdoctoral studies abroad.
• Candidates who are at the end of the 1st year and entering into the second year of their overseas studies (Fall 2024 – Spring 2025) are also eligible to apply. This is applicable only if the minimum duration of the course is 2 years and there is at least one full academic year remaining to complete at the time of award of the loan scholarship, which is normally by July of any calendar year.
• Candidates must have scored at least 60% marks on average in their undergraduate or postgraduate studies. • Candidates must not be older than 45 years as on June 30, 2024.
Prizes & Rewards: Loan scholarship of up to Rs. 10 lakhs *Last Date to Apply:* 15-03-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/JNT8

Disha Scholarship Program

Description: An initiative of Birlasoft to offer financial assistance and support to individuals, facilitating their educational pursuits and ensuring the successful completion of their academic journey.
Eligibility: Only Female students
• Students domiciled in Delhi-NCR or Pune enrolled in the first year of General/Professional Undergraduate courses at premier NIRF institutions or accredited universities and colleges across India.
• Candidates must have scored 65% in aggregate or an equivalent CGPA in the Grade 12 board examination from Delhi-NCR and Pune in 2023.
• The annual family income of the applicants from all sources must not exceed INR 5 lakh.
• Applicants must fall within the age bracket of 17 to 29 years at the time of submitting their applications.
Prizes & Rewards: Up to INR 25,000 annually
Last Date to Apply: 15-03-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/SSPSP1
buddy4study.com

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● బుధవారం 7 ఫిబ్రవరి 2024
diksuchi@andhrajyothy.com



ఐఐఎస్సీలో పీజీ, పీహెచ్‌డీ

బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్సీ)- పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎంటెక్, ఎండిజైన్, ఎంమేనేజ్‌మెంట్, ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ, ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ, ఎంటెక్ (రీసెర్చ్) ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి.

రీసెర్చ్ ప్రోగ్రామ్‌లు

పీహెచ్‌డీ ఇన్ సైన్స్ స్పెషలైజేషన్స్: ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రో ఫిజిక్స్, బయో కెమిస్ట్రీ, ఎకోలాజికల్ సైన్సెస్, హై ఎనర్జీ ఫిజిక్స్, ఇనార్గానిక్ అండ్ ఫిజికల్ కెమిస్ట్రీ, మెటీరియల్స్ రీసెర్చ్, మేథమెటిక్స్, మైక్రో బయాలజీ అండ్ సెల్ బయాలజీ, మాలిక్యులర్ బయో ఫిజిక్స్, డెవలప్‌మెంటల్ బయాలజీ అండ్ జెనెటిక్స్, న్యూరో సైన్సెస్, ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఫిజిక్స్, సాలిడ్ స్టేట్ అండ్ స్ట్రక్చరల్ కెమిస్ట్రీ, ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ అప్లయిడ్ ఫిజిక్స్.

పీహెచ్‌డీ ఇన్ ఇంటర్ డిసిప్లినరీ స్పెషలైజేషన్స్: బయో ఇంజనీరింగ్, ఎనర్జీ, మేథమెటికల్ సైన్సెస్, వాటర్ రీసెర్చ్, సైబర్ ఫిజికల్ సిస్టమ్స్, క్లయిమేట్ ఛేంజ్, బ్రెయిన్ కంప్యూటేషన్ అండ్ డేటా సైన్స్.

పీహెచ్‌డీ ఇన్ ఇంజనీరింగ్/ఎంటెక్(రీసెర్చ్) స్పెషలైజేషన్స్: ఏరోస్పేస్, అట్మాస్ఫిరిక్ అండ్ ఓషనిక్ సైన్సెస్, కెమికల్, సివిల్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఆటోమేషన్, ఎర్త్ సైన్సెస్, ఎలక్ట్రికల్ కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ సిస్టమ్స్, మేనేజ్‌మెంట్ స్టడీస్, మెటీరియల్స్ ఇంజనీరింగ్, మెకానికల్, నానో సైన్స్ అండ్ ఇంజనీరింగ్, డిజైన్ అండ్ మాన్యుఫాక్చరింగ్, సస్టయినబుల్ టెక్నాలజీస్, కంప్యూటేషనల్ అండ్ డేటా సైన్సెస్.

అర్హత: బీఈ/బీటెక్/బీఫార్మసీ/నాలుగేళ్ల బీఎస్సీ/ఎంబీబీఎస్ ఉత్తీర్ణులు; మాస్టర్స్ డిగ్రీ(సైన్స్/ఎకనామిక్స్/జాగ్రఫీ/సైకాలజీ/మేనేజ్‌మెంట్/కామర్స్/ఆపరేషన్స్ రీసెర్చ్/కంప్యూటర్ సైన్స్/కంప్యూటర్ అప్లికేషన్స్/ఇంజనీరింగ్/టెక్నాలజీ/ఆర్కిటెక్చర్/అగ్రికల్చర్/ఫార్మసీ/వెటర్నరీ సైన్సెస్)/ఎంబీఏ/ఎండీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. నెట్ జేఆర్ఎఫ్/జీప్యాట్/గేట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి.

ఎంపిక: నెట్ జేఆర్ఎఫ్/గేట్/జీప్యాట్ స్కోర్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ

స్పెషలైజేషన్‌లు: బయలాజికల్ సైన్సెస్, కెమికల్ సైన్సెస్, మేథమెటికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్

అర్హత: ప్రథమ శ్రేణి మార్కులతో బీఈ/బీటెక్ లేదా సంబంధిత సబ్జెక్టులతో బీఎస్సీ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. జామ్ 2024(బయోటెక్నాలజీ/ కెమిస్ట్రీ/మేథమెటిక్స్/ఫిజిక్స్)/జెస్ట్ 2024 స్కోర్ తప్పనిసరి.

ఎంపిక: జామ్/జెస్ట్ స్కోర్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు ప్రవేశాలు కల్పిస్తారు.

ఎక్స్‌టర్నల్ రిజిస్ట్రేషన్(పీహెచ్‌డీ/ఎంటెక్ రీసెర్చ్)

- ఆర్ అండ్ డీ సంస్థలు, ఇండస్ట్రీస్‌కు చెందిన వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం ఈ ప్రోగ్రామ్‌లను ఉద్దేశించారు. ఇంజనీరింగ్, అగ్రికల్చరల్, ఫార్మాస్యూటికల్, వెటర్నరీ, మెడికల్ విభాగాలకు సంబంధించిన ప్రభుత్వ/ప్రైవేట్ ఫ్యాకల్టీ మెంబర్లు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. కనీసం రెండేళ్ల అనుభవం ఉండాలి. సీఎస్ఐఆర్ యూజీసీ నెట్ జేఆర్ఎఫ్/ యూజీసీ నెట్ జేఆర్ఎఫ్/డీబీటీ జేఆర్ఎఫ్/ఐసీఎంఆర్ జేఆర్ఎఫ్/గేట్/ఎన్‌బీహెచ్ఎం అర్హత ఉండాలి. ఇంటర్వ్యూ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

ఎంటెక్

స్పెషలైజేషన్స్: ఏరోస్పేస్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, మెటీరియల్స్ ఇంజనీరింగ్, సస్టయినబుల్ టెక్నాలజీస్, బయో ఇంజనీరింగ్, ఎర్త్ అండ్ క్లయిమేట్ సైన్సెస్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్ ప్రొడక్ట్ డిజైన్, ఎలక్ట్రానిక్ సిస్టమ్స్ ఇంజనీరింగ్, ఇన్‌స్ట్రుమెంటేషన్ సిస్టమ్స్, మెకానికల్ ఇంజనీరింగ్, మైక్రో ఎలక్ట్రానిక్స్ అండ్ వీఎల్ఎస్ఐ డిజైన్, మొబిలిటీ ఇంజనీరింగ్, క్వాంటం టెక్నాలజీ, రోబోటిక్స్ అండ్ అటానమస్ సిస్టమ్స్, సెమీకండక్టర్ టెక్నాలజీ, సిగ్నల్ ప్రాసెసింగ్, స్మార్ట్ మాన్యుఫాక్చరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, కెమికల్ ఇంజనీరింగ్, కంప్యూటేషనల్ అండ్ డేటా సైన్సెస్.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో బీఈ/బీటెక్/బీఆర్క్/ఏఎంఐఈ లేదా మాస్టర్స్ డిగ్రీ (ఫిజికల్ సైన్సెస్/మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్/జియాలజీ/ఇన్‌స్ట్రుమెంటేషన్/ఎలక్ట్రానిక్స్/కంప్యూటర్ అప్లికేషన్స్) ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. గేట్(2022/2023/2024) స్కోర్ తప్పనిసరి.

ఎంపిక: ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, కెమికల్ ఇంజనీరింగ్, కంప్యూటేషనల్ అండ్ డేటా సైన్సెస్ విభాగాలకు రాత పరీక్ష ఉంటుంది. గేట్ స్కోర్‌కు 70 శాతం, రాత పరీక్షకు 30 శాతం వెయిటేజీ ఇస్తారు. మిగిలిన స్పెషలైజేషన్‌లకు గేట్ స్కోర్, ఇంటర్వ్యూల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ఎండిజైన్

అర్హత: ద్వితీయ శ్రేణి మార్కులతో డిగ్రీ(ఇంజనీరింగ్/టెక్నాలజీ/డిజైన్/ఆర్కిటెక్చర్) ఉత్తీర్ణతతోపాటు గేట్(2022/2023/2024) లేదా సీడ్ 2024 స్కోర్ ఉండాలి.

ఎంపిక: గేట్/సీడ్ స్కోర్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి మెరిట్ ప్రకారం అడ్మిషన్స్ ఇస్తారు. గేట్/సీడ్ స్కోర్‌కు 70 శాతం, ఇంటర్వ్యూ స్కోర్‌కు 30 శాతం వెయిటేజీ ఇస్తారు.

ఎమ్మెస్సీ

స్పెషలైజేషన్‌లు: లైఫ్ సైన్సెస్, కెమికల్ సైన్సెస్

అర్హత: లైఫ్ సైన్సెస్ విభాగానికి ప్రథమ శ్రేణి మార్కులతో డిగ్రీ (ఫిజికల్, కెమికల్, బయలాజికల్, వెటర్నరీ, అగ్రికల్చరల్, ఫార్మాస్యూటికల్ సైన్సెస్ లేదా బయోటెక్నాలజీ)/బీఈ/బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి. కెమికల్ సైన్సెస్ విభాగానికి బీఎస్సీ(కెమిస్ట్రీ) పూర్తిచేసి ఉండాలి. ఇంటర్ స్థాయిలో మేథమెటిక్స్ చదివి ఉండాలి. జామ్ 2024/గేట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి.

ఎంపిక: కెమికల్ సైన్సెస్ విభాగానికి జామ్ 2024(కెమిస్ట్రీ) స్కోర్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. లైఫ్ సైన్సెస్‌లో ప్రవేశానికి జామ్ 2024/గేట్ (2022/2023/2024) స్కోర్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి మెరిట్ ప్రకారం అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ఎంమేనేజ్‌మెంట్

అర్హత: ప్రథమ శ్రేణి మార్కులతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతోపాటు గేట్(2022/2023/2024) లేదా క్యాట్ 2023 లేదా జీమ్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి.

ఎంపిక: జాతీయ పరీక్ష స్కోర్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. గేట్/క్యాట్/జీమ్యాట్ స్కోర్‌కు 15 శాతం, అకడమిక్ ప్రతిభకు 15 శాతం, కమ్యూనికేషన్ స్కిల్స్‌కు 30 శాతం, ఇంటర్వ్యూ స్కోర్‌కి 40 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యుఎస్, స్పాన్సర్డ్ అభ్యర్థులకు రూ.800; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.400
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 22
- **వెబ్‌సైట్:** https://iisc.ac.in/admissions

ఐఐటీ మద్రాస్‌లో స్పోర్ట్స్ కోటా

ప్రస్తుత విద్యా సంవత్సరం(2024-25) నుంచి అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో స్పోర్ట్స్ కోటాను ప్రవేశపెడుతున్నట్లు ఐఐటీ మద్రాస్ ప్రకటించింది. ప్రతి డిగ్రీ కోర్సులో అదనంగా రెండు సీట్లను ఈ కోటా కింద ఏర్పాటు చేయనున్నారు. వీటిలో ఒక సీటును విద్యార్థినులకు ప్రత్యేకిస్తారు. ఈ సీట్లు పొందాలంటే అభ్యర్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్(కామన్ ర్యాంక్ లిస్ట్/కేటగిరీ ర్యాంక్ లిస్ట్)లో అర్హత పొందడంతోపాటు గత నాలుగేళ్ల వ్యవధిలో జాతీయ/అంతర్జాతీయ స్థాయి క్రీడాపోటీల్లో కనీసం ఒక మెడల్ సాధించి ఉండాలి. అడ్మిషన్ ప్రక్రియను జోసా(జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ) పోర్టల్ ద్వారా కాకుండా సంస్థ నూతనంగా ఏర్పాటు చేసిన 'స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అడ్మిషన్(ఎస్ఈఏ)' ద్వారా నిర్వహిస్తారు. అభ్యర్థులు సాధించిన క్రీడా విజయాలను పరిగణనలోకి తీసుకుంటూ విడిగా 'స్పోర్ట్స్ ర్యాంక్ లిస్ట్(ఎస్ఆర్ఎల్)'ను రూపొందిస్తారు. ఈ లిస్ట్ ప్రకారమే సీట్ల అలాట్‌మెంట్ ఉంటుంది. క్రీడల్లో నైపుణ్యం ఉన్నవారిని గుర్తించి ప్రోత్సహించడంతోపాటు వారు మరింతగా రాణించేందుకు అడ్వాన్స్‌డ్ ఎక్విప్‌మెంట్‌తో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను కూడా ప్రారంభించనున్నట్లు సంస్థ డైరెక్టర్ వీ.కామకోటి తెలిపారు. ఇప్పటి వరకూ ఐఐటీల్లో స్పోర్ట్స్ కోటా లేకపోవడం గమనార్హం.

ఎంతటి ప్రశాంతత పాటించే తల్లిదండ్రులైనా, తమ పిల్లలకు పరీక్షలు అంటే ఆందోళన చెందడం సహజం. పరీక్షలంటే ఒత్తిడి ఈ రోజుల్లో విద్యార్థులకే పరిమితం కావటం లేదు. ఆ సెగ పేరెంట్స్‌నూ తాకుతోంది. అందుకే పరీక్షల సమయంలో తల్లిదండ్రుల పాత్ర కీలకమని నిపుణులు కూడా అభిప్రాయపడుతున్నారు. యావత్తు వాతావరణాన్ని కూల్‌గా ఉంచాల్సిన బాధ్యత వారిపైనే ఉంటుందని కూడా చెబుతున్నారు. అధిక ఒత్తిడిలో పిల్లలు ఆందోళన చెందకుండా ఉండాలన్నా, పరిస్థితులు చల్లబడి పరీక్షలకు అనుగుణమైన సానుకూల వాతావరణం ఏర్పడాలన్నా తల్లిదండ్రులు ఇతోధిక పాత్ర పోషించాల్సి ఉంటుంది. అందుకు కొన్ని సూచనలు...

పరీక్షల సమయంలో పేరెంట్సే మెంటార్స్



- ప్రతి విద్యార్థిలో కొన్ని ప్రత్యేక లేదా కొనియాడదగ్గ లక్షణాలు ఉండి తీరతాయి. అవేంటో తల్లిదండ్రులకే ఎక్కువ తెలుస్తాయి. పరీక్షలకు తమ పిల్లలు సన్నద్ధమవుతున్న సమయంలో తల్లిదండ్రులు వారి వెంట ఉంటే అద్భుతాలను రాబట్టవచ్చు. మానసికంగా, ఉద్వేగపరంగా వారికి బాసటగా నిలిచినట్లవుతుంది. ముందు పేర్కొన్నట్టు విద్యార్థి బలాన్ని అర్థం చేసుకుని, ప్రోత్సహిస్తే బాగుంటుంది. అదే సమయంలో మరొకరితో పోలికలు తేవద్దు. ఒక సబ్జెక్టులో వీక్‌గా ఉన్నా మరికొన్నింటిలో బలంగా ఉండొచ్చు. అందుకని ఆ అమ్మాయి/అబ్బాయిలా అంటూ పోల్చి మాట్లాడటంతో వ్యతిరేక ప్రభావాలు కలుగుతాయని తల్లిదండ్రులు గుర్తించాలి.
- తల్లిదండ్రులు ఎన్నడూ తమ ఆలోచనలు, ఆకాంక్షలను పిల్లలపై రుద్దకూడదు. పరీక్షలకు ఉన్న ప్రాధాన్యం తెలియజేయాలి. అందుకు అనుగుణంగా వారిని సన్నద్ధం చేయాలి. పరీక్షలే వారి భవితను నిర్దేశిస్తాయని చెప్పకూడదు.
- పరీక్షల సమయంలో పేరెంట్స్ మెంటార్ల మాదిరిగా వ్యవహరించాలి. పరీక్షకు ఉద్దేశించిన సిలబస్ మొత్తం కవర్ అయ్యేలా స్టడీ షెడ్యూల్ రూపొందించుకునేలా సహకరించాలి. దీంతో తమ అబ్బాయి/అమ్మాయికి ఫోకస్ అలాగే స్పష్టత పెరుగుతుంది. అదే వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. పరీక్షల్లో బెస్ట్ పర్ఫార్మెన్స్ ఇచ్చేందుకు దోహదపడుతుంది.
- ప్రిపరేషన్ నుంచి తమ పిల్లలు దృష్టితప్పకుండా చూసుకోవాలి. అంటే టీవీ షోలు చూడడం, పెద్ద సౌండ్‌తో సంగీతం పెట్టడం, ఫ్యామిలీ గెట్ టుగెదర్స్, పిక్నిక్‌లు, కమ్యూనిటీపరంగా కలవడాలు, మొబైల్, వీడియో గేమ్స్, చిట్‌చాట్స్, సోషల్ మీడియాకు దూరంగా ఉండేలా చూడాలి.
- సరైన పౌష్టికాహారం చాలా అవసరం. తేలికగా అరిగే ఆహారం అందించాలి. పండ్లు, కూరగాయలు, నట్స్, ఎక్కువగా నీరు - డైట్‌లో ఉండేలా చూడాలి. చిరుతిండి, శీతల పానీయాలు, కెఫిన్ ఉండే డ్రింకులకు దూరంగా ఉంచాలి. ఇవన్నీ మత్తును కలిగిస్తాయి. అది జీవక్రియ మందగించేలా చేస్తుంది. అలాగే ఒత్తిడికి కూడా దూరంగా ఉంచాలి. సరిపోను నిద్రపోయేలా చూడాలి. అదే ఆలోచన, మెమరీని పెంచుతుంది. మెంటల్‌గా ఫోకస్డ్‌గా ఉండేలా చూస్తుంది. నిద్రకు ఉన్న ప్రాధాన్యం తెలుసుకోవాల్సిందే. నిజానికి నిద్ర పిల్లల నుంచి పెద్దల వరకు అందరికి చాలా అవసరమైనది.
- వెర్బల్(తిట్టడం) లేదా పనిష్మెంట్స్ అస్సలు వద్దు. శిక్షిస్తే పిల్లల్లో ముఖ్యంగా పెద్దలపై వ్యతిరేక భావన పెరుగుతుంది. భయం కలిగిస్తుంది. చివరకు కోలుకోలేని దెబ్బ తగిలేందుకు దారితీస్తుంది. ఏదో ఒక టాస్క్ ఇచ్చి, పూర్తి చేస్తే అందుకు బహుమతి ఇవ్వడం మంచిది. అది అటు తల్లిదండ్రులు ఇటు పిల్లల మధ్య మంచి పరిస్థితులు నెలకొనేందుకు దారితీస్తుంది.
- పరీక్ష రోజున కూడా సహాయపడవచ్చు. ముఖ్యంగా పిల్లలు పరీక్ష హాలుకు ఒక అరగంట ముందే చేరుకునేలా చూడాలి. హాల్ టికెట్, స్టేషనరీ పెట్టుకునే పౌచ్, వాటర్ బాటిల్ తదితరాలు ఉన్నాయా లేదా అన్నది చెక్ చేయాలి. పరీక్ష రోజున ఏదైనా తిని వెళ్ళేలా చూడాలి. పరీక్ష రోజుల్లో ఒకటి పూర్తయిన వెంటనే మరొక సబ్జెక్టుపై దృష్టిపెట్టేలా చూడాలి. అయిపోయిన పరీక్షను అక్కడికి వదిలేయమనాలి. బాగా రాసినా, రాయకున్నా అక్కడికి ఆ సబ్జెక్ట్ క్లోజ్ అని చెప్పి ఒప్పించాలి. అంటే రాసిన రోజు పరీక్ష ప్రభావం మరుసటికి క్యారీ ఫార్వార్డ్ కాకుండా చూడగలగాలి. క్రాస్ వెరిఫికేషన్, రాసిన దానిపై చర్చలు ఉండకుండా శ్రద్ధవహించాలి.
- చివరగా పిల్లలకు పరీక్షల సమయంలో చేదోడువాదోడుగా ఉండగలిగితే మంచిది, పిల్లలకు తల్లిదండ్రులే మొదటి టీచర్లు, మెంటార్లు, స్నేహితులు, గైడ్స్ అందుకని అడుగడుగునా పిల్లల ఎదుగుదలలో పేరెంట్స్ సహకారం అవసరమవుతుంది. పిల్లలకు సంబంధించి ఎంత సమయం అని ప్రశ్నించుకోవడం కన్నా, వారితో వీలైనంత ఎక్కువసేపు గడిపేందుకు తల్లిదండ్రులు సన్నద్ధం కావాలి. అప్పుడే పిల్లలు పరీక్షలే కాదు, జీవితంలోనూ రాణిస్తారు.

పరీక్షల సమయంలో పేరెంట్స్ మెంటార్ల మాదిరిగా వ్యవహరించాలి. పరీక్షకు ఉద్దేశించిన సిలబస్ మొత్తం కవర్ అయ్యేలా స్టడీ షెడ్యూల్ రూపొందించుకునేలా సహకరించాలి. దీంతో తమ అబ్బాయి/ అమ్మాయికి ఫోకస్ అలాగే స్పష్టత పెరుగుతుంది. అదే వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. పరీక్షల్లో బెస్ట్ పర్ఫార్మెన్స్ ఇచ్చేందుకు దోహదపడుతుంది.

ఎగ్జామ్ టైమ్

ప్రిపరేషన్ నుంచి తమ పిల్లలు దృష్టితప్పకుండా చూసుకోవాలి. అంటే టీవీ షోలు చూడడం, పెద్ద సౌండ్‌తో సంగీతం పెట్టడం, ఫ్యామిలీ గెట్ టుగెదర్స్, పిక్నిక్‌లు, కమ్యూనిటీ పరంగా కలవడాలు, మొబైల్, వీడియో గేమ్స్, చిట్‌చాట్స్, సోషల్ మీడియాకు దూరంగా ఉండేలా చూడాలి.

- బూస శశి కుమార్,
బైజూస్


లిటిల్స్



మీకు తెలుసా?

- ఆఫ్రికాలోని చిట్టి పొట్టి నక్క ఇది. దీని చెవుల వల్ల 'బ్యాట్ ఇయర్డ్ ఫాక్స్' అనే పేరుతో పిలుస్తారు.
- చాటలాంటి ఈ చెవులు ఐదు ఇంచుల పొడవు ఉంటాయి. ముఖ్యంగా ఎడారి ప్రాంతంలో ఉండే ఈ నక్కలకు ఈ చెవుల వల్ల కాస్త చల్లదనం కలుగుతుంది. దీంతో పాటు అద్భుతంగా వినగల సామర్థ్యం ఈ చెవులకు ఉంది. ఎంతా అంటే.. తన దగ్గరలో చిన్న పురుగులు తిరిగినా వాటి శబ్దం వీటికి వినపడుతుంది.
- శాండీగ్రే రంగుల్లో ఉంటాయి. ముఖం దగ్గర కాస్త గోధుమ రంగు ఉంటుంది.
- తూర్పు, ఉత్తర ఆఫ్రికాల్లో కనిపించే ఈ నక్కలు గుంపుగా ఉంటాయి. ప్రతి గుంపులో కనీసం రెండు నుంచి ఐదు ఉంటాయి. ఇవి కేవలం 200 ఎకరాల్లోపలే ఉంటాయి. గుంపుగా ఉండటమే వీటిబలం.
- గద్దలు, హైనాలు, నక్కలు బారినపడి చనిపోతుంటాయివి. అందుకే వాటికి దొరక్కుండా ఉండటానికి ఇవి మట్టిని తవ్వి నివాసాన్ని ఏర్పరచుకుంటాయి. అలా వీటి పంజాలు మట్టిని తవ్వటంలో బాగా ఉపయోగపడతాయి. ముఖ్యంగా ఈ గుంతల్లో ఛాంబర్స్ ఉంటాయి. ఇవి నిద్రపోయేది.. పిల్లలను కనేది అక్కడే.
- ఇవి చిన్నపురుగులు, మిడతలు, బల్లులులాంటి పండ్లు, దుంపలు తింటాయి.
- దంతాలు యాభై వరకూ ఉంటాయి. ఇవి చీల్చి ఆహారాన్ని తినటంలో ముందుంటాయి.
- ఇవి రాత్రంతా వాటి నివాసాల్లో సేదతీరుతాయి. మధ్యాహ్నం తర్వాతనే వాటి గుహల్లోంచి బయటకు వస్తాయి.
- ఇవి తొమ్మిది రకాలుగా శబ్దాలు చేస్తాయి.
- ఆరు పిల్లలను కంటాయి. వీటిలో ఒకటి లేదా రెండు వారంలోపే చనిపోతుంటాయి. మిగతా నాలిగింటికి పురుగులు, ఇతర ఆహారపదార్థాలు తెచ్చి తినిపిస్తాయి. ఆర్నెళ్ల వరకూ డెన్‌లోనే జాగ్రత్తగా పెంచుతాయి.
- 16 ఇంచుల పొడవుండే ఈ జంతువుల బరువు ఒకటిన్నర కేజీ నుంచి రెండు కేజీల లోపు ఉంటుంది.

దారి కనుక్కోండి



చుక్కలు కలిపి రంగులు వేయండి



5 తేడాలు గుర్తించండి



ఎంత మంది?



డైలీ సుడోకు - 223

8	7					2		
4			7		9			3
		2	1					
	8	6		4				
	3						6	
				1		5	3	
					7	3		
2			4		1			7
		8					4	6

సుడోకు - 222 సమాధానం

3	1	9	2	6	5	4	8	7
5	2	4	1	7	8	3	9	6
7	6	8	9	3	4	1	5	2
4	5	1	6	8	9	2	7	3
6	3	2	5	4	7	8	1	9
8	9	7	3	1	2	6	4	5
9	8	5	4	2	6	7	3	1
1	7	6	8	9	3	5	2	4
2	4	3	7	5	1	9	6	8

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.